

భారతి

సాహిత్య మాసపత్రిక

సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్

1961 మే

సంపుటి : ౩౮

సంచిక : ౫

వెల ఒకరూపాయి

భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

మే 1961

సంపుటము 38 : : సంచిక 5

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మే 1961

నివేదన

'సాహితీ వర్ధన'

స్వామీ! ఔనదిగో! సురీరచిత లాక్షారాగ రత్నద్యుతి
శ్రీ మంజీరము వామపాదము, త్రయీ శృంగీతులాకోటి భూ
షా మంతవ్యము దక్షిణాంఘ్రి యదిగో! శబ్దార్థ నిర్మాణ వి
ద్యామూలమ్ములు, వీని నిల్పవటవే! అస్మన్మనఃపీఠికన్.

మనసై కోసిన కొండగోగు పువులన్ మాయాపుళిందాంగనా
ఘనధమ్మిల్లభరమ్మునన్ తుఱిమి, తత్కైశిక్యబంధమ్ము రొం
డిని కైజంటను జేర్చి నిల్చి నగుచున్ వీక్షించు నీ బోయ జా
ణని సింగారము చెప్పె మన్మథునకున్ బ్రహ్మాయువంచున్ ప్రభూ!

శ్రీమంతున్ వనజాక్షు నా శుగముగా చేపట్టి ఆస్వామిదా
ఆ మర్యాదకు లోటురానిగతి కార్యంబెల్ల నెగ్గించుటన్
హేమక్ష్మాధర కార్ముకాంబునిధి తూణీరాహిరాణ్మౌర్విగా
సీమారూఢ మహాకాచితిన్ గనె భవత్స్నేహప్రభల్ ధూర్జటీ!

నెనరున్ సిగ్గుల క్రొత్తపెండ్లికొడుకై నిన్నోషధిప్రస్థ ప
ట్టణ పుణ్యాంగన లెల్లరున్ వృషభరాట్పల్యంకికన్ జూచి లో
చన కోణస్మిత లాచు ముత్తియపు సేసల్ చల్లు ఆనాటి మో
హనమూర్తిన్ నిను నెంతు, అర్ధశశిభూషా! వ్యోమకేశప్రభూ!

అవురా! ఒక్కదినమ్ము చెంచుదొరగా ఐనంత మాత్రాన అ
ప్సవలెన్ చెంచున కెంత తీర్చితివయా! మోమోటమిన్ బోయి, నిన్
భువనైకైక మహాకవీశుడని సంపూజించు ఆమ్నాయముల్ —
కవినై గొల్తును నిన్ను నేను తగనా? కాంక్షింప నీ సన్నిధిన్?

భరమై తోచినచో పథిశ్రమము నోర్వన్ నా గృహంబేగుటన్
వెర వూహించియ వచ్చితిన్ హృదయతంత్రీ మంజుగానమ్ములన్
కరగింతున్ రజతాచలం బదియు వాకల్ వోవు-తద్వీచికో
త్కరమున్ తూగుచు పారిజాతసుమనోకారీతి రావే ప్రభూ!

ఎవరయ్యా! ప్రభు! వారు? పూర్వజనులం దే పుణ్యమున్ పండి నీ
ధవళోరఃస్థలరంగ మధ్యమున నృత్యద్రుండమాలాత్వ గౌ
రవమున్ దెచ్చెను వారికిన్, తెలుపవే ప్రత్యగ్రనిష్ఠామతిన్
కవితారూప తపం బొనర్చి ఎవరైనన్ జేరిరా హారమున్?

ఎదియో నీ ఒకమేలు చేకుఱిన మా దృప్తత్వ ముల్లోకమై
అది మా నేర్పుగ పొంగిపోయెదము భూమ్యాకాశముల్ పట్టరా
కెదియేనీ ఒక కీడు పైబడిన నిన్నే పట్టి తూర్పార బ
ట్టెద మీ మా శిశుబుద్ధి ఆమరణ మిట్లే మమ్ము పీడించెడిన్.

నీ రాకన్ గుఱుతింపలేనటవె తండ్రీ! ప్రౌఢచాంపేయ పు
ష్పారామంబులు కేతకీవనులు దివ్యన్మల్లి కావాటు లిం
పారన్ కప్రపుదీప్రులున్ కెరలుచున్ హాలీసకం బాడునాన్
సౌరభ్యంబులు చింద, పూత్కృతి మిషన్ చక్షుః శ్రవోమాల్యముల్.

భూభృద్ధన్వి! నినున్ మహాద్భుత కథాంభోరాశి వర్ణింప భా
షాభాండార నియంతలున్ శిశువులై శబ్దాతి శాయ్యంగ చే
ష్టాభక్త్యాత్ములుగా కనంబడుదు రస్మాదృగ్యథార్థార్భకుల్
లోభంబందిన నేమగున్ సయిపవే లోలోర్మిహాసద్యుతీ!

హా నిష్ఠాలసయత్నముల్ యుగములైనన్ నెగ్గునా? దూరదూ
రానీతంబులు జ్ఞానమార్గమున కీ యత్నంబు లాశింప నే
మైనన్ కించి దధీతి మాత్రముగ రానో నేమొ యోగాదులున్
రానేరావవి స్వామి! ఆచరణపర్యంతంబు మాయందునన్.

పులకల్ కస్తురి రంగవల్లులగు మద్భ్రూమధ్య దృఙ్మండప
స్థలిపై నొక్కనిమేషమున్ నిలుము హృత్కర్పూరఖండం బిదే
వెలిగింతున్ భవదంఘ్రి నూపురమణుల్ వెల్గన్ నవాంశుచ్ఛటా
కవితాపూర్వమనోజ్ఞమై శ్రుతిసతీ కళ్యాణకేదారముల్.

నీరాకన్ గని మోదబాష్పలహరుల్ నిండన్ భవత్పాద పూ
జారంభం బొనరింతు తజ్జలము నర్ఘ్యం బిచ్చి, అవ్వేళ దే
వా! రంహోగతి నీవు రా సురనదీవార్బిందువుల్ చిందెనం
చౌరా! ఎంచెదవేమొ! అర్ధశశిభూషా! వ్యోమకేశప్రభూ!!

నీ రాకన్ గని పుల్కరింపు లెసగన్ నిల్తున్ నమత్ఫాల నీ
మా రూఢాంజలినై సమస్త పరిచర్యామూర్తి నవ్వేళ నీ
వారా! రాజతశైల కుట్మల కదంబానోకహాంబం చవ
జ్ఞారీతిన్ చనిదేమొ!! అర్ధశశిభూషా! వ్యోమకేశ ప్రభూ!!

పండరినాథ రామాయణము

శ్రీ బి. రామరాజు

ఆంధ్రవాఙ్మయమున రామాయణ కథా సంబంధి సాహిత్యమున్నంతగా మరి యేదియును లేదు. కవిత్వము వ్రాయ నేర్చిన ప్రతి కవియు నేదో యొకతీరుగా రామనామ స్మరణ మొనర్చినట్లున్నాడు. తక్కిన దైవతములకన్న సీతా రాములకే తెలుగువారి హృదయము లర్పితమైనవి. తెలుగు వారికి శ్రీరాముడు కన్నతండ్రి. సీతమ్మ కన్నతల్లి. అరణ్యవాసము మిషగా శ్రీరాము డాంధ్రదేశమునకు వలసవచ్చినట్లున్నాడు. లేనిచో పంచవటిలో నా మహానుభావుడు పర్ణశాల నిర్మించుకొనునా? మాయలేడిపై విల్లెక్కుపెట్టినప్పుడు భూమిపై మోపిన మోకాలి గుంటలును, సీతమ్మతల్లి చీర లారవేసికొన్నప్పు డేర్పడిన తెల్లని చారలును, తెలుగు దేశపు ప్రతి గ్రామమందుండునని వేళాకోళము చేయువారి మాట లెట్లున్నను వానిలో కొంత సత్యమున్నది. అది వ్యాజస్తుతియని నా అభిప్రాయము. ప్రతిగ్రామమున చిహ్నము లుండు టొక లెక్కకాదు. ప్రతి మానిసి హృదయమున గూడ సీతా రామచంద్రుల పాద పద్మాంకములు ప్రగాఢముగా పడినవి. ఆ యంకము లెన్నటికిని చెడవు. భాస్కరునినాటినుండి ఈనాటివరకును ఆ యా రచయితలు రామాయణములను తమ శక్తి కొలది తమ యభిరుచికొలది రచించుకొనుచునే యున్నారు. ఒక భక్తుడు తొమ్మిదికోట్ల రామ నామ జపముచేసి నాదసుధగా శ్రీరాముని లోకమున కందించగా మరి యొక భక్తుడు సీతమ్మ కొక చింతాకు పతకును, శ్రీరామునకొక కలికితురాయిని నవదరించి మనపాలిటికొక యమృతక్షేత్రమును పండించినాడు. ఆదికవి యమోఘవాక్కులో, రఘునాథుని చరితమందున్నచేవయో, తెలుగువారి హృదయములం దున్న భక్తిప్రపత్తులో వీనిలో నేది కారణమైనను కానిండు. తెలుగు కవిత్వపు పందిరిపై రామాయణలత మాత్రము అల్లిబిల్లిగా నల్లుకొన్నది.

అనంతమగు రామాయణలతయం దధ్యాత్మరామాయణ మొక చిలువ. వాసిష్ఠరామాయణమువలె నిదియును వేదాంత సంబంధి. ఇది నారద బ్రహ్మ సంవాద రూపమున బ్రహ్మాండ పురాణాంతర్గతమై యున్నది. పరమ శివుడు పార్వతికి శ్రీరామచంద్ర పరబ్రహ్మము యాథార్థ్యము నెరిగించినట్లున్నది. కనుక నిది వ్యాసవిరచితమై యుండవలెను. కాని పారాయణ క్రమమున అంగన్యాసకరన్యాసములందు "అస్య శ్రీ మదధ్యాత్మ రామాయణ మహా మంత్రస్య ఈశ్వర ఋషిః" యని పఠింతురు. పార్వతికి వినిపించిన పరమేశ్వరుడే ఈ ఈశ్వర ఋషియో లేదా మరియొక ఋషియో తెలియదు. మూల గ్రంథములం దీతీరుగా నుండ అధ్యాత్మరామాయణమునకు కర్త విశ్వామిత్రుడను జనశ్రుతి యొకటి ప్రబలముగా నున్నది. ఈ విశ్వామిత్ర సృష్టి యెట్లు వచ్చెనో తెలియరాదు. విశ్వామిత్రుడు రచించినట్లు మూలమున నెచ్చటను గానరాదు. అనువాదము లందు కూడ నేను జూచిన వానిలో వ్యాసుడే కర్తయని చెప్పబడి యున్నది. క్రీ. శ. 1890 సంవత్సరమున శ్రీ వాణి వినోద మందిర ముద్రాక్షరశాలలో ముద్రింపబడిన (సంస్కృతము) అధ్యాత్మరామాయణ ముఖ పత్రముమీద "విశ్వామిత్ర మహర్షి ముఖకమలమందేతర మకరందధారాయమాణం అధ్యాత్మ రామాయణం" అని ముద్రింపబడినది. ములుకుట్ల విశ్వనాథ శాస్త్రిగా రీప్రతికి సమ్యక్పరిశోధకులు. వావిళ్ళవారు ప్రకటించిన గ్రంథముపై నీ విశ్వామిత్రుడు లేడు. తెలుగు భాషా సమితివారి విజ్ఞాన సర్వస్వము మూడవ సంపుటము (తెలుగు సంస్కృతి)లో 'రామాయణ వాఙ్మయ'మను వ్యాసమున (పుట 1040) గూడ అధ్యాత్మ రామాయణమునకు కర్త విశ్వామిత్రుడని కలదు.

అధ్యాత్మరామాయణమునకు ప్రాచీనమైన యనువాదములు కానబడుటలేదు. మళయాళమహాకవి ఎజుత్తచ్చన్ (16 వ శతాబ్దము) తాను మళయాళభాషలో రచించిన అధ్యాత్మ రామాయణమునకు మూలము తెలుగని చెప్పుకొనినట్లు శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులవా రనుచున్నారు. ఎజుత్తచ్చన్ మహాకవికి మార్గదర్శకమైన తెలుగు అధ్యాత్మరామాయణము మనకు దక్కకపోవుట మన దురదృష్టము. కనీస మా కవి యూరు పేరులైనను తెలియరావాయెను. సీతా రామాంజనేయ సంవాదమును (క్రీ. శ. 1760) రచించిన పరశురామపంతుల లింగమూర్తి యను మహాయోగి యొక అధ్యాత్మరామాయణమును రచించెను. దాని ప్రతి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్పుస్తకభాండాగారమున గలదట. దాని గూర్చి పరిషత్పత్రికలో నొకప్పుడు వ్రాయబడినట్లు ఆచార్య నిడుదవోలు వెంకటరావుగారనుచున్నారు.[1] లింగమూర్తి ఓరుగల్లు నివాసి. అతని యిల్లు ఇప్పటికిని కలదు. అది నిజముగా మనజాతికి పుణ్యతీర్థమట్లు భద్రపరుపదగిన పవిత్రప్రదేశము. లింగమూర్తికి సమకాలికుడైన రాపాక శ్రీ రామకవి (పర్కాల—ఓరుగల్లు మండలము) కూడా అధ్యాత్మ రామాయణమును వ్రాసెను. అదియు నముద్రితమే. గద్వాల సంస్థానమున (క్రీ. శ. 1775—1800) కవిగా నుండిన కాణాదము పెద్దన సోమయాజి రచించిన యధ్యాత్మ రామాయణము ముద్రింపబడుట మన భాగ్యము. కోటంరాజు రామయామాత్యుడు (క్రీ. శ. 1860 ప్రాంతము) రచించిన అధ్యాత్మ రామాయణము కూడ ముద్రిం

1. ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రిక. సం. 10. పుట 38.

పబడినదట. కంచెర్ల శరభన కూడ అధ్యాత్మ రామాయణము నాంధ్రీకరించెనట. ఇప్పటికి లభించిన అధ్యాత్మ రామాయణ ములందిది ప్రాచీనము. ఈతడు 16 వ శతాబ్దము వాడందురు.[2] ఇదియు నముద్రితమే. కాళహస్తి సుబ్రహ్మణ్యకవి రచించిన అధ్యాత్మ రామాయణము కీర్తనలు (ఆరుకాండములు) ముద్రింప బడినవి. వీని కధిక ప్రచారము గలదు. పాడ నేర్చిన వారంద రును ఈ కీర్తనలు పాడుకొనుచున్నారు. రంగరాజు కేశవరావను మహాకవి (షాహపురము) (క్రీ. శ. 1882 సంవత్సరమున) అధ్యాత్మరామాయణ మారుకాండములును కీర్తనలుగా రచించెను. ఇదియముద్రితము. ఇంకను చెదలువాడ సుందర రామశాస్త్రి వి. బాలకృష్ణమొదలి, దుర్వాసుల రామయార్యుడు, వెంకట కృష్ణమాచార్యులు, ప్ర. సుబ్రహ్మణ్యశాస్త్రి మున్నగువార లనేకులు వచనముగా వ్రాసిన అధ్యాత్మ రామాయణములును, ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రిగారి నాటకమును, బి. లక్ష్మయ్య అధ్యాత్మరామాయణ సంగ్రహమును (వచనము) బి. తమ్మిరెడ్డి అధ్యాత్మ సార సంగ్రహము (వచనమును) ముద్రింపబడినట్లు ఆంధ్ర వాఙ్మయసూచిక సాక్ష్యమిచ్చుచున్నది. అముద్రితములుగా నింకనుగల గ్రంథము లెన్నియో!

పదునెనిమిదవ శతాబ్దమున తెలంగాణమందు నలుగురు మహా కవు లీ యధ్యాత్మ రామాయణమును పద్యకృతులుగా రచించిరి. ఈ నాల్గింటిలో నొక్కటి కాణాదము పెద్దన సోమయాజి రచించినది మాత్రము ముద్రితమైనది. లింగమూర్తికవి, రాపాక శ్రీ రామకవి రచనముల గూర్చి ఇదవరకే మనవి చేసినాను. ఇక నాలుగవ మహాకవి మోదుకూరి పండరినాథరావుగారు. ఈ మహాకవి స్వగ్రామము మడికొండ (కాజీపేటకు మైలున్నర దూరము—ఓరుగల్లు తాలూకా) హన్మకొండలో నుద్యోగము కాబోలు. గ్రంథరచనము హన్మకొండలో జరిగినట్లు గోలకొండ కవుల సంచికసాక్ష్యము.

ఈ మహాకవి పదునెనిమిదవ శతాబ్దము పూర్వార్ధమున జన్మించి పందొమ్మిదవ శతాబ్దము పూర్వార్ధమున పరమపద మలంకరించిన పూర్ణాయుష్కుడు. ప్రస్తుతము మడికొండలో వీరి వంశీయులున్నారు. శ్రీ మోదుకూరి వెంకటేశ్వరరావుగారు నా కీ గ్రంథము నిచ్చిరి. వారి వయస్సు సుమారు 65 సంవత్సరములుండును. శ్రీ వెంకటేశ్వరరావుగారి ముత్తాత కగ్రజు డీ కృతికర్త. పండరినాథరావుగారి మరియొక రచనము రామ కథా కల్పలత 2400 శ్లోకములతో జీర్ణావస్థలో నున్నది. పండరీనాథరావుగారు భాస్కర రంగనాథాదులవలెనే తమ నామముతో నీ గ్రంథమును పండరినాథ రామాయణమనినారు. పండరినాథ రావుగారికి సంతానము లేదట. వారిసోదరులు రామకృష్ణరావు గారు అన్నగారు చెప్పుచుండగా నీ గ్రంథమును వ్రాసినట్లు శ్రీ వెంకటేశ్వరరావుగారు తెలుపుచున్నారు.

మూరెడు పొడవు, రెండు బెత్తెల వెడల్పుగల 25 వ దళసరి (కోరుట్ల) కాగితములపై రెండు ప్రక్కలను ముద్దులు మూటగట్టు అక్షరములతో నున్నదీ గ్రంథము. ఒక్కొక్క పుటకు 16 బంతులున్నవి. గ్రంథము చివరన పెన్సిలుతో 488 సీస పద్యములు, 5410 ఇతర పద్యములు మొత్తము 5898 పద్యము లీ గ్రంథమందున్నట్లు వ్రాయబడియున్నది. ప్రతి పుటకును ఎర్రని సిరాతో బార్డరు కట్టబడియున్నది. నల్లసిరాతో రెండుమూడు కాగితములపై రథారూఢ, గజారూఢ, అశ్వారూఢులగు యోద్ధలు విక్రమించుచున్నట్లును గీయబడిన చక్కని చిత్రములున్నవి. వేరొకచో నొక హరిదాసు చిత్రము కూడ కలదు. ఈ హరి దాసుకు కాళ్ళకు గజ్జెలు, నడుమునకు బిగించిన యుత్తరీయము, చేతులందు తంబురా, చిరుతలును, మెడలో తులసి మాలతోపాటు మూతికి మీసములు కొట్టవచ్చినట్లున్నవి. పాఠక మహాశయులును, తద్వంశీయులును మన్నించినచో ఈ చిత్రము స్వయముగా పండరినాథరావుగారి ప్రతికృతియనుకొని సంతృప్తినందెదను.

ఇంత గ్రంథమును రచించుట కా మహాకవికి ఎన్నాళ్ళు పట్టెనో తెలియదుకాని గ్రంథాంతమం దొక సీసపద్యమునకవి తననుగూర్చియు, తలి దండ్రుల గూర్చియు, గ్రంథ సమాప్తిని గూర్చియు ఇట్లు వ్రాసికొన్నాడు.

సీ. ఇలను ఖండేరావు కులజు డాపస్తంబ
    సూత్రుండు కౌండిన్య గోత్ర జాతు
డైన గోపాలరాయామాత్యునకు తదీ
    యాంగనా మణి వెంకటాంబికకును
నందనుండైన పండరినాథు డధ్యాత్మ
    రామాయణము సమగ్రంబుగాగ
తెలుగున విరచించి యెలమి శ్రీరామున కొసగె
    షట్కాండంబు లుర్వి వెలయ
హస్త గుణ శైల భూ సంఖ్య నమరు శాలి
వాహనశక ప్రమోదూత వత్సరమున
నమరు వైశాఖ శుద్ధ పంచమిని సోమ
వారమున భాను డర్ధాహ్న వర్తిగాగ.

ప్రస్తుత మీ వంశీయుల ఇంటిపేరు మోదుకూరివారు. ఒకప్పుడు వీరు మహారాష్ట్రులై యుందురు. ఖండేరావనుపేరు తరుచుగా మహారాష్ట్రులయందే యుండును. ఖండేరావనగా శివుడు. సతారా జిల్లాయందున్న "జజోరి" యే ఈ ఖండేరాయ క్షేత్రము. ఖండేరావను మహారాష్ట్రుడు తెలంగాణమునకు వలసవచ్చి యుండును. అతనిపేరే ఇంటిపేరుగా తరువాతి తరములవారు వర్ధిల్లియుందురు. పండరినాథరావుగారి తండ్రి గోపాలరాయు డనియు తల్లివెంకటాంబయనియు తెలియుచున్నది. గ్రంథము శ్రీ రామాంకితము. గ్రంథ పరిసమాప్తి శా. శ. 1732 ప్రమోదూత వైశాఖ శు. 5 సోమవారము మధ్యాహ్నము. అనగా క్రీ.శ. 7—5—1810. చివర గద్య మిట్లున్నది. "ఇది శ్రీరామ చంద్ర సాంద్ర కరుణాలబ్ధ నిస్తంద్ర సంస్కృతాంధ్ర కవితా సనాథ పండరీనాథ ప్రణీతంబైన అధ్యాత్మరామాయణ యుద్ధ కాండంబునందు సర్వంబు చతుర్థాశ్వాసము."

ఈ పద్యము తరువాత నొక యుత్పలమాలలో కవి తనకు గల కోరిక నిట్లు వెల్లడించినాడు.

---

2. ఇదియును శ్రీ వేంకటరావుగారేతెలిపిరి.

ఉ. చందురు గేరు మోము విలసన్నయనాంబుజయుగ్మ మిందిరా
సుందరి మందిరంబగుచు శోభిలు వక్షము బాహు యుగ్మమున్
కందమువంటి మేనుగల కారుణికుండవనీజతోడ నా
ముందర నిల్చుగాత కనుమూసెడునప్పుడు విచ్చునప్పుడున్

మహాకవిపోతన జన్మించినగడ్డపై పుట్టిన పండరినాధరావుగారింత కన్నవేరుగా నెట్లు కోరుకొనజాలుదురు. ఇట్టికోరికనే పోతనగారు వెల్లడించిరి. (ఏకాదశస్కంధము చివరన) ఈ యిరువురి కృతులకును శ్రీ రామచంద్రుడే కృతిపతి. పోతనకవి పండరినాధరావుగారి కన్నివిధములను ఆదర్శమూర్తి.

ఈ గ్రంథము ప్రారంభమున నున్న పద్య మిది.

ఉ. శ్రీ గిరిజా సరస్వతుల చిత్తములుల్లసిలంగ కేశవ
శ్రీగళ పద్మజాకృతులు చెంది జగత్స్థితి నాశకల్పనా
యోగము లాచరింపుచు సమున్నతభావము తత్త్వదీయసే
వాగతులొందజేయు పరవస్తు భజించెద నిష్టసిద్ధికిన్.

ముక్తికి భక్తిజ్ఞానము లొక మార్గమనియు సత్కవిత్వము వేరొక మార్గమనియు కవి యభిప్రాయము.

క. ఈ రెండు పథంబుల కడు
వారసి ప్రథమంబు దూరమని యితరంబుం
జేరువయని యా పథమున
శ్రీరమణీవరుపథంబు జెంది రనేకుల్

ఉ. అట్టి మహామహుల్ సుకవితాకృతులైన యశశ్శరీరముల్
బెట్టి విముక్తులౌట యతి విశ్రుత మిమ్మహిలోన గాన నీ
పట్టున దేహభోగములపాయములై చను సత్త్వబంధముల్
గట్టిగ కీర్తిముక్తులకు కారణమై చిరకాల మొప్పెడున్.

క. అవహితమతి నిజకృతి మా
ధవునకు నర్పించునట్టి ధన్యతరుండా
కవితా నౌకం దుస్తర
భవ సింధు తరించి ముక్తిఁబడయుట యరుదే.

కనుకనే కవి తాను గూడ ఈ రెండవ మార్గమననుసరించి ఏ తత్‌కృతికి పూనుకొనెను. అందుల

"మామకీనేష్టదైవంబు రాము డతని
సచ్చరిత్రంబు నానేర్చు చందమునను
చతుర వైకృతవాక్ప్రపంచమున నొక్క
కృతి రచించుట మేలు తత్కృప జనింప".

అని నిశ్చయించుకొనెను.

రామాయణమును తొలిసారిగా రచించిన ఆది కవిని స్మరించి

శా. దివ్యప్రస్తవనీయశీలుడు రమాధీశప్రభావుండు వే
దవ్యాసుండు మునీశ వంద్యుడు సముద్యత్పండితా పండిత
ప్రవ్యక్తంబుగ రామతత్త్వము సముద్గస్ఫూర్తి యొప్పంజన
శ్రవ్య గ్రంథముగా నొనర్చె భువన శ్లాఘావచః పూజ్యుడై.

ఆ.వె. అదియు రామతత్త్వ మను పెన్నిధికి రసాం
జనముబోలె జగము సన్నుతిభవ
నవనిలోన వెలసె నధ్యాత్మరామాయ
ణాఖ్యమై పురాణ ముఖ్యమగుచు.

క. అది బ్రహ్మాండ పురా
ణోదంచిత మాలికాగతోజ్వలరత్నం.
బై దశరథసుత పార
మ్యాదితలావణ్యమై సమున్నతి నొప్పన్.

క. అది సంగ్రహించి యేనున్
పదపడి మృదు విక్రుతి వచన పద్ధతిమైనే
ర్పొదవ రచించుటకై నె
మ్మది గృత నిశ్చయుడనైతి మద్దేవుకృపన్.

ఉ. ఈ కృతి నంధ్ర వాక్కుల న హీన మతి న్విరచించి సర్వలో
కైక శరణ్యుడౌరఘుకులేశున కిచ్చి తదీయ సత్కృపా
లోక సుధాబ్ధి దేలియవిలుప్త మహా మహామోన్నతుండనై
శ్రీ కరముక్తికాంతను వశీకృతజేయుదు వేయు నేటికిన్"

అని తన కృతిప్రయత్నము నుగ్గడించి పదంపడి.

గీ. కలిత సూత్ర భాష్యకారుల కేశవ
శంకరాంశజుల విశాల మతుల
పరమయోగివరుల బాదరాయణ శంక
రార్యులను హృదబ్జమందు నిల్పి.

తనకు రామతారక ముపదేశించిన రామదేశికుల నన్నుతించితల్లి దండ్రుల మదినిల్పి షష్ఠ్యంతములు చెప్పినాడు.

క. రామునకు భక్తకైరవ
సోమునకు సుధామునకు సుశోభితముక్తా
దామునకు ఘోరదనుజవి
రామున కరి భీమునకు పరంధామునకున్

క. దశరథ సుతునకు సాక్షా
ద్దశరథునకు భక్తకలన తత్పర మతికిన్
దశ కంఠకంఠ లుంఠన
విశదబలున కఖిలలోక విదితయశునకున్

క. ఆద్యునకున్ భవ భయరు
గ్వైద్యునకు న్నిగమ వాఙ్నిగద్యునకు శతా
ర్కద్యోతమానరుచికిని
నాద్యంత వివర్జితున కనాసాద్యునకున్.

క. సుగ్రీవరాజ్యదునకు గ
రగ్రీవాద్యఖిలసురవర ప్రభునకు కం
జగ్రీవున కుపశమితద
శగ్రీవోద్వేగునకు బ్రశాంతాత్మునకున్.

క. ధాత్రీవరునకు పరమ ప
విత్రునకున్ భవలతాలవిత్రునకున్ సా
విత్రునకు నవ్య నీరజ
నేత్రునకు వినీల జలదనిభగాత్రునకున్,

ఇట్టి యయ్యనకు తానీయ దలంచుకొన్న సాలంకృత కృతికన్య నిట్లు వర్ణించియున్నాడు.

సీ. కలిత విద్యున్మాలికా దివ్యతనువల్లి
మాలిన్య దూర సన్మానినియును
లలిత చంపకనాస విలసదుత్పల గంధి
ఘనతర స్రగ్ధర కందవేణి
మత్తకోకిలవాణి మత్తేభగామిని
ప్రస్ఫురత్స్రగ్విణి భవ్యగీత
వరయశోజాల భాసురమంజుభాషిణి
తరళలోచన సదుత్సాహ భరిత.

మధురవచనయైన మత్కవితా కన్య
నింపుమీర జగదధీశ్వరునకు
భక్తినిచ్చి జనులు ప్రస్తుతింపగనేన
కూకుదుండ నైతి కొదువలేక.

ఇంతవరకు చెప్పిన విషయములకు పండరినాథరామాయణము పీఠిక మరియు చివరి పద్యమాధారములు. ఇక కవి సామర్థ్యము దెలుపుటకు అటనట కొన్ని యుదాహరణము లుద్ధరింతును.

ప్రారంభమున గల నైమిశారణ్య వర్ణన మిట్లున్నది.

"మరియు నమ్మహారణ్యంబు బ్రహ్మాలయంబునుం బోలె సరస్వతీనివాసభూతంబై, కైలాసంబునుం బోలె నార్యాధిష్ఠంబై, ఇంద్రలోకంబునుం బోలె సుమనోధివాసితంబై, లంకాపురంబునుం బోలె పలాశబృందాకులంబై, విరాట నగరంబునుం బోలె కీచకవంశ భరితంబై, స్యందనంబునుం బోలె సూతాధిష్ఠింబై, యలకాపురంబునుం బోలె రంభాధిధామంబై, వధూముఖంబునుం బోలె కాంచనతిలకశోభితంబై, మహారణంబునుం బోలె ధృతధర్మవిలసితంబై, కామినీ హృదయంబునుం బోలె సమన్మథంబై, పక్షీంద్రావాసంబునుం బోలె ద్విజబృందసంఘుష్టంబై, యంబరంబునుం బోలె ఖగమండలాలంకృతంబై, ద్వారకా నగరంబునుం బోలె ననిరుద్ధసంచారోదంచితంబై, యంతరిక్షంబునుం బోలె నారదాగమయోగ్యంబై, ఏకచక్రాపురంబునుం బోలె బకసంచారితంబై, భోగవతీ నగరంబునుం బోలె వాతాశన భూయిష్ఠంబై యుండ"—

శౌనకాది మునులు సూతునితో నిట్లనిరి :

సీ. భానుమత్కుల దుగ్ధపాథోధి కెవ్వాడు
రాకావధూ నిశారమణుడయ్యె
జానకీనయన కంజంబుల కెవ్వాడు
వనజాత బంధుడై వినుతికెక్కె
భయదరక్షోమహావనముల కెవ్వాడు
కేవలంబుగ దావకీలి యయ్యె
దశకంఠ కంఠకందమ్ముల కెవ్వాడు
చటుల వాతూలమై జగతి బరగె
నట్టి రాము తత్త్వ మాకర్ణనము చేయ
వలయునను మనీష గలదు మాకు
కాన సదయ నీవు కరుణా మయుండవై
తెలుపవలయు సూత ధీసమేత.

అయోధ్యానగరమును వర్ణించుసందర్భమున నున్న పద్య మొకటి.

ఉ. మానిత తుంగ హర్మ్య గత మానవతీతనుగంధ తస్కరా
నూనసువాతపోతకలనో పగతైక సుగంధవ త్స్వరు
ద్యానతరువ్రజంబగుచు తన్ను జగంబు నుతింపగా నయో
ధ్యా నగరీసునామమున నప్పుర మొప్పు రమాధి వాసమై.

అయోధ్యానగరమందలి చాతుర్వర్ణ్యములవారి వర్ణించు పద్యములు.

చ. నిగమ చతుష్టయంబు తన నేర్పర నాలుగు మోములన్ సదా
ధిగతముగా నొనర్చిన విధిం జతురాస్యు డనంగ జెల్లనే
నిగమచతుష్టయంబు కడు నేర్చిన నేక ముఖోద్గతంబు జే
యగ దగినట్టిమాకు జతురాస్యత యొప్పు నటంద్రుభూసురుల్

ఉ. ఆకృతి జూడగా నహి భయంబున నన్వహముం గ్రశించు దో
షాకరనామసంయుతు డనంగ సహోయుడు దీన కామినీ
భీకరుడుం గళంకసముపేతుడు తాదృశురాజు జేసి యీ
లోకము మెచ్చునంచు నృపలోకము చందురు నవ్వు నప్పురిన్.

(క్షత్రియులకు చంద్రుడో లేదా సూర్యుడో వంశకర్తలై యుండగా ఇచట చంద్రు నవహేళన చేయుటలో నౌచిత్య మేమని తోచవచ్చును. కాని అయోధ్యానగరము సూర్యవంశ్యుల కాలవాలము గనుక చంద్రవంశము కన్న సూర్యవంశమువారు తాము గొప్పవార మనుకొనుచున్నారని స్వారస్యము)

మ. ధనమెల్లం నిధిజేసి తా గుడువకన్ దానక్రియాహీనుడౌ
ధనపాలుం ధనదుండటంచు బలుకం ధర్మంబె మేలెంచు న
ర్థనదున్ మెచ్చరు వైశ్యుల న్నగరిలో దానక్రియా దక్షులై
ఘన భోగాన్వితులై మహా ధనికులై కల్యాణ సంపన్నులై

ఉ. ఏకహలాయుధుండు మరి యేరికి తత్ఫలదుండు గా డిల
నైక హలాయుధత్వము సమస్త జనైక ఫలప్రదత్వమున్
మాకు దగున్ హలాయుధుడు మా సరియేయని మాటిమాటి క
స్తోకబలున్ బలు న్నగుచు చొక్కుదురంఘ్రిజు లప్పురంబునన్.

అయోధ్యానగరీసౌధరాజములును స్త్రీలును నిట్లు వర్ణింపబడినారు :

చ. సరసపయోధరాలి గని సౌధ చరత్సతులెల్ల తత్పయో
ధరత సహింపలేక కరతాడిత వక్త్రము జేయ దంతముల్
కరక చయాపదేశమున గ్రక్కున పైపయి భూమిరాలగా
నరుదుగ వింట నీరదము లయ్యె పయోధరము ల్తదాదిగన్.

మ. పురసౌధస్థ వధూముఖాబ్జకలనాబుద్ధిన్ వియ ద్వాహినీ
శరజవ్రాతము కాలదన్ను మధులిట్సంఘంబు తద్భాసభా
స్వరసత్కౌముది జూచి చంద్రమతి బోవం తత్పయో జాలి సు
స్థిరమై మోడ్చిన చాల మ్రోయు మధుపశ్రీ లెందునిత్యంబులే

గీ. చంద్రపురభామినీ వక్త్ర చంద్ర భేద
భంగి యొనరించుటకు గాదె బ్రహ్మ యేరు
పరచె బ్రాచీన చంద్రు నిర్భగ్న కలుగ
భామినీ వక్త్ర చంద్రు నభగ్న కలుగ.

దశరథుని ధర్మపరిపాలన మీతీరుగా వర్ణింపబడినది :

సీ. కుటిల ప్రచారముల్ క్రూర సర్పము
లంద పక్షపాతంబులు పక్షులంద
వరకళాభంగంబు సరసిజాహితునంద
సంతాపగతి దినేశ్వరునియంద
మద విభ్రమంబు సామజ బృందములయంద
ప్రకటబంధంబులు రతులయంద
మందత్వములు వధూమణులయానములంద
కాఠిన్యములు శైలగణములంద
గాని వేరొక్కచోటుల గల్గకుండ
నిఖిలజగమేలె తను సర్వస్వపులు గొల్వ
మెరసి నిజనందనత్యాగమిష్యమాణ
దశరథుండై తనర్చు న ద్దశరథుండు.

ఋష్యశృంగుడు తాను జూచిన వారకామినులను తాపసులను కొని విభాండకమహామునికి వారి మాహాత్మ్యమును వర్ణించి చెప్పు ఘట్ట మత్యంత హాస్యరస పూరితము.

క. మత్తేభ కుంభనిభమై
చిత్తంబు హరించు చారు శృంగద్వితయం
బ త్తపసి కొమరు నురమున
నుత్తమ రూపమున మెరయు నుజ్జ్వల తరమై

ఉ. శారద నీరదాకలిత చారు కనత్కనకాచలాభ వి
స్ఫార తదుత్తరీయగత భాసుర శృంగయుగంబు జూడగా
గోరెడు నాదు కన్నుగవకున్ మృదుమారుత ముత్తరీయమున్
జారగ వీవ నొక్క మరి సయ్యన గానగనయ్యె శృంగముల్.

గీ. అసమున్నతత్వ మావర్తులత్వంబు
నా మనోహరత్వ మా కఠినత
ఆ నిరంతరత్వ మనిశంబు మదిబాయ
వేమిసేతు భూసురేశ చెపుమ.

ఆ. వె. కేవలముగ చంద్రకిరణావలియు బోలె
కనకగిరుల నడిమి గంగబోలె
నక్షమాల యొకటి యమహాత్మునివరు శృంగ
మధ్యమందు గ్రాలు మహితచరిత.

ఆ. వె. అట్టి యక్షమాల లట్టి కంకణములు
నట్టి వల్కలంబు లెట్టి మునుల
యందు గంటిమే మహాభాగ తల్లిప్త
భస్మ మతి సుగంధ బంధురంబు.

క. తెలిపితి నొకముని సత్కథ
తెలియుము మునులంద రిట్టి తెరగున నందుం
బొలిచెదరని వినువారల
దలచుటచే గాదె విరహతాపము బొడమెన్.

ఆ. వె. కొంద రందు శిష్యకోటి కధ్యయనంబు
జెప్పుచుండ నాదు చెవుల పండు
వయ్యె నట్టి మధురమైన సుస్వాధ్యాయ
మేను తొల్లివిన వహీనచరిత.

ఉ. అంతట నన్ను జూచి ముని లందరు దిగ్గన లేచి వచ్చియ
త్యంత ముదంబుదోప బిగియార ననుం దయ గౌగిలింప మే
నంతయు చాల రోమ పులకాకులమయ్యె మునీశ నాకు నే
నింతట దానిదల్చి తనువెల్ల మరిం బులకించు కంటివే.

క. ఆదివ్య తనుస్పర్శము
నాదైన పురాకృతావినాశి తపస్సం
పాదిత ఫలమున గల్గుట
గా దలచెద నొండు గలదె కారణ మనఘా.

దశరథుడు పుత్రకామేష్టి చేసినపుడు యజ్ఞకుండమునుండి వెడలిన ప్రాజాపత్యపురుషుని వర్ణన మిట్లున్నది :

సీ. పల్లవారుణవర్ణ బహుల సిరోజంబు మ
హితారుణారుణ శ్మశ్రుకంబు
రుచిరార్క మండలారుణ చారు వక్త్రంబు
లోలానలప్రభాలోచనంబు
ఆశా మదేభతుండాభబాహుయుగంబు
మేఘగర్జాతి గంభీర రవము
అభితప్తచామీకరాయత చేలంబు మణి
మండనావళీ మండితంబు.

నైన యొక్క భూత మమృతాభ పాయస
భరితమైన పాత్ర పత్నిబోలె
బాహుదండములను బల్మి నాలింగించి
విపులవహ్ని ముఖము వెడలి నిలిచె.

అహల్యను వర్ణించు సందర్భమున గల కొన్ని పద్యములు :

క. మునుమత్స్య రాజభావము
గనిన నయనముల సహింపకను వానిం గ్రిం
దను ద్రొక్కి సకుంతల భా
వనిరూఢత నొందెననగ ఫాలము మెరసెన్.

*   *   *

గీ. స్మర సమారోపితంబైన చాపమనగ
వచ్చు తద్భ్రూలతాయుగం బచ్చుపడగ
దానికడనుండి మెరయు నుద్దామ నయన
ములకు నంబకభావంబు గలుగుకతన.

*   *   *

క. త న్నిశ్వాస చలత్సున
మున్నత నాసావలగ్న ముక్తాఫలమున్
మిన్నున శశిపై రోహిణి
సన్నుగ నుపరతిమెలంగుభంగి వెలుంగున్.

*   *   *

క. సురుచిర సుమనో నివహం
బురు ముక్తావళులు నిరత ముల్లసిలంగం
గురు వక్షోరుహ యుగ్మము
పరమపదం బని వచింపబడు టబ్బురమే.

*   *   *

గీ. అక్షి యుగ్మంబు పుష్కరం, బధరసీమ
మధుర, నూగారు కాశి, తన్మధ్యయుషి
మాయ, ప్రపదద్వయంబు కూర్మంబు, దేహ
మవని శ్రీరంగమనఁజెల్లు నారమణికి.

శ్రీరాముని పాదరజము సోకి శాపవిముక్తయైన యహల్య ఈ తీరుగా నున్నదట :

సీ. మంథాచలనిధర మథ్యమానక్షీర జలధి
నిర్గత రమాసతి యనంగ
అతిఘోర రాహుగ్రహక్రూరముఖ ముక్త
కమనీయ తరచంద్రకళ యనంగ
ధూమప్రణాశకృద్భూరి ప్రభాలసచ్ఛీ
మదుద్ధతాశన శిఖయనంగ
వర్షావసర వారివాహగర్భవ్యక్త లలిత
సౌదామనీలత యనంగ.
భవ్య రామచంద్ర పాదపంకజ పరా
గాభికలిత దేహయై యహల్య
సత్వరముగ భర్తృ శాపబంధము బాసి
ముదితయగుచు రాము నెదుర నిల్చె.

పంపా సరోవరప్రాంతమున వసంతర్తు వర్ణనము :

సీ. చంచరీకావళీఝంకారరవ మనూ
నంబైన తంత్రీస్వనంబుగాగ
ఖగకులేరిత మహా కలకలధ్వను లమందము
లైన కంఠ తాళములు గాగ
మత్తకోకిల గీత మధురతరనినాద
మత్యనుపమమైన గేయంబు గాగ
వనగజంబు లొనర్చు ఘన బృంహితముల
నుత్తమములౌ మర్దల ధ్వనులు గాగ
పుష్పవద్భూజములు హేమభూషణాంగ
రాగముల నొప్పు రుచిర పాత్రములుగాగ
వనిని నర్తకుడి వ్వనంబున వసంతు
నాజ్ఞ నృత్యంబు సేయుచున్నట్లు దిరుగు.

భర్తృశోకముతో తార శ్రీరాముని సంబోధించి యిట్లనుచున్నది.

గీ. స్వర్గతుండయ్యె వానర చక్రవర్తి
నన్నుబాసి సుఖించునే నరవరేణ్య
రమ్య వనచారివయ్యు నీ రమణిబాసి
యున్న కతమున సుఖము నీ వొందనట్లు.

క. కానన్నీవీయెడనను
ప్రాణేశునితోడ గూర్చి పరమకృపాళు
త్వానూనత వెలయం బతి
దానఫలం బందవే యుదార చరిత్రా.

ఆంజనేయుడు సముద్ర లంఘనమునకై మహేంద్ర శైల శిఖరము నుండి ఎగసిన సందర్భమున నున్న పద్యములు.

మ. నిజదేహానిల సన్నిపాత నిహతి న్నిర్మూలమై తత్తరు
వ్రజముల్ సంఖ్యకుమీరి తోనెగయ జేవం బొవజొచ్చె న్నిజ
ధ్వజనీసంవృతుడై మహీపతి రిపువ్రాతంబుపై నెత్తి వై
రిజయ ఖ్యాతి జెలంగబోవు గతి నుర్వీ భృన్నిభాకారుడై

ఆ. వె. ఉరువేగమున సముద్ధిత వృక్షంబు (గణభంగము ?)
లరిగె కొంతదూర మతనితోడ
నవని దూరదేశ మరుగు బంధునితోడ
బంధుగు లరుగుభంగి పాటిగొనగ

ఆ. వె. అందు సారవంతమగు తరు వ్రజము త
జ్జలధిగూలి మునిగె శక్రభీతి
బారుతెంచి తొల్లి ధారుణీధరములు.
శరధిమగ్నమైన కరణిదోప

క. అతత కుసుమస్థగితుం
డై తరుచరవీరుడొప్పె నవనీధ్రముఖ
ద్యోత స్థగితంబగుగతి
ప్రీతిం దనుమెచ్చి దివిజబృందము జూడన్.

ఆ. వె. కొంతదూరమిట్లు కుసుమబృందంబేగి
సాగరమున విగతవేగమగుచు
బడిన తజ్జలంబు భాసిల్లె గగనంబు
తారకాళితోడ దనరునట్లు.

శ్రీ పండరినాథరావుగారి కవితాపాటవమును గుర్తించుటకు పై నుదాహరించిన పద్యములు చాలుననుకొందును. ముముక్షువైన పండరినాథరావుగారి యాశయము గ్రంథరచనముతోడను, ఏతద్గ్రంథమును శ్రీ రా మ చం ద్రు ని కర్పించుటతోడను 7—5—1810 నాడే ఈడేరినది. మనకర్తవ్యము మాత్రము మిలిగియున్నది. అది యెన్న డీడేరునో కదా!

కీర్తికాంక్ష లేదు

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

విడుపి సత్యబాల వెడలె భావేయజ్ఞ
కార్యనిరతి నొక్క గ్రామమునకుఁ
గండపట్టినట్టి కమ్మతీండ్రకు నది
మనికిపట్టు సిరుల కునికిపట్టు

భూదాన మహాత్త్వము నా
సోదరి వివరించి పల్కుచున్ గీరితిపై
నాదటపడి దానం బిడఁ
గాదని యది సాత్వికమ్ము కాదని చాటెన్

ఇచ్చువాని కహంకృతి పుచ్చుకొనెడు
వాని కీసుమంత దైన్యము లేని యీవి
యుత్తమోత్తమ మని పల్కె నువిదమిన్న
సభ ముగిసెఁ గాని దానవాసన హుళక్కి

ఈపూఁట పేరుకొన్నను
జే పీడెందములు కరఁగి ప్రేమస్రోతో
రూపము ధరింపవా యని
యూపొలఁతుక బసకుఁ జేరె నాఅనిదీక్షన్.

అంత నొకవృద్ధకర్షకుఁ డావెలంది
కుఱఁగటికి వచ్చి యణఁకువ గురిసి నేను
నలువదేకరాలవాఁడ నానంజ పుంజె
యెల్ల నిచ్చితిఁ గైకొమ్ము తల్లి! యనియె
ఆసాధ్వి విస్మయంపడి
"యీసత్కృతి సేయవైతి వేమీ సభ" నాఁ
గాసంతయశము నొల్లని
మాసి యితం డనియెఁ గాఁపు; మానిని గ్రుంగెన్

ఫలము నొల్లనికర్మమే వలఁతిచేఁత;
గీత సెప్పిన వెలలేనినీతి యిదియె;
విశ్వహితశీలుఁ డైన భావే మహర్షి
కతన నీయోగమునకు సంక్రాంతి వచ్చె!

శ్రవ్యకావ్యేతివృత్తము

శ్రీ 'సుప్రసన్న'

మహాకావ్యమునందున్న యితివృత్త మీవిధముగానుండవలయు నన్న విషయము ప్రాచ్యాలంకారికులు చేయలేదు. కావ్యాంగములలో సూక్ష్మసూక్ష్మములైన విషయములను వివరించుటయందు జాగరూకత వహించి కృత్యాదినుండి భరత వాక్యము దాక సర్వ విషయముల నిరూపించినవారు దీనినిగూర్చి యంత స్పష్టముగా చెప్పకపోవుట యాశ్చర్యముగానే గోచరించును.

కవికి కావ్యము నిర్వహించుటకు కథ ప్రధానమైనది. కథలోని ప్రధానమైన పాత్రల నాశ్రయించియే రసభావాదులు కలుగును. కవి స్వీకరించిన యొకానొక కథ తాను చెప్పబోవు మహావిషయమున కనుగుణముగా ప్రవృత్తమగుచుండును. ఈ మహా విషయాభిముఖముగా కవి తన కావ్యమునందలి సర్వ సంఘటనలను కల్పించును. పాత్రల మనోవృత్తులను తీర్చును. కావ్యవ్యంగ్యముగా తన చెప్పదలచిన దానిని భాసింపజేయును.

ఊరక కావ్యము వ్రాయుటలో సర్థములేదు. యథేచ్ఛగా తనకు దోచిన విషయముల నల్లుకొనుచుబోయినచో నెంతయేని వ్రాయవచ్చును. త్రాడు బొంగరము లేని యా 'సంఘటనా మంజరిని కలగూరగంప యనగలము కాని కావ్యమనలేము. అందువల్లననే యొకానొక మహాధర్మమును వ్యంజకముగా జేయుటకొరకు తదనుగుణమైన వస్తువును కవి యెన్నుకొని తదనుగుణమైన కల్పనచేసి కథను కుదించి, పెంచి కావ్యముగా తీర్చును. అందువలన కథాస్వరూప మిట్లుండవలయునని నిరూపించుటలో నంతగా సార్థక్యములేదని యాలంకారికులు భావించియుండవచ్చును. కథయొక్క యంగ ప్రత్యంగములు నిరూపింపబడినప్పుడు కవి తదనుగుణముగా రచియించిన నా కావ్యమును యథాపూర్వ నిర్మాణమై కవియొక్క ప్రతిభా పూర్వకమైన నిర్మాణదక్షత్వము నరికట్టును.

ఒకానొక విషయమును ప్రతిపాదించుటకు చేయబడిన రచనాస్వరూపము వేరొక విషయమును ప్రపంచించుటకు చేయబడిన రచనా స్వరూపముతో భేదించును. ఆధునిక కాలమునందు కథాప్రధానములై వెలయుచున్న నవలల యొక్క రచనాస్వరూప మిట్టిదని చెప్పుటకు వీలు లేకుండ నవ నవముగా రోజు రోజున కభివృద్ధిపొందుచున్నది. ఒకానొక ప్రతిభావంతుడైన రచయిత తత్పూర్వమున్న నవలల నిర్మాణ మార్గమునకు భిన్నముగా వేరొక మార్గమును ద్రొక్కుచున్నాడు. ఈ విషయము నెరింగినవా రగుటచేత కాబోలును కావ్యాలంకారశాస్త్రజ్ఞులు నాయకాది విషయములు, రస భావాదుల విషయములు విపులముగా చర్చించియు కథా విషయమును కవియొక్క స్వేచ్ఛకే వదలివేసిరి.

"ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితం" అన్న భరతుడు కూడ కావ్యముయొక్క యీ కథా శరీర లక్షణము నెరిగిన వాడే. ఏ ఉద్దేశ్యముతో నిర్మించినను కథ తదనుగుణమైన యాకారము దాల్చును. కుంభకారుడు కుండల నొనర్చునప్పుడు తచ్ఛరీరమును దానియొక్క ప్రయోజనమున కనుగుణముగా బానగా, కడవగా, కూజాగా, మూకుడుగా నిర్మించును. ఈ నిర్మాణమునందలి శక్తి చాల యవసరము. లేనిచో దాని ప్రయోజనము దెబ్బతినును. శరీరము జీవుని ప్రవృత్తికి సాధనమైనట్లు కావ్యకారుని ప్రయోజనమునకు కథ సాధనమగుచున్నది—ఉపకరణ మగుచున్నది.

అందువలననే సంస్కృతభాషయందు కవులు తమ కావ్యములయందలి కథను స్వేచ్ఛగా తీర్చుకొనిరి. కాళిదాస విరచితములైన రఘువంశ, కుమార సంభవములే ఒక దానినొకటి పోలక కథా రచనమునందు భిన్నతను వ్యక్తము చేయుచున్నవి. మాఘునికృతియు, భారవి కృతియు నిట్లే కథావిషయమున తమ స్వేచ్ఛను వెల్లడించుచున్నవి. శ్రీ హర్షుని నైషధీయ చరితము సాగిన మార్గము వేరు.

రఘువంశము సూర్యప్రభవమైన వంశముయొక్క వైభవమును వర్ణించునట్టిది. వంశవైభవము వర్ణించు కావ్యమునం దా వంశముయొక్క ప్రత్యేకములైన సుగుణములను వర్ణింపవలయును. సర్వ జగన్నాథుడైన శ్రీ రామచంద్రు డవతరించిన వంశ మది. సేవ, దానము, గాఢ శీలత్వములు వారి గుణములు. అజదిలీపరఘురామాదులు వానికి ప్రతీకలు. ఒక్కొక్కగుణము నొక్కొక్క రాజచరితమునందు ప్రజ్జ్వలించును. తన జీవితమునెల్లయు నా ధర్మముకొరకే యా మహారాజు వెచ్చించును. వీరందరకు సామాన్యమైన ధర్మము లుండనే యున్నవి. "శైశవేభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణాం, వార్ధకే మునివృత్తీనాం యోగేనాన్తే తను త్యజాం"

శిష్టరక్షణ, ఆశ్రితపోషణ, దుష్టశిక్షణ మొదలైనవి వారి యాదర్శములు. వాని నా మహారాజులు తప్పలేదు. వేదములందున్న యీ మహాదర్శములయొక్క దీపమాలికవలె వారి వంశము వెలిగినది. ఈ మహా ధర్మసంపుటి వ్యంగ్యముగా కథయందు భాసింపజేయుటకు నిట్టి కావ్యమును కాళిదాసు రచించియున్నాడు. ఒక మహారాజునందే యన్ని విషయములు ప్రకాశించినట్లు చెప్పుటకు వీలులేదు. ఎవ్వని జీవితమేనియు నేది యేనొక పరమార్థాభిముఖముగా సంచరించును. "రామో విగ్రహవాన్ ధర్మః" యన్నను శ్రీరామునిజీవితములో త్యాగమన్నది పరమార్థము, ఆతని జీవితమునందు సర్వేతరధర్మములు ఈ ప్రధానమైన త్యాగమున్న

ధర్మమున కొదిగియుండును. ప్రధానములైన వేదధర్మముల యొక్క ప్రవృత్తిని జీవితమునందు చూపదలచిన కవి రఘు వంశము వంటి కథానాయకగల మహాకావ్యమునే రచించును.

అతని వేరొక కావ్యము కుమారసంభవము. దీనియందు ధర్మములయొక్క ప్రతిపాదన యుద్దిష్టముకాదు. జీవునిలోని ప్రధానమైన కామప్రవృత్తియొక్క వ్యాఖ్యానము ముఖ్యమైనది. పరమేశ్వరునిదే ఈ కామము. ఇది సృష్ట్యభిముఖమైనది. "సో కామయత" యన్న శ్రుతికి వ్యాఖ్యానము. ఆనందమయమైన బ్రహ్మమునందు సంకల్పము కలుగుటతోడనే సృష్టి కలుగుచున్నది. ఈ సృష్టి యా సంకల్పమునకు కలిగిన ఫలము. ఈ సంకల్పమునే—కామము లేక వాంఛ యనవచ్చును. మాయ యనగా నిదియే. ప్రకృతి యన్న నిదియే. ఈ ప్రకృతి పరమేశ్వరుని సంయోగముపొంది సృష్టిగా పరివర్తనము చెందినది. ప్రకృతియొక్క స్వరూపమే పార్వతి. అందువలననే కాళిదాసు కావ్యమునకు పార్వతీపరిణయమని పేరు పెట్టలేదు. కుమారసంభవ మనెను. ఈ కుమారుడు సృష్టియొక్క స్వరూపము. ఈ కామమునకు ఫలము సృష్టి. అది కలుగుటను సూచించి కావ్యమును ముగించినాడు కాళిదాసు. ఈ కామఫలమైన సృష్టియొక్క విలాసము చెప్పుట కవియొక్క సంకల్పముకాదు. అందువలననే కుమారస్వామి చరిత్రను చెప్పలేదు. ఈ యుద్దేశ్యము కలవాడు కావుననే కవికులగురువు భగవంతుని సురతమును వర్ణించినాడు. దానియందలి యౌచిత్య మెరుగని కవులు గతానుగతికముగా కావ్యమునందు శృంగారరసమనుపేర సంభోగాదులను వర్ణించుచు వచ్చిరి.

కావ్యస్వరూపము కవియొక్క యుద్దేశ్యము ననుసరించి యుండవలయునని యన్నది, యొక్క కాళిదాసునే కాదు, భారవ్యాదుల కావ్యములను పరిశీలించియు దీనిని నిరూపించుకొనవచ్చును. కావ్యనిర్వహణ మింత క్లిష్టమైనది. కర్తవాదరమీద నడచుటవంటిది. కవిప్రతిభ ననుసరించి ఎట్టి స్వరూపమైనను తాల్చగలట్టిది.

సంస్కృత నాటక కర్తలకే విషయము బాగుగా తెలియును. స్వీకరించిన దొకే యితివృత్తమైనను వారి కావ్య ప్రయోజనము నుద్దేశ్యమును చెడకుండ కథను నిర్మించిరి. ఆ నాటకములలోని కథల నా మార్గమున భావన చేయవలయును. మహావీరచరితమునకు, ననర్ఘరాఘవమునకు, ప్రసన్నరాఘవమునకు, బాలరామాయణమునకు గాఢదృష్టితో చూచినచో ననంతమైన భేదము గోచరించును. ఒక్కొక్క నాటకములో నొక సంఘటనకు నొక ప్రవృత్తికి ప్రాధాన్య ముండును. ఇది తారతమ్యపరిశీలనముచేతగాని తెలియరాదు.

కావ్యమునం దంగిరసమును పోషించుటకొరకు తదనుగుణమైన పాత్రలప్రవృత్తి యేర్పడును. మహావీరుడైన రాముడొకచో మహోదారుడైన రాము డొకచో మహాదుఃఖశీలియైన రాము డొకచో అ యా నాటకము లనుసరించి గోచరించును. ఈ పాత్రల ప్రవృత్తి రసాభిముఖముగా ప్రసరించును. ఈ ప్రవృత్తి తత్పాత్రయొక్క సృష్టికి భంగము కల్గించనంతవరకు మారవచ్చును. నిజముగా నిది మార్పుకాదు. ఆ విధముగా నొదిగిపోవుట. తక్కిన గుణములు ప్రధానములు కాకపోవచ్చును. కాని వాల్మీకి చిత్రించిన రామునికన్న విశిష్టముగా నుండవలసిన రాముడు, తద్వ్యతిరేకముగా నుండరాదు. పురాణగాథలకు నవీనవ్యాఖ్యానములను పేర నీకాలమందు దుష్టములు, రసభావహీనములైన రచనలు వచ్చుచున్నవి. వానియందు రామాదులు సంపూర్ణముగా స్వప్రవృత్తికి వ్యతిరేకముగా నుందురు. పాఠకుం మనస్సులో సుపరిచితములైన రామాదులకు భిన్నములుగా నీ మూర్తులు ప్రవర్తించినప్పుడు బింబప్రతిబింబముల యందలి వైరుధ్యము వలన నది చమత్కారముగా, హాస్యముగా భాసించును. ఒక్కొక్కచో జుగుప్సను కల్గించును.

పరిశీలింపగా కావ్యమునందు కథ ఈవిధముగా నుండవలయునని యాలంకారికులు నిర్ణయింపలేదు. ఏలయనగా కావ్యముయొక్క పరిధి నాటకాదులకన్న చాల విశాలమైనది. కాని పురాణములయంత విశాలమైనది కాదు. పురాణములు మిత్రోపదేశములు. రసభావాదుల యనుభూతి వీనియందు కలుగుట దుర్లభము. మనకున్న రెండితిహాసములను గొప్ప కావ్యములే వానిని వస్తువు ననుసరించి యొక పరిధిలో నొదిగించుట కష్టమే. ముఖ్యముగా మహాభారతమునం దీ చిక్కున్నది.

ఐనను కావ్యమునందలి యితివృత్తమునను దృశ్యకావ్యములందు నితివృత్తమునుగూర్చి చేసిన విభాగమునే పాటింపవలయునని కొందఱు భావించుచున్నారు. రసాది సిద్ధాంతములు తొలుత రూపమునకు చెందినవే యనియు వానిని తరువాత నాటకమున కన్వయించిరని యుక్తే కావ్యవస్తు విషయమునందు కూడ నాటక వస్తు విషయమునే పాటింపవలయునని దీనియందును నాటకసంధులన్నియు నుండునని సాహిత్యదర్పణమునందు చెప్పబడి యున్నది—

"సర్గబంధో మహాకావ్యం తత్రైకో నాయక స్సురః"
సద్వంశః క్షత్రియో వాపి ధీరోదాత్తగుణాన్వితః,
ఏకవంశ భవాభూపాః కులజా బహవోపివా॥
శృంగార వీర శాంతానా మేకాంగీ రస ఇష్యతే
అంగాని సర్వేపిరసాః సర్వే నాటక సంధయః॥
ఇతి హాసోద్భవం వృత్త మన్యద్వా సజ్జనాశ్రయమ్
చత్వారస్తస్యవర్గాస్స్యుః తేష్వేకంచ ఫలం భవేత్"
'సాహిత్య దర్పణమ్'.

—దీని ననుసరించినపుడు నాటకమునందలి పంచ సంధులు కావ్యమునందు గోచరింపవలయునని తెలియును. ఇతివృత్తమును గూర్చి ఇతిహాసోద్భవముకాని సజ్జనాశ్రయముకాని యని చెప్పబడినది. అనగా కావ్యేతివృత్తము ప్రసిద్ధము కావచ్చును. గ్రథితము కాకపోయినను ప్రజలయందు వాడుకలో నున్నది కావచ్చును. సజ్జనాశ్రయ మన్నప్పుడు సజ్జనులయందున్న కథ యనియేగాక సజ్జనుని గూర్చిన కథ యని చెప్పవచ్చును. ఈ రెండవ పక్షమున కల్పితేతివృత్తము కూడ సజ్జననాయకమైనచో కావ్యమునం దుండవచ్చునని చెప్పవచ్చును. ఈ మాటకే చారిత్రకేతి వృత్తమని కూడ చెప్పవచ్చును. అనగా విశ్వనాథుడు

రెండు విధములే యితివృత్తమని చెప్పినను దానిని నాలుగు విధములుగా విభాగింపవచ్చును. ఒకటి ఇతిహాసోద్భవము కుమార సంభవాదులవంటిది, రెండు పరంపరలుగా కథలుగా వచ్చునది. ఉదయ నోదయమువలె, మూడు కల్పితమైనది, కాదంబర్యాదులవలె; నాలుగు చారిత్రకమైనది హర్షవర్ధన రాజవర్ధనాదుల చరిత్రలవలె. ఈ విధముగా కావ్యేతివృత్తముండవచ్చునని మనము భావింపవచ్చును.

ఈ ఇతివృత్తవిభాగము భరతునినాడే ఉన్నట్లున్నది. ఆనాడు నాటకములగూర్చి చెప్పునప్పుడు ప్రఖ్యాతమైన యితివృత్తమును వాడవలయునని చెప్పెను. ఆహార్యమైన యితివృత్తమని మరియొకచోట కలదు. ఇచ్చట 'అహరింప దగినది' అనగా నుత్పాద్యమని యర్థము చెప్పవలయును.

భామహు డిట్లు వ్రాసెను—

"వృత్త దేవాది చరిత శంసి చోత్పాద్య వస్తు చ
కలా శాస్త్రాశ్రయం చేతి చతుర్ధాభిద్యతే పున:" 1—17

—దీనియందు కలాశాస్త్రాశ్రయమైన కావ్యవిభాగము కేవల శాస్త్రరచనకు సంబంధించినది. ఇతివృత్తసంబంధమైన విభాగము మాత్రము వృత్తదేవాది చరితశంసి (ప్రఖ్యాతము)యు, నుత్పాద్యమును ప్రస్తావించినాడు. కావ్యాదర్శమునందు దండి యభిప్రాయ మిదియే.

ఇతిహాస, కథోద్భూత మితరద్వా పదాశ్రయమ్
చతుర్వర్గఫలాయత్తం చతురోదాత్తనాయకమ్. 1–15
సర్వత్ర భిన్నవృత్తాంతై రుపేతమ్ జనరంజనమ్
కావ్యం కల్పాంతరస్థాయి జాయేత సదలంకృతి

ఇచ్చట కూడ సాహిత్యదర్పణమున కవిరుద్ధముగా చెప్పబడియున్నది. ఇచ్చట మిశ్రకథాభేదము స్పష్టముగా చెప్పబడ లేదు.

భోజుడు కావ్యేతి వృత్తమును తానైదుభాగములుగా విభాగించెను. ఈ విభాగము చాల సూక్ష్మముగా చేయబడినట్లున్నది. సాహిత్య దర్పణములో సందిగ్ధముగానున్న విషయము లిందు స్పష్ముగా గోచరించుచున్నవి.

"కథా శరీర సంవిధాన భేదా: పంచ, ఇతిహాసాశ్రయమ్ కథాశ్రయమ్, ఉత్పాద్యేతివృత్తమ్, అనుత్పాద్యేతివృత్తమ్, ప్రతి సంస్కార్యేతివృత్తమితి—1 ఇతిహాసాశ్రయమ్ వృత్తదేవాది చరిత సంశ్రితతా ఇతిహాసాశ్రయమ్, యథా కుమార సంభవ: హయగ్రీవ వధాదయ:తే ఐతిహాసికం చరిత మావేదయంతి: కథాశ్రయమ్; బృహత్కథాది ప్రతిపన్నప్రఖ్యాతోదాత్త నాయక చరిత విషయమపి మహాకావ్యాదే: ప్రబంధ స్యాభిదత్యే యథా వత్సేశ్వరచరితమ్. ఉదయనోదయ:, ఉత్పాద్యేతివృత్తమ్ కవి మనీషాప్రకల్పిత చతుర్వర్గావబోధహేతు ర్దివ్యాదిచరితమ్ కవి ర్బ్రూతే యథా చంద్రాపీడ పుండరీకాదిచరితమ్! అనుత్పాద్యేతివృత్తమ్ యథావగత వర్తమానాతీతమహారాజాది వృత్త వర్ణన విషయతా మస్యాం అచష్టే యథాహర్షవర్ధన రాజవర్ధనాది చరితమ్ హర్ష చరితే, ప్రతిసంస్కార్యేతివృత్తమ్ ఇతిహాసేషు యథాస్థిత వస్తు నిబంధనే న్యాయప్రవృత్తే రప్యఫల వత్త్వ మనిష్టావాప్తిఫలత్వం చ దృశ్యతే అన్యథా యత్ప్రవృత్తే రపి ఫలయోగ్యావధార్యతే యత్రయత్ర ప్రతి సంస్కారో విధేయ: యథా శాకుంతలాది ప్రతిసంస్కార:"


(శ్రీ మానవల్లివారి నాట్యకోశమునుండి)

భోజుడు చెప్పిన యంత విస్తృతమైన కథావిభాగము ఆలంకారికులలో మరియెవ్వరును చేసినట్లులేదు. ఈ మార్గము ననుసరించి చూచినప్పుడు కావ్యేతివృత్తమైదు విధములుగా గోచరించుచున్నది. విశ్వనాథుని నిర్వచనమున మన మూహించిన నాల్గు భేదములేకాక, ప్రతి సంస్కార్యేతివృత్తమను క్రొత్తవిభాగము గోచరించుచున్నది.

పూర్వ కథ యుండనే యున్నది. కాని దానిని రసానుభవమునకు తగినట్లు సంస్కరింపవలయును. కల్పనలు చేయవలయును. అచ్చటచ్చట కొంత కొంత పరిత్యజింపవలయును. అందువలన ప్రతి సంస్కార్యేతి వృత్తము పుట్టుచున్నది. *

ఇతివృత్తమును రెండు విధములుగా విభజించినది విశ్వనాథుడు. ఐదుగా విభజించినది భోజుడు. ఈ రెండు విభాగములు పరస్పరవిరుద్ధములైనవికావు. మరియు ఒకదానియం దొకటి యేకీభవించును.

ఈ కథానిర్మాణమునం దౌచిత్యమునకు నధికమైన ప్రాధాన్యమున్నది. ఔచిత్య సహితమైనప్పు డేవిధముగా కథ నిర్మించుకొన్నను బాధ లేదు.



శ్రవ్యకావ్యేతివృత్తము

ఒక్కొక్క కథ నిర్మించునప్పుడు దానికి సంబంధించిన జాగ్రత్త యెంతయో యవసరము. తత్సంబంధములైన శిల్ప మర్యాదల నెరిగి కవిత్వనిర్మాణము కావింపవలయును. ఆనంద వర్ధనుడు ప్రబంధగతమైన ధ్వనిని గూర్చి చెప్పినప్పు డీ విషయమును చర్చించియున్నాడు. ఈ ప్రబంధనిర్మాణము చాల క్లిష్టమైనది. ఈ కథాశరీరము విభావానుభావ సంచార్యౌచిత్య చారువు. ఈ కథాశరీరము ప్రఖ్యాతముగాని కల్పితముగాని (ఉత్ప్రేక్షితము) కావచ్చును. ప్రఖ్యాత కథలో మార్పులు చేయవచ్చునని కూడ యాతడుద్దేశించెను.

ఇతివృత్తవశాయాతాం త్యక్త్వా ననుగుణాంస్థితిమ్

ఉత్ప్రేక్ష్యాప్యంతరాభీష్ట రసోచిత కథోన్నయః (ధ్వ న్యా 3-11) కథ ప్రఖ్యాతమైనప్పటికిని అననుగుణమైన దానిని పరిత్యజించి నడుమ నడుమ రసానుకూలమైన క్రొత్త కల్పనలు కూడ చేయవచ్చును. ఈ శ్లోకమువలన నాతడు మిశ్ర కథను కూడ అంగీకరించినట్లు గోచరించును. ఈ మిశ్ర కథయందు రసవిరోధములైన కల్పన లాతడంగీకరింపలేదు.

సన్తి సిద్ధరసప్రఖ్యా యేచ రామాయణాదయః
కథాశ్రయా న తైర్యోజ్యా స్వేచ్ఛా రసవిరోధినీ.

ఈ రెండు శ్లోకములవలన మిశ్రకథయొక్క తత్త్వమును పూర్ణముగా వివరించినట్లైనది. పూర్వాలంకారికులు కారణమేమో తెలియదుకాని మిశ్ర కథ యని యంగీకరించనే లేదు. విడిగా ప్రఖ్యాతమును గూర్చి చెప్పునప్పుడే రసోచితములైన కల్పనల నంగీకరించినారు. దానినే రామరాజ భూషణుడు మిశ్రకథ యని వేరుగా ప్రతిపాదించియున్నాడు.

సిద్ధవస్తునిర్మాణము కూడ జాగ్రత్తగా చేయవలసినది. రామాయణాదులు రససిద్ధములు. రసవిరోధములైన కల్పనలు చేయరాదు. "కథా శరీర ముత్పాద్య వస్తుకార్యం తథా తథా యథారసమయం సర్వమేవ తత్ప్రతిభాసతే" యన్న శ్లోకమునందు కల్పితమైన కథయందు కూడ తన్నిర్మాణము కావ్యమును సర్వమును రసమయముగ భావించుట కనుకూలముగా నుండవలయునని చెప్పబడినది.

ఈ సర్వమైన కల్పనయు ఔచిత్యము నాశ్రయించి చేయబడవలయును. అందువలననే "అనౌచిత్యా దృతే నాన్యద్రసభంగస్య కారణమ్" అనుట.

కేవలము శాస్త్రముకొఱకుకాక కావ్యమునందు సంధి సంధ్యంగఘటనము రసాభివ్యక్త్యపేక్షయా చేయబడవలయును (తృతీయ ఉద్యోతము 12 వ కారిక) కావ్యముయొక్క నిర్మాణము సర్వాంగసుందరముగా నుండుటకొరకే యీ సంధి సంధ్యంగ ఘటన ముద్దిష్టమైనది.

ధ్వన్యాలోకము కావ్యముయొక్క వృత్తమును తీర్చుటకు కవికి స్వేచ్ఛ నెక్కువగా కల్పించినది.

దశ రూపకమునందిట్లున్నది—

ప్రఖ్యాతోత్పాద్య మిశ్రత్వ భేదాత్ త్రేధాపి తత్త్రిధా
ప్రఖ్యాత మితహాసాదే రుత్పాద్యం కవికల్పితమ్
మిశ్రయం సంకరాత్తాభ్యాం దివ్య మర్త్యాదిభేదతః

—ఈ వాక్యము ననుసరించి ప్రఖ్యాతోత్పాద్యములతోబాటు మిశ్రభేదమును గూడ దశరూపకకారు డంగీకరించినట్లు తెలియవలయును.

ఈ విషయము లన్నియు చక్కగా పరిశీలించి రామరాజభూషణుడు కావ్యేతివృత్తమును మూడు భాగములుగా నొనరించియున్నాడు. ఈ విభాగము భోజుని విభాగమంత విస్తృతము కాకున్నను స్పష్టముగా సరిహద్దులు గీచినట్లు గోచరించుచున్నది.

కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము, లాద్య సత్కథల్
వావిరి పుట్టు రత్నము, లవారిత సత్కవి కల్పనా విభూ
షావహ పూర్వవృత్తములు సానలు దీర్చిన జాతి రత్నముల్,
కావున నిట్టి మిశ్రకథగా నొనరింపుము నేర్పు పెంపునన్.
వసు 1. 19

కావ్యేతివృత్తము, ఆద్యసత్కథలు, కేవల కల్పనా కథలు, మిశ్రకథలు (కల్పన విభూషావహ పూర్వ వృత్తములు)అని మూడు విధములు. కల్పనా కథలన్నవి భోజుని విభాగమున నుత్పాద్యేతివృత్తములు, ఆద్యసత్కథలు ఇతిహాసాశ్రయములు, కల్పనా విభూషావహ పూర్వ వృత్తములన్నవి ప్రతి సంస్కార్యేతి వృత్తములు. (వీనినే మిశ్ర కథలని చెప్పవచ్చును) ఈ విధముగా చేయబడిన ఈ విభాగమునందు కథాశ్రయములు, అనుత్పాద్యము లన్న భోజుని విభాగములు చేరలేదు. కాని ఈ విభాగము లాద్య సత్కథలన్న మాటలో చేరును. ఆద్య సత్కథలనగా కేవల మితిహాసపురాణకథాశ్రయము లనకపోవుటవలన బృహత్కథాది ప్రఖ్యాతకథలు దీనియందంతర్భవించును. అంతేకాక హర్ష వర్ధనాదిమహారాజులచరిత్రము కూడ చేరును. దీనినే మనము ప్రఖ్యాత మనవచ్చును. కల్పనా విభూషావహ పూర్వవృత్తముల మిశ్ర కథలని యాతడే చెప్పెను. ఈ విధముగా నాతనివిభాగము ప్రఖ్యాతము, కల్పితము, మిశ్రమునని మూడు విధములుగా తెలుచున్నది. ఇది దశరూపకకారుని నిర్ణయముతో సంప్రతించుచున్నది. *

* ఇతిహాసాశ్రయము	కథాశ్రయము	అనుత్పాద్యము	ప్రతిసంస్కార్యము	ఉత్పాద్యము
ప్రఖ్యాతము	ప్రఖ్యాతము	ప్రఖ్యాతము	మిశ్రకథలు	కేవలకల్పనాకథలు

దీనివలన భోజుని విభాగమునందు రామరాజభూషణుని విభాగ మెట్లంతర్భవించునో తెలియవచ్చును. ఇంకొక విషయము. ప్రఖ్యాతమునందు ఇతిహాసాశ్రయాదులైన మూడు విభాగము లెట్లు చేరుచున్నవో, నివి మూడును ప్రతి సంస్కారము నొందినప్పుడు మిశ్ర కథలలో చేరుచున్నవి. ప్రఖ్యాతము నందు సంస్కారము లేదు. దీనియందు సంస్కార మున్నది. ఇదియే ప్రధాన భేదము.

ఈ ప్రఖ్యాతేతివృత్తము రామాయణాదులం దున్నట్లు యథాస్థితముగా కవులచే స్వీకరింపబడు చున్నది. కవులు తమతమ శక్తి ననుసరించి దానియందు రసభావాదుల కల్పనము చేయు చున్నారు. మూలకథ యందలి సంఘటనముల కవిరుద్ధముగా పాత్రలయొక్క ప్రవృత్తి నేర్పరచుచుందురు. వేణీసంహారమున దురోధనుడు భానుమతితో సంభాషించిన ఘట్ట మున్నది. అది భారతమున లేకపోవచ్చును. కాని భారతమున కీ సంఘటనము విరుద్ధము కాదు. దానియందు చెప్పబడిన వాని కీ విషయము ప్రతిరోధకము కాలేదు. కాని కావ్యమునందు రస భావముల పోషించుటకొరకు కవి యిట్లు సంఘటన సమకూర్చు చుండును. కుమారసంభవమునందలి రతీవిలాపము కాళిదాసు కల్పించినదే. భర్తృవియోగ మెంత దుస్సహమైనదో తజ్జీవికాజీవయైన భార్య దుఃఖ మెట్టిదో, పరమేశ్వరు డెంత కరుణామయుడో చూపించుట కీ విషయము విస్తరింపబడినది. ఈ సంఘటనలు, ఈ భావములు పురాణేతిహాసములకు విరుద్ధములు కావు. ప్రఖ్యాత వస్తు కావ్యమునందు కవియొక్క కల్పనము రసభావముల ననుసరించి పురాణాదుల కిట్లొదిగి యుండును. ప్రఖ్యాతమనగా కేవల కల్పనాహీనముగా భావింపరాదు. ఆద్య సత్కథలు వావిరిపుట్టు రత్నములని వీనినే రామరాజభూషణుడు పేర్కొనెను. ఈ కథలు సానలు దీర్చని పుట్టు రత్నముల వంటివి. కవి మనుచరిత్రమును ఈ జాతికి చెందిన కావ్యముగా భావించి యుండును. దానిలోని కథ యంతయు మార్కండేయ పురాణములోనిదే. దానిలోనున్న కల్పనములు తద్రత్నమును సాన బట్టలేదా యని యడుగవచ్చును. కాని రామరాజభూషణుడు దానియందలి కల్పనలతో తృప్తి చెందియుండకపోవచ్చును. ఇంక నధికమైన కల్పనలద్వారా దానిని మరియు రమ్యముగా నొనరింప వలయునని భావించియుండును. అందువలననే వానిని సానలు దీర్చని రత్నము లనుట.

కేవల కల్పనా కథలు కృత్రిమరత్నములని యాత డధిక్షేపించెను. ఈ విషయము కళాపూర్ణోదయమును దృష్టిలో యుంచుకొని యొనర్చినదని విమర్శకులు భావించుచున్నారు. కళాపూర్ణోదయములోని కథ కేవలము కల్పితము కాదనియు, లింగపురాణమునందు దాని యందలి నారద తుంబుర సంగీత స్పర్ధ యంతయు కలదని బ్రహ్మశ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారు (భారతి — డిసెంబరు 1941) వెల్లడించి యున్నారు. ఈ విధముగా చూచినను ప్రధానమైన కళాపూర్ణ, కలభాషిణీ వృత్తాంతములు కల్పితములనక తప్పదు.

కేవల కల్పనాకథలు కృత్రిమరత్నము లనుటలో అలంకారశాస్త్రసంబంధమైన విషయ మొకటి యున్నది. పాఠకునకు ప్రేక్షకునకు మనస్సులో పూర్వ వాఙ్మయముతో—కథలతో, పురాణాదులతో—గల పరిచయము—వాసనారూపముగా నుండును. నిత్యపరిచయము వలన సీతారామాదులు, శకుంతలా దుష్యంతులు కేవల నామశ్రవణమునందే స్వస్వరూపములతో సాక్షాత్కరింతురు. మనస్సుతో మెలిగిపోదురు. కవియొక్క చమత్కారములైన భావములు, కల్పనలు, సంఘటనము లివి యన్నియు మనసులో సుస్థితములైన పాత్రలను గూర్చిన వగుటవలన సద్యఃపర నిర్వృతి కలుగుట కవకాశమున్నది. ఒక యాంజనేయుని, ఒక సుగ్రీవుని ప్రవేశపెట్టి హఠాత్తుగా కథ నారంభింపవచ్చును. పూర్వకథతో సంబంధం మంతగా కలుప నక్కర లేదు. "కథ జగత్ప్రసిద్ధి కావున పూర్వ పర్వార్థ యుక్తిసేయ నట్టియెడల, యత్న మించుకంతయుయినను వలవదు. వలసినట్లు చెప్పవలసియుండు" (విరా 1—42) అని తిక్కన విరాటపర్వాదియందు చెప్పెను. ప్రఖ్యాతేతివృత్తమును తీర్చుటలో నీ విశిష్ట సౌలభ్య మున్నది. మాలతీమాధవాది కావ్యము లెంత రస భావ చమత్క్రియాపరవములయ్యు నుత్తరరామచరిత్రాదుల వలె సుప్రసిద్ధములు కాకపోవుట కిది యొక కారణము. కావ్య రసాస్వాదనకు దానియొక్క పరిచయ మెంతయో యావశ్యకము.

ధ్వన్యాలోకమున "అతఃఏవ భరతే ప్రఖ్యాత వస్తు విషయత్వమ్, ప్రఖ్యాతోదాత్త నాయకత్వంచ నాటకస్యావశ్యకతయోపన్యస్తమ్. తేనహి నాయక స్యౌచిత్య విషయే కవిర్నవ్యాముహ్యతి. యస్తూత్పాద్య వస్తు నాటకాది కుర్యాల్ తస్యాప్రసిద్ధానుచిత నాయకస్వభావవర్ణనే మహాన్ ప్రమాదః" (ధ్వ ఉ 111—14 కారికావృత్తి) అని చెప్పబడి యున్నది.

రసభావాదుల నాశ్రయింపని కేవల ముత్కంఠయే రేపుట ప్రధానమైన యాధునిక నవలలో నితివృత్తముయొక్క అపరిచయమే ప్రధానమగుచున్నది. ప్రఖ్యాతేతివృత్తము నిర్వహించుటకన్న, కావ్యమున కల్పితేతివృత్తమును నిర్వహించుట చాల కష్టమైన విషయము. కళాపూర్ణోదయమున నున్న కల్పన యెంత యనల్పమైనను కొన్ని పౌరాణికపాత్రల నాశ్రయింపక తప్పలేదు. కథలో ద్వారక, శ్రీకృష్ణుడు, ఆయన యంతఃపురము, నారద తుంబురులు, రంభానలకూబరులు, సరస్వతీ చతుర్ముఖులు ఇవన్నియు పాఠకులకు నిత్య పరిచితములైన పాత్రలు. ఇవన్నియు చుట్టుపట్టుల నుంచుకొని సూరన తన కథను ప్రారంభించినారు. కావ్యమునందలి ప్రధానసంఘటనవే సరస్వతీ చతుర్ముఖ సంవాదము. ఏది ఏమైనను కళాపూర్ణోదయ కథ కల్పితమె గాని, మిశ్రకథ కానేరదు.

మిశ్ర కథయందు ప్రధాన కథ ప్రఖ్యాతమైనదేకాని కొన్ని సంఘటనలు కొన్ని పాత్రలు మాత్రము కల్పింపబడును. కళాపూర్ణోదయమునందలి ప్రధానమైన కథ కల్పింపబడినదై కొన్ని పాత్రలు, సంఘటనలు ప్రఖ్యాతములైనవి. ఇది మిశ్ర కథాలక్షణమునకు విరోధ లక్షణము. కల్పిత కథయయినను కేవల కల్పితకథకాదు. కేవల కల్పనాకథలు కృత్రిమ రత్నములు. అనగా భ్రాంతికల్గించునవి. అది చాలకాలము నిలవదు. కొంతకాలమునకే ఆ రత్నములు గాజు ముక్కలని తేలిపోవును. అట్లే కల్పిత కథలయందు కథాత్వభ్రాంతి కొంత కాలమే నిల్చి వాని కథాత్వమును పోగొట్టుకొనును. ఆ పాత్రల పరిపూర్ణ మనోభావముల నిర్మించుట యంత సులభము కాక పోవుటవలన తొలుత నాకర్షించినను మన మనస్సులలో స్థిరముగా నుండజాలవు. "ప్రాగ్విపశ్చిన్మతంబువ రసము వేయి రెట్లు గొప్పది నవకథౌద్ధృతినిమించి" యన్న శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు కూడ నవ కథా సృష్టియందు రసముయొక్క ప్రాధాన్యములేదని చెప్పియున్నారు. క్రొత్త కథలనుమాత్రమే సమాదరించుట పాశ్చాత్య భావలక్షణము కావచ్చుకాని, ప్రాచ్య భావుకులు రసమునందే నిష్ఠకలవారని తాత్పర్యము.

ఇక మిశ్ర కథలు. ఇవి "సత్కవి కల్పనా విభూషావహ పూర్వ వృత్తములు." ఇందన్ని పదములను జాగ్రత్తగా పరిశీలింపవలయును. సత్కవులచేత తమ కల్పనము లన్నియు విభూషణములగునట్లుగా తీర్చబడిన పూర్వ వృత్తములు. ఇవి సానలు దీరిన జాతి రత్నములు. ఇచట నికషము కవి ప్రతిభ. పూర్వవృత్తము పుట్టు రత్నము. కల్పనములు రత్నము పొందిన క్రొత్త వంపులు, యొదిగింపులు. ఇట్టి కల్పన ముత్తర రామ చరితమునందున్నది. శాకుంతలమునందున్నది. తొలిదానియం దంతర్నాటక మున్నది. ఇది శ్రీరామునకు సీతా లవ కుశల వృత్తాంతము తెల్పుటకు కల్పింపబడినది. దీనియందే లవ కుశుల పరాక్రమాభివ్యంజకముగా రామయజ్ఞాశ్వమును వారు పట్టుకొనుట, చంద్రకేతు లక్ష్మణాదులు వారితో యుద్ధము చేయుట మొదలైన ఘట్టములు కూడ నున్నవి. ఇవన్నియు నానాటకమున రసభావముల పోషించినవి. లవ కుశులను మహావీరుడైన శ్రీరామునిసంతానముగా తీర్చుటకే ఘట్టములు కల్పింపబడినవి. అంతటి రామాయణములో లవ కుశ పాత్రలకు ప్రాధాన్యములేదు. కాని యుత్తరరామచరిత్రలో వారు ప్రధానులే. అందువలన నీ విధముగా తీర్చిదిద్దుట కీ కల్పన యవసరమైనది. శాకుంతలము కూడ ఇట్టిదే. దీనియందున్న దూర్వాసుని శాపము కథను పూర్తిగా మార్చివేసినది. భారతములోని దుష్యంతుని కథ యొక యుపాఖ్యానమే. దానిలోని పాత్రల ప్రవృత్తి యొక్క సూక్ష్మభేదములు, ఔచిత్యానౌచిత్యములు ప్రధానమైన పాండవ కథకు నుపకర్మాపాదకములు కావు. కాని యా యుపాఖ్యానమునే ప్రధానముగా స్వీకరించినపుడు దాని యందలి పాత్రలు ప్రాధాన్యము వహించును. ఈ దుష్యంతునియొక్క శకుంతలయొక్క మనః ప్రవృత్తి తీర్చునదే కావ్యము సాగును. భారతములో లోకాపవాదభీతుడైన దుష్యంతుని శాపకారణముగా శకుంతలావృత్తాంతమును మరచినవాడుగా నత్యంత సత్పురుషుగా తీర్చుటవలన దుష్యంతుడు కావ్య నాయకుడుగా నర్హుడగుచున్నాడు. అనర్హులైనవారు, మృషావాదియైనవారు చివరకు సత్ఫలమును పొందుట ధర్మభావమునకు విరుద్ధమైన విషయము. ధర్మమున కవిరుద్ధముగా కవి కావ్యమును శాపమును కల్గించి లోకోత్తరముగా నిర్మించియున్నాడు.

కాని ఈ కల్పనమున కొక హద్దుండవలయుననియు, ప్రధానమైన పాత్ర ప్రవృత్తులకవిరుద్ధముగా రచన సాగవలయుననియు చెప్పబడినది. కవియొక్క కల్పన పూర్వవృత్తమునకు విభూషావహముగా నుండవలయుననుట యిందులకే.

ఈ విధముగా రామరాజభూషణుని శ్రవ్య కావ్యేతి వృత్త విభజనము చాల సమంజసముగా నున్నది. ఈ పద్యమును సమకాలికులైన కవుల నాక్షేపించుటకు వ్రాసినాడని మనము భావింపనక్కరలేదు. స్వయముగా తానొక లాక్షణికుడగుటవలన తానా విషయమునంత విస్పష్టముగా చెప్పినాడనవచ్చును.

సంస్కృతాలంకారికు లొనర్చిన కథా ఆఖ్యాయికాది భేదములు మహా కావ్య వస్తువును గూర్చినవికావు. అవి గద్య కావ్య భేదములు. సర్గ బంధమైన మహాకావ్యమునకు దీనితో సంబంధములేదు.

ఇంతవరకు కథాస్వరూపమును దాని భేదములను గూర్చి చర్చయైనది. ఐనను ముఖ్యమైనది కథా గమనము. ఈ కథ యన్నది యెట్టిది? దాని శరీర నిర్మాణ మెట్టిది? ఒక వృత్తాంతము, ఒక సంఘటన, ఒక కథ వీని నడుమ భేదమెట్టిది. ఈ విషయములు చర్చించినగాని కథా శరీర మిట్టిదని చెప్పలేము.

లోకమునం దనేకవిషయము లున్నవి. వార్తలున్నవి. దిన దినము గడచిపోవుచున్నది. ఈ విధముగా గడచిపోవుచున్న దినములలో నొకానొక దినము మాత్రము స్మృతిలో నుండును. మిగిలిన దినములు విస్మృతములగుచున్నవి. దారిలో పోవుచుండగా నొక పాము కనిపించినది. దానిని చూచి భయము కల్గినది. ఇంతతో నది పోయినది. ఇది విశేషము. తత్కార్యాచరణమందు ప్రవృత్తులగుటకు పూర్వము మన మీ పాముయొక్క రాక భావింపలేదు. వచ్చుట పోవుట యన్న భావమునందు లేని యొకానొక నూతన విషయము 'విశేష'మగుచున్నది. ఈ విశేషమువలననే ఆ సంఘటనకు ప్రాధాన్యము.

బహుధా లోకమునందు మానవులు తత్తత్కార్యాచరణ కాలములయందు దానిని గూర్చి నిర్ణయము చేసికొనగా లిప్త

లిప్తాంశములుగా విభక్తమైన యాకాలముయొక్క యణువులలో నీ మానవుని యూహలకన్న విలక్షణమైన యొకానొక విషయము ప్రవేశించినచో నది విశేషము. ఈ విశేషమువలన తదాశ్రితములైన సంఘటనలు వరుసగా జరుగగా నొక ఫలము కల్గినప్పుడు విశేషమునుండి ఫలము పర్యంతము జరిగిన వృత్తాంతమంతయు నొక కథ. దైనికాచరణములన్నియు వార్తలు. హఠాత్తుగా సంభవించెడి విశేషములు సంఘటనములు. ఈ విశేషములైన సంఘటనముల నాశ్రయించి ఫల పర్యంతము సాగెడి వృత్తాంతము కథ. ఈ విశేషమువద్దనే కథ యారంభించినట్లు. సీతా వివాహము ఫలమైనప్పుడు విశ్వామిత్రాగమనముతో కథ యారంభము. రావణవధ ఫలమైనప్పుడు కైకేయి వరము లడుగుటలో కథ యారంభము. ఇది రామాయణ విషయము.

ఈ విశిష్ట లక్షణమునందే మానవుని మనస్సు రమించుచున్నది. రస ప్రవృత్తి కూడ ఈ కథా లక్షణమునకన్న వేరుగా లేదు. లోకమునందు మన మనేకములైన వృత్తాంతములను చూచుచున్నాము. ఈ విషయము లన్నియు మనకు పట్టవు. విశేష విషయమునందే మనస్సు రమించుచున్నది. ఈ మనస్సు రమించు లక్షణముయొక్క లోతులందే రసమున్నది. రమణముయొక్క లోతు ననుసరించి స్మరణము, చమత్కారము, భావప్రేరణము, రసానుభూతి యన్నవి కల్గుచుండును. లోతు తగ్గిన కొలది పూర్వ పూర్వమునందే యనుభూతి యాగి పోవును. విశిష్టలక్షణముగల కథ దానిలోని లోతుల ననుసరించి శ్రోతయొక్క మనోలక్షణము నాశ్రయించి యనుభూతమగుచున్నది. పరమభావుకునియందు ఉదాత్తమైన కథ రసత్వమును పొందుచున్నది. కథ యుదాత్తముకానిచోట విశిష్టమైన కథాస్వరూపమున్నందున పాఠకునియందు చమత్కారము కల్గజేయుచున్నది.

రసము విభావానుభావాదుల నాశ్రయించుననగా కథయొక్క ప్రాధాన్యము లేదనికాదు. ఈ విభావాదులన్నియు కథలో నంతర్భాగములే యగుచున్నవి. లౌకికముగా ప్రతిబింబ ప్రాయములయిన సన్నివేశములయందు కలుగని యానందాదికము కావ్యమునందు కలుగుటకు కారణము తత్సన్నివేశ చారుత్వము. ఈ సన్నివేశము కథాంతర్భాగమై, కథాత్వ లక్షణమునకు మరింత శోభ చేకూర్చుట కూడ యెంతయో ముఖ్యమైన విషయము.

సాధారణమైన సన్నివేశమునందు ఒకానొక యనూహితమైన ప్రవృత్తివలన కథ పుట్టుచుండగా నీ ప్రవృత్తిని దైవమని (విధియని) చెప్పినప్పుడు, మనోమయుడైన మనుష్యుడు తన సంకల్పమునకు విరుద్ధమైన దానియందు కూడ రమించుట చిత్రముగనే గోచరించుచున్నది. అనిష్టమైన దానియందు *రమించుటలోకమునకు విరుద్ధమైన విషయము.* అందువలన మనస్సున కన్న యతీతమైనదేదో యుండవచ్చును. ఈ మనస్సునకు కూడ తెలియకుండ తదధికమైన యొక చైతన్యభావము దైవమని చెప్పబడుచున్న ఈ విశిష్ట లక్షణమున కవిరుద్ధమైనది కావచ్చును. ఇది ఇట్లేయైనచో మనోతీతమైన ఈ చైతన్యము కాలమునందు ప్రవేశించియున్న దైవమునందు రమణముపొందుచున్నదన్నమాట. ఇదియే వేరొక విధముగా చెప్పినచో జీవుడు పరమేశ్వరునిలో రమణము పొందుట. అందువలననే రసానుభవము బ్రహ్మానందానుభవమని చెప్పిరి.

కథ నాశ్రయించి రససిద్ధి కలుగుచున్నది. మహాకావ్యము కూడ రసము నాశ్రయించి యున్నది. కథా నిర్మాణదక్షులైన వారికే మహా కావ్యనిర్మాణచణత్వము కల్గుచున్నది. వారే రససిద్ధులు. మహాకవులు. లోకములో కథాత్వములేని ఇతివృత్తమును స్వీకరించి, ఇతివృత్తమేలేని కావ్యముల నిర్మించువారు మహాకవులుకారు. వారి కావ్యములందు రససిద్ధిలేదు.

ఈ కథా నిర్మాణదక్షత్వము లోకోత్తర స్థితినందినది వాల్మీకి వ్యాసులయందు. తరువాత కథా లక్షణ మెరిగినవారు కాళిదాసాదులు కొందరు మాత్రమే.

నా తి చ రా మి

శ్రీమతి కె. వి. యస్. అచ్యుతవల్లి

"జయా!" భూమ్యాకాశాలు దద్దరిల్లేటట్లు ఒక్క గావు కేకవేశాడు ప్రసాదరావు. ఒకజడ అల్లుకుని వీపుమీదకు జారవేసి రెండోజడ ముందుకు వేసుకొని రిబ్బను బిగిస్తున్న 'జయప్రద' ఒక్కసారి త్రుళ్ళిపడింది. అన్నయ్య అంతలా ఎందుకు అరిచాడో బోధపడక మెట్లవైపు వచ్చి క్రింది హాలులోకి చూసింది. ప్రసాదరావు చేతులు వెనక్కి విరిచిపెట్టుకుని హాలులో విసురుగా పచార్లు చేస్తున్నాడు. 'జయప్రద' తన రూమ్‌లోకెళ్ళి తీరికగా బుక్స్ బాగ్‌లో పెట్టుకుని 'వాచీ' తిన్నగా తిరుగుతోందో లేదో చూసుకుని అద్దానికి తుది వీడ్కోలిచ్చి మెట్లు దిగి హాలులో కొచ్చి నిలబడింది.

"నువ్వింక కాలేజీకి వెళ్ళనవసరంలేదు జయా! పైకి వెళ్ళి పుస్తకాలు పెట్టేసిరా! ఒక్క క్షణం నీతో మాట్లాడాలి. నాకు ఆఫీసు'టైం' అయిపోతోంది. గమ్మునరా!" అన్నాడు ఆజ్ఞగా. అన్నయ్య అధికారస్వరానికి విస్తుపోతూ అలానే సోఫాలో కూర్చుండిపోయింది జయ.

"బోర్నవిటా కలిపి తెమ్మంటారా? భోజనం చేస్తారా బాబూ!" అని అడిగింది వంటామె.

"ఇప్పుడేం వొద్దు నాకు" అని మళ్ళీ పచారుచేయ నారంభించాడు. జయ అక్కడ కూర్చున్నదనే సంగతి విస్మరించినట్లుగా ప్రసాదరావు.

"కాలేజీకి వెళ్ళక్కరలే దన్నావేం అన్నాయ్? స్టూడెంట్స్ దేనికయినా "స్ట్రయిక్ చేస్తున్నారా?" అంది శాంతంగా జయప్రద.

"ఏం నేరనట్టు మాట్లాడతావేం? ఈ దొంగపిల్లి వేషాలు ఎప్పట్నించీ మొదలెట్టావ్! నిన్ను ఇవ్వాళ 'సస్పెండ్' చేశారుటగా ప్రిన్సిపాలుగారు? కాలేజీవంకన తిరువీధులు వేంచేయటానికి బయలుదేరావా పాపం?" అన్నాడు కోపంగా ప్రసాదరావు.

జయప్రదముఖం తడిసిన కాగితం పువ్వల్లే అయింది. అన్నయ్యకి ఎలా తెలిసిఉంటుంది ఈ సంగతి? ప్రిన్సిపాలుగారు చెప్పివుంటారా? అన్నయ్యకు ఆయనతో అంత "ఇంటిమెసీ" లేదే! ఇకపోతే సత్యవాణి. దానికి అన్నయ్యముందు మాట్లాడటానికే భయం. ఇంక ఎవరు చెప్పివుంటారు? అంత అవసరం ఎవరికి కలిగివుంటుంది? తల వంచుకుని ఆలోచించ సాగింది. జయ ఎదురుచెప్పలేకుండా తల వంచుకోవటం చూసి ప్రసాదరావుకి జాలేసింది.

"జయా! ఏదో బుద్ధిగా చదువుకుంటావుకదా! అని కాలేజీకి పంపిస్తే నువ్వు ఇలా "బాడ్‌నేం" తెచ్చుకుంటే ఎల్లాగ చెప్పు? ఇవ్వాళ మీ తెలుగులెక్చరర్ 'కె. డి. ఎస్.' సెంటర్లో కనబడి నిన్ను "సస్పెండ్" చేసిన సంగతి చెప్పాడు. అంతా ప్రసాదరావుగారి "సిస్టర్" ఇల్లాగా! అని చెప్పుకుంటూంటే నా తల వంగిపోదూ! నువ్వు నెమ్మదిగా చెప్తే వినిపించుకోవు. గట్టిగా అంటే నెత్తిమీది నీళ్ళకుండ దింపేస్తావు." నెమ్మదిగా నచ్చచెప్పటం ప్రారంభించాడు ప్రసాదరావు. అన్నయ్య తగ్గడం గమనించి జయప్రద తలెత్తింది. ఆమెకు అన్నగారంటే భయమూ, చనువూ కూడా ఉన్నాయి.

"ఎవరు అన్నయ్యా నీకు చెప్తా? ఆ కే. డి. శాస్త్రేనా? వాడు ఉత్త "రోగ్" అనుకో. ఫోర్తు ఇయర్‌లో వాడి 'నెవ్యూ' ఒకడున్నాడు. రాంబాబు అని. వాడిమూలంగానే నేను ఇవ్వాళ "సస్పెండ్" అయ్యాను. అన్నాయ్! నీకు అంతా చెప్తాను. తప్పంటే నన్నేమైనా చేయి! పడతాను" అని చరచరా లోపలికి వెళ్ళి పాతిక నీలంకవర్లున్న ఒక ఫైలు తీసుకొచ్చి ప్రసాదరావు కిచ్చింది. అతను ఆశ్చర్యపోతూ చదవటం ప్రారంభించాడు. వారానికి ఒకటి చొప్పున ఆరునెల్లకు పైగా వ్రాసిన ఉత్తరాలు అవి! ఒక్కదాంట్లో కూడా జయ జవాబు ఇచ్చినట్లు లేదు. పోనీ జవాబులేనా ఇయ్యకూడదా! రాంబాబు అనే అతను ప్రాథేయపడుతున్నట్లు వ్రాసిఉన్నాయ్! ఒకఉత్తరంలో "కుంతీ విలాపం" పద్యాలు ఉదహరించాడు. ఇంకొకదాంట్లో,

"ప్రియ భామినీ!

నీకోసం, నీ పలుకుకోసం నా కన్నులు కాయలు కాచే లాగున ఎదురుచూస్తున్నాను. నీ కళ్ళలోని తీక్ష్ణత నన్ను కాల్చివేస్తున్నది. కాస్త ప్రసన్నతగల చూపు అలవాటు చేసుకోకూడదా దేవీ?"

వేరొకటి,

"ఈ శుభోదయంలో నా పుష్పవాటికలో ఒక చిన్న కన్నె గులాబీ విరిసినది. దాని సోయగమునకు ఒక తేటి సాగలేక ఆగినది. ఆ గులాబీ ఆహ్వానించింది. తేటి సంతృప్తిచెంది మరలిపోయినది. విడిచిపోతున్న తేటిని తనలోని మాతృత్వపు నిండుతనాన్ని చూసుకొని ఆ గులాబీ మురిసినది." ఇలాగ కవిత్వ ధోరణిలో ఉన్నది. ప్రసాదరావు విరగబడి నవ్వాడు.

"ఇదేం వర్ణన జయా? గులాబీపువ్వునకు మాతృత్వము లేదు. సైంటిఫిక్‌గా చూస్తే కొమ్మలు అంటుకట్టాల్సిందే కాని కాయలు కాసి విత్తనాలు కావుకదా? విత్తనాలు తయారవని పువ్వులకు మాతృత్వమేమిటి నా బొంద?"

"అతను స్పెషల్ తెలుగులే అన్నయ్యా ?" అంది జయ.

"సెర్టన్లీ! అదే అనుకున్నానులే! ఊఁ. ఇదా సంగతి! దీనికి ప్రతీకారం నువ్వేలా చేశావో చెప్పు. సరదాగా వింటాను."

"చెప్తాలే అన్నాయ్. కాని ఇలా పూర్తవుతుందన్న కథ పూర్తికాలేదు. ఎదురు తిరిగింది. దానికి నువ్వుకూడా నాకు సహాయంచేసిపెట్టాలి."

"తప్పకుండా చేస్తాను. ముందు నువ్వు నీ ప్రతీకారం ఎల్లా చేశావో చెప్పు మరి !"

జయప్రదకి సిగ్గువేసింది.

"నేను చెప్పలేను అన్నయ్యా ! సాయంత్రం సత్యవాణిచేత చెప్పిస్తాను. ఏం ?" అంది ముద్దుగా.

2

"మొన్న ఆదివారం. 'ఫ్రమ్ హియర్ టు ఎటర్నిటీ' మార్నింగ్ షోకి వెళ్లాం నేనూ మీ జయాను. మేం వెళ్లే సరికి హైక్లాసు టిక్కట్లు అయిపోయాయ్ అన్నారు. మేము మామూలుక్లాసుల్లో కూర్చోలేమన్నసంగతి మీకు తెలుసు కదూ ? ఎల్లాగా అని ఆలోచిస్తొంటే లోపలకు వెళ్లబోతున్న రాంబాబుముఠా కనపడ్డారు. జయకో "ఐడియా" తట్టింది కాబోలు వెంటనే నాతో,

"ఒసే ! మన హీరో వచ్చినట్టున్నాడు. అతన్నో ఆట ఆడించనా ?" అంది.

"వద్దే ! ఎటొచ్చి ఎటు పోతుందో ! అన్నప్పుడల్లా కలిసి వస్తుందా ?" అన్నాను.

"ఏం పెసిమిస్టువే మా తల్లీ !" అంది హేళనగా. నేను వెనక్కి తీస్తున్నా జయ విన్పించుకోకుండా రాంబాబు దగ్గర కెళ్లి "చూడు మిష్టర్ ? మీరు టిక్కట్లు తీసుకోటం అయిందా ?" అన్నది. రాంబాబు జయ తనతో మాట్లాడటం నమ్మలేనన్నట్లు నిలువుగుడ్లేసి చూడటం మొదలెట్టాడు. నేను అన్నాను.

"చూడు. మాకు టిక్కట్లు దొరకలేదు. అంచేత మీ ఫ్రెండ్సులో ఇద్దరి టిక్కట్లు మాకు ఇప్పిస్తే మేము కూడా మీతోపాటు పిక్చరు చూసిపోతాం" వెంటనే వాళ్లల్లో వాళ్లు గొడవచేసుకోవటం మొదలెట్టారు. ఏమంటే మేము వాళ్లని పలకరించటమే కాకుండా వాళ్లతోపాటు సినిమా కూడా చూస్తామనేసరికి వాళ్లు నిజంగా "ఎటర్నిటీ" కి వెళ్తున్నట్లే భావించి అలాంటి సదవకాశాన్ని జారవిడుచుకోవటం ఎవళ్లకి వాళ్లే ఒప్పుకోక వాళ్లల్లోవాళ్లు కుమ్ముకోవటం ప్రారంభించారు. జయ పూరుకోలేదు.

"ఏమంటావ్ మిష్టర్ ? అనవసరంగా గొడవలు చేసుకోవటం నా కిష్టంలేదు. మీ కిష్టం లేకపోతే మేం వెళ్లిపోతాంలెండి" అన్నది. రాంబాబు ఎల్లానో చచ్చి చెడి ఇద్దర్ని ఒప్పించి మాకు టిక్కెట్లు ఇప్పించాడు. జయ పర్సు తీసే లోగా తనే దర్జాకి అభినయంవట్టి వాళ్లకి డబ్బిచ్చేశాడు.

ఇంక హాలులో. మాకు ఎప్పుడూలేని అలవాట్లు అన్నీ తెచ్చుకున్నాం. నాలుగుసార్లు కాఫీలు, రెండుసార్లు కూల్ డ్రింకులూ, అరడజనేసి కిళ్లీలు, ప్యారీ స్వీట్స్ తీసుకున్నాం. అన్నింటికీ వాళ్లల్లో వాళ్లు వంతులేసుకుంటూ మమ్మల్ని మేపారు."

"ఉద్ధరించారన్నమాట వాళ్లని. సిగరెట్లుకూడా కాల్చ లేక పోయారుటర్రా ?" అన్నాడు ప్రసాదరావు.

"ఆ ప్లాను వేసిందండోయ్ మీ జయ ! అవి కూడా రాబట్టు కుందామే వాణీ ! పోనీ కారు డ్రైవరుకేనా ఇవ్వచ్చు !" అంది. నేనే బొత్తుగా బావుండదని వద్దన్నాను. మిట్ట మధ్యాహ్నం పన్నెండున్నరదాకా రాంబాబూ, అండ్ పార్టీ" యొక్క బ్రహ్మాండమైన 'ఎస్కార్టు' తో మేము "ఫ్రమ్ హియర్ టు ఎటర్నిటీ" పిక్చరు ఎంజాయ్‌చేసి ఇళ్లకు వచ్చేశాం.

నిన్న ఏం జరిగిందంటే మేము గరల్స్ రూంలోంచి క్లాసుకి వెళ్లబోతుంటే ఆ రాంబాబుగాడు—

"నిన్న సినిమాలో అయిన ఖర్చులో అయిదు రూపాయలు నన్నిచ్చుకో మంటున్నారు మావాళ్లు. నా చేతిలో చిల్లికానీ లేదు. ఆ అయిదు రూపాయిలూ మీరిస్తే నాకు మని యార్డరు రాగానే మళ్లీ ఇచ్చేస్తాను" అన్నాడు.

"మా దగ్గర ఇప్పు డేం డబ్బుల్లేవు" అన్నాను.

మీ జయ "మీతోపాటు సినిమా చూసినందుకు మీరు సంతోషంకొద్దీ చేసుకున్న ఖర్చు మేము ఇవ్వడ మేమిటి ?" అంది.

"అప్పేకదా ఇమ్మన్నదీ ?" అన్నాడు.

"అప్పూలేదు. సప్పూలేదు. మనిషిని నిలబెట్టి మాట్లాడుదామనీ. వెధవ్వేషాలు. అవతలికి నడు !" అంది జయ దురుసుగా.

"ఏదో మీ కిష్టంవచ్చినట్టు అనుకోవచ్చును. కాని మర్యాదగా అయిదు రూపాయలూ వాళ్ల మొహాన్న పారేస్తే మంచిది. లేకపోతే మనిద్దరిపేర్లూ గోడ కెక్కించేస్తారు వెధవలు" అన్నాడు. తనేదో మహా మర్యాదరామన్నలా పోజు పెట్టి.

"వ్రాస్తే వ్రాయనీయి ! నాకేమిటి మధ్యని ?" అంది విసురుగా జయ. ఆ సమయానికి 'కె. డి. ఎస్.' గారు కాంటీన్ నుంచి 'స్టాఫ్ రూం' లో కెళ్లబోతూ వీళ్లని చూస్తూ ఆగిపోయాడు. అది గమనించాడు రాంబాబు.

"అయితే నీకు సాయంత్రం ఒక షిఫాన్ చీర, పసుపు కుంకుమా, అరటిపళ్లూ పంపించనేమిటి ? మా అత్తయ్య చేత ?" నెమ్మదిగా పరిహాసంగా అన్నాడు. జయకు అరికాలు మంట నెత్తికెక్కింది. అతని దవడమీద ఒక లెంపకాయ ఇచ్చుకుని గరల్స్‌రూంలోకి వెళ్లిపోయింది. రాంబాబు రిపోర్టుమీద శాస్త్రిగారు సపోర్టుచేయగా మీ జయని ఇవ్వాళ 'సస్పెండ్' చేశారు." అంది సత్యవాణి. ప్రసాదరావు చెల్లెలి ఆకతాయితనానికి నవ్వుకుని—

"అయితే ఇప్పుడేం చేద్దాము జయా ? వాడు వ్రాసిన లెటర్సు ప్రిన్సిపాల్‌కి చూపెడదామా ?" అన్నాడు.

"అది కాదండీ. రాంబాబు చర్య సమర్థనీయమే. అతని మీద కసి జయఎప్పుడో తీర్చుకుంది. పైగా అతను మాతోటి కుర్రవాడే కనుక సరదాకి అల్లాగ ప్రవర్తించాడు. అతన్ని వొదిలేయచ్చును. ఈ కె. డి. శాస్త్రి ఉన్నాడు చూశారూ ? వీడు అనవసరంగా ఆడపిల్లలమీద లేనిపోని 'శ్కాండల్సు' ప్రచారంచేస్తున్నాడు. వాడి జులుబు వొదిలిస్తేకాని కాలేజీలో ఆడపిల్లల మనుగడ దుర్భరమై పోతోంది" అంది సత్యవాణి.

"నిజమేనా జయా ?" అన్నాడు ప్రసాదరావు.

"నిజమే అన్నాయ్ ? నావల్ల కాలేజీ పాడయిపోతూందని వాడి భార్యతో చెప్పాట్ట ! ఆమె వెళ్లి వాళ్ల ఇంటివారి అమ్మాయితో చెప్పిందిట ! అది గాలిలో తేలి నాదాకా వచ్చింది. ఈయనతో కాలేజీలో అందరూ వెళ్లి ఎల్లాగయినా జయప్రదని "డిబారు" చేయిస్తేకాని మా చదువులు సాగటం లేదు. అని మొరపెట్టారుట. చూడుమరి !" అంది రుద్ధ కంఠంతో జయప్రద.

"అయితే ఏం చేయడం ? ఆయనమీద రిపోర్టు ఇవ్వటం ఎల్లాగ మరి ?" అన్నాడు ప్రసాదరావు.

"అబ్బే ! అదేం కుదరదండీ ! క్లాసుల్లో 'స్ట్రిక్టు' గా ఉన్నట్లు నటిస్తాడు. దొంగముండాకొడుకు !" అంది సత్యవాణి.

"మనమే ఎల్లానో పట్టివ్వాలి అన్నాయ్ !" అంది జయ. ఆలోచనతో ఆమె కళ్లు తళుక్ మన్నాయ్ !

3

సాయంకాలం కాలేజీనించి ఇంటికి వచ్చి సంధ్య వారుస్తూండగా "మీకోసరం ఎవరో వచ్చి కూర్చున్నారు ! చప్పున లెమల్పండి !" అన్నది. దయానిధిశాస్త్రిభార్య లలితాంబ ! కె. డి. శాస్త్రి ఎవరా అని ఆలోచిస్తూ బయటికి వచ్చి "నమస్కారం" అన్న ప్రసాదరావుని ప్రశ్నార్థకంగా చూసి "దయచేయండి" అని కుర్చీ చూపించాడు.

"నన్ను ప్రసాదరావు అంటారండి. మా చెల్లెలు జయప్రద కాలేజీలో "ధర్డు ఇయర్" చదువుతూందిలెండి. ఆమె మార్చికి "భాషాప్రవీణ" కు 'అపియర్' అవుదా మనుకుంటున్నది. మీరు బాగా చెప్పగలరని 'ప్రిన్సిపాల్' చెప్పారుట. అంచేత మీరు దయయుంచి మా చెల్లెలికి "ట్యూషన్" చెప్పాలి !" అన్నాడు ప్రసాదరావు వినయంగా. కె. డి. ఎస్. నిర్ఘాంత పోయాడు. ఒక్కసారి జంధ్యాలు సవరించుకున్నాడు.

"జయా ! జయా !! ఆ సైకిలువాలీ ! ఆ పిల్ల శాంస్క్రీట్ చదువుతుందీ !" అనేశాడు అప్రయత్నంగా.

ప్రసాదరావు చిన్నగా నవ్వాడు.

"దాన్ని చూస్తే అందరికీ అలాంటి అనుమానమే కలుగుతుందిలెండి. కాని చాలా మంచిపిల్ల. మా నాన్నగారు దాని చిన్నతనమంతా ఉత్తరాదిని ఉద్యోగంలో ఉండేవారు. అంచేత దానికి అటువెంపు అమ్మాయిల విచ్చలవిడితనం అలవాటు అయిపోయింది. దాన్ని పరిపూర్ణమైన భారతీయ వనితగా తీర్చిదిద్దాలని నా ఆశయం. దానికి సంస్కృతభాషాభ్యాసము అవసరమని నా భావన !" అన్నాడు. మిసెస్ కె. డి. ఎస్. 'లలితాంబ' పాలూ, పళ్ళూ తెచ్చి మేజాబల్లమీ దుంచిది.

"కాఫీ, టీ మొదలగు పానీయాలు తామస ప్రవృత్తిని ప్రకోపింపజేస్తాయని నేను పాలే తీసుకుంటాను. అదిన్నీ శ్రేష్ఠమైన గోక్షీరమైతేనే !" అన్నాడు దయానిధిశాస్త్రి ఒక పాలగ్లాసు ప్రసాదరావు వెంపు తోస్తూను.

"అది నిజమే ! ఆధ్యాత్మికంగా ఉన్నతులైన మన భారతదేశపు ప్రజలు, కాఫీలు, ఫేషన్లు పెచ్చుపెరగటంతో విషయవాంఛలకి బానిసలైపోతున్నారు. ఈ పరిస్థితిలో ఇప్పటి నాగరికతమీద విప్లవం వస్తేకాని మనం బాగుపడము" అన్నాడు ప్రసాదరావు.

"ఏం విప్లవము వస్తుందో ఉద్ధరి ! ఈయన చూడకపోతే సినిమాకు తీసుక పొమ్మన్నా తీసుకెళ్లరు కదా ! సాటివారు "టింగురంగా" అంటూ కాలం గడుపుతూంటే నేను ఈయన ఆచారాలలో మసై మంటకలిసిపోవాల్సి వస్తోంది. అన్నయ్యగారూ !" అనేసింది లలితాంబ.

ఆమెకేసి పరీక్షగా చూశాడు ప్రసాదరావు. లలితాంబ ఇరవయి ఏళ్ల స్త్రీ ! పచ్చటి పూలతో టర్నింగుబోర్డరు ఉన్న ఎర్రటి కాశ్మీరపు సిల్కుచీర కచ్చపోసి కట్టుకుంది. చేతికందని మెలికలుతిరిగే జుట్టు బిగించి జడ అల్లి గుండ్రసిగ చుట్టుకుంది. కాళ్లకి గొళ్లెపుగొలుసులు. మెడలో నల్లపూసల తావళం. ఏమిటో, ఆ సింగారం ఆమెకు ఎబ్బెట్టుగా ఉండటంతో ప్రసాదరావుకి కె. డి. ఎస్. చాదస్తం అర్థమయిపోయింది. ప్రొద్దున్న ఏడు మొదలు ఎనిమిదిన్నరదాకా జయప్రద ఇంటివద్ద, కె. డి. ఎస్. సంస్కృతం నేర్పడానికి 'టైం ఫిక్స్' కాబడింది. రామోదంతం మొదలుపెట్టి వరసగా చదువుకుపోతూ కుమార సంభవం, కాదంబరిలో మహాశ్వేత వృత్తాంతము, మధ్యమ సిద్ధాంతకౌముది పూర్తిచేశారు. ఇంక కోర్సులో మిగిలిఉన్నది అభిజ్ఞాన శాకుంతలము. అది పరీక్షల ముందు చదువుకోవచ్చును అంది జయప్రద. అంచేత విక్రమోర్వశీయము, మృచ్ఛకటికమ్, ప్రియదర్శిక, నాగానందం చదివింది. ఆమె గురువుగారివద్ద శ్రద్ధగా కావ్య నాటకాలలోని నవరసాల్ని ఆకళింపుచేసుకుంటున్నది. "ఆమె చిన్నతనం ఉత్తరాదిన గడిపింది" అన్న సంగతి దయానిధిశాస్త్రి గుర్తుంచుకుని శరీరాన్ని అదుపులోపెట్టుకునే ఆమెకు కావ్య నాటకాలలోని భావాలను విపులీకరించేవాడు.

లలితాంబ మడికట్టుకొని వంట చేస్తుంది. పెళ్లయిన కొత్తలో ఆమె భర్త కాలేజీలో తెలుగులెక్చరర్ అని వింటంతో ఆమె మురిసిపోయింది. ఆ మురిపెంలో భర్త

దగ్గర తనకు కాలేజీలో జాయినవుదామన్న కోర్కె ఉందని తెలిపింది. ఆమె స్కూల్ ఫయినల్ ప్యాసయి వుందన్నసంగతి పాపం శాస్త్రికి తెలియదు. అతని ఒళ్ళు జల్లుమంది. తన భార్యా! కాలేజీ గర్ల్ అవడమా? అమ్మయ్యో! ఇంకేమన్నా ఉందీ! అప్పట్నించీ అతను పనిగట్టుకుని లలితాంబలో రోజూ కాలేజీ అమ్మాయిల బేడ్ కారెక్టర్సునిగురించి వర్ణించి చెప్పేవాడు. లలిత అనే పేరు మృదువుగా ఉందని భయమేసి లలితాంబ అని మార్చేశాడుకూడా. అలా చెప్పుకోవటంలో ఒకరోజు జయప్రదపేరు కూడా జారేశాడు. అది జయ దాకా వెళ్లింది. ఆమె త్రాచల్లే లేచి కసిపెట్టుకు కూర్చుంది. జయప్రద చిత్రంగానే ఉండేది. రోజుకో కాస్ట్యూమ్ ధరిం చేది. ఎండగా ఉన్నప్పుడు గాగుల్స్ వేసుకునేది. కారు అన్నయ్య తీసుకెళ్లినప్పుడు సైకిలు ఉపయోగించేది. 'డిబేటు' ల్లో పాల్గొనేది. ఆమె ఎన్. సి. సి. డ్రస్‌లో నడు స్తూంటే కె. డి. ఎస్. కళ్లప్పగించి చూసేవాడు. జయ ప్రదకు ఏది చెప్పినా ఇట్టే గ్రహించే అసాధారణగ్రహణ శక్తి ఉన్నది. ఆమెకు ప్రిన్సిపాల్ కూతురూ క్లాసుమేటూ అయిన సత్యవాణి ప్రాణమిత్రురాలు!

4

ఆరోజు జయప్రద పుట్టినరోజు! తెల్లవారకుండానే ప్రసాదరావు జయప్రదకు తా నివ్వాళ పార్టీ ఏర్పాటుచేశా ననీ అందర్నీ పిలుచుకొమ్మనీ చెప్పాడు. జయ లేచి తలంటు కొని "బ్రెక్‌ఫాస్టు" పూర్తికానిచ్చి సత్యవాణికి ఫోను చేసింది.

"ఇవ్వాళ నా బర్తుడే! కాస్త మాగురువుగారిని ఇన్వయిట్ చేయాలి. వేగం తయారయి రావే!" అంది.

"ఓ! తప్పకుండా వస్తున్నాను" అంది సత్యవాణి. డ్రస్సింగ్ టేబుల్‌వద్ద కూర్చుంది జయ. మామూలుగా రెండు జడలు వేసుకుని మళ్లీ నచ్చక విప్పేసింది. జుట్టు ఆరు పాయలుగా వేరుచేసి దువ్వెనతో మెలిపెట్టి పైన హెయిర్‌క్లిప్పులు పెట్టి బిగించింది. భుజంమీదికి ఆరు పాయలూ ఆరు త్రాళ్లల్లా వ్రేలాడుతున్నాయ్! తెల్లగా పొడుగ్గా ఉన్న మెడలో ఒంటి వరస ముత్యాలహారం! ఒక చేతికి మూడేసి వరసల తెల్లరాళ్లు పొదగబడిన బ్రేస్‌లెట్. రెండోచేతికి ఆరు బంగారు డైమన్‌కటింగ్ గాజులు. ఒంటి వంపుల్ని వ్యక్తంచేసేట్టున్న పచ్చని పట్టుచారలున్న తెల్లటి జార్జెట్ కమీజు! లేత ఆకుపచ్చ సాటిన్ సాల్వార్! చమ్కీ పని చేసిన చప్పల్సు!

"ఆహా! ఒమార్‌గారి ప్రేయసిలా తయారయ్యావే? మనం వెళ్తున్నది "మొఘల్ గార్డెన్సులో" విహారాని కను కుంటున్నావేమిటి? దయానిధిశాస్త్రుల్లవా రింటికి "తన జన్మదినోత్సవ సందర్భ ఆహ్వాన నిమిత్తం" అని మరచినావా? బేలయైన బాలా?" అంది సత్యవాణి.

"ఏం బాగులేదా సత్యా?" అంది జయ.

"బాగులేకేం? నాకు బాగానే ఉంది. రోడ్డమ్మట వెళ్తుంటే స్టూడెంట్సుకూడా నయనానందంగానే ఉంటుంది. కాని పవిత్రమైన గృహస్థాశ్రమము నిర్వహిస్తున్న గురువు గారి సన్నిధిని ఈ వేషభాషలు ఎంతమాత్రము "ఇంప్రెస్" చేయజాలవని నొక్కి వక్కాణించుచుంటిని. ఏమనుకోకు జయా!"

"అయితే ఎల్లా తయారవమంటావు చెప్పు! కొప్పెట్టు కొని, కొప్పులో తంగేడుపూలెట్టుకుని తట్ట నెత్తిన పెట్టుకుని నల్లటి చీర మరాటీ స్టయిల్‌లో కడ్తే బాగుం టుందా?" అంది జయ జుట్టుపాయలు విప్పేస్తూ.

"అంతమాట నే ననలేను కాని, మనవూళ్లో సంపన్న లైన కన్యలవేషం ధరిస్తే చాలు అనుకొంటున్నాను" అన్నది సత్య. ఈసారి జయప్రద వొదులుగా వాలుజడ వేసుకొని జాజి పూలమాల పెట్టుకుంది. ముదురు ఆకుపచ్చని పట్టు పరి కిణీమీద లేత నీలి జార్జెటువోణి వేసుకుని మిరపపండురంగు చోళీ తెల్లనిమెడని ముద్దు పెడుతుండగా కళ్లనిండుగా కాటుక పెట్టుకుని చిన్న నొక్కు ఉన్న గడ్డంమీద అగరుచుక్క పెట్టింది. చెవులకి రాళ్ల జుంకీలు, ముత్యాల మాటీలు (చంప స్వరములు) నుదుట ఆండాళ్లబొట్టు (పైన దోసగింజలా క్రింద గుండ్రని చుక్క) ధరించి,

"సత్యా!" అంది ఆలోచనగా.

"అనుసరామి!" అంది సత్య.

"ఏమిటేవ్ సంస్కృతంలో మాట్లాడేస్తున్నావ్?" అంది జయ.

"సూదితోటే దారమూనూ. జయా! నీ కోర్సు ఎంతవరకూ అయిందే?"

"అవుతోంది. అవుతోంది. కాని లొంగుబాటుకు రావటం లేదే గురుడు!"

"నీరోనే ఉందిలే అంటాను. బొత్తిగా ఫాషన్ షోలో మోడల్‌లా తయారవుతావు! దాంతో గాభరాపడి పోతున్నాడు. కాస్త మన సాంప్రదాయంప్రకారం నువ్వు తయారయితే ఈపాటికే నిన్ను......"

"చాల్లే! చాల్లే! ఓవర్ డోస్ అయిపోతోంది." ఇద్దరూ గురువుగారింటికి వెళ్లారు. వరండాలో కూర్చుని చదువుకుంటున్న రాంబాబు వీళ్లను చూడగానే తేలు కుట్టి నట్టు ఒక్క గెంతు గెంతి వంటింట్లో పనిలో ఉన్న లలితాంబముందు వ్రాలాడు.

"అత్తా! నేను నిమిత్తమాత్రుణ్ణి. అంతా మామయ్య దేస్మా! నన్ను క్షమించి రక్షించు అత్తా!" అన్నాడు.

"ఏమిటయ్యా అసలు సంగతి!"

అదే అత్తా! అదే! అదంటే ఆ అమ్మాయి, నన్ను కొట్టేసిన అమ్మాయి, మనింట్లోకి వస్తోంది. వచ్చేసింది!

అయ్యొ బాబోయ్ ! "అత్తా ! నాదేం తప్పులేదు. నన్ను రక్షించు. ఈ దీనుణ్ణి కనికరించు !"

"పూ సోదిపెట్టకు ! నన్నవతలకి వెళ్ళనీ మరి !" అంది లలితాంబ నవ్వుకొని.

"అమ్మగారూ ?" అని పిలిచింది సత్యవాణి.

"ఎవరితాలూకూ ?" అడిగింది లలితాంబ.

"మీతాలూకే ! మీవారి శిష్యురాలు ఈ అమ్మాయి. ఇవ్వాళ పుట్టినరోజట. మీతో చెప్దామని వచ్చింది" అంది సత్యవాణి.

"కాలేజీ పిల్లే అన్నమాట."

"అవును. మీవారిదగ్గర సంస్కృతం ట్యూషను చెప్పించుకుంటోంది."

"మీ చెల్లెలికా పుట్టినరోజు ?"

"నాకు నేనే అక్కనీ, చెల్లినీ. నాదేనండి పుట్టిన రోజు" అంది జయప్రద.

"మీ గురువుగారు దేవతార్చనలో ఉన్నారమ్మాయ్ !" లోపల్నించి దయానిధిశాస్త్రి కంచుకంఠం.

"గాతుం యజ్ఞాయ, గాతుం యజ్ఞపతయే దైవీ స్వస్తిరస్తునః"—రాగవరుసలో వినపడింది.

"అయిపోవచ్చింది కదా ! చెప్పేసే వెళ్తాములెండి" *అంది జయ. లలితాంబ 'ఒకమూల తనూ వాళ్ళల్లా ఉండా ల్సినదాన్నే* కదా అనే చింత మనస్సుని వేధిస్తున్నా'—

"ఔరా ! ఎంత బరితెగిపోయారూ ? పద్దెనిమిదేళ్ళొచ్చి నలుగురేసి పిల్లల తల్లుల్లా ఉండి ఇంకా మా పుట్టినరోజు మా పుట్టినరోజు అంటూ మగాళ్ళని కూడా పిలవటానికి తయా రయ్యారు. వీళ్ళకి సిగ్గూ ఎగ్గూ అన్నది ఉంటుందా? అన్నట్టుగా ముక్కుమీద వేలుంచుకొంది. జయ, సత్య ఆమెని పరిశీలిస్తూ నిలబడ్డారు. దయానిధిశాస్త్రుల్లవారు ఒక లంగవస్త్రం చుట్టుకొని ఒక అంగవస్త్రం భుజంమీదుంచుకొని చెవులో వందివర్ధనంపువ్వు, నుదుట విభూతి రేకలమధ్య కుంకుమ బొట్టుతో ఇవతలికి వచ్చారు.

"ఏమిటి విశేషం ?" అన్నారు.

"ఇవ్వాళ నా బర్త్డే. అన్నయ్య పార్టీ ఏర్పాటు చేశాడు. మీరు, మీ మిసెసు తప్పక రావాలి సాయంత్రం" అంది జయ.

"ఇప్పుడే గట్టిగా చెప్పమ్మాయ్ ! లేకపోతే ఆయన నన్ను ఎక్కడకూ తీసుకుపోరు" అనేసింది లలితాంబ. భార్య కేసి ఎర్రగా, గుర్రుగా చూశాడు శాస్త్రి.

" ఏం ? " అలా చూస్తారేం ? ఉన్నమాటంటే ఉలు కెక్కువట పాపం ! "లలితాంబ సాగదీసుకుంటూ లోపలి కెళ్ళి పోయింది. సాటిస్త్రీ అసహాయతకి ఆరాటపడింది జయ అమృతహృదయం !

"తప్పక తీసుకరండి మాష్టారూ ! ఈ రోజుల్లో కూడా వెలుగు చూపించకపోతే ఎల్లాగా ?" అనేసింది జయ.

"అది తిన్నగా ఉండే రకం కాదు జయా ! మీలాంటి వాళ్ళమధ్య తిరిగిందంటే మీ ఫాషన్సు చేసుకోవటం మొద లెడుతుంది. అది నాకు నచ్చదు. వాళ్ళక్కయ్యల్లో ఒకర్తి "విడో మారేజ్ చేసుకుంది. ఇంకొకర్తి క్లబ్బు లేడీ. ఇంకో ఆవిడ సోషలు వర్కరు. ఇలాంటి వంశంలోదని నాకు తెలి యక పెళ్ళాడాను. నా జాగ్రత్తలో నే నుండకపోతే ఎల్లాగ?" అన్నాడు.

"వెరీ సారీ ! మీ పెర్సనల్ మాటర్సులో కలుగజేసు కున్నాం. ఏం బాధపడకండి మాష్టారూ !" అంది జయ అనునయంగా.

"నో ! నో ! నేను *బాధపడటం* అనేది ఎప్పుడో మర్చి పోయా జయా !" అన్నాడు. జయకళ్ళల్లోకి ఆవేదనగా చూస్తూ.

దార్లో "ఏమేవ్ మాష్టారు దార్లో పడ్డట్టున్నారు. రాంబాబు గతేంకాను ?" అంది సత్య.

"నోర్మూసుకోవే ! ఇద్దరిగతీ చూస్తాను" అంది జయ.

ఇక్కడ కొంచెం దయానిధిశాస్త్రిని గురించి చెప్తే ఫరవాలేదు అనుకుంటాను. అతను పూర్వాచారపరాయ ణుడు. త్రికాలాలు సంధ్య వారుస్తాడు. కాలేజీలో అతనికి ప్రవరాఖ్యుడు అనే బిరుదు ఉన్నది. బెనారస్ హిందూ యూనివర్సిటీలో శాంస్క్రిట్ ఎం. ఎ. ప్యాసయినాడు. ఉభయ భాషాప్రవీణ కూడా ప్యాసయినాడు. వేదాంతము, తర్కము, అతని అభిమానపు సబ్జెక్ట్సు. ఇప్పుడు జయ కోసమని అతను కావ్యనాటకాలన్నీ తిరగేయటం ప్రారంభించాడు.

జయ "మాష్టారూ ? కేవలం పరీక్షచదువు చది వితే ఏం లాభమండీ ? కాదంబరిలో మూడు ఛాప్టర్సూ, కుమారసంభవములో నాలుగు కాంటోస్ చదువుకుని మీరు చెప్పిన క్వశ్చ నాన్సర్సు బట్టీవేసి అవి ముక్కున పెట్టుకుని పరీక్ష వ్రాసేసి భాషాప్రవీణ డిగ్రీ తెచ్చుకుంటే ఏం సాహిత్య మబ్బుతుందీ ? నాకు భాషలోని భావగాంభీర్యము, శబ్ద మాధుర్యము అర్థమయ్యేలాగున మీరు చెప్పాలి మాష్టారూ ?" మీ సంపూర్ణసహకారం లేనిదే నాకు సంస్కృతసాహిత్య సమగ్రపరిశీలన అలవడదు" అన్నది. నిమిషాని కొకవేషం ధరించే ఈ ఫాషన్‌బుల్‌గర్ల్ జయలో ఇంత సాహిత్యపిపాస కలగటం తనసన్నిధికోసం తపన అయివుంటుందని అభి ప్రాయపడ్డాడు శాస్త్రి ! జయకూడా చాలా "సిన్సి యర్" గా చదువుకునేది. ఆమె కాలేజీకి ఎలా వెళ్ళినా ట్యూషన్‌ముందర మాత్రం అచ్చమయిన తెలుగుబాలికలా వర్తించేది. జయ రోజూ ఏరోజు పాఠం ఆరోజు అన్నయ్య దగ్గరా, సత్యవాణి దగ్గరా చెప్పేది. వాళ్ళల్లోవాళ్ళు చమత్క రించుకుని నవ్వుకునేవారు. జనవరినెల గడచిపోయింది. గురువు గారూ, శిష్యురాలూ అభిజ్ఞానశాకుంతల నాటకము చదువుట

కుపక్రమించారు. జయ శకుంతల నాటకంమీద గట్టి నమ్మకము పెట్టుకొని ఉన్నది. "మాష్టారూ! ప్రొద్దుటిపూట అరింటికే వచ్చేయండి. ఎనిమిదిన్నరదాకా చదువుకోవచ్చు" అని చెప్పింది. ఇద్దరూ అభిజ్ఞానశాకుంతలములోని "భావ వైరుధ్యాన్ని" గూర్చి రాంచ్రటోవర్చీ వేసుకునేవారు.

5

హేమంతపు అఖరి ఉషోదయము! విరిసిన పారిజాతాలు ఒక్కొక్కటే నేలమీద వ్రాలుతున్నాయ్. వాటి కాడల్లోని ఎరుపుదనం రేకుల్లోని తెల్లదనం కలిసి ముత్యాలూ, పగడాలులా కన్పట్టుతున్నాయ్. బాల్కనీమీద జయ, శాస్త్రిగారు కూర్చున్న పేముకుర్చీలమీదికి వంగిన పొన్నపూల రెమ్మచుట్టూ ఆ పూల సువాసనకు తేనెటీగలూ, తుమ్మెదలూ ముసురుతుంటే శాస్త్రిగారు నిర్లిప్తంగా చూస్తుండిపోయారు. జయ ఆరోజు లేత పసుపుపచ్చని జార్జెటు చీర, బ్లౌజు ధరించింది. మెడమీదికి జారిపోయే జుట్టు వదులుగా జారుముడివేసి రెండు ఆకులు ఉన్న ఎర్రని మందారపువ్వు తురుముకొంది. ద్వితీయాంకములో గ్రంధము నడుస్తోంది. జయ కనుకొలకుల్లోంచి దయానిధిశాస్త్రిని పరీక్షిస్తూ నెమ్మదిగా చదువ నారంభించింది.

"స్నిగ్ధం వీక్షిత మన్యతోపి నయనే,
య త్ప్రేరయన్త్యా తయా,
యాతం యచ్చ నితంబయో ర్గురుతయా
మందం విలాసా దివ,
మాగా ఇత్యుపరుద్ధయా యదపి సా,
సాసూయ ముక్తా సఖీ,
సర్వం తత్కిల మత్పరాయణ మహో,
కామీ స్వతాం పశ్యతి!"

అహో! కామీ స్వతాం పశ్యతి!"

ఆశ్చర్యము! కోరికలుగల పురుషుడు అంతయు తన నిమిత్తమని చూచుచున్నాడు!

దయానిధిశాస్త్రి భావము విడమర్చి చెప్పుచున్నాడు.

"శకుంతలకు అందముగా చూచుటయు, నెమ్మదిగా, సవిలాసముగా నడచుటయు స్వభావము. కాని దుష్యంతుడు అది అంతయు తనని గురించే అని భ్రమపడుచున్నాడు."

జయప్రద శాస్త్రిగారివంక నిర్నిమేషంగా చూస్తూండిపోయింది. కిటికీ వెనకావతల నైలాన్ కర్టెన్లు మనుష్యుల నీడలజాడలతో చిరుగాలికి రెపరెపలాడసాగాయ్. ఒక్కసారి జయహృదయం దడదడ లాడసాగింది. చేతులు వణకిపోగా ఆమె చేతిలోని పెన్ను దయానిధిశాస్త్రి పాదముదగ్గర జారిపోయినది. ఆమె పెన్నుకోసరము క్రిందికి వంగగా ఆమె పైట చలిగాలికి తపతప లాడుతూ ఆమె మోచేతిమడత మీదికి జారింది. దయానిధి కళ్లకి మెరుపు కొట్టినట్లయింది. ఆమె జయేనా? కాదు కాదు. ముమ్మాటికీ కాదు. కణ్వాశ్రమంలోని శకుంతల! దుష్యంతుణ్ణి కళ్లారా చూడాలని ఆకాంక్షిస్తూ చెలుల పరిహాసోక్తులకు బేజారయిపోయి ఉత్తరీయము పొదలలోచిక్కుకున్న మిషతో ఆగిపోయిన శకుంతలే ఇక్కడ జయగా అవతరించి తనపాదార్చనకోసరం పెన్ను మిషతో వంగివుంది. సూర్యోదయమైనా ఇంకా చలి వదల్లేదు. ఆ చలిగాలిలోకూడా అతని చెంపలు చమర్చుతూండగా తటాలున లేచి జయ రెండుభుజాలు పట్టుకుని తనవెంపు త్రిప్పుకుని.

"జయా! నీవు నిజంగా సుమబాలవే! నా పాలిటి శకుంతలవి. నా హృదయరాణివి?" గట్టిగా హృదయానికి హత్తుకో బోయాడు.

"స్టుపిట్! మా గొప్ప దక్షిణ నాయకుడివి బయల్దేరావు! మర్యాదస్థుడివి కదా అని చదువు చెప్పమంటే బిల్హణీయం సాగిద్దా మనుకుంటున్నావా? నువ్వింత నీచుడివి అని కానలేకపోయాను. ఇదేనా నీ మర్యాద ముసుగు? ఇదా నీ ధర్మప్రతిష్ఠాపన!" ప్రసాదరావు హుంకరించాడు.

"మాస్టారూ? నన్ను 'డిబారు'చేస్తేకాని కాలేజీ బాగుపడదు అన్నారుట. మీలాంటి బాధ్యతవున్న పెద్ద మనుష్యులే మమ్మల్ని ఈ దృష్టితో చూస్తూంటే ఇంక కుర్రకారువాళ్లు అలా ప్రవర్తిస్తే తప్పేముంది చెప్పండి! ఏదో కుర్రవాళ్లంకనుక సరదాకొద్దీ బాగా డ్రస్సయి కాలేజీ కొస్తే అదేనా 'యూనిఫారమ్' అంటూ మీరు చూసి ఆగలేక అత్యాచారాలు జరుపబోయి అవి సాగకపోతే అసభ్యప్రచారాలు చేయటం మొదలుపెట్టారా? మీకు లొంగకపోతే మామీద అసూయపడటం తప్పుకదూ! రేపట్నించీ నాకు మీరు కావ్యబోధన చేయక్కరలేదు. గుడ్‌బై!" అంది జయప్రద.

"ఏమిటయ్యా శాస్త్రుల్లూ? మాదగ్గర అంత నెమ్మదిగా వుండేవాడివి? నువ్వు చెప్పిన మాటలన్నీ నిజమే అనుకుని నమ్మి పాపం నిష్కారణంగా జయను అవమానించాము. నీ బుద్ధిమంతతనం అంతా మా దగ్గరే అన్నమాట. అన్నీ చెప్పినవాడివి జయ ఒంటిగా కనపడేసరికి పెసరపప్పుజావలా తయారయినా వేమిటి! "నాతిచరామి" అని అగ్నిసాక్షిగా ప్రతినపట్టి అర్నెల్లయినా తిరగలేదు మళ్లీ చూడపోతేను" అన్నారు. ప్రొద్దుటే "బ్రెక్‌ఫాస్టు"కి ప్రసాదరావు ఆహ్వానంమీద అక్కడికి వచ్చిన ప్రిన్సిపాలు 'సాగరు' గారు!!

శ్రీ విక్రాల రామచంద్రాచార్యుల ప్రతిభ

శ్రీ విక్రాల శేషాచార్యులు

విద్యావన పంచానన విద్యా వాచస్పతి ప్రశస్తియుజః
విక్రాల రామచంద్రాచార్య స్యాంఘ్రౌ నమఃపదం కలయే.

విద్యారణ్య పంచానన విద్యావాచస్పతి బిరుదాంచితులైన శ్రీమాన్ విక్రాల రామచంద్రాచార్యులవారు విద్యాస్థానములుగా పేరుగాంచిన కాశి నలంద నవద్వీపముల వంటి మహాస్థానములలో జరుగుచుండిన పండిత పరిషత్తులలో స్వకీయ పాండిత్య లక్ష్మీసందర్శన విశేష విస్మేరహృదయులైన విద్వద్వరేణ్యులచేత పరమేష్ఠిప్రాణమువోసి పలికించుచున్న గొప్ప గ్రంథాలయమని ప్రశంసింప బడినవారు. అనంగా సర్వ శాస్త్రములయందు గల అపారమైన గ్రంథజాలము నంతయుం జదివి యందలివిషయములను బహు చక్కగ నుపన్యసించుచున్నారని యీ ప్రశంస కర్థము. చివరకు సకల శాస్త్రములు అంగములుగా గూడి యవతరించిన యొక విద్యామూర్తి యని గూడ యనిపించుకొనిన వీరి జననకాలము :—

కలియుగాది 84 వ ప్రమాది సంవత్సర జ్యేష్ఠ కృష్ణ ద్వితీయ (విదియ) శుక్రవారము పూర్వాషాఢా నక్షత్రము ప్రథమ చరణము సింహలగ్నోదయం దవతరించిరి. అప్పుడు క్రీ. శ. 1879—6—6 కనుక 19 వ శతాబ్దము 20 సంవత్సరములకు ముగియుటకు ముందుగా ఆచార్యులవారి జననము. 19 వ శతాబ్దముయొక్క చివర నన్నమాట.

నెల్లూరుజిల్లా కందుకూరుతాలూకాలో కవిపండితారామమని నుతిగాంచిన కలికివాయ గ్రామమునందు స్వమాతామహులు చతుశ్శాస్త్రపండితులు నైన శ్రీమాన్ పర్ణశాల వేంకటనరసింహాచార్యులవారి గృహమునందు వారి పుత్రిక శ్రీమతి కనకమ్మగారి గర్భమునం దవతరించిరి. వీరు మా తండ్రిగారు. వీరు తెన్గల శ్రీవైష్ణవ శాఖకు జేరిన బ్రాహ్మణోత్తములు. భారద్వాజ గోత్రులు. ఆపస్తంబసూత్రులు., యజుశ్శాఖాధ్యేతలు. పదునెనిమిదవ శతాబ్దములో జగత్ప్రసిద్ధ పండితులలో నగ్రగణ్యులైన శ్రీమాన్ కళత్తూరు విక్రాల రాఘవాచార్యులవారి యాత్మజులు. ఈ రాఘవాచార్యులవారు శ్రీ కాళహస్తి సంస్థానమునందు ప్రధాన పండితులుగ నున్నవారు. వేదప్రామాణ్యము, శిక్షాభాష్యము, రహస్యత్రయ భాష్యము, శుల్బసూత్ర భాష్యము, సూర్య సిద్ధాంత వ్యాఖ్యానము, గ్రహాదర్శము, ధర్మనిర్ణయము, వృత్తి సంగ్రహము ఆంధ్రదేశ భాషా మహిమాను వర్ణనము మొదలుగా గల మహోపకారములైన 42 గ్రంథములను రచించినవారు. కాశీ పండితులు వీరితో వాదముచేసి వీరి పాండిత్య మపార మని యెరింగి "షడంగ వేదజ్ఞః" అను బిరుదము నొసంగి సత్కరించిరి. ఆటువెనుక మహోపాధ్యాయబిరుదమును లబ్ధమయినది. ఇట్టి పండితప్రముఖునికి పుత్రులయిన వీరు "కారణగుణాః కార్యే సంక్రామన్తి" యను న్యాయమునకు లక్ష్యభూతులుగా తండ్రిగారి కెనయైన పాండిత్య ప్రసిద్ధులతో నొప్పిరి.

విద్యాభ్యాసము—వీరు తమ జననాది యయిదవ సంవత్సరము గడచు లోపల తమ తండ్రిగారి సన్నిధియం దక్షరాభ్యాసము నారంభించి చక్కగా వ్రాయుటకును, చదువుటకును నేర్చి యాఱవ సంవత్సరమున నగా పార్థివ ఫాల్గుణ శుక్ల తృతీయ (తదియ) నా డుపనయన సంస్కారము నొంది వృత్తి పంచకమునందు మంచి పరిజ్ఞానమును సంపాదించి యేడవ యేట లీలావతీ గణితసారసంగ్రహము లనెడి పాటీ గణితములను భాస్కరజ్ఞానరాజరచితములైన బీజగణితగ్రంథములను శ్రీ ధరత్రిశతిని సంపూర్ణముగ తదుక్త గణితాభ్యాసము తోడ జదివి తొమ్మిదవ సంవత్సరమున స్వపితృకృతమైన గ్రహాదర్శమను గ్రంథమును వాసనా (సైన్సు) సహితముగ బఠించి యొక్క రాత్రిలోపల పంచాంగరచనకు గావలసిన యావద్గణితమును అభ్యసించి మరునాటినుంచి పంచాంగ రచనను చక్కగ నలవరచుకొనిరి.

వీరి కీ విద్యాభ్యాస మంతయు తమ తండ్రిగారి సన్నిధి యందే జరిగినది. అనంతరము 10, 11, 12 సంవత్సరముల వయస్సునందు అనగా మూడేండ్లలో దమ మేనమామగారు తమ తండ్రిగారి వద్దనే షట్శాస్త్రములం జదివి పండితశిరోమణులైన శ్రీమాన్ పర్ణశాల రాఘవాచార్యులవారి వద్ద సాహిత్య వ్యాకరణములను తర్కశాస్త్రమును పరిపూర్ణముగ బఠించి యుత్తీర్ణులైరి.

అటువెనుక తమ పదమూడవ సంవత్సరమున దమ తండ్రిగారు పరమపదము నొందిరి. వారికి వారియొక్క 84 మంది శిష్యులు తమ మేనమామగార్లతోను కూడి బ్రహ్మమేధ విధానముగ సంస్కారముల నొనర్చి పిదప కాళహస్తిలోనే బ్రహ్మశ్రీ శింగరాజు సూర్యనారాయణోపాధ్యాయులవారి కడ జేరి స్వశాఖయగు కృష్ణ యజుర్వేదమునందలి తైత్తిరీయమును అర్థ, లక్షణ, మీమాంసా, త్రయములు పద క్రమముల తోడను పరిపూర్ణముగ నధ్యయనము గావించిరి.

పిమ్మట పూర్వాశ్రమములో తమ తండ్రిగారి శిష్యులు పరమహంసేత్యాది రామదత్తానంద తీర్థులనెడి బ్రహ్మశ్రీ తాటిపర్తి సీతారామయ్యగా రనువారి వద్ద సిద్ధాంత జాతకముహూర్త వాస్తు ప్రశ్నభాగములం జదివి జ్యోతిషమునందు పరిపూర్ణజ్ఞానము నొందిరి.

వీరిన్ని విద్యలం జదివి యన్నింటిలో నుత్తీర్ణులై తమ 24 సంవత్సరముల వయస్సు నిండకమునుపే పలు రాజ సభల వాక్యార్థముసలిపి గొప్ప కీర్తిని సంపాదించిరి. ఇవ్విషయమున శ్రీ యాచార్యులవారికి శ్రీ నరసారావుపేట జమీందారీ సంస్థానమునం దొసంగిన సర్టిఫికెట్టునుండి కొన్ని పంక్తుల నిట జూపుచున్నాడ.

“వీరు చతుర్వింశతి వత్సర పరిమిత వయఃకాలం బతిక్రమింపక పూర్వమే షడంగవిశిష్టక్రమాంతయజుర్వేదపారీణులై యష్టసిద్ధాంత వేత్తలై సనిధి పరిమితాధికరణ విశిష్ట జైమినీయ పూర్వమీమాంసాపారంగతులై ఏ తద్దేశస్థరాజసభావాక్యార్థ ప్రతిపాదన సంప్రాప్తయశో విరాజితులై” యని.

వీరి పాండిత్యప్రకర్షమును విద్వద్గోష్ఠియందుఁ గాంచి శ్రీ రాజా నరసారావుపేటజమీందారుగారి యాస్థానపండితులైన శ్రీమాన్ శ్రీమత్తిరుమల నల్లాన్‌చక్రవర్తి వేంకటరామనృసింహాచార్యులవా రుద్ఘోషించిన శ్లోకము.

వేదవేదాంగ నిష్ణాతో మీమాంసా శాస్త్రపారగః
విక్రాల రామచంద్రార్యో రాజతే బుధతోషకః

ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము అను నాలుగు వేదములు. శిక్ష, వ్యాకరణము, ఛన్దస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అను నారు వేదాంగములు, పూర్వమీమాంసా ఉత్తరమీమాంసలు రెండు. ఈ పదిరెండు శాస్త్రములయందు శ్రీమాన్ విక్రాల రామచంద్రాచార్యులవారు పాండిత్యవైభవముచే పండితుల కానందకరులయి యలరుచున్నారు అని యర్థము.

వీరియొక్క చతుర్వేదపాండిత్యము సర్వకల్పసూత్ర పాండిత్యము వీరు రచియించిన [1] “సర్వవేద సంప్రదాయములు సర్వసూత్రసంప్రదాయములు” అను గ్రంథములయందు చూడనగును.

అంత తిరుపతియందు శ్రీ మదుభయ వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యులు శాంత శమదమాద్య శేషకల్యాణ గుణగణ పరిపూర్ణులు శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యవర్యులై వేంచేసియుండే శ్రీమాన్ చిన్నజియ్యంగార్లవారి యనుగ్రహముచే పంచ సంస్కార భాగ్యమునొంది పిదప శ్రీ పెరుంబూదూరునందు శ్రీమాన్ ఆళూరురంగస్వామి అయ్యంగారి నాశ్రయించి భాష్య భగవద్విషయాది సంప్రదాయగ్రంథముల సేవించిరి.

ఇట్లు స్వల్ప వయస్సులో నన్ని శాస్త్రములం దుత్తీర్ణులగుట యమానుషమైన శక్తి. ఇందు కాచార్యులవారి గురువులు, సహాధ్యాయులు మాకు జెప్పినఁ వారి మేధాశక్తి నిటఁ దెలుపుచున్నాడ.

మేధాశక్తి :—అయిదవ సంవత్సర ప్రాయమున యాచార్యులవారికి అక్షరాభ్యాసము నారంభించి వారిచే దిద్దించుటకుఁగాను వారి తండ్రిగారు పలకమీద నక్షరముల వ్రాయుటఁ జూచి యాచార్యులవారు ఆ పలకను, బలపమును తీసికొని వాటిఁ దిద్దకనే గ్రహించి యప్పుడే యా వెనుకప్రక్క నా యక్షరముల నట్టులే నోటఁ బలుకుచు వ్రాయువారు. ఈ ప్రకారమాచార్యులవా రొక్క దినములోననే గుణితము వత్తులతోటి యావత్తు అక్షరములను వ్రాయుటను, చక్కగ చదువుటను, ౧౦ మున్నగు సంకెలను, మున్నగు భిన్న గణితాంకములను అనాడు ఒక్కపూటలోననే నేర్చుకొనిరి.

ఇవ్విషయము నప్పు డాచార్య పితృపాదసన్నిధిని శాస్త్రాభ్యాస మొనర్చుచుండు శిష్యబృందము కని మహాశ్చర్యము నొందుచుండెడిది.

వేదాధ్యయనమునందును సదక్రమవిశిష్టముగ నొక్కొక్క ప్రశ్న (పన్న) ము నొక్కొక్కమారు మాత్రమే గురువు చెప్పుచుండ విని మఱిమాఱు గ్రంథాపేక్ష లేకుండనే యాప్రశ్నము నంతయు పదక్రమములతోడ గురూక్తరీతిగ నొప్పుఁ జెప్పుచుండెడివారు.

ఈ గ్రహణధారణ శక్తిం గాంచి యాచార్యులవారి బంధువులు, గురువులు “పితుశ్శత గుణః పుత్రః” యను న్యాయము వీరియం దన్వర్థమగునని తలంచి యా ప్రతిభాతిశయంబు నీక్షించి “ప్రపేదిరే ప్రాక్తనజన్మ విద్యాః” (తొలిపుట్టుకయందలి చదువులు వచ్చి చేరినవి) యని నిశ్చయించుకొను చుండు వారలు. (అనఁగా బహుకాలము గడచినందున విస్మృతమైన నొక్కపని నొక్కరు గురుతుచేసినచో నంతయు నెట్టులు మనస్సుకు స్ఫురించునో యట్టులే పూర్వజన్మాభ్యస్తములగు సర్వశాస్త్రములు ఈ జన్మమునందు వినినంత మాత్రమున వీరికి గోచరించుచున్నవి యని యర్థము) ఇట్టు లందరకు నుండదుగాన నిది హేతువాదమునకు నిలువని యప్రమేయమైన శక్తి. ఆచార్యులవారియొక్క యిట్టి ప్రతిభాసంపద దిలకించి యాయా గురువు లాశ్చర్యావిష్టు లగుచుండెడివారలట.

ఇవ్విషయము నిప్పుడును కడు వృద్ధులై జీవించి యున్న యాచార్యులవారి గురువు లొక రిద్దరు సహాధ్యాయులును ప్రస్తావవశమునం జెప్పి వారి ప్రతిభ కాశ్చర్యము నొందుచుందురు.

లోకోత్తరమైన యింతటి యాశుగ్రహణధారణాస్ఫూర్తులు గలవారు గనుకనే యచిర కాలముననే యశేష శాస్త్రములం దలస్పర్శముగ జదివి నవద్వీపమునందు ప్రాచ్య పండిత మహాపరిషత్తులో నవద్వీపము యూనివర్సిటి వైస్‌ఛాన్సలరు అయిన విద్యార్ణవ శ్రీ సర్. అశుతోషు ముఖర్జీ గారు మున్నగు మహాశయులనుండి “విద్యావాచస్పతి” యను అనన్యలభ్యమైన మహాబిరుదమును సంపాదింపఁగలిగిరి.

ఈ ప్రకార మేకసంథాగ్రాహిత్వముతో అర్థలక్షణ సహితముగ చతుర్వేదములను, షడంగములను, షడ్దర్శనములను

1. ఇదియే వేదాధ్యయనసంప్రదాయము. ఇందు కృష్ణయజుర్వేదములో నందులోను తైత్తిరీయశాఖకు సంబంధించినభాగము ఒక్కటిమాత్రము స్వధర్మప్రకాశినీ సంపాదకులు శ్రీ కనుపర్తి మార్కండేయశర్మగారిచే ముద్రింపబడినది.

యౌవన మధ్యము లోపలనే గ్రహించి బహుగ్రంథ పఠనముచే చదువు నభివృద్ధిచేసికొని యనేక శిష్యులకుపదేశించి వృద్ధి లోనికిం దెచ్చిరి.

విద్యాభ్యాసము పూర్తిగావించిన కొలదిదినములకు తమ పదునెనిమిదవ సంవత్సరపు వయస్సున శాలమేని యను గ్రామమునం జరిగిన యాగమునందు సదస్యులుగ నెన్నుకొనంబడి యా యాగమును యథావిధిగ నిర్వర్తింపజేసిరి. వయస్సున పిన్నలైనను యాగము నామూలాంతము ప్రాయశ్చిత్తముచేయ పనిలేకుండనే సక్రమముగ నిర్వర్తింపంజేసిన యాచార్యులవారి పాండిత్యపాటవమునకుం గడు సంతసించి సోమయాజులవారు బుత్విక్కులు "ఆత్మావై పుత్రనామాఽసి" యనునట్లు శ్రీ రాఘవాచార్యులవారే యీ రామచంద్రాచార్యులవారుగ లోకమున వేదశాస్త్రముల నెలగొల్పుటకై క్రమ్మర నవతరించిరి యని పెక్కుగ గొనియాడి పెక్కుమర్యాదలు గావించిరి.

మఱియు నాసంవత్సరమే గంగాగోదావరీసదృశము లయిన సంస్కృతాంధ్రభారతములయం దఖండపాండిత్యము గల చెన్నపురిలోని శ్రీ గుఱ్ఱము ఆదినారాయణశెట్టిగారు శ్రీ మహాభారతమునందు రహస్యార్థముల నుపన్యసింపంజేసి శ్రీ యాచార్యులవారికి సువర్ణ ముక్తాఫలమయములైన కటక కుండలములను శ్రీ తాతా సీతారామయ్య శ్రేష్టిగారు లోకోత్తరమైన జ్యోతిషోపన్యాసకౌశలమును గాంచి సంతసించి గడియారమును సమర్పించిరి.

మఱియు విద్యార్ణవ నిష్ణాతులైన 4—5 సంవత్సరములలో ననంగ తమ 29 వ సంవత్సరపు ప్రాయమునందు 12—11—1919 తేదీన పూనాలో జరిగిన ఫస్టు ఓరియంటలు కాన్ఫరెన్సుకు డెలిగేటు (మద్రాసు ప్రతినిధి) గ వెళ్లి గొప్ప కీర్తిని పొందిరి.

వీరికి యిరువదవ సంవత్సరములో కలికివాయగ్రామములో విద్యాగురువులు మేనమామగారు నైన పూర్వోక్త శ్రీ రాఘవాచార్యులవారు తమ ప్రప్రథమ పుత్రిక శ్రీ రంగనాయకమ్మగారి నిచ్చి వివాహము గావించిరి. వివాహము జరిగిన నాలుగవ మాసమున 27—8—1907 నాడు బళ్లారి నగరమునందు సభ జరిగినది. అందు విద్యారణ్యభాష్యము ననుసరించి వేదార్థము నుపన్యసించి జయముగాంచి పండితప్రశంసాపత్రము (సర్టిఫికెట్) ను పొందిరి.

ఆస్థానపండితులుగం గుదురుట : నెల్లూరుజిల్లా, కావలి తాలూకాలోని ముత్యాలపాటిసంస్థానము రాజాగారైన శ్రీ రాజా శ్రీరంగభూపాలభాలేరావుగారికి ఒకప్పుడు 18 మహాపురాణములు, 18 ఉపపురాణములు, ఈ 36 గాక మఱియు 13 పురాణము లెక్కువగం గనుపించుచున్నవి. ఇన్ని పురాణములు పుట్టుటకు హేతువేమి ? ఒక్క వ్యక్తిచరిత్రయే బహుపురాణములయందు మార్పులతో నుండుటకు గతమేమి ? పురాణజ్యోతిశ్శాస్త్రములందు గోళవాదము పరస్పరభిన్నముగ నుండు కారణమేమి ? యను మున్నగు సందేహము లంకురించి పండితుల నెందరం బ్రశ్నించినను తగు సమాధానము లభింపకుండెను. అంత నొకప్పు డా సంస్థానాశ్రితులు మా తాత (పితామహులు) గారి శిష్యులైన బ్ర. శ్రీ. బండేపల్లి సుబ్బయ్యశాస్త్రులుగారు రాజాగారితో మా తండ్రిగారిం గురించి యిట్లు చెప్పిరి: "శ్రీ కాళహస్తి సంస్థానమునందు ఆస్థానపండితులుగ నుండిన శ్రీమాన్ కళత్తూరు నిక్రాలరాఘవాచార్యులవారు సర్వశాస్త్రముల నెఱింగిన గొప్పపండితులు. ముందు శ్రీ వేంకటగిరి రాజాగారు వేదశాస్త్రములమీఁద అప్రామాణ్యమును మోపి ప్రచురింపఁగా శ్రీ రాఘవాచార్యులవారు దానికి సమాధానముగా వేదప్రామాణ్యమును రచించి వినిపింప రాజాగారు చాలా సంతోషించి శ్రీ రాఘవాచార్యులవారి యభిప్రాయమే తమ యభిప్రాయమని, కలిలో కలుఁగు శాస్త్రములమీఁది యవిశ్వాసమును నిట్టి కారణజన్ములచేత నిరసింపఁ జేయుటకై ముందుగ నేనే అట్టి పనిని సలిపితినని తమ నిగూఢాభిప్రాయమునుఁ దెలిపిరి. ఆ రాఘవాచార్యులవారి యనంతర మిప్పుడు వారితో నెనయగు పాండిత్యముగలవారు వారి కుమారులు శ్రీ రామచంద్రాచార్యులవారు గలరు. వారు వయస్సున చిన్నవారైనను పాండిత్యమున కడు ప్రౌఢులు. సరస్వతీపురుషావతార మనఁదగినవారు. వారికి తెలియని శాస్త్రరహస్యము లేదు. మీప్రశ్నమునకు సమాధానముచెప్పఁ వా రొక్కరే సమర్థులు."

శ్రీ రాజాగా రందుకు సంతసించి మా తండ్రిగారిని తమకుఁ బరిచయ మొనర్పవలెనన శాస్త్రులుగారు కలికివాయకు వచ్చి మా తండ్రిగారికి సంగతి నెఱింగించి తమతోడ పెదపవనికిం బిలుచుకొని వెళ్లి రాజాగారికి పరిచయ మొనర్చిరి.

మరునాడు రాజాగారు తమ సందియముల నన్నిటినిం దెలుక నాచార్యులవారు తగువైన సమాధానములుం జెప్పి రాజాగారి యంతస్సునందలి సందేహ తమస్సును పోగొట్టి యానందచంద్రికను గలిగించిరి. అంత రాజాగా రాచార్యులవారిని తమ సంస్థానమునందు విద్వాంసులుగ నుండగోర నాచార్యులవా రందు కంగీకరించి యానాటినుండి ముత్యాలపాటి సంస్థానమున ప్రధాన విద్వాంసులై యొప్పిరి.

ఇట్లు సంస్థాన పండిత పదవి నొందు నాటికి ఆచార్యులవారు యిరువదియొక్క సంవత్సరముల వయస్సు గలవారై యుండిరి.

అష్టసిద్ధాంత తంత్రవేత్తా యను బిరుదము నొందుట :—పిదప 19—4—1902 నాడు నూజవీటి సంస్థానమునందు శ్రీ రాజాగారివలన అభ్యర్థనమును, సభయందు తత్సంస్థానపండితులు, అష్టసిద్ధాంత తంత్రవేత్త యను బిరుదాంచితులు నైన శ్రీ మొక్కపాటి బుచ్చన్నశాస్త్రుల వారివలన జ్యోతిష విద్యా వైదుష్య విశేషముం గని సంతోష ప్రశంసా పూర్వకముగ వారి బిరుదముతో సమానమైన "అష్టసిద్ధాంత తంత్రవేత్తా" యను బిరుదమును పట్టు లిఖితపూర్వకముగ నొంది సంస్థానమున కరుదెంచిరి.

1905 వ సం. రము జులై 12 వ తేదీనాడు చెన్నపురమున సాగ్నిచిత్యసర్వపృష్ఠ్యాప్తోర్యామాతిరాత్రయాగమును యజ్ఞము జరిగినది. అందు ప్రార్థితులయి సదస్యత్వమును వహించిరి.

* * * *

విద్యారణ్యపంచానన బిరుదము నొందుట :—ఆచార్యులవారు అనంతశయనము (త్రావెన్కూరు) గవర్నమెంటులో సభయందు "విద్యారణ్య పంచానన:" అను బిరుదమును మహారాజావారి గొప్ప సంభావనను పొంది యచట చాల ప్రశస్తిని గడించిరి.

విద్యా వాచస్పతి బిరుదము నొందుట:— 28–1–1922 ది నాడు కలకత్తాలో సెకండు ఓరియటల్ కాన్ఫరెన్సుజరిగింది. ఆచార్యులవా రందు డెలిగేటుగా వెళ్లి ఉపన్యాసములిచ్చి అందు రివర్ ట్రెఫ్సు గవర్నరు విందులో విచిత్ర దర్శనము మొదలు విశేష మర్యాదను పొందిరి.

వెంటనే ఫిబ్రవరి 12 వ తేదీనాడు నవద్వీపమునందు ప్రాచ్య మహావిద్వత్పరిషన్మండలి సమావేశ మైనది. అం దాచార్యులవారి యొక్క సర్వశాస్త్ర పారదృశ్యత్వమును కని యానందించి నిఖిల విద్వల్లోక చక్రవర్తియు, ప్రాచ్య పాశ్చాత్య విద్యాసాగర పారీణులు వంగీయోన్నతన్యాయస్థాన న్యాయాధీశులు శ్రీమచ్ఛాస్త్రవాచస్పతీత్యాద్యనేక బిరుదాలంకృతులు నగు బ్రహ్మశ్రీ ది అనరబుల్ జస్టిస్, సర్. ఆశ్ తోష్ ముఖర్జీ, సరస్వతీ సంబుద్ధాగమచక్రవర్తీ, శాస్త్రవాచస్పతి, విద్యార్ణవ, కె. టి. సి.; ఎఫ్. ఆర్ ఎం. ఎసి. ఎల్; డి. ఎస్. సి; పి. హెచ్. డి; ఎఫ్. ఆర్. డి. ఎస్; ఎఫ్. ఆర్. యస్; ఇ. ఎఫ్. ఎ. యస్. బి, ఇత్యాది వైస్ ఛాన్సలర్ కలకత్తా యూనివర్శిటీ, ప్రెసిడెంట్, నవద్వీప వంగవిబుధ జననీసభ గారు లోగడ నలువది సంవత్సరముల లోపల నిట్టి మహావిద్వాంసుని నేను దర్శించియుండలేదని సభాస్తారులగు నవద్వీప భట్టాచార్యులతో సహా ఆచార్యులవారియొక్క చతుర్వేద తదంగ పూర్వోత్తర మీమాంసాది సమస్త వైదిక వాఙ్మయ సర్వస్వవేతృత్వమును వేనోళ్ల నుగ్గడించి "విద్యా వాచస్పతి:" అను మహా బిరుదముచే నలంకరించి గౌరవించిరి. ఆచార్యులవారి యా గౌరవమును యావదాంధ్ర దేశగౌరవముగ నెంచి యప్పటి పత్రికలందు సంపాదకులు విశేషముగ తమ యభినందనములన ప్రకటించిరి.

ఆచార్యులవారు "కళానిధి" యను బిరుదమును పొందినవారు. ఈ విషయము వారి యుపన్యాస పత్రములు పత్రికలు వారి మిత్రుల ద్వారాను తెలియుచున్నది. కాని పట్టా (సర్టిఫికెట్టు) కనుపించక నది యెచ్చట ఎప్పుడు ఏ సందర్భములో నివ్వబడినదో ? తెలియ శక్యముగాక యున్నది.

1923 వ సంవత్సరంలో బాపట్ల దరిదాపుల నున్న నండూరు గ్రామములో ఆరవ యాంధ్ర సాహిత్య పరిషద్వార్షికోత్సవ సభ జరిగినది. అందు పారిషదులు "మహోపాధ్యాయ" బిరుద మొసంగి సత్కరించిరి.

ఆచార్యులవా రిప్పగిది ఐదు బిరుదముల నొందినవారైనను తరచుగా విద్యారణ్యపంచానన: విద్యా వాచస్పతి: అను రెండు బిరుదములే వారి గ్రంథములయందు—శ్రీ మహావిష్ణువు శంఖచక్ర గదా ఖడ్గ శార్ఙ్గము లనెడు పంచాయుధములు గల్గియున్నను తరచుగా శంఖచక్రములు రెండే యా దేవుని పాణిపద్మములయందువలె దర్శనీయము లగుచున్నవి.

వీరు విజ్ఞానభూములని చెప్పదగిన లండన్ వంటి మహాపట్టణముల విశ్వవిద్యాలయములలో జదివి అస్ట్రానమి (జ్యోతిష సిద్ధాంతము) యందు ఉత్తీర్ణులయిన దివాన్ బహదూర్ శ్రీ ఎల్. డి. స్వామికన్ను పిళ్లె ఐ. ఎస్. ఒ. గవర్నమెంట్ రివిన్యూ సెక్రటరీగారు వంటి విజ్ఞాన నిధులకు భూభ్రమణ వాదమునందు సునిశితములైన ఆక్షేపణముల తోటి సూర్యభ్రమణ సిద్ధాంతము నుపదేశించి దాని సత్తామహత్త్వముల చాటిన దిట్టలు. ఈ యుపన్యాసముల ద్వారా సంస్కృతసిద్ధాంతగ్రంథముల మహాత్త్వదుల నెరింగి శ్రీ పిళ్లెగారు మున్నగువారు వేడగా వారికి సూర్యబ్రహ్మాది పంచసిద్ధాంతములను భారతీయుల గణిత విశేషములను ప్రతిపాదించినవారు. మరియు శ్రీ పిళ్లగారు 1300 (పదమూడు వందల) యేండ్లకు ఎ. డి. 700 మొదలు 2000 వరకు పంచాంగములను (ఇండియన్ ఎఫిమెరీస్) ను గణించిరి. తద్రచనయందు శ్రీ యాచార్యులవారు పిళ్లగారికి తిథి, నక్షత్ర, తత్ప్రమాణ, శృంగోన్నతి, గ్రహయుతి, గ్రహణ, గ్రహాస్తోదయముల గణితములయందు చాలా సాహాయ్యము నొనరించిరి. ఆ విషయమందు తొలి యచ్చు ప్రిఫేసు 5 వ పుట మొదలు తెలియజేసి యున్నారు. అట్లు శ్రీ స్వామికన్నుపిళ్లగారికి ఎఫిమెరీసుగణితమునందు చాలా సాహాయ్యమొనరించుటయే గాక 84 ఆనంద సంవత్సరము మొదలు 18 సంవత్సరములు సిద్ధాంత పంచాంగములు నళ మొదలు 16 సంవత్సరములు వాక్య పంచాంగములను గణించిరి. అవి చెన్నపురిలో యానంద ముద్రశాల యందు ముద్రితము లగుచుండెడివి.

1917 వ సంవత్సరములో శ్రౌత గోష్ఠి వారికి చార్వాక జైన బౌద్ధులతో పెద్ద వాదము తటస్థించినది. అందు శ్రీ యాచార్యులవారు శ్రౌతగోష్ఠి వారి పక్షమున ప్రతిపక్షుల నెదుర్కొని వారి హేతు (సైన్సు) వాదములను సహేతుకముగను సప్రమాణముగను ఖండించి వారిచే శ్రౌత మతమును ఒప్పించి నందున నా శ్రౌతగోష్ఠివారు చాలా సంతోషించి యాచార్యుల వారిని "శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య" యను బిరుదమునకు మీ రొక్కరే తగుదురని ప్రశంసించి 1116 రూపాయలును బహుమానముగ నొసంగిరి. ఆ ధనమును మరికొంత ధనమును వారు ముద్రింపించ దలంచిన శ్రీ కృష్ణ యజుర్వేదముయొక్క వ్యాసభాష్యముద్రణమునకుగాను సాహాయ్యముగ వారికే యొసంగిరి. ఆచార్యులవారు వేదార్థము వేదాంతము, జ్యోతిషము, ధర్మశాస్త్రములు మున్నగు విషయములలో పలుమారు లుపన్యాసములు జెప్పినవి మద్రాస్, గుంటూరు బళ్లారి, నెల్లూరు, బెజవాడ, ధార్వాడ, కాశీ, కలకత్తా, నవ

ద్వీపము జళగావ్‌లోనగు స్థలములు మూడు వందలకు ఎక్కువగా పత్రికలయందు కనుపించుచున్నవి. వాటిలో ముఖ్యములైన వాటిని చాలామట్టుకు 1956 సం. లో శ్రీ వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రులవారు ప్రచురించిన మా తండ్రి గారి చరిత్రమునందు వ్రాసి ఉన్నాము. వ్యాస విస్తరభీతిచేత నిట వ్రాయ మానితిని.

శాస్త్రములయందు కనుగొన్న కొన్ని క్రొత్త రహస్యములు, రచనారీతులును : వీరు విద్యార్ణవతలస్పర్శము గావించి యనేక రహస్యరత్నముల నుద్ధరించి ప్రకాశింపజేసి యున్నారు. వాటియందు గొన్నిటి నిట నుట్టంకించుచున్నాడ.

1. వేదమునందు పదక్రమము లపౌరుషేయములు అని. వేదమునందు పదము క్రమము అని రెండు గలవు. వీటిని విద్వాంసులు పౌరుషము లందురు. ఆచార్యులవా రన్నన్ అవి పౌరుషేయములు కావు అని శాస్త్రముల నుంచి ప్రమాణములఁ జూపియున్నారు. 2. యాజుషహోత్రము హవిర్యజ్ఞములకు వికృతుల తోడ పూర్తిగ నున్నది యని. కల్ప (శ్రౌత) శాస్త్రసంబంధమైన యియ్యపూర్వ రహస్యము హోత్ర నిర్ణయము యాజుష హోత్రదర్పణము అని సంస్కృతభాషను రెండు గ్రంథములుగ బుట్టి కుంభకోణములో సలక్షణ ఘనపాఠి మీమాంసాద్వయవేది శ్రౌతస్మార్త విశారదులునైన శ్రీ అగ్నిహోత్రం తాతదేశిక తాతాచార్యులువారు, కాశీలు మహా మహోపాధ్యాయ మహా మహోధ్యాపక విద్యా తిలక భట్టపల్లీయ శ్రీ పంచానన తర్కరత్న భట్టాచార్యులువారు లోనుగాగల సుప్రసిద్ధ మహావిద్వాంసుల నాశ్చర్యపూరితుల గావించి "... అన్యద ప్యత్ర వక్తవ్యం భవతి। యావన్తి తతచ్ఛాఖానుబన్ధీని కల్ప సూత్రాణి ఇదానీం పత్యమానాని తాని సర్వాణ్యపి అత్ర ప్రమాణీకృతా నీత్యయం విషయః విశిష్య సర్వైరపి వైదికై రవ గంతవ్య ఇతి మన్యా మహేచ వయం ఏతఏవ నూన మనూచానపద వాచ్యతా మర్హన్తీతి. అంగాధ్యాయ్యనూచాన ఇతిహి మహర్షయః స్మరన్తి। ఇందంపరం తత్రానుశోచామి। నామ్నా ప్యనాఘ్రాత కల్ప సూత్రాది గ్రంథ పండిత కులభూయిష్ఠే పాపీయసి కలౌ శ్రుతి కల్పసూత్ర మీమాంసాది ప్రమాణ క్షుణ్ణం అతఏవాతి గహన మిమం గ్రంథం చావలోక్య సారాసార వివేచన చతురః అపినామ కశ్చనాధికారీ స్యాదితి। కింబహునా సర్వథా సర్వతోఽయం గ్రంథః అతిమనోహర ఇత్యేవ సాంప్రతం మన్యామహే ..." "... ఏత దను సారేణ కర్మ నిర్వాహే కర్మణ స్సాఫల్యం నవేత్యత్ర సాక్షాత్కృత ధర్మాణో మహర్షయ ఏవప్రమాణం। వయంచాస్య నిబన్ధస్య యుక్తిమత్తాం స్వీకృత్య నిబంధుర్వై దుష్యే చాత్మనః ప్రీతిం ప్రకాశయామః పరైరపరిశీలితం పంథాన మిమ మాలోక్య వేదవిదోఽపి తుష్యేయురితీమ మాశంసేతి ...." ఇత్యాది బహు ప్రశంసలకు పాత్రమై యొప్పినది. జ్యోతిషమునందు— 3. ముహూర్తము జాతకాధీన ఫలమునే యిచ్చునది. 4. మధ్య గ్రహములచే జాతకలేఖన మొకప్పుడుండెను. 5. బుధ శుక్రులు సూర్యుని చుట్టుఁ దిరుగుదురు అనునవి మొదలగునవి. గణితమునందు—6. సౌరమానము (అరవనెల) చాంద్రమానము (తెలుగు నెల) హోణము (క్రీస్తుశకము) తురుష్కము (హిజరీ) అనుమానములలో నొకదాని నుంచి మఱియన్నింటిని కనుగొనుటకు తీరును క్రొత్తగ గనిపెట్టి ప్రతిపాదించి యున్నారు. ఇది తొలుత సంస్కృత భాషలో శ్లోకములు గాను, తెలుగులో వచనముగాను "మానాంతర బోధము" అను పేరుతో రచితమై పూర్వోక్తులైన శ్రీ పిళ్లెగారి వంటి గణితవిద్యా పారంగతులకు బోధింపబడి ప్రపంచమందంతటను వ్యాప్తికి రాఁదగినదని "డేట్ కాల్క్యులేటర్" అను పేర ఇంగ్లీషులో ననువాదము నొంది ముద్రితమై ప్రచుర ప్రచారము నందియున్నది. మఱియు 7. నొకయేటి పంచాంగమును బట్టి దానికి ముందు వెనుకల యేండ్ల పంచాంగముల యందలి తిథి వారాదిచారముల నెఱుంగుటకును నొక మార్గమును కనిపెట్టి దానిని "చిత్ర పంచాంగ" మను పేరుతో గ్రంథముగ రచియించిరి. రామాయణ, భారతములలో—8. లోకములో రాముఁడు మాటున దాగి వాలిని వధించెనని చెప్పెదరు. ఆచార్యులవారు రాము డెదురుగ నిలుచొని తెలిపియే వాలిని వధించెనని సిద్ధాంతము చేసియున్నారు. ఇది "వాలి వధ విచార" మను పేరుతో నాంధ్రములో నుపన్యాస గ్రంథముగ రచించిరి. 9. రాముని సేనయైన హనుమజ్జాంబవదాదులకు రామాయణమునందు కపి భల్లూకాది శబ్దములు ప్రయుక్తములై యుండుటనుఁ గాంచి అందరు వారిని వానరులని తలంచుచున్నారు. ఈ భ్రమను మాన్పి, వారు కోతులు కారు, మానవులేనని క్రొత్తగా రహస్యమును కనుగొని దీనిని తెనుగులో "వానరజాతి నిరూపణము" ను గ్రంథముగ నొనర్చిరి. 10. రామ, రావణుల యొక్క సైన్యము అనేక కోట్ల సంఖ్య గలది యని పండితులు సైతము రామాయణము నుడువు నప్పుడు చెప్పెదరు. రామాయణములోని యా సంఖ్యల కంతయు సరియైన యర్థమును సాధించి సంస్కృతములో గ్రంథము రచించియున్నారు. అది "వానర రాక్షస సంఖ్యానము" అనునది. అట్లే, 11. రాముని యాయుర్దాయము వందల ఏండ్లని చెప్పుచుండ, కాదు డెబ్బది సంవత్సరములు మాత్రమే యని తేల్చి "రామాయుర్దాయ నిర్ణయ" మని సంస్కృతములో గ్రంథము నొనర్చిరి. 12. శ్రీరాముడు చైత్రశుద్ధ నవమినా డవతరించెనని మాత్రము లోకము గుర్తెరింగి యున్నది. కాని అది ఏ మన్వంతములో, నే యుగములో, నెప్పుడో తేల్చినారు. ఇంకను రామాయణమునందు జెప్పిన రామ జాతకవిషయములో గణిత జ్యోతిషముల నేర్పరులైన వారికి తెలియదగిన గొప్ప యాక్షేపము కలదు. జ్యోతిష, గణిత సంబంధమైన దానిని యెత్తి తెలిపి బహు చమత్కారముగ సమాధానము దెలిపిరి. దీనిని సంస్కృతాంధ్రములలో "రామావతార సమయ నిర్ణయము" అను పేరుతో నుపన్యాస గ్రంథముగ రచించిరి. 13. రావణునికి పది తలలు, ఇరువది చేతులు లేవు. ఒక్కటే తల, రెండే చేతులు అని సిద్ధాంత మొనర్చి "రావణ శిరస్సంఖ్యాన" మను గ్రంథమును నిర్మించిరి. ఇవి యన్నియు రామాయణములో వీరు కనిపెట్టిన క్రొత్త యంశములు.

ఇవి యన్నియు బలు తావుల పలుమారు లుపన్యసించబడి గ్రంథములుగ రచితములై యున్నవి. 14. ఇంకను శ్రీమద్రామా

యణములో విరుద్ధముగ ప్రచారములై యుండెడు "రామ పట్టాభిషేక ముహూర్త నిర్ణేత" రామాయణ మార్గదూరము, రామ వనవాసాద్యంత తిథి మొదలుగా గల పెక్కు అంశములలో వాస్తవార్థములకు ప్రమాణములు దెలిపియున్నారు. అవి "శ్రీ రామాయణ విరుద్ధార్థ భంజక ప్రమాణాని" యను పేరుగల "శ్రీ రామాయణ రహస్యాని" యను ప్రమాణసంపుటి గ్రంథము. భారతమునందు 15. అక్షరిత అజన్మ బ్రహ్మచారి యని యను కొనబడుచుండు భీష్మునకు పెక్కు వివాహములు జరిగినట్లు సమర్థించినారు. ఇదియే "భీష్మబ్రహ్మ నిరూపణ" మను గ్రంథము. ఇంకను చారిత్రకముగా 16. భోజరాజు కవుల కిచ్చిన అక్షర లక్షలలోని రహస్యార్థము. 17. మేల్కోటలో దేవాలయ చండాల ప్రవేశము భగవద్రామానుజుల కాలములో జరుపబడినది కాదు, మున్నగునవి కలవు.

ఇంకను వివిధ శాస్త్రములయందును వీరు కనిపెట్టిన రహస్యములు చాల గలవు. వాటి నన్నింటిని వీరి జీవిత చరిత్రమును సమగ్రముగ వ్రాయునప్పుడు తెలుపగలను.

ఇట్లు సారస్వత మహార్ణవ తలస్పర్శము గావించి రహస్య రత్నములం గ్రహించుటయేగాక శాస్త్రములందు నూతన రచనా మార్గములను కనిపెట్టి యున్నారు. ఈ నూతన రచనతోఁ బ్రణీతమైన గ్రంథము వేదాంత రాద్ధాంత మను నది. దీనికే వేదాంతం జడ్జిమెంట్ అని మరియొక పేరు.

ఇయ్యది వేదాంత శాస్త్రమునందు వాది (ప్లెంటిఫ్) ప్రతివాది (డిఫెండెంటు) దావా సొత్తు (సూట్ ఆఫ్ ప్రాపర్టీ) న్యాయవాదులు (వక్కీలు) న్యాయస్థానము (కోర్టు) ప్రాడ్వివాకుడు (జడ్జి) హియరింగు సాక్షులు ఆన్సరు, పిటీషన్‌దార్లు మున్నగువానిం గల్పించి వ్యవహార ప్రక్రియతో రచింపంబడిన యద్భుతమైన గ్రంథము. పూర్వము కృష్ణమిశ్రులు, వేదాంత దేశికులు మున్నగువారు వేదాంతములు పాత్రములను కల్పించి ప్రదర్శన యోగ్యమగు నాటకముగ రచించినట్లు వీరు వేదాస్త్రమును కేవల లౌకికబోధకొరకు ఆస్తి విషయక వ్యవహార ప్రక్రియగ మార్చి నవీనుల కతి సులభముగ నుండునట్లు రచించియున్నారు. దీనిని వారు తొలుత భూప్రదక్షిణ మొనర్చునప్పుడు రాజమన్నారు కోవిలయం దొక ప్రైవేటు ప్లీడరు బోధ కొరకు తామా రచన గనిపెట్టి శాస్త్రము నుపదేశించిరి. ఈ సంగతినందు, ముందు బొందుపరచి యున్నారు. దీనిని మొదట ఆ దేశభాషయైన యరవములో జెప్పి యాయనకు రచించి యిచ్చి, స్వభాషయగు ఆంధ్రము లోను రచించి యున్నారు.

గ్రంథరచన :—వీరు సర్వ శాస్త్రములయందు నూతనముగ రహస్యములను కనుగొని రచించినవి. అప్పుడప్పుడు పండిత సభలలో చర్చకు వచ్చుచుండు జ్యోతిష ధర్మశాస్త్రాది వివిధ విషయములలో రచియించినవియు గ్రంథములు మొత్తము 89 గలవు. ఆ గ్రంథముల పేర్లను పట్టికయందు వ్రాయ నెంచి వాటిలో గొన్నిటిలోని విషయ సంగ్రహమును పాఠక పరిచయార్థ మిట వ్రాయుచున్నాడ.

1. త్రేతాకాండ మంత్రభాష్యము—ఋషుల ముఖ్యములైన మంత్రములను సూత్రములయందే తెలిపెదరు. సూత్ర వ్యాఖ్యాతలు తమకు మంత్రభాష్యముద్దేశ్యము గాదనియు, వేదభాష్య కర్తలు తా ముద్దేశించిన భాగమున లేవనియు నా మంత్రములకు భాష్యమును వ్రాయరైరి. అవి వీరి వరకు వ్యాఖ్యానము లేకయుండెను. ఆ మంత్రముల కన్నింటికి వీరు చక్కని భాష్యమును రచించిరి. ఇది యా భాష్యము. 2, 3 సర్వ వేద సంప్రదాయములు. సర్వసూత్ర సంప్రదాయములు— ఈ రెండు గ్రంథములు అనేక వేదములుగను, అనేక సూత్రములుగను నుండుటకు హేతువులు మున్నగు నంశములను చక్కగ బోధించునవి. 4. ప్రాస్తావిక శ్రుతి సంకలనము. ఇది సుభాషితరత్న భాండాగారము వలె పెక్కు ప్రకరణముల నేర్పరచి ప్రస్తావోచితములైన శ్రుతివాక్యముల నన్నింటిని యేర్చి కూర్చి యా కరప్రదర్శనముతోటి రచించిన గ్రంథము. 5, 6. ఆపస్తంబ్యాదిషట్శాఖా నిరూపణము. తైత్తిరీయ శాఖా స్వరూప నిరూపణము. ఈ రెండు గ్రంథములలో తొలిదాని యందు ఆపస్తంబ మహర్షి బోధాయన మహర్షి మున్నుగా గల ఆర్గురు రచియించిన కృష్ణ యజుశ్శాఖ యొక్క కల్పసూత్ర షట్కములోని విశేషములను వివరించియున్నారు. రెండవ దాని యందు తైత్తిరీయ శాఖయొక్క స్వరూప స్థిత్యాదుల బ్రతిపాదించిరి. 7. స్వరోచ్చారణ వైఖరి. దీనిలో ఉదాత్తాది స్వరములను గురించి జ్ఞేయములైన యంశములను వివరించినారు. ఇది శిక్షాశాస్త్రము. శ్లోకరూపము. 8, 9. అనువాక నిర్ణయము, ఆపస్తంబాశయము మొదలుగా గలవి. ఇంకను ననేకములైన వైదిక గ్రంథములు గలవు. ధర్మశాస్త్రములో—వీరి తండ్రి గారు కొన్ని యంశములమీద కొన్ని యాక్షేపములు రాగా వాటిని ఖండించుచు "ధర్మనిర్ణయ" మను సంస్కృత గ్రంథమును రచించినారు. దీనికి వీరు విపులమైన వ్యాఖ్యానమును సంస్కృతముతో రచించినారు. అది 10. ధర్మనిర్ణయ టిప్పణి యనునది. మరియు శ్రౌతమునందు, గృహ్యమునందు, ఆగమము నందును శాస్త్రోక్తములు గాని కొన్ని యాచారము లెట్లులో పుట్టి సర్వత్ర పండితులచేతను ననుష్ఠితము లగుచున్నవి. వాటిలో నే శాస్త్రములో నేది ఏ దేశమున వాడుకలో నున్నదియు దెలుపుచు 11. "అశాస్త్రీయాచార పరిగణనము" అను గ్రంథమును సంస్కృత భాషలో రచించిరి. పాంచరాత్రములో పాద్మసంహిత యందలి చర్యాపాదమునకు సర్వ సుబోధముగ ప్రయోగమును రచించి వారు. ఇది 12. పాద్మచర్యాపాదప్రయోగమని పేరు గలది. 13 జ్యోతిర్దశానిర్ణయః— జ్యోతిషము జాతక స్కంధములో దశాదుల సాధనమునకు సులభ మార్గములు. దశలనేమానములతో చూడవలసినదియు మున్నగు విషయముల నిందు విశదముగ తెలిపియున్నారు. శ్లోకరూపమైన గ్రంథము. 14. సంఖ్యాను శాసనము—జ్యోతిషములోను, ఛందశ్శాస్త్రములోను 0—1—2— మొదలగు సంఖ్యలకు బదులు ఖ భూ. దృక్ మొదలగు శబ్దములను తరచుగా వాడుదురు. అందుకు కారణములు వాటి పర్యాయ పదములు.

వాటిమీద శాస్త్రాంతరములతో గలుగు విరోధములు, సమాధానములు. సంఖ్యల ఉత్పత్తి మున్నగునవి వివరింపబడినవి. ఇది. అతి విస్తృతమైన వాక్యరూపగ్రంథము సంస్కృతము. 15. గ్రహాదర్శ వ్యాఖ్యానము — ఆచార్యులవారి తండ్రిగారు శ్రీమాన్ రాఘవాచార్యులవారు పంచాంగ రచనకుఁ బ్రాచీన గ్రంథముల కన్నను నత్యంత సులభమైన లఘు (గణిత) మార్గమును కనిపెట్టి సంస్కృత భాషలో శ్లోకరూపముగ గ్రంథమును రచించియున్నారు. దానికి శ్రీ ఆచార్యులవారు తెలుగులో సులభమైన భాషతో అర్థమును ఉపపత్తి నిందు వ్రాసినారు. 16. మాన నిర్ణయము—అతి విస్తృతమైన ఈ గ్రంథమునందు వివిధ ప్రాంతములలో వివిధముగ నుండు భూమానము (భూమి కొలతలు), ధాన్యమానము, తూనికలు మున్నగు ద్రవ్య మానముల ముందు వివరించి, పిమ్మట నిమేషాద్యంతమైన కాలములో సంవత్సరములు, యుగములు లోనగునవి. 60, 4 మున్నగు నియత సంఖ్యలు గలిగియుండుటకు ఉపపత్తులును తత్కాలోచిత దైవపితృకార్యానుష్ఠానములు సందేహ పరిహార పూర్వకముగ ప్రతిపాదితములై యున్నవి. ఇంకను భూగోళ ఖగోళములలోని విశేషములు, గణిత విశేషములు విశదముగ నిందు ఉపన్యస్తములై యున్నవి. ఇంకను పఙ్క్తి తెలిపెడు పథకము. ఆయ గణిత సూక్ష్మపద్ధతి లోన గాగల గణిత గ్రంథములను నిర్మించి యున్నారు. 19. కల్పసూత్ర సంగ్రహము :—ఇందు ద్వైహికారాధన ప్రతిపాదకములయిన ఆపస్తంబాది శ్రౌత సూత్రములకు దైవికారాధన ప్రతిపాదకములైన పాంచరాత్ర వైఖానసాద్యాగమములకు నుండు భేద సామ్యాది విశేషములు అన్నియు సమగ్రముగ బ్రతిపాదితము లైనవి. 20. గోత్ర ప్రవర సంగ్రహము—గోత్రములయు, ప్రవరములయు లక్షణములు, సంఖ్యలు, భేదములు, ప్రవరభ్రంశములు, తత్స్వరూప యథార్థ్యములు లోనగు నంశములను కూలంకషముగ చర్చించిన గ్రంథము. ఆంధ్రము, మాహాత్మ్య సంగ్రహము:—వీరు సభల నుపన్యసించుటకై యొండె యజ్ఞ యాగముల ఆర్త్విజ్య సదస్యత్వముల నిర్వహించుటకై యొండె పుణ్యక్షేత్ర తీర్థ సందర్శనార్థమై యొండె ముమ్మారు 1 భూప్రదక్షిణము జేసిరి. సకల దేశముల యందలి పుణ్యతీర్థములం గ్రుంకి గొప్ప దేవాలయములను వివిధ దృశ్యములను చూచి యాచార వ్యవహారముల చక్కగ నెరిగి యార్యభూమి యందంతటను పండితులయందు, నధికారులయందును మహా ఖ్యాతి నొంది,

"యస్తు పర్యట తే దేశాన్యస్తు సేవేత పండితాన్
తస్య విస్తారితా బుద్ధి స్తైల బిందు రివాంభసి."

యను నుడికి దార్కాణమై యొప్పిరి. తాము యాత్ర సలుపు నప్పుడు యాత్ర చేయువారికిఁ గాని యేది యెచ్చట నున్నది కనుగొని యానందించువారికి గాని యుపయోగార్థ మొండు గ్రంథము ఆంధ్రములో రచించిరి. అది విష్ణు క్షేత్రములను, శివక్షేత్రములను, శక్తి క్షేత్రములను ఋష్యాశ్రమములను, పర్వతములను, అందలి విశేషములను తీర్థములను, వాటి ప్రెసిడెన్సి, జిల్లా, తాలూకాలు, రైలు, బండ్లు మున్నగు వివిధములైన ప్రయాణ సౌకర్యములు, త్రోవలు, దూరములు దిశలు లోనగు వాటిని తెలుపుచు నారుభాగముల నలరారి యున్నది. అందు వైష్ణవక్షేత్ర బోధినియైన 21. దివ్యదేశ మార్గదర్శిని యను ఒక్క భాగ మానంద ముద్రాశాల నచ్చయి ప్రచారము నందియున్నది. కడమ అయిదు భాగములు అచ్చు కెదురు చూచుచున్నవి. మరియు వివిధ దేశములయందలి పౌరాణిక మాహాత్మ్యములు, లౌకిక విశేషములు మున్నగు విశేషాంశములను 22. "మాహాత్మ్య సంగ్రహ" మనెడి గ్రంథమునందు విపులముగ నుపన్యాసములతో దెలిపి యున్నారు. ఆ గ్రంథము ఐతిహాసిక నైరుక్తిక సంప్రదాయముల ననుసరించి వ్రాయబడి నందున ప్రాచీన, నవీన మార్గానుయాయులకు మనోరంజకమైనది. 23. వివాహ విధి:— ఇందులో బ్రహ్మాది మున్నుగా గల వివిధములయిన వివాహముల లక్షణములు తత్తద్ధర్మ జాతులు దొంగపెండ్లి మున్నగు సర్వ విషయములు పెండ్లిండ్లకు సంబంధించినవి విరివిగ నుపన్యస్తము లైనవి. ఆంధ్ర వచనము. 24. జనక జీవిత చరిత్రము :—విస్తృతమైన దీనిలో తమ తండ్రిగారి యొక్క జన్మాది నిర్యాణాంతము గల సమస్త చరిత్రమును వ్రాసియున్నారు. ఇంకను తరిగొండ వేంగమాంబా విజయము మున్నగా గలవి పెక్కులు గలవు. అన్నిటిని వెనుక పట్టికలో దెలిపెదను.

ఇట్లు వీరిచే రచితములగు గ్రంథములు 89 (ఎనుబది తొమ్మిది) గలవు. ఇట్లు లాచార్యులవారు రచియించిన గ్రంథములలో గొన్ని "స్వచికీర్షిత గ్రంథశేషరచనా యోజనాత్మజః" యని తాము రాఘవాష్టోత్తర శతనామ స్తోత్రమును తమ తండ్రిగారి స్తోత్రములో నుడివినట్లు 1. తమ తండ్రిగారు పరమపదము వేంచేయు నాటికి వారు రచియింప దలచినవి. 2. తాము శాస్త్రముల తరచి తరచి స్వయముగ గనిపెట్టిన రహస్యములు భీష్మ వివాహము వాలి వధ సక్రమము అను మున్నగునవి 3. విద్వత్సభల నప్పు డప్పుడు జ్యోతిషధర్మశాస్త్రాద్యంశములకు సంబంధించినవి, వివాహకాల నిర్ణయాదులు. 4. తాము సమీపమున లేనియపుడు శిష్యులు చదువుకొనుటకుగాను రచించినవి. ఈ నాలుగు కారణములచేతను ఆచార్యులవా రిన్ని గ్రంథములు

---

1. తూర్పు దక్షిణము పడమరలయందు సముద్రములును, ఉత్తరమున హిమాచలములోని టిబెట్టును హద్దుగా గల్గి అనేకములగు కాశ్మీర, నేపాళాది దర్శనీయ దేశములకు, గంగాది పుణ్యతీర్థములకు మునీంద్రుల ఆశ్రమములకు స్వయంవ్యక్త దైవతార్చములైన అనేక హరిహర దేవతాయతనములకు దేవతా స్వరూపములైన పర్వతములకు నెలవైన భారతభూమిని చుట్టి తిరుగుట భూప్రదక్షిణము. పరశురాముని భూప్రదక్షిణమును ఇట్టిది యని శాస్త్ర పర్యాలోచనచే తెలియు నంశము.

రచించి శిష్యుల కుపదేశించి సభల నుపన్యసించి కొన్నింటి నచ్చు వేయించియు విద్వల్లోక విదితములుగ నొనర్చి యున్నారు. పీ రేయే విషయములను స్వయముగ గనుంగొని రచించినదియు, అప్పుడప్పుడు సభలయందు చర్చకు వచ్చెడి జ్యోతిష ధర్మశాస్త్రాద్యంశములలో రచించినవియు, శిష్య పుత్ర పత్రార్థము రచించినవియు వేర్వేరుగ సమగ్ర చరిత్రమునందు ప్రతిపాదితము లయ్యెడిని.

పూర్వము "సర్వజ్ఞత్వం రత్నముక్తాకలాపే" యని రత్నముక్తా కలాప రచనచేత శ్రీ వేదాంత దేశికులవారి సర్వజ్ఞత్వము ప్రకాశమైనట్లుల యాచార్యులవారి సర్వశాస్త్ర పారంగమత్వము వారి ప్రతిరచనచేతను పూర్వము సభల యందు వారి యుపన్యాసములచేత బాగా ప్రకటముగు చుండును. మరియు శ్రీ స్వామి కన్నుపిళ్ళై గారికి సూర్య సిద్ధాంతము, బ్రహ్మ సిద్ధాంతము మున్నుగా గల అన్య సిద్ధాంతములను తమ తండ్రిగారి గ్రహోదర్శమును తమ మానాంతర బోధమును వాసనా (సైన్సు) సహితముగ నుపదేశించి వారు ఇంగ్లీషులోని కనువదించుటకుగాను అడిగినందున ఆయుష్మ సిద్ధాంత గ్రంథములను ఆంధ్రములోని కనువదించి యిచ్చిరి. వీరీ ప్రకారము సంస్కృతములో, నాంధ్రములో గూడ నన్ని శాస్త్రములలో సులభమైన శైలిలో సర్వ సుబోధకములగు గ్రంథములను రచియించి యిరు భాషలలోను సారస్వతమున కపారమైన సేవ సలిపి విద్వన్నుతులైరి.

ప్రభుత్వ సంస్థలలో ప్రవేశము

ఆచార్యవా రిప్పగిది విద్యా సంస్థల యందు మాత్రమే కాక ప్రభుత్వ సంస్థల యందును ప్రవేశము నొందియుండిరి. అందు గొన్నిటి నిట నుట్టంకించుచున్నాడు.

వీరు 1904 వ సంవత్సరమున వంగోలు తాలూకా బోర్డు మెంబరుగాను, 1905 వ సంవత్సరమున దానితో బాటు కందుకూరు తాలూకా బోర్డు మెంబరుగాను, మరల 1907 వ సంవత్సరముననను, వెండియు 1911 వ సంవత్సరముననను, మొత్తము తొమ్మిది సంవత్సరములు కందుకూరు తాలూకా బోర్డు మెంబరుగాను, 1904 వ సంవత్సరము మొదలు 1913 వ సంవత్సరము అనగా తొమ్మిది సంవత్సరములు నెల్లూరు డిస్ట్రిక్టు బోర్డు మెంబరుగాను ఉండిరి. (విశేషములను పూర్వోక్తమైన త్రిలింగ పత్రికలో దెలిపి యున్నాము.) వీరు బోర్డు మెంబరుగ నున్నప్పుడు వంగోలు తాలూకా నెల్లూరు జిల్లాలో చేరియుండెను. 2, 3 రోడ్లు కలయు చోటనే రోడ్డు ఏ గ్రామమునకు బోవునదియు, నెన్ని మైళ్ళు ఉండుననియు దెలుపు పలకల (బోర్డుల) ను వేయించినది యాచార్యులవారే. 1911 వ సంవత్సరము ఆగస్టు 20 వ తేదీన సౌత్ ఇండియన్ అసోసియేషను మెంబరుషిప్పు వీరికి లభించింది. 1912 వ సంవత్సరము ఆగస్టులో మదరాసు పచ్చయప్ప కాలేజీలో ప్రెసిడెంట్ అధికారము నొందిరి.

సమాజమును, పాఠశాలను నెలగొలుపుట—శ్రీమాన్ ఆచార్యులవారు 31—5—1912 నాడు శ్రీ శింగరాయ కొండయందు జ్యోతిషాయుర్వేద సాహిత్య విద్వాన్ శ్రీమాన్ పర్ణశాల కొండమాచార్యులవారి పుత్రుల వివాహ సందర్భమున గూడిన తమ బంధుగుల బృందమునకు సంఘముచే చేకూరు ఉపకారములను చెప్పి యచట శ్రీవైష్ణవ సమాజమును నెలగొల్పిరి. పిదప ద్వారక తిరుమల మున్నగు పెక్కు క్షేత్రములలోను ఈ సమాజమున కనుబంధములుగ సమాజములను స్థాపించిరి. ఇట్లు ఈ సమాజకల్పతరువు శాఖోపశాఖలతో నానా దిగంతముల నావరించి వర్ధిల్లినది. సమాజమును నెలగొల్పిన వారము లోపల సింగరాయకొండ యందే కళానిధి యను పాఠశాలను ప్రారంభించిరి. కాని యది కొంతకాలము జరిగిన పిమ్మట "మతాంతర విద్యార్థులను కూడ పాఠశాలయందు జేర్చి చదువు చెప్పవలయు" ననెడి శ్రీ యాచార్యులవారి యభిప్రాయము, "మతాంతరులను చేర్చరాదనెడి యా సంస్థ యందలి అందరి సభ్యులయొక్క యభిప్రాయమునకు భిన్నమై యాచార్యులవారా సంస్థనుంచి చాలించుకొనిరి. అందుచే నా పాఠశాల యనాయకమై అగిపోయినది.

భగవత్కైంకర్యము :—వీరికి పెక్కు తావుల స్థిర చరాస్తులను గూర్చి బంధువులతో వీరి పినతండ్రిగారు పెద్ద వ్యవహారములు జరుపుచుండిరి. వారి వెనుక క్రమముగ నన్ని వ్యవహారములను వీరు జయించి ఆస్తులను స్వాధీన మొనర్చుకొనిరి. ఆ సంతోషముతో 1929—3—25 ది 84 శ్రీ విభవ సం. ఫాల్గుణ పూర్ణిమ సోమవారమునాడు శింగరాయకొండలో వేంచేసియుండు శ్రీ భూవరాహస్వామి వారికి సువర్ణమయమగు వక్షస్థల లక్ష్మిని వాది వారి యుత్సవ మూర్తులకు రజతమయములైన శ్రీపాదములను గొప్ప చెమికీ పని చేసిన కవచము (కపాయి) వైరముడియు, వారి ఉభయ దేవులకు కొండెలు శ్రీ భూదేవికి జడసాదు మున్నగు ఆభరణములను ఆళ్వారాచార్యులతో సహ అందరకు సరిగపనిచేసిన మంచి పట్టు వస్త్రములను సమర్పించి శ్రీ లక్ష్మీ కళ్యాణోత్సవమును బహువైభవముగ జరిపించిరి.

గృహభాండాగార ప్రతిష్ఠ :— వీరు నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకాలోని కలికివాయ అగ్రహారమునందు 124 అంకణములు పరిమితి గల సౌధమును నిర్మించి యందు స్వంత ఉపయోగార్థము గొప్ప గ్రంథశాలను నెలగొల్పిరి. దాని పేరు "సరస్వతి పుస్తక భాండాగార" మని యిడిరి. ఈ కలికివాయ గ్రామము పూర్వము అశేష విద్యా శేషాహి నిర్విశేషులు వివాద నిర్ణీత నిగూఢ చరణులు నని ప్రశస్తి నొందిన శ్రీమాన్ విక్రాల శేషాచార్యులవారు మున్నగు మహనీయులకు నివాసమై యాసేతు సీతాచలము "కలికివాయ

గ్రామము కవిపండితారామము" అని పొందిన ప్రశస్తి లతను నీ యాచార్యులవారు కాశ్మీర, నేపాల దేశములయందు సైతము వ్యాపింపజేసిరి.

తమకు మున్ను ఇరువదినాల్గవ పురుషులు శ్రీ భగవద్రామానుజాచార్యులవారి యంతేవాసులు నొక్క కారణముచే వారివల్లనే "విశ్వకాలః" అని స్వవంశమున కంతయు చిహ్నమై యొప్పిన నామధేయము నొందినవారు నైన శ్రీమాన్ విశ్వకాల నరసింహాచార్యులవారు మొదలుకొని యరువది నల్గురు మహా విద్వత్కవుల యవతారములచే "విశ్వకాల వంశము, విద్యావతంసము" అని యీ వంశమునకు గలిగిన ప్రశంసను శత గుణితము కావించిరి. ఈ యరువదినాలుగు మంది పండిత కవుల చరిత్రములను విశ్వకాల వంశచరిత్రమునందు చదువ దగును.

ఈ యాచార్యులవా రెల్లప్పుడు వివిధ శాస్త్రములం దరచి యపూర్వములైన భీష్మ వివాహాది బహు రహస్యములం గనుంగొనుటను, వివిధ శాస్త్రాంశములను అనేక విద్వత్పరిషత్తుల నుపన్యసించుటలను, యాగములందు ఆర్త్విజ్య సదస్యత్వములను నిర్వహించుటను, రాజకీయ సంస్థలయందు ప్రవేశము నొందుటను, అనేక వ్యవహారముల నెదుర్కొని విజయము గాంచుటను, అనేక విద్యార్థుల కెల్లప్పుడు విద్యాదానము సలుపుటను, పలుమరు యావద్భారతదేశ యాత్రల నొనర్చుటను, లోకోత్తరమైన వైదిక, లౌకిక ప్రతిభా సంపదం గాంచిన విద్వాంసులు.

"యద్య ద్విభూతిమత్సత్వం శ్రీమ దూర్జిత మేవ వా
తత్తదేవావగచ్ఛత్వం మమతేజోంశ సంభవం." గీత

అను ప్రమాణముచే వీరు పరమాత్మ యొక్క జ్ఞాన ప్రకాశకమైన యవతార విశేషమని నుడువుచుందురు.

నిర్యాణము :—వీరి లీలా విభూతి యందు 53 సంవత్సరములు వెంచేసియుండ 84 అంగిరస చైత్ర శుక్ల ద్వితీయ (విదియ) గురువాసరము అశ్వినీ నక్షత్రము (తే 1932–4–7) మధ్యాహ్నము ఒంటిగంట సమయమునం దీ లీలా విభూతిని వదలి నిత్య విభూతిని (పరమపదమును) చేరిరి.

ఇందులో వీ రుపన్యసించిన సభలు, సంస్థానములలో పొందిన బహుమానములు మున్నగు పెక్కు అంశములు వ్యాస విస్తర భీతిచే వ్రాయలేదు.

వీరినిగురించి వంగోలు తాలూకా కారుమంచి గ్రామ వాస్తవ్యులగు బ్రహ్మశ్రీ కంచిభొట్ల నీలకంఠ సోమయాజుల వారు రచియించిన ప్రశంస.

తాతోయస్య షడంగవేద విబుధో యశ్చ స్వయం విశ్రుతో
విద్యాగిష్పతి రిత్యధిజ్యమథ విద్యారణ్యపంచాననః
విద్వద్వర్య చతుర్విధో రు కవితాధుర్యో౽చ యస్యా౽౽త్మజో
విక్రాలాన్వయ రామచంద్ర గురు రాట్సో౽యం కథంవర్ణ్యతే
విక్రాల రామచంద్రార్య శ్రీమా న్విజయతే తరాం
విద్యా వాచస్పతి ర్విద్యారణ్య పంచాననశ్చ యః.

వీరు రచించిన గ్రంథములు :—సంస్కృత గ్రంథములు, వైదిక గ్రంథములు 16. త్రేతాకాండ మంత్రభాష్యం (ఆపస్తంబీయం) ఆపస్తంబ్యాది షట్శాఖానిరూపణం. తైత్తిరీయ శాఖా స్వరూప నిరూపణం. అనువాక నిర్ణయః. సర్వవేద సంప్రదాయ సంకలనం. సర్వసూత్ర సంప్రదాయ సంకలనం. మేధ పద్వర్గాది నిరూపణం. ప్రాస్తావిక శ్రుతి సంకలనం. వైదిక కోశ నిర్వచన సంకలనం. వార్ష నిర్ణయః. హోత్ర నిర్ణయః. ఆపస్తంబాశయః. స్వరోచ్చారణ వైఖరీ. ఉదాత్త నిర్ణయః. ప్రశ్నార్థ సంగ్రహ వ్యాఖ్యా యాజుష హోత్ర దర్పణం. (స్తోత్రములు 4.) శ్రీరామ కృష్ణస్తవః. రాఘవాష్టోత్తర శతనామ స్తోత్రం. సీతారామ షోడశనామ స్తోత్రం. వందేమాతరాష్టకం. ధర్మ శాస్త్ర గ్రంథములు 3. ధర్మ నిర్ణయ టిప్పణి. మహోదయ విచారః. అశాస్త్రీయాచార పరిగణనం. జ్యోతిష గ్రంథములు 14. లబ్ధనామ నిర్వచనం. సంఖ్యానుశాసనం. పురాణానుసారి జ్యోతిర్మార్గః. శ్రీరామ జాతకం. శ్రీ రామాయుర్దాయ నిర్ణయః జ్యోతిర్దశా నిర్ణయః పుష్కరాంశ పరిష్కారః. పురీషాంశనిర్ణయః వర్ష ఫలవాసనా. చంద్రస్థైర్య సిద్ధాంతః. మానాంతర బోధః. (దీనికి డేట్ కాల్క్యులేటర్ అని యింగ్లీషులో అనువాదము) చిత్ర పంచాంగం. వర్ణ నిర్ణయః. భోజదత్త ద్రవ్య సంఖ్యానం. (పాంచరాత్ర శాస్త్రం) (పాద్మచర్యా పాదప్రయోగః) కావ్య గ్రంథః వేదపాదరామాయణ వ్యాఖ్యానం.

ఆంధ్ర గ్రంథములు :— కల్పసూత్ర సంగ్రహము, మాహాత్మ్య సంగ్రహము, గోత్రప్రవర సంగ్రహము, దివ్యదేశ మార్గబోధిని, వేదాంతం జడ్జిమెంట్ (వేదాంత రాద్ధాంతము), వర్ణిష్ఠ హితోపదేశము, రామ జాతకము (రెండు భాగములు), రామ మాతృజాలినిరూపణము, వానరజాతి నిరూపణము, వాలి వధావశ్యకత్వ శాస్త్రీయత్వ నిరూపణము, వానర రాక్షస సంఖ్యానము, భీష్మాశ్రమ నిరూపణము, ప్రశ్నోత్తర భీష్మాశ్రమ నిరూపణము, స్నానవిధి, వివాహవిధి, వివాహకాలనిర్ణయము, స్త్రీ పునర్వివాహ శాస్త్రీయత్వ నిరూపణము, అబ్ధిహరగదోష నిరూపణము, గ్రహోదర్శ వ్యాఖ్యానము, మాస నిర్ణయము, గ్రాహ్య పంచాంగ నిర్ణయము, బీజ సంస్కార విచారము, నామ నక్షత్ర విచారము, పొంతనపు నిరూపణము, పంచక పరిష్కారము, తారా బల విచారము, పక్షి తెలిపెడు పథకము, ఆయగణిత సూక్ష్మ పద్ధతి, లగ్నమానపట్టిక, తరిగొండ వేంగమాంబా విజయము, *ఆనంద నందన సంవాదము*, ఆళ్వారాచార్య జననదేశ కాలాది నిరూపణము, జనక జీవిత చరిత్రము, పూర సుబ్బయ్యసెట్టి గారి జీవితము, నంబిశబ్దనిర్వచనము, కమ్మమున్నగు జాతి నిర్ణయము, స్వప్నతత్వము, మాతుల సుతాపరిణయ సమర్థనము, దీర్ఘకాల ప్రసవ సమర్థనము, దివ్యదేశాలయ విశేషములు, అసుర నిర్ణయః, గ్రహదృష్టి నిర్ణయః.

మేలుకొన్న మనసు

శ్రీ 'వాచస్పతి'

పార్కులో నైట్‌క్వీన్ చెట్టుప్రక్క ఇసకలో కూలబడి సిగరెట్ తీసి వెలిగించి గుప్పు గుప్పుమని పొగ వదులుతూ శూన్యంలోకి చూస్తూ అలాగే ఉండిపోయాడు రాఘవేంద్రం. కాసేపటికి సిగరెట్టు అయిపోవటంచేత వేళ్లు చురుక్కు మన్నాయి.

మరో సిగరెట్టు వెలిగించి రేడియోపాటమీదకి దృష్టి మళ్లించాడు. లతామంగేష్కర్ కంఠం నుండి వచ్చే గాన మాధుర్యం—ఆనందాన్ని కలిగించలేక పోతూంది. ఎందుకనో మరి ? విసుగ్గా పశ్చిమదిక్కువైపు చూశాడు. పశ్చిమాద్రి లోకి క్రుంగిపోతున్న సూర్యుని వింత సోయగాల్లో—అరుణ రేఖల్లో—అందాన్ని చూళ్ళేకపోయినందుకు గాభరాపడుతూ లేచి నిల్చున్నాడు రాఘవేంద్రం.

ఆ గాభరాలో గబగబా ఇంటివైపు అడుగు వేశాడు.

అడుగులేస్తూ—అనుకున్నాడు.

చిన్నతనంలో బామ్మ సూర్యుణ్ణిగురించి గమ్మత్తయిన కథలు చెప్పేది. లోకాలను పాలించను ఏడుగుర్రాల రథంలో సూర్యుడు వస్తాడట ! ఆ మర్నాడు ఉదయభానుణ్ణి చూడాలనే ఆశతో ప్రాతఃకాలంతో లేచి మంచులో తడుస్తూ ఆరు బయట నిలబడ్డాడు. అప్పు డనిపించింది—ఓ డాబా ఉంటే ఎంత బావుండేదని ! ప్చ్ ! శక్తికి మించిన కోరికలు !

ఆరోజు ఉదయభానుడు ఎంత అందంగా ఉన్నాడని ! భాస్కరుని కిరణాలు సోకగానే వికసించిన అరవిందంలా తన హృదయారవిందం వెయ్యిరేకులతో—ఇంకా ఎక్కువే !—లెక్క పెట్టలేదుగానీ విరిసి, సవిలాసంగా నాట్యం చేసింది. ఆ అందం యీరోజు కనిపించదేం ? అడుగులు బరువుగా పడుతున్నాయి.

జేబులో ఉన్న పదినయాపైసల బిళ్ళ యిక వుండలే నంటూ బరువుగా మూల్గింది. తలెత్తి చూసి ఎదురుగా ఉన్న టీ కాంటీన్‌లో కెళ్లి మంచినీళ్లలా ఉన్న టీ గొంతులో పోసు కుని మళ్లీ నడక సాగించాడు.

మర్నాడు ఆఫీసుకు సెలవని తెలుసు. ఎందుకనో తెలీదు.

ఎందుకో ?

రిపబ్లిక్‌డే అనా ? లేక యిండిపెన్‌డెన్స్ డే అనా ? సర్క్యులర్ సరిగ్గా చదువుకోవాల్సింది.

పోన్లే ! దేనికయితే నేం ? తెలుసుకోని చేసేదిమట్టు కేముంది ? సెలవని గుర్తుంది. అందుకు సంతోషించాలి.

తన జ్ఞాపకశక్తి మరీ 'అధ్వాన్నమై'పోనందుకు తన్ను తానే అభినందించుకుని—నడకవేగం హెచ్చించాడు.

ఇంట్లో అడుగుపెట్టగానే సీత కళ్లు తుడుచు కుంటూ కనిపించింది. అసహ్యం వేసింది. ఛీ ! ఆడాళ్లంతా యింతే !

విసురుగా గదిలోకెళ్లి ఫైళ్లు తెరిచాడు. ఆ ఆఫీస రుకు తనే కనిపిస్తాడు గాబోలు ! ఆఫీసరుకే నేం ? ఎవరికైనా అంతే ! మెత్తనివాళ్లను చూస్తే మొత్తబుద్ధవుతుం దన్నట్టు—ఆఫీసులో చేసే గొడ్డుచాకిరి చాలదన్నట్టు యింటి క్కూడా మూటకట్టి పంపిస్తాడా? రేపే యివ్వాలట ! ఏమిటో ఆ జబర్దస్తీ ! ఒకవేళ తనే ఆఫీసరయితే . . . . .

రాఘవేంద్రం యింకేం ఆలోచించలేకపోయాడు.

"అమ్మడుకు జ్వరం తగ్గలేదండీ !" భయంగా అంది సీత.

"జలుబుమీద జ్వరం. రేపటికి తగ్గుతుందిలే" తలెత్త కుండానే అన్నాడు.

"వారంరోజులుగా అలాగే అంటున్నారు." నిష్ఠూ రంగా అంది సీత.

"ఏం చెయ్యమన్నావ్ ?" సీతముఖంలోకి చూస్తూ కఠినంగా అన్నాడు.

కళ్లు దించుకుని నేలచూపులు చూసింది సీత.

రాఘవేంద్రం ఫైళ్ళు తిప్పాడు.

సీత మెల్లిగా వెళ్లిపోయింది. ముందుగదిలోనుండి అమ్మడి మూల్గులు సన్నగా వినిపిస్తున్నాయి.

రాఘవేంద్రం చకచకా కాగితాలు తిప్పుతున్నాడు—రాస్తున్నాడు. రెండు గంటలు అమ్మడి మూల్గులుతప్ప మరే శబ్దం లేదు.

సీత వచ్చి అన్నానికి పిల్చింది.

రాఘవేంద్రం లేచివెళ్ళి కంచంముందు కూర్చున్నాడు.

"అమ్మడు పాలు కావాలంటుంది" పచ్చడి వేస్తూ అంది సీత.

"ఇవ్వు."

"ఈమధ్య పావుపాలేగా వేయించుకుంటుంది."

"ఉ . . ."

"హోటల్లో దొరుకుతుందేమో . . . ." నసిగింది సీత.

"ఇప్పు డెక్కడుంటాయి ? రాగానే చెప్పాల్సింది."

గదిగడపమీద కూలబడి, రాఘవేంద్రంవైపు చూస్తుంది సీత.

రాఘవేంద్రం ఒక్కొక్క ముద్దే నోట్లో కుక్కేసుకుంటున్నాడు.

"సురేష్‌కు డబ్బు పంపారా ?"

"లేదు" తలెత్తకుండానే జవాబిచ్చాడు.

"పంపకుంటే ఎలా ?"

"వచ్చేయమని రాశాను."

"వచ్చేయమనా ? రెండేళ్ల చదువు ఏమయ్యేటట్లు ?"

"ఏట్లో కలిసేటట్లు !" చీత్కారం చేశాడు రాఘవేంద్రం.

సీతముఖంలో కలవరం స్పష్టంగా కనిపిస్తోంది.

అమ్మడు పెద్దగా మూల్గింది.

మజ్జిగనీళ్లతో భోజనం ముగించి మంచంపై వాలాడు.

కషాయం త్రాగమని అమ్మణ్ణి బ్రతిమాలుతోంది సీత.

అమ్మడు ససేమిరా మాట వినడంలేదు.

"కషాయం త్రాగితే రేపటికి జ్వరం తగ్గిపోతుంది తల్లీ! రేపు కోవాబిళ్లలు చేసిపెట్టొద్దూ ?"

ఐదేళ్ల అమ్మడు విసురుగా మంచంమీదనుండి లేచి—బాలనాగినిలా బుసకొట్టి—"పాలివ్వమంటే యివ్వలేదు . . . . కోవా బిళ్లలు నాకే మొద్దు పో" కషాయం గ్లాసును దూరంగా నెట్టేస్తూ అంది.

"బంగారు తల్లివిగదూ !! యిప్పుడు గంట ఎంతయిందని ? పది ! పాలెలా దొరుకుతాయి ? జావ కాచివ్వనా ?"

అమ్మడు తల అడ్డంగా తిప్పింది.

"హొద్దులే ! యీ కషాయం తాగు. ఉదయాన్నే పాలావిడదగ్గర మరో పావు పాలు ఎక్కువ తీసుకుంటాను . . ."

"తలనొప్పి .... ఉ .... నాన్న పాలు తెస్తే ఏం ?" మనసులోమాట బైటపెట్టింది అమ్మడు.

"యిప్పు డెక్కడుంటాయి ? తల్లీ ! అందరూ నిద్రపొయ్యేవేళ కాదూ ?"

అమ్మడు కోపంగా చూసి కళ్లు మూసుకుంది.

సీత మెల్లగా అమ్మడుతల ఒత్తుతూంది. నిమిష నిమిషానికీ జ్వరం పెరుగుతున్నట్లుంది. థర్మామీటరుండి చూస్తే బావుణ్ను—అనుకుంది సీత. చ్ప్ ! రాఘవేంద్ర దగ్గర కెళ్తే వచ్చే జవాబేమిటో సీతకు తెలుసు.

భారమంతా దేవుడిమీదేసి అమ్మడు ముఖంలోకి చూస్తూ అలాగే కర్చూంది సీత.

రాఘవేంద్ర మంచంలో కాసేపు అటూ యిటూ దొర్లాడు. ఎంత ప్రయత్నించినా కంటిమీద కునుకుపట్టడం లేదు.

హరికెన్‌లాంతరు పొగబట్టి—గుడ్డిగా వెలుగుతూంది.

దీపం తుడవాలన్న విషయం సీత మర్చిపోయిందేమో.

బోర్లా పడుకుని చూపు అందినంతవరకూ గుడ్డి వెలుతుర్లో గదంతా పరికించి చూశాడు.

ట్రంకుపెట్టెమీద రవీంద్రుని 'రాణిఘాట్' కనిపించింది.

ఎన్నిరోజులయిందో — పుస్తకం ముఖం చూసి—అలవాటుతప్పిన చెయ్యి పుస్తకం తీసుకోను బద్ధకించింది. నిద్రాదేవి నమ్మెచేయడంచేత పుస్తకాన్ని బలవంతంగా తెరవాల్సి వచ్చింది.

గుడ్డి వెలుతుర్లో కథ సాగిపోతోంది.

మధ్యమధ్యలో అమ్మడు పలవరింతలూ, సీత అనునయింపులూ వినవస్తున్నాయి.

దూరంగా చర్చి గడియారం రెండుగంటలు కొట్టడం—రాఘవేంద్రం పుస్తకం ముయ్యడం ఒకేసారి జరిగాయి. తనలో ఏదో చైతన్యవాహిని ప్రవహిస్తోంది. ఇంతవరకూ గాఢ సుషుప్తిలో ఉన్న హృదయం జాగ్రదవస్థలోకివచ్చి పూర్వంలాగ (ఐదేళ్ల క్రితంలా) పిచ్చిపిచ్చి ప్రశ్నలు వేస్తోంది. 'రాణిఘాట్'లో విభాదేవి తానై కాసేపు ఆమెహృదయాన్ని పంచుకొని మరోసారి కథావలోకనం చేశాడు.

ఐదు సంవత్సరాల ముందు కెళ్లినట్లనిపిస్తోంది.

2

ఇన్ని రోజులుగా గాఢనిద్రలో ఉన్న తన కవితా హృదయాన్ని విభాదేవి తట్టి లేపింది.

మేలుకొన్న హృదయం ఐదేళ్ల నిస్సారజీవితాన్ని సర్వే చేసి వెలకట్టేందుకు ప్రయత్నిస్తోంది.

ప్రపంచంలో ఎవరు మోసంచేసినా చివరకు భగవంతుడు తన్ను మోసగించినా తన కవితాహృదయం తన్ను మోసగించదని గర్వంతో ఛాతీవిరుచుకుని నడిచినరోజులు లేకపోలేదు.

చివరకు ఆ హృదయమే మోసగించింది ! ఆకులన్నీ రాల్చుకుని మోడుబారింది. తిరిగి చిగిరింపచేసేందుకు తను ప్రయత్నించలేదు.

గాఢమైన మత్తుమందు తీసుకున్నట్లు మైకంగా పడున్న హృదయాన్ని లేపాలంటేనే తనకు భయంవేసేది.

జాగ్రతీ సుషుప్తుల పొలిమేరలమధ్యలో ఉన్నాడు తను. తనలో ప్రాణముంది. బ్రతుకుతున్నాడు. ఎలా బ్రతుకుతున్నాను. చుట్టుప్రక్క లేం జరుగుతూంది ?—అనే విషయాలు తన కనవసరం.

'ఎలా బ్రతుకుతున్నాను' అని ప్రశ్నించుకొంటే— అసలు బ్రతకలేడు.

అందుకనే—యీ హృదయం నిద్రపోవడం మేలనిపించింది.

హృదయంలేని మనుషుల మాటలకు తనహృదయం కెంబేలుపడిపోయేది.

ఆఫీసులో పని చెయ్యనిచ్చేది కాదు—

అన్నం తిననిచ్చేది కాదు—

నిద్ర పోనిచ్చేది కాదు—

షావుకారు సుబ్బయ్య—కంట్రాక్టు విషయ మేదో చూడమని రెండువందలు చేతిలో పెట్టబోతే విషం తినబో తున్నట్లు హృదయం వలవల ఏడ్చింది.

ప్రక్కనున్న రామంగాడు దగ్గరకు పిల్చి, వీపు తట్టి నవ్వి—

"మరీ చాదస్తంలో పడిపోతున్నావ్ ! బతకలేవురా బాబూ !" అన్నాడు.

ఆ సాయంత్రం యింటి కొచ్చేసరికి సురేష్ వోడి పోయిన వీరుడిలా "పరీక్షఫీజు కట్టా అన్నయ్యా !" అని కొంప లంటుకుపోతున్నట్లు కన్నీళ్లు కార్చాడు !

అంత ధైర్యవంతుడు ఎంత దిగజారిపోయాడు !

వాడితోపాటు ఏడిస్తే బావుండదని తను లోపలే ఏడ్చి వూరుకున్నాడు.

ఆ రోజుతో సరి ! యీ హృదయానికి వీడ్కోలిచ్చి, కమ్మని జోలపాటపాడి నిద్రబుచ్చి—ఉదయాన్నే షావుకా రును పలకరించాడు.

ఆరోజునుండి—అరుణరేఖల్లోని అందాన్ని చూడ్లేక పోయినా—

లతా మంగేష్కర్ గానమాధుర్యాన్ని గ్రోలలేక పోయినా—

సీత కన్నుల్లోని రాగడోలికల్లో వూగలేక పోయినా—

అమ్మడు చిలుకపలుకుల్లోని సౌహార్దాన్ని అందుకోలేక పోయినా—

అంతరాంతరాల్లో ఏ గోలా లేకుండా జీవితం సాఫీగా గడిచిపోతుంది.

కానీ యీరోజు విభాదేవి నిద్రపోతున్న హృదయాన్ని మేల్కొల్పి, మానవత్వాన్ని మరవనీక బాధ, వేదనా మిగిల్చి పోయింది.

బరువుగా కళ్లు మూతలుపడ్డాయి. కలతనిద్దర— కలతనిద్దర్లో కమ్మని కలలూ. కన్నీటి పాటలూ—

తెలతెలవారుతూండగా కలతనిద్దర్లోనుండి కళ్లు విప్పి చూశాడు. అమ్మడు మరీ భయంకరంగా

మూల్గుతూంది.

హృదయం అమితమైన బాధతో

మూల్గింది !

చివాల్న లేచి కూర్చుని చుట్టుప్రక్క లేం జరుగు తుందో—వో నిముషం పరికించి చూశాడు.

"అమ్మడుకు జ్వరం తగ్గలేదా ?"

సీతదగ్గర్నించి ఎలాంటి సమాధానము రాలేదు.

"నిన్నే సీతా !"

సీత లేదన్నట్లు తల అడ్డంగా తిప్పింది. కిటికీలో నుండి సూర్యకిరణాలు దూసుకువచ్చి గదిని ప్రకాశవంతంగా చేశాయి. కుర్చీలో కూలబడి సీతవంక తదేకదృష్టితో చూశాడు రాఘవేంద్రం.

సీత చాలా చిక్కినట్లు కనిపిస్తూంది. ఆనాటి పచ్చని రంగుకూడా మాయమైనట్లుంది. ఇన్నాళ్లుగా తనెందు కీ విషయాన్ని గుర్తించలేదు.

రాఘవేంద్రం గుండె ఝల్లుమంది. సీత చూపుకోసం మాట కోసం, వెన్నెల్లాంటి నవ్వుకోసం పడిగాపులు కాచిన రోజులు ఎన్ని లేవు ?

అందనిపండని ఆశ నిరాశచేసుకొన్న క్షణాలు తక్కువేం లేవే ?

పచ్చగా, బొద్దుగాఉన్న సీత కన్నులపండువుగా బంతిపువ్వల్లే, అందర్నీ మేగ్నట్‌లా ఆకర్షించే దనడంలో అతిశయోక్తి లేదు.

3

ఆ రోజుల్లో తను బి. ఏ. ఫెయిలయి పొట్టకోసం గుమాస్తాగిరి చేస్తున్న అనామకుడు.

సీత ఇంటర్ చదువుతున్న గెజెటెడ్ ఆఫీసరు ప్రియ తనూజ.

చేసుకుంటే సీతనే పెళ్లిచేసుకోవాలనుకున్న రోజు లవి. యౌవనపు ఉద్రేకంలో చేసుకున్న తీర్మానాలకు యీరోజు నిజంగా అర్థం లేదనిపిస్తోంది. సీతను చేపట్టేందుకు తనకున్న అర్హత లేమిటి ?

ప్రక్కింట్లో ఉండడం తప్పిస్తే మరొక అర్హతుందా?

అందనిపళ్లకు ఆశ పడ్డంలోనే అందముందేమో! నెలలు జరిగిపోతున్నాయి. తన ఆశలు ఫలించేటట్లు కనిపించడంలేదు.

ఓ రోజున ఆఫీసరుగారు తన ముద్దుల మొద్దబ్బాయి గారికి ట్యూషనుమాష్టరు అన్వేషణలో ఉన్నారని విని తనే స్వయంగా వెళ్లి అప్లికేషను పెట్టుకున్నాడు. తన్ను ఎగా దిగా అద్దాల్లోంచి వోసారి అద్దాలుతీసి మరోసారి చూసి, నొసలు ముడిచి, కళ్లు చిట్లించి, చివరకో చీత్కారం చేసి—

"ఎంత కావాలి ?" అన్నారు.

అమ్మయ్య ! తనకామాటలు చాలు. తనొచ్చింది డబ్బు కోసం కాదుగా ? అందుకే ఏ పేచీ లేకుండా పోయిన పనయింది. ఏ రోజూ ట్యూషనుకు నామంపెట్టినట్లు గుర్తులేదు.

ఆ అబ్బాయికన్నా తనకే దిక్కుమాలిన శ్రద్ధ !

సీతతో మాట్లాడాలంటే చచ్చేటంతటి భయం! ఎంతయినా ఆఫీసరు కూతురాయె! ఆ ఠీవి! ఆ దర్జా ఎక్కడికి పోతుంది.

ప్రతిరోజూ 'యీ రోజు సీతతో మాట్లాడాలి' అని తీర్మానించుకోవడం తీరా మాట్లాడబోయేసరికి గుండె అదరడం, యింటికొచ్చి తీరిగ్గా కూర్చుని తన ధైర్యానికి తనే మురిసిపోవడం జరుగుతుండేది!

ఓరోజు లదేదో హిందీ సినిమానుండి తిరిగి వస్తున్నాడు. సీత విసురుగా నడుస్తూ వెళ్తూంది. వెనక కొంటె బ్బాయిలు—ఏదో వాగుతున్నారు. ఇల్లు చేరుకోవాలంటే కనీసం యింకో రెండు ఫర్లాంగులైనా నడవాలి. సీత నాలుగు వైపులా చూసింది. రిక్షాకోసం కాబోలు. పాపం! ఓ రిక్షా అన్నా ఉంటేనా?

తను విషయాన్ని క్షణంలో అర్ధంచేసుకుని వెళ్ళి పలకరించాడు. కోపంతో ఎర్రబడిన సీతముఖం (తనమీద కాదు సుమండీ!)—వీధిలైటు కాంతిలో చూడ ముచ్చటగా ఉంది! "సమయానికో రిక్షా అన్నా లేదు. "ఇంటిదగ్గర వదుల్తా రండి!" ఎలాగో ధైర్యంచేసి అన్నాడు.

సీత తేలిగ్గా శ్వాస పీల్చి, వెనక్కు తిరిగిచూసి—

"రాస్కెల్స్! మెల్లగా జారుకుంటున్నారు!"

"వాళ్ళ ధైర్య మంతవరకేలెండి!" అన్నాడు తన ధైర్యానికి మురిసిపోతూ.

సీత నవ్వింది. ఎందుకో మరి? తన కర్థంకాలేదు.

"ఒంటరిగా బయల్దేరారేం?"

"నాన్న జవాన్ని పంపిస్తానన్నారు. ఎందుకనో మరి రాలేదు."

"రిక్షా అన్నా చేసుకోవాల్సింది."

"ప్రక్కసందువరకూ నా ఫ్రెండూ నేనూ వచ్చాము—యీ కాసింత దూరానికి రిక్షా ఎందుకని...." నసిగింది సీత.

"యింతకూ ఎక్కణ్ణించి? సినిమానుండా?"

"మా కాలేజీ వార్షికోత్సవాలు జరుగుతున్నాయండీ! అక్కణ్ణుండి!"

"ఇకమీద ఎప్పుడూ అలా ఒంటరిగా బయల్దేరకండి!' తను మందలించాడు. ఏమిటో తన కప్పుడే పెద్ద అధికారం, చనువు కలిగినట్లు!

సీత జవాబుగా సన్ననినవ్వు నవ్వి లోపలికి వెళ్ళిపోయింది.

మర్నాడు సీతలో పెద్ద మార్పుంటుం దనుకున్న తనకు నిజంగా నిరాశే ఎదురైంది. సీత మామూలుగానే ఉంది.

అయితే భేదమల్లా—తనిప్పుడేదన్నా ప్రశ్న వేయదల్చుకుంటే గోడలకు వేయనవసరం లేదు. ధైర్యంగా సీతనే అడిగేస్తున్నాడు. సీతకూడా నెమ్మదిగా జవాబిస్తుంది.

అలా నెలలు గడిచాయి.

మొద్దబ్బాయి కాస్త దార్లోకొచ్చాడు. ఆఫీసరుగారు అభినందించకుండా ఉండలేకపోయారు.

అయితే ఆ రోజూ, యీరోజూ సీత అందనిపండులాగే ఉండిపోయింది. ఎలాగయినా యీ విషయాన్ని ఓ దార్లోకి తేవాలనుకున్న తన నిశ్చయం ఏరోజు కారోజే గాల్లోకి తేలిపోతుంది!

ఓరోజు ఆఫీసరుగారి ల్లు బహు సందడిగా ఉంది.

"ఏమిటి విశేషం?" అని అడక్కుండా వుండలేకపోయాడు శిష్యుడు.

"ఎవరో వస్తున్నారు."

"ఎవరో వస్తే" యింత హంగామా ఎందుకు? ఒళ్ళు మండింది.

" 'ఎవరో' ఎందు కొస్తున్నారు?"

"అక్కయ్యను చూసేందుకు."

"ఊహూ......"

తనమూతి నాలుగు వంకర్లు తిరిగేసరికి అసలే పెద్దగా ఉన్న వాడికళ్ళు మరింత పెద్దవయ్యాయి.

తర్వాత నాల్గు రోజులు యిల్లంతా చీమ చిటుక్కుమన్నా శబ్దమయ్యేంతటి ప్రశాంతంగా ఉంది.

అందుకు తను ఆశ్చర్యపడ్డంలో చిత్ర మేముంది?

"మీ అక్కయ్య యింట్లో లేదా?"

"ఉంది."

"సీత మౌనవ్రతానికి కారణమేంటో రెండు రాత్రిళ్ళూ, రెండు పగళ్ళూ ఆలోచించినా తన కర్థంకాలేదు. వారం రోజులు జరిగినా అసలువిషయం అంతు పట్టలేదు.

మామూలుగా ట్యూషను చెప్పేందుకు వెళ్ళాడు—ఆరోజు—

ఆఫీసరుగారు వరండాలోనే ఎదురై చిరునవ్వు విసిరి, కుర్చీ చూపించి, "కూర్చోవోయ్!" అంటూ ఆప్యాయత ఒలకబోశారు.

ఆ అకారణ అనుగ్రహానికి కారణాలు వెతుక్కోలేక బుఱ్ఱ పాడయినమాట నిజమే!

ఎలాగయితే నేం? కష్టపడి తన పుట్టుపూర్వోత్తరాలన్నీ లాగారు!

ఏరోజూ అలవాటులేంది ఆరోజు ప్రియశిష్యుడు కాఫీ, టిఫినుతో ఎదుట నిలబడ్డాడు!

"యీ బొమ్మలేసిపెట్టరూ? అంటూ సీత ఫిజిక్సు రికార్డుతో దర్శనమివ్వగానే విషయం పూర్తిగా అర్థమైంది.

తనేమంత గొప్ప ఆర్టిస్టు కాడు. చచ్చీ చెడీ రాత్రి పన్నెండువరకూ కూర్చుని నీటుగా బొమ్మలు వేసిపెట్టాడు.

"నాకన్నా బాగానే వేశారు" అంది సీత.

మేలుకొన్న మనసు

మరీ పొగడితే ఆకాశంలోకి ఎగిరిపోతానని గాబోలు ! ఆమాత్రం పొగడ్త చాల్లే అనుకుని తను తృప్తిపడ్డాడు.

"పోయిన జన్మలో 'బంతి'పువ్వుగా పుట్టి ఉంటావు. లేకుంటే యింత పచ్చగా, బొద్దుగా ఉండవు సీతా !" అన్నాడు తను.

"అంత లావున్నా నేమిటి ?" బుంగమూతి పెట్టింది సీత.

"ఛా ! ఛా! లావని ఎవరన్నారు ? బొద్దుగా ముద్దొస్తున్నావు గానీ ..... "

"అక్కయ్య లావేనండీ ! మాస్టారూ !" లెక్క వెయ్యడం మాని తన అభిప్రాయం వెల్లడించాడు శిష్యుడు.

"ఊ .... నీకన్నా నేమిటి ?" వాడి తలమీదో మొట్టికాయ యిచ్చి అంది సీత.

ఊహూ .... లెక్క వెయ్యరా ! నాగమ్మా !" అని ఓ ఉరు మురిమి—సీతవైపు తిరిగి—

"ఈ అనుగ్రహం శాశ్వతమైందా ? లేక మురిపించి పారిపోతావా సీతా !" అని తన సందేహాన్ని బైటపెట్టకుండా ఉండలేకపోయాడు. సీత నవ్వుతూ లోపలికి పారిపోయింది. ఇంతవరకూ స్త్రీహృదయం అగాధమని వినడమే గానీ—ఆరోజు ప్రత్యక్షంగా చూచి నిజమనుకున్నాడు. మహాను భావులు చెప్పినమాట ఏరోజూ పొల్లుబోదు.

చచ్చి ఏ లోకా నున్నారో మామగారు — తనచేత సీత మెళ్లో తాళి కట్టించి తన విశాలహృదయాన్ని ప్రకటించు కొన్నారు.

తర్వాత సీతతో గడిపిన మధురక్షణాలు—నిజంగా వాటికి విలువకట్టను తనచేతకాదు.. ఆ రోజులు వేరు. ఆ మధురానుభూతిని వర్ణించను తను కవికాడు. కానీ తనకు కవితాహృదయ ముంది—అది—

గులాబీలా అతి కోమలం
అరవిందంలా అతి మనోహరం
విరజాజిలా అతి సుగంధభరితం.

"మీ రో కవికుమారులు కావల్సింది ! ఎందు క్కాలేదో" అంది సీత ఓరోజు.

"నిన్ను చూశాను కదూ ? యిక కవికుమారుడు నాలో ప్రవేశిస్తాడు గాబోలు ! ఒద్దులే ! సీతా ! ఆ కవిత్వంలో పడి నిన్ను మర్చిపోవచ్చు."

సీత నిండుగా నవ్వింది. ఇప్పుడు నవ్వినట్లే ఉంది.

రాఘువేంద్రం కళ్లుతెరచి సీతవైపు చూశాడు. శోక దేవతలా ఉంది సీత. పువ్వులాంటి తన హృదయం—యీరోజు—యిలా—అచేతనంగా ఎందుకు పడుంది ? నిర్దాక్షిణ్యంగా తన హృదయాన్ని 'వీళ్లు' నలిపారు.

వీళ్లకెందుకు తనమీ దింత కక్ష ?

తనేం పాపం చేశాడని ?

అమ్మడు కళ్ళుతెరచి సీతనేమో అడుగుతుంది.

చీకటితెరల్లో మైమరచి నిద్రపోతూ, మానవతను కోల్పోయిన హృదయం—పశువాంఛలను తీర్చుకొనేందుకు ప్రయత్నించిందేగానీ—ఏనాడన్నా మానవత్వపు లోతుల్ని చూడ కలిగిందా ?

—కానీ—

ఆ చీకటిలోకంలోనే—

ఆ జాగృతి లేని గాఢనిద్రలోనే—సంతృప్తి, సంతోషం, సుఖం—ఉన్నాయని మురిసిపోయి మరీ చీకటి లోకాల్లోకి పరు గులుతీసిన రోజులు లేకపోలేదు. అందరు చీకటిని భరించ లేకపోతే—తను వెలుతురు భరించలేకపోయేవాడు.

సూర్యుని వెలుగంటే భయం—
మెర్క్యురిలైటు కాంతంటే భయం—
పున్నమిచంద్రుని వెన్నెలంటే భయం—
ఉండీ లేనట్టున్న నక్షత్రాల వెలుగూ—
వెలిగీ వెలగనట్లున్న ఆముదందీపం కాంతీ—

ముఖ్యంగా అమావాస్యనాటి చికటీ—తన హృదయానికి ఓ విధమైన మత్తుతో కూడిన ఆనందాన్నిచ్చేవి.

4

అమ్మడు బాధతో మెలికలుతిరిగిపోతోంది. సీత వెక్కిళ్ళు రాఘువేంద్రం ఊహల్ని పటాపంచలు చేశాయి.

సీతా ! ఏవిటి ? అమ్మడు కేంజబ్బంటావ్ ?"

"నేను డాక్టర్ను కానే ?" సహనమంతా యింకిపోయిన సీత మండిపడింది.

"డాక్టరుదగ్గరకు తీసుకుపోనా ?"

"ఆజ్ఞాపించేందుకు నే నెవర్ని చెప్పండి ?"

"ఏం మాటలు సీతా ? డాక్టర్నే తీసుకొస్తానుండు" అంటూ వీధిలో కెళ్ళాడు రాఘువేంద్రం.

ఇద్దరు డాక్టర్లను చూశాడు.

'పదిగంటలక్కానీ బైటకు కదలం" అన్నారు.

మరో డాక్టరు నిద్రే లేవలేదట !

మరో యిద్దరు అమ్మాయిని తీసుకురమ్మని సలహా యిచ్చారు !

చిరకాలనిద్రనుండి మేల్కొన్న హృదయం మంటలు కక్కింది. ప్రపంచాన్నంతా భస్మీపటలంచేసే ఏ హైడ్రొజన్ బాంబో వుంటే—పేల్చి ప్రతీకారం తీర్చుకుందుకు లేక పోయింది కదా—అని వలవల ఏడ్చింది. ఈ డాక్టరు రానంటే చెంపలు వాయించమని సలహా యిచ్చింది రాఘువేంద్రానికి. ఆ డాక్టరుగారి అదృష్టం బాగుండి రిక్షా పిలవనున్నాడు.

తనూ ఓ రిక్షా తీసుకొని వెంట వెళ్లాడు రాఘువేంద్రం.

పరీక్షచేసి, ఓ యింజక్షనిచ్చి, కాఫ్ పిల్సు రాసిచ్చి—విజిటింగ్ ఛార్జితోసహా కలిపి బిల్సు చేతిలో పెట్టా—

"రెండుగంటల కోసారి రెండేసి కాప్స్ చొప్పున యివ్వండి!" అన్నాడు.

బిల్లు తీసుకుని జేబులో పెట్టుకుని "ఘన్యుడను చూస్తా నండీ!" అన్నాడు చేతులు నలుపుకుంటూ రాఘవేంద్రం.

డాక్టరు మింగేటట్లు చూసి రిక్షాలో కూలబడ్డాడు—చేసేది లేక.

అభిమానంతో ఏడ్చింది హృదయం. సంపాదించాలని ఎంత ప్రయత్నించినా అదీ దూర దూరంగా పోతుంది. దానికీ అదృష్టం ఉండాలిగాబోలు! వ్రతంచెడ్డా ఫలం దక్కన ట్లయింది చివరకు.

అడ్డదారులు తొక్కి గడ్డితిందామన్నా అదీ అందడం లేదు. ప్చ్! ఏం బ్రతుకులో! కంట్రాక్టర్లంతా నేరుగా ఆఫీసరుదగ్గరకే పోతున్నారు! అమ్మడుకు మందు తెద్దా మన్నా చేతిలో చిల్లిగవ్వ లేదు.

"డాక్టరేం చెప్పారండీ?"

"యిదో! యీ కాప్స్ తెచ్చి వెయ్యమన్నారు."

"యిప్పు డిప్పుడే షాపులు తెరవరా?" రాఘవేంద్రం యింకా కదలకపోవడం చూసి అంది సీత.

"షాపులు తెరవకేం? అసలు డబ్బే లేదుగానీ ...." నసిగాడు.

సీత మరేం మాట్లాడ్లేదు. శూన్యంలోకి చూస్తూ అలాగే కూర్చుంది.

"రామంనన్నా అడుగుతాను. అమ్మడు జాగ్రత్త" అంటూ వీధిలో కెళ్లాడు. వెదక బోయిన తీగ ఎదురైనట్లు రామారావు ఎదురై—రాఘవేంద్రం చెప్పింది పూర్తిగానన్నా వినక జేబులోని పదిరూపాయలకాగితం తీసి రాఘవేంద్రం చేతిలో పెట్టాడు. రాఘవేంద్రం ఆశ్చర్యంతో స్నేహితుడి ముఖంలోకి చూశాడు.

"ఏం? సరిపోదా? సాయంకాలం పట్టుకొస్తా .... యిప్పటికా కాప్స్ కొనుక్కెళ్ళు."

"రామం!"

"ఏం?"

"నువ్వూ అందర్లో ఒకడి వనుకున్నాను."

"కాదా మరి!"

"మానవత్వపు పొలిమేరల్లోనే ఉన్నావు. మనుషుల్ని అర్థంచేసుకోవడం కష్టమేరా?"

"ఇప్పుడు తెలిసిందేమిటి? ఏడిశావులే! త్వరగా వెళ్ళు."

రాఘవేంద్రం పరుగుల్తో యిల్లు చేరాడు. ఆరోజంతా అమ్మడి మంచంప్రక్కనే కూర్చున్నారు సీతా, రాఘవేంద్రం. మింగే కాప్స్ మింగుతున్నా జ్వరం దానిపాటికది ఎక్కు వవుతూనే ఉంది.

సాయంత్రం రామారావొచ్చి—హెచ్చరిక చేసేంత వరకూ తా మే స్థితిలోఉండేదీ తెలిసిరాలేదు.

అమ్మణ్ణి భుజాన వేసుకుని రిక్షాలో డాక్టరింటికి తీసి కెళ్లాడు రామారావు.

అచేతనంగా వెంటవెళ్ళాడు రాఘవేంద్రం.

డాక్టరు చెయ్యిపట్టుకుని నాడి చిక్కక వదిలేశాడు.

అమ్మడి భౌతికశరీరాన్ని హృదయానికి హత్తుకుని హాస్పిటల్లోనే భోరుమన్నాడు రాఘవేంద్రం.

వార్త నిముషాలమీద ప్రాకిపోయింది.

సానుభూతిపరులంతా వచ్చి ముఖంచూపి పోయారు!

మర్నాటి ఉదయం తెలివిలో కొచ్చింది సీత.

రాఘవేంద్రం హోటలుకెళ్లి కాఫీ తెచ్చాడు.

దోసిట్లో ముఖం పెట్టుకుని కాఫీ దూరంగా నేట్టే సింది సీత.

"ఏవిటి సీతా! పోయినవాళ్లతో మనమూ పోతామా?"

"మీకు హృదయంలేదు ...... మీరు మారిపోయారు" దోసిట్లో ముఖం పెట్టుకుని వలవల ఏడ్చింది సీత.

"ఏం? నీలాగ నేను ఏడవలేదనా?"

"అమ్మడిని చేతులారా చంపారు .... అది మీకేం పాపం చేసిందని .... మీ కడుపులో పుట్టడమే ఓ పాపమా? నా చిట్టి తల్లిని .... నిర్దాక్షిణ్యంగా....అబ్బ! మీకు చేతు లెలా వచ్చాయి?"

"సీతా!" గావుకేకపెట్టాడు రాఘవేంద్రం.

"అలా అరవగానే భయపడతా ననుకున్నారా? .... కానీ .... నిజం చెప్పేందుకు నే నేరోజూ భయపడను .... నే నిజం చెప్పానో లేదో మీ అంతరాత్మ నడగండి .... "

"నిజమే చెప్పానంటావా?" హతాశుడై కుర్చీలో కూల బడుతూ అన్నాడు రాఘవేంద్రం. సీత చేసిన నేరారోపణ ఎంత పెద్దదో, అసలు తెలిసే అంటుందో, తెలీకే అంటుందో రాఘవేంద్రానికి తెలిసిరాలేదు.

అమ్మడు పోయినందుకు తనహృదయం వ్రయ్యి లౌతుంటే? తనకేనా ఆ దిగులు? మామూలు జ్వరం కాబోలు—ఏదో నాలుగురోజుల్లో తగ్గకపోతుందా అను కున్నాడుగానీ – యిలాంటి విషమపరిణామాలకు దారితీస్తుందని తనకుమటుకేం తెలుసు?

పాడు హృదయం—మళ్ళా నిద్రపోతేనే బాగుండును.

అయితే సీత చేసిన నేరారోపణ నిజంకాదా ? నిజమే ! తనవారిపట్ల తనకింత నిర్లక్ష్యం ఎందుక్కలిగింది ?

ఏ రోజయితే తనకిష్టంలేని పనులన్నీ యీ మనుషులు తనచేత చేయించారో ఆనాటినుండీ తన హృదయం మూగవోయి, నిద్రపోయి—తన్నొక యంత్రంగా మార్చింది.

ఎవరెలాపోయినా తన కక్కరలేనట్లుగా ఉండిపోయాడు.

అవును మరి—తన యిష్టా యిష్టాల నెవరన్నా చూశారా ? లేదు. మరి తనెందుకు చూడాలి ?

ఊహు .... యీ కుతర్కంతోనే తన హృదయాన్ని నిద్రబుచ్చాడు. దాంతో అమ్మడు శాశ్వతంగా దూరమైంది.

భగవంతు డెందు కీ సంఘటన కలిగించాడో ?

మిగిలిన మానవతనుకూడా దోచుకోవాలనా ?

దోపిడీదొంగల్ని మించిపోయాడు భగవంతుడు !

స్స్ ! ప్రాణపదంగా చూచుకొనేవారిని మధ్యలోనే తీసికెళ్తాడు. ఆరోగ్యాన్ని, ధనాన్ని గాలిలోకి విసిరేసి—కన్నీటి వరదలో యీదులాడమంటాడు.

అందులోనే ఆనందముందేమో !

ఎంత కఠినాత్ముడు ! ఓరోజు తన ప్రాణపదంగా సీతను ప్రేమించేవాడని చెబితే ఎవరైనా నమ్ముతారా ?

తన ప్రాణంమీదే తన కెందు కింత నిర్లక్ష్యం ?

సీతా ! భగవంతుడు వట్టి కఠినాత్ముడు. తన విలాసానికి మన ప్రాణాల్తోనే ఆడుకుంటాడు. మనచేతిలో ఏం లేదు. మనం నిమిత్తమాత్రులం—ఆ విషయం తెలీక నన్ను నిందిస్తున్నావు ....

"చేసినపాపం చాలు .... యింకా ఎందుకు కొనితెచ్చుకుంటారు ?"

పైట చెరగుతో కళ్ళు తుడుచుకొంటూ అంది.

"ఓహో ! నీ భగవంతుడు దయాస్వరూపుడు కదూ ?"

"ఎందుకిలా హింసిస్తారు .... అబ్బ ! ఎంత మారిపొయ్యారు .... " దుఃఖాన్ని ఆపుకోలేక మంచంపట్టెమీద తల ఆన్చి విలపించింది సీత.

సీత కన్నీరు రాఘవేంద్రం హృదయాన్ని ప్రయ్యలు చేసింది.

"చూడు సీతా ! మళ్లీ తప్పకుండా తిరిగి మనదగ్గర కొస్తుంది అమ్మడు .... మనల్ని వదిలిపోదు సీతా ! .... నావల్ల పెద్దతప్పే జరిగిపోయింది .... నే నెందు కిలా మారిపోయానో అర్థంకావడంలేదు .... యీసారికి నన్ను క్షమించావను......."సీత చేతులు తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు రాఘవేంద్రం.

రాఘవేంద్రలో పూర్వం తను చూసిన హృదయాన్ని చూసి, పోగొట్టుకున్న దేదో దొరికినట్లు తలెత్తి రాఘవేంద్ర ముఖంలోకి చూసింది సీత. సీతచెక్కిళ్లమీద కారే కన్నీటిని తుడుస్తూ—

"ఇలా అవుతుందని నాకుమటుకేం తెలుసు ? భగవంతుడు నిజంగా నిర్దయుడు .... లేకుంటే నా హృదయాన్నెందుకిలా నలిపేస్తాడు .... '

"తప్పు."

రాఘవేంద్రం నోటిని తన చేత్తో మూస్తూ అంది సీత.

"అమ్మడికోసం కన్నీటితో ఎదురుచూస్తుంటాం. మా మాటగా చిట్టితల్లితో చెప్పు" అని సూర్యభగవానునితో చెప్పుకొంటున్నారా అన్నట్లుగా — కిటికీలోనుండి ఉదయభానుణ్ణి చూస్తూ అక్కడే—అమ్మడి మంచందగ్గరే కూర్చున్నారు, సీత, రాఘవేంద్రము.

మనదేశం, మనం, మన పరిపాలనవిధానం

శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య

దేశంయొక్క భౌగోళిక లక్షణాలు, దేశంలోఉండే ప్రజల ఏకత్వ భిన్నత్వాది లక్షణాలు, పరిపాలనవిధానంపై ఎంతో ప్రభావంకలవిగా ఉన్నవి. ఆ ప్రభావాన్ని స్పష్టంచేయడమే ఈ వ్యాసంయొక్క ఉద్దేశం.

1

భౌగోళికంగా మన దేశానికిచెందిన మూడు ప్రధానలక్షణాలు ఆదికాలాననుండి ఇప్పటివరకు పరిపాలనావిధానంపై గొప్ప ప్రభావం కలవిగా పరిణమించాయి. వాటిలో మొదటిది, దేశానికిగల ప్రత్యేకత; రెండవది, దేశంయొక్క విస్తీర్ణాధిక్యం; మూడవది, ప్రకృతిసిద్ధంగా దేశంలోపల ఏర్పడ్డ కొన్ని భౌగోళిక నిరోధాలు.

సులభంగా దాటడానికి సాధ్యంకాని మహోన్నత పర్వతాలు, విశాలములైన సముద్రాలు మనదేశాన్ని ఇరుగు పొరుగునందుండే తక్కిన దేశాలనుండి వేరుపరుస్తూ ఉన్నాయి. ఇందుచేత హిమాలయాలనుండి కన్యాకుమారివరకు, పశ్చిమసముద్రాననుండి పూర్వసముద్రం వరకు వ్యాప్తమైన మనదేశం ఇతర దేశాలతో భౌగోళికంగా ఎక్కువ సంబంధంలేని ఒక ప్రత్యేక భూభాగంగా ఏర్పడిపోయింది. దీనితోపాటు ఒక ఏకత్వంకూడా దేశానికి లభించింది. ఈ సరిహద్దుల మధ్యఉండే భారతదేశం ఒకేదేశం అన్న భావం చాలా కాలాననుండి ప్రజలలో నాటుకొని పోయింది. దీని ఫలితంగా విజిగీషులైన రాజులందరు, దేశాన్ని అంతా తమ ఏలుబడిలోనికి తెచ్చుకొనడానికి సర్వప్రయత్నం చేస్తూ వచ్చారు. దేశం అంతా ఒకే ప్రభుత్వానికి లోబడి ఉండడం వాంఛనీయమని భావించారు. "భరతఖండం చక్రవర్తి క్షేత్రం" అనే వాక్యం ప్రచారంలోకి వచ్చింది. ఇందుచేతనే పురాణాలలో ప్రసిద్ధిగాంచిన షట్చక్రవర్తులు మొదలైనవారు దిగ్విజయాలు చేసి, అశ్వమేధ రాజసూయాది యాగములద్వారా తమ చక్రవర్తిత్వాన్ని ప్రకటించుకొన్నారు. ప్రఖ్యాతిగాంచిన తక్కిన రాజులు కూడా ఈ మార్గంలోనే నడిచారు. చారిత్రక కాలంలో ఇదే సంప్రదాయాన్ని రాజులనేకులు అనుసరించారు. మౌర్యులు, శాతవాహనులు, గుప్తులు, ఢిల్లీసుల్తానులు, మొగలాయీలు, బ్రిటిష్‌వారు, దేశాన్నంతా జయించి పాలించడమే ఆదర్శంగా పెట్టుకొన్నారు. భౌగోళికంగా దేశమంతా ఒక ప్రత్యేక భూఖండంగా ఏర్పడడమే దీనికి కారణం.

దేశంలో ప్రతిభాగాన్ని జయించి వశపరచుకొనడంలో వీరు చూపించిన ఉత్సాహం, శ్రద్ధ, దేశానికి ఆవలఉన్న విదేశాల విషయంలో చూపించకపోవుటకు కారణం కూడా ఇదే. దేశాన్ని ఒకే పరిపాలనలోకి తెచ్చే ప్రయత్నం ఒకప్పుడు సఫలం కావడం, ఒక్కొక్కప్పుడు సఫలంకాకపోవడం జరుగుతూ వచ్చినా, అలాటిది సఫలం అయినప్పుడే పరిపాలనవిధానానికి స్థిరత్వం లభించగలదనేభావం, పూర్వకాలపు విజిగీషులందరిలోను, ఇటీవల ప్రఖ్యాతిగాంచిన నాయకులందరిలోను గాఢంగా నాటుకొనిపోయింది. కాబట్టే 1947 లో దేశం ఇండియా అని, పాకిస్తాన్ అని రెండు ముక్కలుగా చీలిపోరాదని అత్యధికసంఖ్యాకులు వాదించారు. దురదృష్టవశాత్తున జరిగిందేమో జరిగిపోయినా, ప్రస్తుతం భారతరాజ్యంలో చేరిఉండే భూభాగం ఏదీ కూడా దానినుండి విడిపోరాదనీ, అలాగు విడదీసి, ద్రావిడస్థానం, శిక్కుస్థానం, ఆదినివాసుల స్థానం అనే ప్రత్యేక రాజ్యాలను రూపొందించడానికి కొందరు లేవదీసిన ఉద్యమాలు ప్రతిఘటించతగినవనిన్ని భావించడానికి కారణం, భౌగోళికంగా ఏకత్వంగల దేశం రాజకీయంగాకూడా ఏకత్వం కలదిగా ఉండడమే వాంఛనీయంఅనేదే.

మనం ఏర్పరచుకొన్న పరిపాలనవిధానంలో తక్కిన సుగుణాలు ఎన్నిఉన్నా, అది దేశాన్నంతా పరిపాలించగలదిగాను, దానికి కావలసిన అధికారబలం, అర్థబలం, అంగబలం కలదిగాను లేనిపక్షాన తక్కిన సుగుణాలన్నీ వ్యర్థం. మనదేశ భౌగోళిక లక్షణాలు, మన చరిత్ర, మన సంప్రదాయం దీనిని స్పష్టం చేస్తూ ఉన్నాయి.

భౌగోళికంగా మనదేశానికి ఉండే రెండవ లక్షణం విస్తీర్ణాధిక్యం. మనది విస్తీర్ణంగల గొప్పదేశాలలో ఒకటి. దీనితో సరిపోల్చతగినవి చైనా, రషియా, యునైటెడ్‌స్టేట్సు, ఆస్ట్రేలియా, కనడాలవంటి పెద్ద దేశాలుగాని, ఇంగ్లండు, ఫ్రాన్సు, ఇటలీలవంటి చిన్న దేశాలుకావు. అధిక విస్తీర్ణంగల దేశాలలో ప్రకృతిసిద్ధంగానే ఒక ప్రాంతంలోని పరిస్థితులకు ఇంకొకదానిలోని వాటికి భేదం ఏర్పడుతుంది. భూసారం, అటవీ సంపద, ఖనిజ సంపద, జలసంపద, వర్షపాతం, సముద్ర వ్యాపార సౌకర్యాలు—ఈలాటివి దేశమందంతటా ఒక మోస్తరుగా ఉండవు. కొన్ని ప్రాంతాలు అభివృద్ధిగాంచడం, తక్కినవి వెనుకబడి ఉండడం సహజం. ఇంతేకాకుండా, కొన్ని ప్రాంతాలు దేశానికంతా ఏర్పడ్డ రాజధానికి సమీపంలో ఉండడం, మరికొన్ని దూరంలో ఉండడం జరుగుతుంది. దేశంలో ఏర్పడే పరిపాలనవిధానం ఈలాటి భేదాలకు అనుగుణమైనదిగా ఉండడం ఎంతైనా అవసరం. దీనిని గుర్తించే అన్ని యుగాలలో దేశాన్ని పాలించిన చక్రవర్తులు, సార్వభౌమత్వంవహించిన తదితరులు, వారివారి పరిపాలనవిధానాలను రూపొందించారు. వాటికన్నిటికి "వికేంద్రీకృత విధానం" అనే పేరు చెల్లింది. ప్రభుత్వం చెలాయించ

వలసిన అధికారాలన్నిటిని కేంద్రప్రభుత్వం ఒక్కటే చెలాయించకుండా, కొన్ని అధికారాలను ప్రాంతాలలో ఏర్పడ్డ ప్రభుత్వాలు స్వతంత్రంగా వహించే విధానానికి వికేంద్రీకృత విధానం అని పేరు. ప్రాంతానికి ప్రాంతానికి పరిస్థితులలో భేదం ఉండడంచేత, ఒక కేంద్రానుండి అన్ని ప్రాంతాలను ఒకే విధంగా పరిపాలించడం వాంఛనీయంకాదు. ఆ యా ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను, అవసరాలను గుర్తించి, పరిపాలనను సాగించవలసి వస్తుంది.

ఇందుచేత, పూర్వకాలంలో దేశాన్నంతా జయించిన చక్రవర్తులు, తాము జయించిన ప్రాంతాలను, స్వయంగా తాము నియమించిన గవర్నరుల ద్వారా పరిపాలించకుండా, తాము జయించిన రాజులద్వారానే పరిపాలిస్తూ ఉండేవారు. ఆలాటి వారు చక్రవర్తులకు సామంతులై వారికి కప్పంకడుతూ, తమ తమ రాజ్యాలను ప్రాంతీయపరిస్థితులకు అనుగుణంగా సంప్రదాయసిద్ధాన పరిపాలిస్తూ ఉండేవారు. మౌర్యులు, గుప్తులు, మొగలాయీలు మొదలైన చారిత్రకకాలంలోని పరిపాలకులు దీనికి అన్యథాగా కొన్ని ప్రాంతాలలో పరిపాలనను సాగించుటకు సొంత గవర్నరులను నియమించినా, ఆ గవర్నరులకు ఎక్కువ అధికారాలను ఒప్పగిస్తూ ఉండేవారు. సామాన్యంగా గవర్నరుల ఇష్టానుసారం ప్రాంతీయపరిపాలన జరుగుతూ ఉండేది. చక్రవర్తులు పర్యవేక్షణతో తృప్తిపడిఉండేవారు. ప్రాంతా లనేకాలు రాజధానికి దూరంగా ఉండడంచేత, ఈలాటి వికేంద్రవిధానం తప్పనిసరి అయింది. ఒక్కొక్కప్పుడు వీరు చక్రవర్తులపై తిరుగుబాటు చేస్తూ ఉండేవారు. వికేంద్రవిధానంలో ఈలాటి ప్రమాదం ఉండినా, దేశం యొక్క విస్తీర్ణాధిక్యంవల్ల మార్గాంతరం లేకపోయింది. బ్రిటిష్‌వారు 1833 లో ఈ విధానాన్ని రద్దుజేసి, రాజ్యాధికారాన్నంతా కేంద్రీకృతంచేసి, కొంతకాలం పరిపాలన సాగించారు. కాని దానిమూలంగా చాలా చిక్కులు సంభవించాయి. అందుచేత 1861 తర్వాత క్రమక్రమంగా కేంద్ర ప్రభుత్వాధికారాలను సడలించి రాష్ట్రప్రభుత్వాలకు ఎక్కువ అధికారాలను సంక్రమింపజేశారు. సమాఖ్య (Federal=ఫెడరల్) విధానం అనేది వికేంద్రీకరణంయొక్క ఉచ్చస్థితి. 1935 లో బ్రిటిష్‌వారు దేశంలో సమాఖ్యవిధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రాంతాలమధ్య పరిస్థితులనుబట్టి భేదం ఏర్పడ్డ కారణాన, మనదేశానికి ఇదే తగినవిధానం అని, మన నాయకులు గ్రహించి, దీనికి అనుగుణంగా రాజ్యాంగశాసనాన్ని 1946—50 లో (స్వరాజ్యం లభించినతర్వాత) నిర్మాణం చేశారు. ప్రస్తుతం మనదేశం సమాఖ్యవిధాన పరిపాలింపబడడానికి కారణం కొంతవరకు దేశంయొక్క విస్తీర్ణాధిక్యం అని ఇది స్పష్టం చేస్తూ ఉంది. ప్రపంచంలోని కెనడా, ఆస్ట్రేలియావంటి తక్కిన విస్తీర్ణాధిక్యంగల ప్రజాస్వామికదేశాలలో ఈ విధానమే అనుసరింపబడుతూ ఉంది.

ప్రాంతాలమధ్య భేదాలు ఏర్పడడానికి దేశంయొక్క విస్తీర్ణమే కాకుండా, ఇంకొక సహజ లక్షణం కూడా కారణం అయింది. మనదేశంలో ఒక ప్రాంతానుండి ఇంకొక ప్రాంతానికి వెళ్లడంలో, భౌగోళికాలైన అవరోధాలను ఎన్నిటినో దాటవలసివుంది. హిమాలయప్రాంతాలు ఈ లక్షణాలతో కూడుకొన్న కారణాన కాశ్మీరు, నేపాలు, ఆసాం మొదలైనవి గంగా మైదానమునుండి వేరుపడిపోయాయి. ఈ మైదానానికి దక్షిణంగా వింధ్య పర్వతాలు, సాత్పురా పర్వతాలు, దండకారణ్యం మొదలైనవి ఉండడంచేత, ఆర్యావర్తం దక్షిణాపథానుండి అనాదిగా వేరుపడిపోయింది. ఈ రెండింటికి మధ్య రాక పోకలు సులభంకావు. ఇదేవిధంగా, సింధు రాజస్థాన్‌లలోని ఎడారులమూలంగా ఈప్రాంతాలే కాకుండా పశ్చిమభారతంలోని సౌరాష్ట్రం, ఘూర్జరం మొదలైనవి ప్రత్యేకప్రాంతా లయ్యాయి. పడమటి కనుమలు, తూర్పుకనుమలు, వీటిమధ్యఉండే అరణ్యాలు ఈప్రదేశాలలో ప్రవహించే గోదావరి, కృష్ణ, కావేరీ నదులు దక్షిణాపథంలో ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, ద్రావిడ రాజ్యాలు వేరు వేరుగా ఏర్పడడానికి కారణాలయ్యాయి. దుర్గమములైన కొండలు, దుర్భేద్యములైన అరణ్యములు అడ్డుగా ఉండడం చేతనే సవరలు, కోయలు, జాండ్లు, భిల్లులు, గంటాలులు మొదలైన ఆదిమజాతులవారికి నివాసస్థానాలైన మన్నె ప్రాంతాలు ఏర్పడ్డాయి.

వేలకొలది సంవత్సరాలుగా దేశంలోఉన్నట్టి అంగ, వంగ, కళింగ, కాశ్మీర, కర్ణాట, ఆంధ్ర, ద్రావిడాది విభాగాలన్నీ, చాలావరకు ప్రకృతిసిద్ధములైన భౌగోళిక లక్షణముల ఫలితములు కాని, మానవకల్పితములుకావు. భౌగోళికంగా దేశానికంతా ఒకవిధమైన ఏకత్వం ఏర్పడ్డట్లే ఈ ఆటంకాలమూలాన ఒక విధమైన భిన్నత్వంకూడా ఏర్పడ్డది. ఏకత్వం కారణంగా దేశమంతా ఒక చక్రవర్తి క్షేత్రం కావడం, ఒక మూలసంస్కృతి దేశం అంతటా వ్యాపించడం జరిగాయి. కాని, భిన్నత్వంకూడా ఉండడంచేత, వివిధప్రాంతాలలో వివిధభాషలు, వేరు వేరు స్వతంత్రరాజ్యాలు, వేరు వేరు ఉప సంస్కృతులు ఏర్పడడం జరిగింది. ఒక్కొక్క ప్రాంతం ఒక్కొక్క భాష మాట్లాడే వారికి నివాసస్థానం కావడంచేతను, అందులో స్వతంత్ర రాజ్యం ఒకటి స్థాపింపబడడంచేతను, ఈ రెండింటి ఫలితంగా అచ్చటి ప్రజల జీవితవిధానంలోను ఆచార వ్యవహారాలలోను ప్రత్యేకమైన విశిష్టత ఒకటి ఏర్పడడంచేతను, అక్కడివారిలో ప్రాంతీయాభిమానం నాటుకుపోయింది. దేశాన్నంతా జయించి పాలించే ఉద్దేశంతో విజిగీషులు దిగ్విజయాన్ని సాధించినప్పుడు, వారి ప్రయత్నాలను ప్రతిఘటించి, తమ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకొనడం ధర్మం అని ప్రాంతీయరాజ్యాలను పరిపాలిస్తూ ఉండిన రాజులు భావించారు. ఇప్పుడు కూడా ఈలాటి ప్రాంతీయ మనస్తత్వం ప్రజలలో ఉన్నది. కొంతవరకైనా తమ ప్రాంతాన్ని తమకు ఇష్టం వచ్చినట్లు పరిపాలించుకొనే అవకాశం ఉండవలెననే అభిప్రాయం దేశంలో వ్యాపించి ఉంది. భాషాప్రయుక్తరాష్ట్రాలకు దారితీసింది ఇదే. ఇందుచేతనే, వికేంద్రవిధానానికి మరింత అవసరం ఏర్పడ్డది.

ఈ వివరణనుబట్టి, భౌగోళికంగా మన దేశానికి కొన్ని స్వభావసిద్ధములైన లక్షణాలు ఉండడంచేత మనకు తగిన పరిపాలనవిధానం కేంద్రీకృతమైన ఏకైక (Unitary = యూని

టరీ) విధానం కాదనిన్నీ, సమాఖ్య (Federal) విధానమే అనిన్నీ స్పష్టం అవుతూ ఉంది. అందుచేతనే మనం 1947—49 లో సమాఖ్య రాజ్యాంగవిధానాన్ని నిర్మాణం చేసుకొన్నాం. ఇప్పుడు అమలులోఉండేది ఇదే.

2

దేశంయొక్క భౌగోళిక లక్షణాలకు పరిపాలన విధానానికి సంబంధం ఉన్నట్లే దేశంలోని ప్రజల మనోభావాలకు పరిపాలనవిధానానికి సంబంధం ఉంది.

ఈ సందర్భంలో మనం ఒక విషయాన్ని గురించి ప్రధానంగా ఆలోచించవలసి ఉంది. మానవుని అభిమానానికి పాత్రములైనవి ఎన్నో వున్నాయి. కుటుంబం, కులం, జాతి, వర్ణం, మతం, భాష, రాష్ట్రం, దేశం మొదలైనవి ఈలాటివి. వీటిని అన్నిటిని అతడు సమానంగా అభిమానించడు. కొన్నిటిపై ఎక్కువ అభిమానం చూపించడం, కొన్నిటిపై తక్కువ అభిమానం చూపించడం, కొన్నిటిపై ఏలాటి ప్రత్యేక అభిమానం చూపించకపోవడం అతనికి సహజం. అతని పరిస్థితులు, బాల్యంలో అతడుపొందే శిక్షణ మొదలైనవాటిమూలంగా ఈ అభిమాన తారతమ్యాలు ఏర్పడుతూ ఉంటవి. కాని ఇవి ఏలాగు ఏర్పడినా, వీటి కారణాన కొన్ని పరిపాలనవిధానాలు సౌష్ఠవంగా ఉండడం, మరికొన్ని సౌష్ఠవరహితంగా ఉండడం, జరుగుతుంది. ఇందుచేతనే ఒక దేశంలో విజయవంతంగా సాగే పరిపాలనవిధానం ఇంకొకదేశంలో సార్థకం కాకపోతూ ఉంటుంది.

ప్రస్తుతం మనం ఏర్పరచుకొన్న పరిపాలనవిధానానికి నాలుగు ప్రధాన లక్షణాలు ఉన్నాయి. అది ప్రజాస్వామిక విధానం. అందులో ప్రతి పౌరునికి కొన్ని ప్రాథమిక హక్కులు కల్పించబడిఉన్నవి. ఇంతేకాకుండా మతాన్నిబట్టి, కులాన్నిబట్టి, భాషనుబట్టి అల్పసంఖ్యాకులుగా నిర్ణయింపబడినవారికి కొన్ని ప్రత్యేక హామీలు, సదుపాయాలు లభించిఉన్నాయి. మన విధానం సమాఖ్యవిధానం అని ఇదివరకే చెప్పబడ్డది. మనదేశంలోని ప్రజలమధ్య ఏర్పడ్డ విభేదాలు కొంతవరకు ఈ లక్షణాలకు కారణాలు.

పరిపాలనసౌష్ఠవ దృష్ట్యా మన ప్రజలలో దేశాభిమానం అగ్రస్థానం వహించవలసిఉంది. ఆలాటి అగ్రస్థానం వహించిన దేశాభిమానానికి కొన్ని ప్రధాన లక్షణాలు ఉంటవి. (1) అది దేశంలో తాము నివసించే ప్రాంతానికి మాత్రం—ఆంధ్రానికి, మహారాష్ట్రానికి, కర్నాటకానికి మాత్రం—పరిమితం కాకుండా దేశానికంతా వ్యాప్తమై ఉంటుంది. తాము నివసించే ప్రాంతమే తమ దేశం అని, భరతఖండంలో తక్కిన భాగాలకు ఏగతి పట్టినా తమ ప్రాంతం సురక్షితంగా ఉంటే చాలునని అనుకొనేవారిలో దేశాభిమానం లేదనే చెప్పవలసివస్తుంది. ఇటీవలివరకు మన ప్రజలలో ఈలాటి సంకుచితాభిమానం మాత్రమే ఉండేది. అందుచేతనే పరాయివారు దేశాన్ని జయించగలిగారు. గత యాభై సంవత్సరాలుగా ఈ మనస్తత్వం మారుతూ వస్తూ ఉంది. దేశాభిమానం అంకురదశలో ఉంది. (2) భారతదేశంలో ప్రతి అంగుళం భూమి, భారతీయులందరిది అనే భావం దేశాభిమానానికి రెండవ లక్షణం. సమిష్టి కుటుంబపు ఆస్తిపై కుటుంబంలోనివా రందరికీ హక్కు ఉన్నట్లు, భారతదేశంపై భారతీయులందరికీ హక్కు ఉంది. ఏవో కొన్ని పరిపాలనసౌకర్యాలకై దేశాన్ని ఆంధ్ర, అస్సాం, మద్రాసు, మహారాష్ట్ర, మైసూరు, కేరళ మొదలైన భాషాప్రయుక్తరాష్ట్రాలుగా విభజించినంతమాత్రాన ఆంధ్రరాష్ట్రం ఆంధ్రులదిమాత్రమే అని, తక్కిన భారతీయులెవ్వరు ఆంధ్రులతో సమానమైన హక్కులు అనుభవిస్తూ, ఆ రాష్ట్రంలో నివసించరాదనీ, ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం ఒకటి ఉన్నది కాబట్టి వారు ఇతర రాష్ట్రాలకువెళ్ళి, ఆ రాష్ట్రాలలోనివారితో సరిసమానంగా ఆస్తిపాస్తులను సంపాదించుకొని వర్తకవ్యాపారాలు చేసుకొంటూ గడపడానికి వీలులేదనీ భావించడం, వాదించడం దేశాభిమానానికి విరుద్ధం. ఆంధ్రరాష్ట్రంపై ఆంధ్రులకు ఎంత హక్కు ఉన్నదో తక్కిన భారతీయులకు కూడా అంతహక్కు ఉన్నది. ఆలాగే మద్రాసు రాష్ట్రంపై అరవలకు ఎంత హక్కు ఉన్నదో ఆంధ్రులకు తదితర భారతీయులకు అంత హక్కు ఉన్నది. (ఇప్పటి మన రాజ్యాంగం దీనిని సమర్థిస్తున్నది.) ఈలాగు ఉన్నది అనేభావం ప్రజలలో ఉంటే దేశాభిమానం ఉన్నట్లు, లేకపోతే లేనట్లు. "దేశమంటే మట్టికాదోయ్; దేశమంటే మనుషులోయ్" అని కవి అన్నాడు. దేశాభిమానం అంటే దేశంలో ఉండే ప్రజలందరిపై అభిమానం అన్నమాట. భారతీయులలో ఎవరు కూడా తక్కిన భారతీయులకు పరాయివారు కాకూడదు. (3) దేశాభిమానంఅంటే దేశం అంతా—ఏలాటి మినహాయింపు లేకుండా—ఒక కేంద్రప్రభుత్వానికి లోబడి ఉండవలెననే అభిమానం. ఈలాటి అభిమానం లేకపోవడంచేత ప్రాచీన మధ్యయుగాలలో దేశంలో అనేక స్వతంత్రరాజ్యాలు ఏర్పడడం, వాటిమధ్య యుద్ధాలు సంభవించడం, పరాయివారైన ఆఫ్గనులు, తురుష్కులు, మొగలాయీలు, బ్రిటిష్‌వారు ఒక రాజ్యంతర్వాత ఇంకొక రాజ్యాన్ని జయించి, తుదకు దేశాన్నంతా కబళించి వశపరచుకొనడం జరిగింది. దేశాభిమానంగలవాడు, దేశ చరిత్రనుండి ఈ సత్యాన్ని గ్రహించి, ఇకమీదట ఈలాటిది జరగకుండా ఉండడానికి బలిష్ఠమైన కేంద్రప్రభుత్వం ఒక్కటే సాధనమన్నదానిలో పూర్తి విశ్వాసం కలవాడు కావలెను. పాకిస్తాన్ మోస్తరుగా దేశంలోనుండి ఏ భాగం కూడా విడిపోయి స్వతంత్ర రాజ్యంగా రూపొందడాన్ని ప్రతిఘటించవలెను. కేంద్రప్రభుత్వం బలిష్ఠం కావడానికి కావలసిన అర్థబలాన్ని, అంగబలాన్ని సమకూర్చడానికి సిద్ధపడవలెను. (4) "భారతదేశం భారతీయులది; పరాయివారిది కాదు. ఇందులో అంగుళం భూమి కూడా విదేశీయులకు చెందరాదు. దీనికి అన్యథాగా పరాయివా రెవరైనా భారత భూభాగాన్ని అపహరించడానికి ప్రయత్నిస్తే, వారిని ప్రతిఘటించడంలో మా సర్వస్వాన్ని ప్రాణాలను త్యాగం చేస్తాము" అనే దీక్ష దేశాభిమానానికి ఇంకొక లక్షణం. ఈ నాలుగు లక్షణాలతో కూడిన దేశాభిమానమే నిజమైన దేశాభిమానం; సంపూర్ణమైన దేశాభిమానం.

ఈలాటి దేశాభిమానం ప్రజలందరిలో ఉన్నదా? ఉంటే ఎంత గాఢంగా ఉన్నది? అభిమానాలన్నిటిలో ఇది అగ్రస్థానం వహించిఉన్నదా? ఇది కాదని చైనా, రష్యా మొదలైన విదేశాలపట్ల అభిమానం చూపించేవారు దేశంలో ఉన్నారా? అనే ప్రశ్నలెన్నో ఈ సందర్భంలో తలఎత్తడం సహజం. వీటికి ఎవరికివారే వారి మనస్సులను పరిశోధించి జవాబు చెప్పుకొనవలసిఉంది. మనలోఉండే విభేదాలు, వాటిమూలంగా అప్పుడప్పుడు సంభవించే పరిణామాలు, గతం కాలంలోని మన ప్రవర్తన—ఈలాటి ప్రశ్నలు బయలు దేరడానికి కారణం. వీటిమూలంగా అనేకులు మన దేశాభిమానాన్ని శంకించడం జరుగుతూ ఉంది.

3

మనలో జాతి, మతం, భాష, కులం అనే నాలుగింటి మూలంగా భేదాలు ఏర్పడిఉన్నాయి. వీటిమూలంగా దేశానికి విచ్ఛిత్తి, దేశైక్యతకు భంగం, వ్యక్తులకు అన్యాయం కలిగే ప్రమాదం ఉండడంచేత వీటిని గురించి ఇచ్చట ప్రస్తావించవలసిన అవసరం ఉన్నది.

చరిత్రపరిశోధన వలన బహు ప్రాచీనకాలంలో "నీగ్రిటో" జాతివారు, "ఆస్ట్రలాయిడ్" జాతివారు దేశంలో ప్రవేశించినట్లు, తర్వాత ద్రావిడులు, ఆర్యులు, మంగోలాయిడ్లు వచ్చినట్లు తెలుస్తూఉంది. క్రమక్రమంగా వీరందర్నూ చాలవరకు కలిసిపొయ్యారుగాని పూర్తిగా కలసిపోలేదు. బహు ప్రాచీనకాలంలో ప్రవేశించినవారిలో అనేకులు, తర్వాత వచ్చిన వారి దెబ్బలకు తాళలేక, దుర్గమములైన కొండలలోకి, అరణ్యాలలోకి పారిపోయి, ప్రత్యేక జాతులుగా ఇప్పటివరకూ నిలబడి పొయ్యారు. మన్నెప్రాంతాలలోని సవరలు, కోయలు, భిల్లులు, నాగులు మొదలైన ఆదివాసులు ఈలాటివారు. మన రాజ్యాంగంలో వీరు షెడ్యూల్డు జాతులుగ (Scheduled tribes) పేర్కొనబడ్డారు. వీరి సంఖ్య సుమారు రెండు కోట్లన్నర. రెండు వేల సంవత్సరాల క్రిందట వీరి పూర్వులు ఏలాటిస్థితిలో ఉండినారో ఆలాటి స్థితిలోనే వీరు ఇప్పటికికూడా ఉన్నారు. వీరు మైదానప్రదేశాలలోఉన్న నాగరికజాతులతో కలిసిపోయే అవకాశాలు ఇటీవలివరకు ఏర్పడలేదు. వారి అభిమానాలు, వారి దృక్పథం, వారు నివసించే ప్రదేశాలకు మాత్రమే పరిమితమై ఉండడంలో ఏలాటి ఆశ్చర్యంలేదు. అన్ని విధాలుగా వారు వెనుకబడిఉండడంచేత తక్కిన భారతీయులకు అనుగుణమైన ప్రభుత్వం వారికి తగదనే కారణాన వారికి ప్రత్యేక సదుపాయాలను రాజ్యాంగం కల్పించింది. వీటిమూలంగా అన్ని రంగాలలో క్రమక్రమంగా వారు అభివృద్ధిగాంచి, భారత రాజ్యంలో తమ శ్రేయస్సుకు ఏలాటి భంగం కలగదనే నమ్మకంకలవారైతే, వారివలన ఏలాటి ప్రమాదం సంభవించదు. పూర్తిగా, ఆలాటి నమ్మకం కుదురని కారణాన, అసాం ప్రాంతంలోని నాగజాతివారు దేశరక్షణకు ప్రమాదం కలిగించే చర్యలలోకి దిగారు. తక్కిన ఆదిమజాతులవారు — బస్తరుప్రాంతంలోనివారు తదితరులు—ఈలాగు ప్రవర్తించకుండా ఉండేటట్లు తగిన చర్యలను తీసుకోవలసి ఉంది. వారికి ఏలాటి అసంతృప్తి కలగకుండా, తక్కిన భారతీయులు, దేశ ప్రభుత్వం ప్రవర్తించవలసి వుంది. నవభారత పరిపాలనలో మనం ఎదుర్కొనవలసిన సమస్యలలో ఆదిమజాతులసమస్య చాలా ప్రధానమైనది, క్లిష్టమైనది కూడా. జాతిభేదం పరిపాలనవిధానంపై ఏలాటి ప్రభావం వహిస్తున్నదో ఇది సూచిస్తూ ఉంది.

జాతులంతా పూర్తిగా కలియకపోవడంచేత అరవ ప్రాంతంలోనివారు కొందరు తాము ద్రావిడజాతివారనీ, ఉత్తరభారతంలోనివారు ఆర్యజాతివారని, భిన్న జాతులవారు ఒకే కేంద్రప్రభుత్వానికి లోబడడం తగదని, అలాగు లోబడడం ఆర్యజాతికి ద్రావిడజాతి లోబడడమే అనిన్నీ, ఆకారణంచేత అరవప్రాంతమంతా ఒక ప్రత్యేక స్వతంత్ర ద్రావిడస్థాన *రాజ్యంగా రూపొందవలెనని ఒకవాదం లేవదీశారు. ఇది జిన్నా* లేవదీసిన పాకిస్తాన్‌వాదం వంటిది. ఈవాదం సహేతుకం కాకపోయినా, ప్రజలలో కొందరు దీనికి సుముఖంగా ఉండడం మనం గుర్తించవలసి ఉంది. ఈలాటివారిలో దేశాభిమానాన్ని పుట్టించి వృద్ధిచేయడం ఏలాగు? అనేది ప్రస్తుతం మనం ఎదుర్కొనవలసిన సమస్యలలో ఒకటిగా ఏర్పడ్డది. ఆర్యులు, ద్రావిడులు భిన్నజాతులుగా ఉండిన కాలం ఏనాటిదో? ఇంతకూ వారిభిన్నత్వం జాతినిబట్టి వచ్చినట్టిదా అనేది కూడా స్పష్టంకాలేదు. ఒక్కొక్కప్పుడు చరిత్రపరిశోధన ప్రమాద పరిస్థితులకు దారితీస్తుందని అనుకొనడానికి ఇది ఒక తార్కాణం.

4

మనలో మతాన్నిబట్టికూడా భేదాలు ఏర్పడివున్నాయి. దేశంలో అధికసంఖ్యాకులు హిందువులు. వారుగాక సుమారు నాలుగుకోట్ల మహమ్మదీయులు, ఎనభైలక్షల క్రైస్తవులు, అరవై లక్షలు శిక్కులు, కొన్ని లక్షల ఇతర మతస్థులు ఉన్నారు. ప్రపంచంలో మత భేదాలుఉండే దేశాలు—మనదేశం వంటివి—ఎన్నో ఉన్నాయి. కాని ఇవి మనదేశంలో ఒకవిధమైన రాజకీయ వైపరీత్యానికి దారితీశాయి. కొంతవరకు దీనికి మన చరిత్ర కారణం. మహమ్మదీయమతాన్ని అవలంబించిన ఆఫ్గన్లు, తురుష్కులు, మొగలాయీలు మనదేశంలో చాలా భాగాన్ని జయించి కొంతకాలం పాలించారు. ఆకాలంలో హిందువులు వారికి లోబడి ఉంటూవచ్చారు. బ్రిటిష్‌వారు దేశాననుండి తొలగి, స్వరాజ్యం ఏర్పడితే అల్ప సంఖ్యాకులైన తాము అధిక సంఖ్యాకులైన హిందువులకు లోబడి పోవడమే అవుతుందనీ, ఒకప్పుడు హిందువులను పాలిస్తూవచ్చిన తాము ఇప్పుడు వారికి లోబడడం తమ గౌరవప్రతిష్ఠలకు భంగకరమనీ మహమ్మదీయు లనేకులు భావించి, పాకిస్తాన్ ఉద్యమాన్ని లేవదీసి, దేశవిభజన అనివార్యం అయ్యేటట్లు ప్రవర్తించారు. అనాదిగా ఒక చక్రవర్తిక్షేత్రంగా పరిగణింపబడుతూవచ్చిన భరతఖండం రెండు ముక్కలుగా చీలిపోయింది. దీనికి కారణం మతాన్ని బట్టి మనలో ఏర్పడ్డ విభేదం. పాకిస్థాన్ ఉద్యమాన్ని లేవదీసిన వారిలోను, దానిని సమర్థించిన వారిలోను, దేశాభిమానం శూన్య

మై పోయింది. మతాభిమానానికి వారు అగ్రస్థానం కల్పించారు. పాకిస్థాన్ విడిపోయినతర్వాత కూడా, భారత రాజ్యంలో నాలుగు కోట్ల మహమ్మదీయులు ఉన్నారు. వీరిలో హృదయపరివర్తనం ఎంతవరకు జరిగిందో, భారతరాజ్యంలో పౌరులుగా ఉండి దానిపట్ల ఇతరపౌరులవలె భక్తి శ్రద్ధలతో ప్రవర్తించడానికి మనసారా ఎందరు అభిలషిస్తున్నారో అనేదాన్ని గురించి శంకించేవారు దేశంలో లేకపోలేదు. ఇట్టి సందేహం ఉండడం చాలా విచారకరం. దీనిని తొలగించడం ఏలాగు అనేది మన సమస్యలలో ఒకటి.

శిక్కులలో కొందరు పాకిస్థాన్‌వాదులధోరణిలో ఉన్నారు. ఒకప్పుడు శిక్కులు వారి మతాన్ని ఆధారంచేసుకొని, పంజాబులో గొప్ప రాజ్యం సంపాదించి, బ్రిటిష్‌వారితో సరిసమానంగా యుద్ధంచేయగలవారనే ప్రఖ్యాతిని పొందారు. వారి చరిత్రలో మతానికి, రాజ్యానికి సన్నిహిత సంబంధం ఏర్పడ్డది. దానిని వారు పూర్తిగా మరచిపోవడానికి సిద్ధంగాలేరు. ఇంతేకాక, దేశవిభజనమూలంగా వారు చాలా నష్టపడ్డారు. వారి ఆస్తులలో చాలా భాగం, వారి పుణ్యక్షేత్రాలలో అనేకాలు పాకిస్థాన్‌లో ఉండిపొయ్యాయి. అనేకులు వారి జన్మభూమిని కోల్పోయారు. ఈ కారణాలచేత వారిలో కొందరు ప్రత్యేక రాష్ట్రం కావలెననే ఆందోళనను లేవదీసి, దానిని సాధించడానికి కంకణం కట్టుకొని, సత్యాగ్రహఉద్యమాలను ప్రారంభిస్తున్నారు. వారిలో కొందరి ఉద్దేశం శిక్కుస్థానం అనే పేరుతో ప్రత్యేక స్వతంత్రరాజ్యాన్ని స్థాపించడమే.

మతసహనానికి మనదేశం, మన సంస్కృతి అనాదిగా ప్రసిద్ధిగాంచినవి. మన రాజులు అన్నిమతాలకు ఆశ్రయం ఇచ్చారు. స్వరాజ్యం వచ్చినతర్వాత మనం నిర్మాణం చేసుకొన్న రాజ్యాంగం అన్ని మతాలకు సమానమైన ఆదరణను చూపించే లౌకికరాజ్యాంగం. మహమ్మదీయులుగాని, శిక్కులుగాని, మరి ఏ ఇతర మతస్థులుగాని వారివారి మతాలను వారి ఇష్టానుసారం సంప్రదాయానుసారం అనుసరించడానికే కాకుండా ఇతరులకు బోధించడానికికూడా హక్కు కలవారుగా ఉన్నారు. మతభేదాలు ప్రజలలో ఉన్నవన్న విషయాన్ని రాజ్యాంగనిర్మాతలు గ్రహించి రాజ్యాంగంలో ఈలాటి హక్కులను చేర్చారు. ఈలాటి సందర్భంలో, తమకు ప్రత్యేకరాజ్యం ఉన్నప్పుడే తమ మతం సార్థక్యం పొందగలదనే భ్రమలో కొందరుపడి, దేశ విచ్ఛిత్తికి దారితీయడం విచారించతగ్గది. అలాటివారిలో మతాభిమానం దురభిమానంగాను, ఆవేశంగాను, మతాంతరులకు ప్రమాదకరంగాను పరిణమించింది.

దేశంలో ఎనభైలక్షల క్రైస్తవులు ఉన్నా, వారు ఇప్పటివరకు విచ్ఛిన్న ఉద్యమాలలోకిగాని, ప్రత్యేక హక్కులను కోరడంలోకిగాని దిగలేదు. శిక్కులు, మహమ్మదీయులవలె వారు భౌగోళికంగా ఒక ప్రత్యేకప్రాంతంలో కేంద్రీకృతం కాకపోవడం, చారిత్రకంగా ఇదివరలో వారికి ఒక ప్రత్యేక రాజ్యం లేకపోవడం, దీనికి కారణం. ఇప్పటివరకు రాజ్యాంగం ప్రసాదించిన మతహక్కులు వారికి తృప్తిని కలిగించాయి. కాని కేరళ రాష్ట్రంలో వారు అధికసంఖ్యాకులుగా ఉండడంచేత అక్కడి రాజకీయాలపై మతప్రభావం ఉండే సూచనలు కనిపిస్తున్నవి.

పార్శీమతస్థులు కూడా రాజకీయంగా ప్రత్యేక హక్కులను వేనినీ కోరలేదు. వారు, వారి దృష్టినంతా వర్తక వ్యాపారాలలోను, పరిశ్రమలలోను కేంద్రీకరించి, ఆర్థికంగా ఎంతో ముందుకు వస్తున్నారు. రాజ్యాంగం అన్ని మతాలవారికి సమానగౌరవం కలిగిస్తూ ఉన్నదన్న సత్యాన్ని వారు పూర్తిగా గ్రహించారు.

5

ప్రజలలో భాషనుబట్టికూడా, భేదాలు ఏర్పడి ఉన్నాయి. ఇంగ్లండు, ఫ్రాన్సు, యునైటెడ్‌స్టేట్సు, జపాన్ మొదలైనదేశాలలో ప్రజలందరు ఒకే భాషను మాట్లాడేవారు. ఆదేశాల ప్రజలలో భాష కారణంగా, అనైకమత్యం ఏర్పడడానికిగాని, దేశాభిమానం కుంటుబడడానికిగాని అవకాశం లేదు. వారందరు ఒకేభాషను మాట్లాడేవారు కావడంచేత, ఒక ప్రాంతంలోనివారి అభిప్రాయాలను తక్కినప్రాంతాలలోని వారు గ్రహించడంలో ఏలాటి ఇబ్బందులులేవు. ఇది వారి ఐక్యభావాన్ని వృద్ధిచేయడంలో ఎంతో తోడ్పడుతూ ఉంది. మన దేశంలోని పరిస్థితులు ఈలాటివి కావు. మనప్రజలు రాజ్యాంగం గుర్తించిన (1) అస్సామీస్ (2) బంగాళి, (3) గుజరాతి, (4) హిందీ, (5) కన్నడం, (6) కాశ్మీర్, (7) మలయాళం, (8) మరాటి, (9) ఒరియా, (10), పంజాబి, (11) తమిళం, (12) తెలుగు, (13) ఉర్దూభాషలనేగాక, మరికొన్ని భాషలను కూడా మాట్లాడేవారుగా ఉన్నారు. భిన్న భాషలు మాట్లాడే ప్రజలు గల కనడా, స్విట్జర్లాండు, దక్షిణ ఆఫ్రికావంటి రాజ్యాలు ప్రపంచంలో కొన్ని ఉన్నా, ఏరాజ్యంలో కూడా మనదేశంలో ఉన్నన్ని ప్రధానభాషలు లేవు.

"ప్రజలలో ఎన్ని భాషలుఉంటే ఏమిటి? అందరూ భారతీయులు, భారత రాజ్యంలో సమానత్వంగల పౌరులు" అన్న భావం ప్రజలలోఉంటే, భాషనుబట్టి ఏర్పడ్డ భేదాలు రాజకీయంగా ఏలాటి ప్రభావాన్ని వహించవు. కాని, ఈలాటి భావం దేశంలో ఇంకా పూర్తిగా నాటుకోలేదు. తాము మాట్లాడే భాషను మాట్లాడనివారు భారతీయులైనా తమకు పరాయివారనేభావం ప్రజలలో వ్యాపించిఉండడంచేత, దేశాభిమానాన్ని బలహీనపరచే శక్తులలో ఈభావం ఒకటిగా పరిణమించి, దేశైక్యతకు ప్రజాస్వామిక విధానానికి భంగం కలిగిస్తూ ఉంది.

దేశంలోని రాష్ట్రాలను భాషలనుబట్టి పునర్నిర్మాణం చేయడం దీనిమూలంగా జరిగింది. ఒక్కొక రాష్ట్రంలో ఒకేభాషను మాట్లాడేవారుమాత్రమే ఉండడం పరిపాలన సౌకర్యానికి తోడ్పడడం వాస్తవమే. ప్రజాభిప్రాయాలను అనుసరించి పరిపాలన జరగవలసిన మనరాజ్యంవంటి ప్రజా రాజ్యాలలో భాషాప్రయుక్తరాష్ట్రాల మూలాన, ప్రజల అభిప్రాయాలు పరిపాలకులు తెలుసుకొనడం, పరిపాలకుల అభిప్రాయాలను ప్రజలు తెలుసుకొనడం సులభం కావడం కూడా వాస్తవమే. కాని,

ఈ భాషాప్రయుక్తరాష్ట్రాలు కొన్ని విపరీతాలకు దారితీస్తూ ఉండడం మనం గుర్తించవలసి ఉంది. ఈ విపరీతాలు బలపడిన పక్షాన దేశైక్యత లోపించడం, రాజ్యవిచ్ఛిత్తి జరగడం, దేశానికి విదేశీయులమూలంగా ప్రమాదం సంభవించడం తప్పదు. మతాభిమానం మతోన్మాదంగాను పరమత ద్వేషంగాను రూపొంద కూడనట్లు భాషాభిమానం భాషోన్మాదంగాను పరభాషల ద్వేషం గాను, రూపొందరాదు.

మనది భౌగోళికంగా ఒకేదేశం కావడంచేతను, ఒకే దేశం అన్నభావం ఆసేతు హిమాచల పర్యంతముండే ప్రజలందరిలో అనాదిగా నాటుకొని ఉండడంచేతను, అందరి మూల సంస్కృతి ఒకటే కావడంచేతను, దేశంలో అప్పుడప్పుడు స్థాపింపబడ్డ సామ్రాజ్యాలు భిన్న కేంద్రాలనుండి స్థాపింపబడడంచేతను, అన్నిభాషలను మాట్లాడేవారు కొద్దిగానో గొప్పగానో దేశంలో అన్నిప్రాంతాలకువెళ్ళి, వారి వారికి తోచిన ప్రదేశాలలో స్థిర నివాసాలను ఏర్పరచుకొని, తర తరాలుగా ఉండిపోవడం జరిగింది. ఈలాగు వెళ్ళినవారిలో కొందరు వారి తొలిభాషను మరచి ప్రాంతీయభాషలను మాట్లాడడం సంభవించింది; మరికొందరు ఇప్పటికి కూడా వారి తొలి భాషనే మాట్లాడుతున్నారు. చోళుల కాలంలో తమిళ దేశాన నుండి ఆంధ్ర దేశానికి ఎందరో తమిళం మాట్లాడే ద్రావిడులు వచ్చారు. వారిలో చాలా భాగం వారి తొలి మాతృభాషను—తమిళమును—మరచి తెనుగును, మాట్లాడుతున్నారు; మరికొందరు ఇప్పటికి కూడా తమిళమునే మాట్లాడుతున్నారు. ఈలాగే, విజయనగరసామ్రాజ్యం తమిళదేశంలో వ్యాపించినకాలంలో తెలుగువారనేకులు తమిళదేశానికివెళ్ళి అక్కడే స్థిరంగా ఉండిపోయారు. వారిలో చాలామంది ఇప్పటికికూడా వారి ఇండ్లలో తెలుగే మాట్లాడుకొంటున్నారు. ఈవిధంగా తెలుగు వారి మధ్య ఒరియా మాట్లాడేవారు, ఒరియాలమధ్య తెలుగు మాట్లాడేవారు, బంగాళీ మాట్లాడేవారిమధ్య ఒరియావారు, హిందీ వారు, అసామీస్ మాట్లాడేవారిమధ్య బంగాళీ మాట్లాడేవారు కలసిపోయి ఉన్నారు. భాషనుబట్టి ఇటీవల మనం పునర్నిర్మాణం చేసుకొన్న ప్రతి రాష్ట్రంలోను అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషతోపాటు అల్ప సంఖ్యాకులు మాట్లాడే భాషలు కూడా ఉన్నాయి. ఏ రాష్ట్రంలో కూడా ఒకే భాషను మాత్రమే మాట్లాడేవారులేరు. ఒకేప్రాంతంలో భిన్నభాషలను మాట్లాడేవారు ఉండడం ఏలాటి వైపరీత్యం లేదనేభావం అనాదిగా ప్రజలలో ఉంటూ వచ్చింది. ప్రాంతాలను పాలించిన రాజులు భాషనుబట్టి పౌరులమధ్య ఏలాటి విచక్షణను తర తమ భేదాలను కల్పించినవారుకారు. కాని భాషాప్రయుక్త రాష్ట్ర సిద్ధాంతం ప్రభావంగా ఇదంతా తారుమారై పోయింది. ఒక్కొక్క రాష్ట్రంలో ఆ రాష్ట్రభాషను మాట్లాడేవారు మాత్రమే ఉండవలెననీ, ఇతర భాషలను మాట్లాడేవారు వారి భాషలను వదలుకొనవలెనని, వదలుకొననిపక్షాన విద్యా విషయంలోను, ఉద్యోగాలవిషయంలోను, తదితర సదుపాయాల విషయంలోను వారికి ఏలాటి సౌకర్యాలు ఉండవనిన్నీ, వీటికంతా ఇష పడనివారు రాష్ట్రాన్నివదలి, వారివారి భాషలను మాట్లాడే రాష్ట్రాలకు తరలిపోవలసినదనీ ఒక వింతవాదం లేవదీసి, తదనుసారంగా కొందరు, కొన్ని ప్రభుత్వాలు ప్రవర్తించడం జరుగుతూ ఉంది. ఒరిస్సాలోను, మద్రాసు నగరంలోను ఉండే ఆంధ్రులకు ఈలాటి చిక్కులు సంభవించడం, అసాంలో అసామీస్‌భాషను మాట్లాడేవారు పెట్టిన బాధలను సహించలేక వేనకువేలు బంగాళీలు వారి ఆస్తులను వదులుకొని, కాందిశీకులుగా ఇటీవల బంగాళారాష్ట్రానికి పారిపోవడం—ఈ వింతవాదం యొక్క ఫలితాలు. పాకిస్తాన్ నుండి పారిపోవలసివచ్చిన హిందువులకును, వీరికిని ఏలాటి భేదం లేదు. ఈ వాదమే బలపడితే, ఇరుగు పొరుగు రాష్ట్రాల మధ్య అంతర్యుద్ధం చెలరేగడంలో ఆశ్చర్యం ఏమీ ఉండదు. భాషాప్రయుక్తరాష్ట్రాల సరిహద్దుల నిర్ణయంలో కొన్ని గ్రామాలు తమకు చెందవలసి ఉన్నవనీ, అవి చెందనిపక్షాన వాటిని సంపాదించడానికిగాను తాము సత్యాగ్రహాలు, సమ్మెలు జరపడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటిస్తూ అలాటి చట్ట విరుద్ధచర్యలలోకి కొందరు దిగుతూవుండడం ఈ సందర్భంలో గమనించవలసి ఉంది. వివిధభాషలు మాట్లాడే ప్రజలు కలిసిపోయిన మన దేశంలో "పదిగ్రామాలు ఏ రాష్ట్రంలో చేరితే ఏమిటి ?" అనే సహనభావం లేకపోవడం చింతింపతగ్గ విషయం. హిందీ, పంజాబీ భాషలను మాట్లాడేవారిమధ్య పంజాబి సుబాను నిర్మాణంచేసే విషయంలో ఏర్పడ్డ విభేదాలు ఎంతటి తీవ్ర పరిణామాలకు దారి తీస్తున్నవో అందరికీ తెలిసిందే. వివిధభాషలు మాట్లాడే వారి మధ్య ఈలాటి ద్వేషం ఏర్పడితే, భారతీయులంతా కలిసి ఒకే రాజ్యంలో పౌరులుగా ఉండడం, విదేశీయులమూలంగా కలిగే ప్రమాదాలనుండి దేశాన్ని రక్షించుకొనడం సాధ్యం అవుతుందా ?

ఈ సందర్భంలో ఇంకొక విషయాన్ని కూడా మనం గుర్తించవలసి ఉంది.

ప్రస్తుతం ఒక్కొక్క భాషను మాట్లాడేవారు ప్రాచీన మధ్యయుగాలలో స్వతంత్రరాజ్యాలను స్థాపించుకొని, అవకాశం లభించినప్పుడు మరికొన్నిభాషలను మాట్లాడేవారి ప్రాంతాలను జయించి సామ్రాజ్యాలను స్థాపించినవారు. ఇదంతా వారికి గర్వకారణం. ఆంధ్రులు శాతవాహన కాకతీయ రాజ్యాలను స్థాపించి, ఆంధ్రేతరులను పాలించారు. కర్ణాటకులు చాళుక్యాదిసామ్రాజ్యాలను స్థాపించి కర్ణాటకేతరులను పాలించారు. తమిళులు చోళసామ్రాజ్యాన్ని స్థాపించి ఆంధ్రులను, కర్ణాటకులను, ఉత్కళులను పాలించారు. మహారాష్ట్రులు ప్రాచీన కాలమందేగాక, ఇటీవల బ్రిటిష్‌వారు వారి పరిపాలనను దేశంలో స్థాపించడానికి పూర్వం, గొప్ప సామ్రాజ్యాన్ని స్థాపించి, ఇతరభాషలను మాట్లాడేవారిని వశపరచుకొన్నారు. దేశ చరిత్ర పరిశోధనమూలంగా ఈలాటి సామ్రాజ్యాలను గురించినజ్ఞానం వ్యాపిస్తూ ఉంది. ఆంధ్రులే ఘనులని ఆంధ్ర చరిత్రకారులు, కర్ణాటకులే ఘనులని కర్ణాటక చరిత్రకారులు, తమిళులే ఘనులని తమిళ చరిత్రకారులు, మహారాష్ట్రులే ఘనులని మహారాష్ట్రచరిత్ర

కారులు ఉగ్గడించడం జరుగుతూఉంది. దేశంలో ఏక జాతీయ భావం పూర్తిగా నాటుకొనని ఈ సంధికాలంలో భాషా ప్రయుక్తరాష్ట్రాలలోపాటు ఈలాటి ఉగ్గడింపులు సర్వ సాధారణం కావడం ప్రమాదకరం. కాని ఇదంతా భాషను బట్టి ప్రజలలో ఏర్పడ్డ విభేదాల ఫలితం.

భిన్నభాషలు దేశంలో ఉండడం తప్పదు. ప్రజలందరు ఒకేభాషను మాట్లాడేస్థితి ఎన్నటికీ రాదు. హిందీపైన ఇతరులకు ఇటీవల ఏర్పడ్డ ద్వేషం యొక్క ప్రభావంవలన అది త్వరితకాలంలో ఏకైక అధికారభాషగా ఏర్పడే అవకాశంకూడా తప్పిపోయింది. కాని భిన్నభాషలు ప్రజలలో భిన్నభావాలను కల్పించి పరస్పరద్వేషాలకు దారి తీయడం ప్రమాదం. మతభేదంమూలాన మహమ్మదీయులు పాకిస్థాన్ అనే ప్రత్యేకరాజ్యాన్ని స్థాపించుకొన్నారు. భాషాభేదాలమూలాన, ఒక్కొక్క ప్రధానభాషను మాట్లాడేవారు ఒక్కొక్క స్వతంత్రరాజ్యాన్ని స్థాపించుకొనదలచే స్థితి రాకూడదు. ప్రపంచంలో భాషోన్మాదం మూలాన విచ్ఛిత్తిగాంచిన రాజ్యాలు ఎన్నో ఉన్నాయి. అలాటి విపరీతం మన దేశానికి సంభవించరాదు. మనలో ఉండే భేదభావాలను పురస్కరించుకొని, దేశాన్ని విచ్ఛిన్నంచేయదలచిన పరాయి రాజ్యాలు, వారికి సహాయంచేసే భారతీయ పంచమదళాలు ఎన్నో ఉన్నాయి. వివిధమతాలు ఉండే దేశంలో మత సహనం ఎంత అవసరమో, వివిధ భాషలు ఉండే దేశంలో భాషాసహనం కూడా అంత అవసరం. మత సహనానికి మన దేశం ప్రసిద్ధిగాంచినట్లు ఇటీవలివరకు భాషాసహనానికి కూడా అది ప్రసిద్ధిగాంచి ఉండినది. కాని ఇప్పుడిప్పుడు ఇది మారుతూ ఉంది. ఈ మార్పును ప్రతిఘటించడం మన ధర్మం. ప్రజలలో ఎవరు ఏ భాషను మాట్లాడినా, వారందరు భారతీయులనీ, సమాన పౌరహక్కులకు అర్హులనీ ప్రతి రాష్ట్రంలోనివారు గ్రహించి, తదనుసారంగా పరిపాలనను సాగించవలసి ఉంది. మన రాజ్యాంగం ప్రతి పౌరునికి, ప్రతి అల్పసంఖ్యాకవర్గానికి కొన్ని హక్కులను ప్రసాదించి ఉన్నది. కాని అధికసంఖ్యాకులలో భాషోన్మాదం పెరుగుచుండే కారణాన ఆ హక్కులు ఆచరణయోగ్యం కాకుండా ఉన్నవి.

6

మనలో కులాలను బట్టి కూడా అనేక భేదాలు ఏర్పడి ఉన్నవి. ఇవి ఈనాటివి కావు. యుగయుగాలుగా వస్తూ వుండేవి. సంస్కరణోద్యమాలు ఎన్ని బయలుదేరినా వీటికి గొప్ప దెబ్బ ఏదీ తగలలేదు. అందుచేత ఇవి ఇంకా ఎంత కాలం ఉంటవో చెప్పలేము. క్రైస్తవమతం పుచ్చుకొన్న వారిలోను, మహమ్మదీయులలోను కూడా ఈ కుల భేదాలు నశించలేదు.

దేశైక్యతదృష్ట్యా ప్రస్తుతం వీటి విషయంలో ఇదివరకు లేని విశేషం ఒకటి ఏర్పడివుంది. ఇదివరలో కుల భేదాలు దేశైక్యతకు ప్రతిబంధకాలుగా ఉండినది లేదు; దానికి కొంతవరకు సహాయంచేసేవిగా ఉంటూ వచ్చాయి. ఇప్పుడు ఉత్పన్నమైన విశేషం మూలంగా ఇవి ప్రజలలో ఐక్యభావానికి అవరోధాలుగా పరిణమిస్తూ ఉన్నాయి.

ఒక శతాబ్దం క్రిందటివరకూ వర్ణభేదాలను, కుల భేదాలను అందరూ సమర్థిస్తూ ఉండేవారు. ఇవి సృష్ట్యాది నుండి ఉండినవనీ, సంఘం సుస్థిరంగా నిలబడడానికి ఇవి మూలస్తంభాలనీ, వీటిని రక్షించడమే దేశ పరిపాలకుల కర్తవ్యమనీ, జన్మతః కొన్ని కులాలవారు గౌరవార్హులు కావడం, మరి కొన్ని కులాలవారు అంతటి గౌరవానికి అర్హులు కాకపోవడం, కొన్ని కులాలవారు కొన్ని వృత్తుల అనుసరించడం, మరికొన్ని కులాలవారు మరికొన్ని వృత్తులను అనుసరించడం కర్మ సిద్ధాంత పునర్జన్మసిద్ధాంతాలకు అనుగుణాలనీ, మానవ జీవితమంతా ఈ సిద్ధాంతాలకు లోబడి సాగిపోతూ ఉన్నదనీ, ఇదే ధర్మమనీ, అందరూ విశ్వసిస్తూ ఉండేవారు. ఈలాటి విశ్వాసం ప్రజలందరిలో గాఢంగా ఉండినందున, శరీరంలో ఉండే వేరువేరు అంగాలు కలిసి శరీరసౌఖ్యానికి సహకరించే టట్లు సంఘంలోని కులాలన్నీ కలిసి, సంఘ క్షేమానికి పాటుపడడం యుక్తమని, తదనుసారంగా ప్రవర్తిస్తూ ఉండేవారు. ఆలాటి సహకారం ఉండినందుననే హిందూ ధర్మం, హిందూ సంస్కృతి దేశంలో నిలబడగలిగాయి.

కాని బ్రిటిష్ పరిపాలనకాలంలో పాశ్చాత్యసంస్కృతితో మనకు సంబంధం కలిగింది. ఈ సంస్కృతిలో వ్యక్తికి ఉన్నంతటి ప్రాధాన్యం కులం, వర్ణం, వర్గం అనే సముదాయాలకు లేదు. కష్టం, సుఖం, సంతోషం, విచారం, మంచి, చెడ్డ అనేవి వ్యక్తుల విషయంలో మాత్రమే సార్థకం అవుతవిగాని సముదాయాల విషయంలో కాజాలవనీ, దుఃఖించేవాడు, సుఖించేవాడు ప్రత్యేకమానవుడు గాని సముదాయం (సంఘం) కాదని ఆధునిక పాశ్చాత్యసంస్కృతి ఉద్ఘాటిస్తూ ఉంది. దీనితో మనకు (అందులో ముఖ్యంగా విద్యావంతులకు) సంబంధం ఏర్పడిన కారణాన, కుల భేదాలకు సంబంధించిన మన మనస్తత్వం కొంతవరకు మారింది. వ్యక్తుల గౌరవాగౌరవాలను వారివారి కులాలనుబట్టి నిర్ణయించడం అధర్మం అనీ, మానవులందరు సమానమైన ఆదరణకు పాత్రులనీ, విద్యాధికు లనేకులు భావించసాగారు. దీనిఫలితంగా కుల భేదాలు అంతరించలేదు గాని, కొన్ని కులాలు గొప్పవని, తక్కినవి అట్టివి కావనీ ఇదివరలో ఉన్న భావం పూర్తిగా మారి పోయింది.

కుల భేదాలకు లక్షణం, కులాలమధ్య ఏర్పడ్డ తరతమ భేదం ఒక్కటే కాదు. ఎవడు ఏ కులానికి చెందిఉంటే ఆకులం మీదనే ఎక్కువ అభిమానం కలిగిఉండడం, ఆ కులం లోనే వివాహసంబంధాలు చేసుకొనడం, ఆ కులానికి చెందిన ప్రత్యేక ఆచారాలను పాటించడం — ఇవికూడా కుల భేదాలకు లక్షణాలు. వీటివిషయంలో గుర్తింపదగిన మార్పులు ఏవీ దేశంలో ఇంకా రాలేదు. కులాంతరవివాహాలు చట్ట సమ్మతాలైనా, వాటిని చేసుకొనేవారి సంఖ్య చాలా స్వల్పం గానే ఉంది. మానవులమధ్య ఏర్పడే సంబంధా లన్నిటిలో రక్తసంబంధానికి ఉన్నంత బలం మరి దేనికీ లేదు. సంబంధ

బాంధవ్యాలు ఏయే కులంవారికి ఆయా కులాలవారితోటే ఉండడంచేత, కులాభిమానం ఇదివరలో ఎంత ప్రబలంగా ఉండిందో ఇప్పుడుకూడా అంత ప్రబలంగానే ఉంటూఉంది.

ఈ ప్రాబల్యమే దేశైక్యతకు, గాఢమైన దేశాభిమానం కుదురుటకు ఒక ప్రతిబంధకంగా ఏర్పడ్డది. దేశంలో తమకులానికే ప్రాధాన్యం ఉండవలెననే మనస్తత్వం ప్రబలిపోయింది. విద్యాలయాలలో ప్రవేశం, ఉద్యోగాలు, అధికారపదవులు, మంత్రిపదవులు, శాసనసభాసభ్యత్వాలు, తదితర సదుపాయాలు తమకులాలవారికే ఎక్కువగా లభ్యంకావలెననే ధోరణితో అన్ని కులాలవారు ప్రవర్తించడం సహజమైపోయింది. వీటిని వ్యక్తుల అర్హతానర్హతలబట్టి నిర్ణయించుటకుబదులు కులాలబట్టి పంపకంచేయడం పరిపాటి అయింది. కొన్ని కులాలవారు ఒకప్పుడు ఉచ్ఛస్థితిలో ఉండినారన్న కారణాన వారిని ప్రస్తుతం పూర్తిగా అణచివేయడంలో అధర్మం ఏదీలేదనే సూత్రం దేశ పరిపాలనానికి ఆధారం అయింది. అన్నం పెట్టడంలో ఎవరికి ఆకలో వారికి అన్నం పెట్టడం న్యాయ్యం అనే సూత్రానికి బదులు, ఆకలిబాధను అనుభవించేవాడు ఏ కులానికి చెందినవాడు అనే సూత్రం ప్రాబల్యం వహించింది. ఇందుచేతనే కులభేదాలు మూలంగా దేశైక్యత కుంటుబడడమే కాకుండా, వ్యక్తులకు అన్యాయం జరుగుతూ ఉంది. వ్యక్తులందరికి సమాన గౌరవప్రతిపత్తులు ఉండవలెననేది ప్రజాస్వామికరాజ్యానికి పునాది. కులతత్వం దానికి గొడ్డలిపెట్టుగా ఏర్పడ్డది. మనం ఏర్పరచుకొన్న ప్రజాస్వామ్యం ఈ పరిస్థితులలో చక్కగా పనిచేయుగలదా అనే సందేహం ఉత్పన్నం అవుతున్నది.

7

ఈ సందేహానికి ప్రజలలో ప్రస్తుతం ఉండే మరి రెండు లక్షణాలు దోహదం కల్పిస్తూ ఉన్నాయి.

ప్రజలలో అత్యధికభాగం దారిద్ర్యబాధను అనుభవిస్తూ ఉండేవారు. కనీస అవసరాలుగా పరిగణింపబడే ఆహారం, వస్త్రం, ఇల్లు, ఆరోగ్యం పూర్తిగా లభించని స్థితికి దారిద్ర్యం అనే పేరు చెల్లుతుంది. దేశంలో నూటికి తొంభై జనం, ఈలాటిస్థితిలో ఉన్నారు. దారిద్ర్యం ప్రారబ్ధకర్మఫలితం అని ఇదివరలో వీరు అనుకొనేవారు. కాని, ఈ అభిప్రాయం ఇప్పుడు పూర్తిగా మారింది. దారిద్ర్యాన్ని మానవకృషివల్ల నిర్మూలనం చేయడం సాధ్యమనీ, ప్రతి ప్రభుత్వానికీ అలాటి శక్తి కలదనీ, ప్రభుత్వం తలచుకొంటే ఇది బహు త్వరితంగా జరగగలదనీ, వీరు భావిస్తూ ఉన్నారు. పరిపాలనవిధానం సౌష్ఠవంగా ఉన్నదా లేదా అనే దాన్ని నిర్ణయించే సందర్భంలో దారిద్ర్యనిర్మూలానికై ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలకు వీరు అగ్రస్థానం కల్పిస్తూ ఉన్నారు. ప్రజాస్వామ్యానికి ఆధారాలైన వ్యక్తి స్వాతంత్ర్యం, వాక్స్వాతంత్ర్యం, సమావేశ స్వాతంత్ర్యం, సంఘనిర్మాణ స్వాతంత్ర్యం మొదలైనవాటియొక్క విలువను వీరిలో అనేకులు గ్రహించేస్థితిలో లేరు. ఇంతేకాకుండా, వేలకొలది సంవత్సరాలుగా మన ప్రజలు రాజుల పరిపాలనకు అలవాటుపడ్డవారు. పరిపాలకులను ఎన్నుకొనడం అనే ప్రజాస్వామ్య పద్ధతి వీరికి క్రొత్త. ఈ కారణంచేత దీనిలోని సుగుణాలు ఏలాటివో వారిలో అనేకులకు తెలియదు. వారు కోరేది కడుపునిండా అన్నం, ఒంటినిండా గుడ్డ, తలదాచుకొనడానికి కుటీరం. వీటిని లభింపజేయడానికి పంచవర్షప్రణాళికలద్వారా ప్రభుత్వం ప్రయత్నం చేస్తూఉండడం వీరికి తెలుసు. కాని, కొంతకాలం గడిస్తేతప్ప వీటిమూలంగా ఫలితాలు లభించవు. దేశంలో జనసంఖ్య ఇప్పటికే ఎక్కువగా ఉండడంచేతను, ఏటేట 75 లక్షల ప్రకారం ఇది వృద్ధిపొందుతూ ఉండడంచేతను దారిద్ర్యనిర్మూలనం మరింత కాలవిలంబనతో కూడుకొంటూ ఉన్నది. ఇది ప్రజలు ఓపికతో ప్రవర్తించవలసిన సమయం. దారిద్ర్యబాధను ఎక్కువగా అనుభవిస్తూఉండేవారు ఓపికపట్టడం కష్టసాధ్యం అయినా, ఆసుగుణం ఉంటేనేగాని, ప్రజాస్వామ్యానికి స్థిరత్వం చేకూరదు. ప్రజాస్వామ్యదృష్ట్యా దారిద్ర్యం అతి శీఘ్రకాలంలో నిర్మూలం కావలసి ఉంది.

ప్రజలలో గుర్తించతగ్గ రెండవలక్షణం అత్యధికులకు అక్షరజ్ఞానం లేకపోవడం. అక్షరజ్ఞానం లేకపోయినా, రాజకీయాలనుగురించి స్వానుభవంద్వారా జ్ఞానం సంపాదించడం సాధ్యం కాకపోదు. కాని ఈ కాలంలో ఇది కష్టంతో కూడుకొన్నపని. ప్రపంచపరిస్థితులు, దేశ పరిస్థితులు క్లిష్టరూపాన్ని ధరిస్తూఉన్నాయి. వీటిని అర్థంచేసుకొనడానికి పత్రికలు పుస్తకాలు చదివి, వీటిద్వారా జ్ఞానం సంపాదించవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో వీటికి మరింత అవసరం. తాము ఎన్నుకొన్న ప్రతినిధులు వారివారి విధులను చక్కగా నిర్వహిస్తున్నారో లేదో తెలుసుకొనుటకు, వారి కార్యకలాపాలను విమర్శించుటకు, వివిధ రాజకీయపక్షాలవారి ప్రచారాలలోని గుణదోషాలను అర్థంచేసుకొనుటకు పుస్తకజ్ఞానం ప్రధాన సాధనం. ప్రజలు తమ వాంఛలను ప్రభుత్వానికి తెలియజేయుటకుకూడ ఇదే సాధనం. కాని ఈ విషయంలో మనం ఎంతో వెనుకబడి ఉన్నాం, అక్షరజ్ఞానం సర్వవ్యాప్తమైతేనేగాని ప్రజాస్వామ్యం సుస్థిరత గాంచలేదు.

పై వివరణవలన దేశంయొక్క భౌగోళిక లక్షణాలు, దేశంలోని ప్రజల అభిమాన దురభిమానాలు, వారిలోని విభేదాలు, వారిలో ఉండే ఇతర లక్షణాలు పరిపాలన విధానంపై ఏలాటి ప్రభావాన్ని వహిస్తున్నవో స్పష్టం అవుతూ ఉంది. ఈ లక్షణాలను విస్మరించి పరిపాలనను సాగించడంకష్టసాధ్యం.

జీవనసరసి

శ్రీ బి. వి. సింగరాచార్య

దయసేయవె దేవ దేవ
తడయకు మీ దీను బ్రోవ
దయసేయవె దేవ దేవ !

హృదయమెండి బీటలువా
రిన భీష్మ గ్రీష్మవేళ
కరుణ రసాభరణ తరుణ
వరుణ దేవతాకృతివై
దయసేయవె దేవ దేవ !

జీవితమ్ము నీరసమై
తావి సురిగి పోవువేళ
లలిత రసోల్లసిత మధుర
రక్తి లోలుకు గీతమువై
దయసేయవె దేవ దేవ !

నలుదెస కర్తవ్య బంధ
నముల జిక్కి సొక్కువేళ
శాంతి సువిశ్రాంతిప్రద
సౌమ్య రమ్య సరసాకృతి
దయసేయవె దేవ దేవ !


ఈ బికారి యెడద అలసి
ఎందో యొదిగి యున్నవేళ
ద్వారమ్ముల నన్ని పగుల
దన్ని చక్రవర్తి వోలె
దయసేయవె దేవ దేవ !

మన మాశాపాశ బద్ధ
మై యాంధ్యము లలము వేళ
కోటి తటిత్ప్రభోజ్జ్వలిత
క్రుద్ధ వజ్రపాణి వగుచు
దయసేయవె దేవ దేవ !

రవీంద్రుని 'గీతాంజలి' నుండి

కవీంద్రుడు రవీంద్రుడు

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి



గంగోత్తరి మంచుమలపై పుట్టినది. బిడ్డలు తల్లిని కలియునపుడు పెద్దసంసారమగునట్లు, ఎన్నో ఉపనదులు చేరుటవలన జాహ్నవీకుటుంబము పెద్దదైనది. విస్తరించిన సలిలసంసారముతో ఝరీమతల్లి జీవనము కడపి, అసంఖ్యాకులను తనిపి జీవాత్మ పరమాత్మను కలియునట్లు సంసారసాగరముతో సాగరమున కలియుచున్నది. నైసర్గిక ప్రతిభ గంగోత్తరివంటిది. ప్రజ్ఞాసముద్భవ నవ్యభావధారలు జీవితక్షేత్రమున ప్రవహించి, ప్రతిభను విస్తృతమొనరించి, పైడిపంటలు పండించి, యుగములను తనిపి, సమగ్రచరితార్థత నందునుగదా!

దండిమహాకవి తెలిపిన నైసర్గికప్రతిభ రవీంద్రుని తొలిసొమ్ము; తండ్రి దేవేంద్రుడు మహర్షి; అతనికి జ్ఞాననేత్రమును ప్రసాదించినాడు. బాలుడైన రవి ఉపనిషన్మధువు నాపోశనమొనరించెను; ఋషిసంప్రదాయమున దీక్షితుడైనాడు. తాత ద్వారకనాథుడు. రామమోహనుని నెచ్చెలి. సారస్వత సాంఘిక ధార్మిక మహోద్యమ నవోదయమును భారతదిగ్వలయముపై వెలయించిన మహనీయులు వారు. సముద్రమథనములో లక్ష్మి, చంద్రుడు, అమృతము ఉదయించినట్లు భావమహోదధిమథనమున దైవీ విభూతి జనించుట నిక్కము. ఈ విభూతి రవీంద్రుని యింట బుట్టినది; యొంటబట్టినది. సంప్రదాయడోలలో నుయ్యాలలూగినపుడే క్రొత్తజోలల నాతడు చెవులందు జొనిపెను. ప్రాచీప్రతీచీ ప్రాచీనార్వాచీన భావరజ్జువు లీ యపూర్వడోలికకు లగింపబడినవి. వంగదేశ వైష్ణవవాఙ్మయము నాతడు పఠించినపుడే మాధుర్యశైవలిని ఆతని యుతరంగమున ఉత్తాల తరంగసంకులమై వెలసెను. షేక్స్పియరు, షెల్లీ, కీట్స్, బైరన్, ప్రభృతుల కవితలోని సౌందర్యలహరి నాతడు మనసార గ్రోలెను. రవీంద్రుని ప్రతిభ బహుముఖముల విస్తరించినది.

రవీంద్రుని వంశవృక్షమే యజ్ఞవాటికలో పెరిగినది. కనోజ్ విప్రుడు భట్టనారాయణుడనునాతడు ఐదుగురు బ్రాహ్మణుల నాయకుడై వంగాధిపుడైన ఆదిసుర కావించిన యాగములో తోడుపడుటకై కనోజ్ నుండి క్రీ. శ. 1072 లో కదలిపోయెను. అప్పటినుండి ఆతని కుటుంబము వంగదేశములో వర్ధిల్లినది.

రవీంద్రుడు క్రీ. శ. 1861 లో మే నెల 6 వ తేదీ నాడు కలకత్తాలో 5, 6 నెంబరుల జోరాశంకో భవనములో జన్మించెను. అతని శతవార్షికదినోత్సవమున ప్రపంచమంతయు పండుగపందిరియై యున్నపుడు 'భారతీ'పీఠమున ఈ శ్రద్ధాంజలిని సమర్పించుచున్నాను. బాల్యకాలంలో అతనికి బడిచదువు భర్జించలేదు. గృహప్రాంగణమందలి ఆరామము ఆతని హృదయమును ఆనందభరితమొనరించినది. తండ్రి ననుసరించి ఆతడు హిమాలయములకరుగువాడు. ప్రకృతి రవిసహస్రారకమలమును వికసింపజేసినది. కాళిదాసు షేక్స్పియరులు చెప్పనేల ? ప్రపంచమందలి మహాకవులందరు సౌందర్యసందీపితస్థలములందు తమ్ము దాము గుర్తించుకొని ఆనందవ్రత మొనరించిరి. ప్రకృతి ముందుముకురమును నిలిపి ప్రతిఫలమును తమ రచనలయందు షేక్స్పియరాదులు చూపిరని చదువుచుందుము. వీరి రచనలు ప్రకృతియొక్క ఛాయాప్రతిమలు (ఫోటోలు) కావు. తాము చూచినదానికి కవులు స్వీయభావనాశక్తిని, రసానుభూతిని, మనన సము

ధ్వని భావశబలతను చేర్చుచుందురు. వీరి రచనము తమ నియమమైన ప్రకృతినియమము ననుసరించి వ్యక్తమగును. కవి కాంతారము నవలోకించినను, రమ్యమైన ఉద్యానమునే సృజించును. ఎదుటి దృశ్యము రసోద్రేకము గలిగించును. వ్యంగ్యప్రభావమువలన కవిహృదయమున నవ్య సృష్టిని పురికొల్పును.

ప్రభాకలితమైన భారతీయసంస్కృతియును, కవితా మహిమయును వనభూములందే ఉదయించినవని రవీంద్రుడు "వనసందేశ"మను తన గ్రంథమున తెలిపెను. 'ఆరణ్యక' శబ్దమువలన అరణ్యసముద్భవశాస్త్ర మదియని స్పష్ట పడుటలేదా ? నైమిశారణ్య, లుంబినీవన, ఉరువేలవన, సారనాథులోని లేళ్లవనములు ఎట్టి కవిత్వమునకు, ప్రజ్ఞాన విభూతికి పుట్టినిళ్లు కాలేదు ?

కవీంద్రుని కవితాజీవితము సౌందర్యసంశోభితారామమున ఆరంభమైనది. తండ్రితపోవనమే 'శాంతినికేతనము' —ఏకాంతమున నధివసించి అత దేవేదికపై ధ్యాననిమగ్నుడై సమాధిస్థితుడై యుండువాడో అందే రవి కవి జీవితము ఆవిర్భవించినది. ఆతని తపసున కది ఆటపందిరి యైనది.

బ్రహ్మాండమంతయు రవీంద్రుని కవుంగిలిలో నిమిడినది. బహుముఖములందు జగదీశ్వరునివాణి వినిపించు టాతడెఱుగును. దైవీశక్తి సర్వత్ర వ్యక్తమగు టాతడు విలోకించెను. శకుంతముల మంజులకూజితములందును, సెలయేళ్ల కలస్వనమందును, తటిల్లతల కాంతులందును, కల్హారశోభయందును, ప్రభాతసమయ పద్మినీసామ్రాజ్యమునందును ఆత డీశ్వరవిభూతిని విలోకించువాడు. సౌందర్యము, సత్యము, శివము, శాంతము, అద్వైతము సర్వత్ర విలసిల్లు టాతడెఱుగును. వీని విస్తరణము నాతడు విశ్వమందు విలోకించువాడు.

ఒక గంభీర భావమునకు స్వరూపమును చిత్రించుటయును, ఒక స్వరూపమందలి ఉదారాశయమును ప్రకటించుటయును, ఆతని యాశయములు.

కాళిదాసాదులు ఊర్వశి నెట్లవలోకించిరో యెరుగుదుము. ఆమె అప్సరస. దేవవేశ్యలొడ్డిన వాగురమునబడక స్వీయోరువునుండి ఋషికంఠీరవుడు సృజించిన సుందరి యామె. ఆ దేవనర్తకి అర్జునున కుపాధ్యాయినియైనది; ఆతనిని వలచినది. ఆమెఆటలు సాగలేదు. 'విక్రమోర్వశీయము'ను నెమకినను ఆమెగాథ దృశ్యకావ్యమే యని యెఱుగుదును. మహాకవులు ఒకే సన్నివేశములో నిలిచినను వ్యక్తిని, వస్తువును, విషయమును ప్రత్యేకదృక్పథముతో విలోకించి, సహజప్రజ్ఞతో, స్వతంత్రశక్తితో వానియందలి నిహితార్థమును ప్రకటింతురు. ఊర్వశి రవీంద్రునిదృష్టిలో కేవలము వ్యక్తి కాదు—మఱి విశ్వవిస్తృత దైవీసౌందర్యము. ఈ పంక్తుల నవలోకింపుడు :

"From age to age thou hast been the world's beloved,
O unsurpassed in !oveliness Urvasi!
Breaking their meditation sages lay
at thy feet the fruuits of their penance
Smittem with the glance, the three
world's grow restless with youth
Thy lotus-feet in "the Lotus" of
the blossomed
Desires of the Universe.

"Urvasi"

షెల్లీ కవీంద్రుడు సౌందర్యము నీ దృష్టితోనే వీక్షించెను. ఈ పంక్తులను విలోకింపుడు :

"Spirit of Beauty, that dost conservate
With thine hues all there dost shine upon"
'Hymn to intellectual Beauty'.
Seraph of Heaven! too gentle to be human
"Veiling beneath that radiant form of woman"
'Epipsychidion'
"That Light whose smile Kindles
the Universe." 'Adonais'

ప్రకృతియం దీశ్వరుని వాణి ఎట్లు శ్రుతిగోచరమగునో ఈపంక్తులందు రవీంద్రుడు తెలిపెను:

"సబుజ నీలే సోనార్ మిలే
జె సుధా ఎయ్ ఛేడియే దిలె"
జాగియే దిలే అకాశతలే
గభీరవాణి ! బెంగాలీ గీతాంజలి

"There is tremor of expectation
On every sheet of grass.
On the dust of the earth."
Fruit Gathering

రవీంద్రుని "ప్రభాతసంగీతమును" కూడ విలోకింపుడు :

జగతినుండి తరలిపోక, సృష్టి సౌందర్యమున రవీంద్రు డీశ్వరసాక్షాత్కారము నందువాడు. ఈ మాటలను వీక్షింపుడు!

"Deliverance is not for me in renunciation. I feel the embrace of freedom in a thousand bonds of delight"

Gitanjali.

1912 లో ఇంగ్లండులోని ఇండియా సొసైటీచే "గీతాంజలి" యొక్క ఆంగ్లానువాదము డబ్ల్యు. బి. ఈట్స్ పీఠికతో ప్రకటింపబడినది. 1913 లో సాహిత్యమందు రవీంద్రుడు నోబుల్‌బహుమాకృతిని పడసెను. గౌరవపరంపర కుసుమవృష్టివలె ఆతనిపై పడెను. ఆ సంవత్సరమందే

కవీంద్రుడు రవీంద్రుడు

కలకత్తా విశ్వవిద్యాలయ మాతనికి అనరరీ డాక్టరేట్ బిరుద మును ప్రసాదించినది. 1914 లో 'సర్' బిరుదు ఆతనిని వరించినది. ఆ వత్సరమందే శాంతినికేతనమున జరిగిన ప్రత్యేక స్నాతకమహోత్సవములో ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయము డి. లిట్. డిగ్రీతో ఆతనిని గౌరవించినది.

ఏ దృష్టితో నాతడు విశ్వమందు విశ్వేశుని వీక్షించి నాడో అదేదృష్టితో సంఘము నవలోకించినాడు. ఆతని కృతులం దీభావము, కాసారమందు ప్రతిఫలించిన పండు వెన్నెలవలె, చక్కగ విస్తరించినది.

ఒక చండాలబాలికను పిపాసువు ఒక బౌద్ధసన్యాసి సమీపించెను. త్రాగుటకు నీ రిమ్మని ఆతడు ప్రార్థించినాడు. "నా నీరు మీరెట్లు స్పృశింతురు?" అని ఆమె ప్రశ్నించినది. "అమిజే మానుష్ తుమిషే మానుష్" "నే నెటువంటి మని షినో నీవు అటువంటి మనిషివే" అని ప్రత్యుత్తరమిచ్చి ఆమె చేతులనుండి తీర్థమును భిక్షువు స్వీకరించెను. ఈ కథలోని రవియూహ స్పష్టము.

1910 లో బ్రహ్మసమాజమున గోచరించిన మూడు చీలికల నాతడు మాపుచేయవలెనని సంకల్పించి, ఏకైక భావ సూత్రములో మనసులను కలుపవలెనని యత్నించెను.

విశాలదృష్టి, విజ్ఞానదృష్టి, దూరదృష్టి, అంతర్దృష్టి ఆతనికి సహజములు. ఈ దృష్టితోనే ఆతడు 1901 లో బోల్పూరునొద్ద శాంతినికేతనములో తన పాఠశాలను నెలకొల్పెను. బంకించంద్ర చట్టోపాధ్యాయుడు నడపిన సుప్రసిద్ధ సాహిత్య పత్రికకు రవీంద్రు డాసంవత్సరమందే సంపాదకుడాయెను.

1902 లో దురదృష్టవశాత్తు ఆతని అర్ధాంగి అస్త మించినది. తన యిరువదిరెండవయేట, పదునొకొండేళ్ల బాలి కను ఆతడు పరిణయమాడెను. పెళ్లికిముం దామె 'భవ తారిణి' యని పిలువబడుచుండేది. తాను రవికావున వివా హము తరువాత కవి ఆమెకు 'మృణాళిని' అను పేరు పెట్టెను. (జెస్సూరుజిల్లాలో దక్షిణదిహి యను పల్లెలో ఆమె 1872 లో జనించినది) భార్య మరణించినపిదప రవీంద్రుడు "స్మరణ్" అను శీర్షికతో కొన్ని పద్యములు రచించెను. వీనిలోను, అరవిందుడు తన యిల్లాలికి వ్రాసిన ట్లీతడు తన పత్ని నుద్దేశించి వ్రాసిన లేఖలందును రవి హృదయము ప్రణయజలధియై ఉప్పొంగినది.

న్యాయశాస్త్రముపై ఆతనికి మక్కువ అంతగా లేదని ఆతని బాల్యజీవనమువలన గ్రహింతుము. 1877, సెప్టెం బరు 20 వ తేదీనా డాతడు రెండవయన్న ననుసరించి లా చదువుటకై మొదటిమాఱు ఇంగ్లాండుకు పోయెను. ఏడాది పాటు ఆత డందుండి స్వదేశమునకు మరలివచ్చెను.

న్యాయవిరుద్ధపరిపాలనము నాతడు సహింపలేదు. బ్రిటిష్ సింహము పెడదారిని బట్టినపుడు రవీంద్రుడు జంకు గొంకు లకు ఎడమీయక తన యసంతృప్తిని దెలుపువాడు. 1905 లో కర్జన్ రాజప్రతినిధిగా నున్నపుడు వంగరాష్ట్రహృదయమును రెండుచీలికలు చేయుటకై బ్రిటిష్‌ప్రభుత్వము పను కట్టినది. రవీంద్రుడపుడు వ్రాసిన పద్యములును, పాటలును దేశభక్తిభరితములైనవి. వంగదేశమందలి ఇంటింట నవి పాడబడినవి.

"Give me the strength never to disown the poor or bend my Knees before insolent might"

"Where the mind is without feaer and the head is held high,"

....

"Into that heaven of freedin, my Father, let my Country awake."

స్వాతంత్ర్యముపై రవీంద్రుని ప్రీతి యెట్టిదో ఈపంక్తులు స్పష్టముచేయుచున్నవి.

జలియన్‌వాలాబాగ్ జనరల్ డయర్ దారుణకృత్యము వలన రక్తప్లావితమైనపుడు రవీంద్రుడు తన యాగ్రహ మును వ్యక్తీకరించి, 1919 లో తన 'సర్' బిరుదును బ్రిటిష్ ప్రభుత్వమునకు తిరిగి యిచ్చెను.

బెంగాల్ గవర్నర్ లిట్టన్‌ప్రభువు ఒకప్పుడు భార తీయవితంతువులను గురించి ఏవేవో వంకరమాట లుచ్చ రించినపుడు కలకత్తాలో బడబానలము విజృంభించినది. రవీం ద్రుడును ఊరుకొనలేదు. లిట్టన్‌ప్రభువు తనఖేదమును తెలుపుచు ఆతని కొక జాబు వ్రాసినపుడే ఆ యాగ్రహాగ్ని చల్లారినది.

నిరుపేదలపై ఆతని కారుణ్యము అనిర్వచనీయ మైనది. గట్టినేలను దున్ను రైతుయొద్దను, తెరువు లందు రాళ్లుగొట్టువారికడను, ఎండలోను వానలోను శ్రమించువారియొద్దను ఈశ్వరు డుండునని, ఆతని వలు వలు దుమ్ముతో నిండియున్నవని రవీంద్రు డనినాడు. ఆతని వాక్కులను పరిశీలింపుడు :

"God is there where the tiller is tilling the hard giound and where the path-maker is breaking stones. He is with them in sun and in shower and His garmet is covered with dust......... even like him came down on the dusty soil"

కేవలము కవిగా గానముచేసి తన కర్తవ్యము చెల్లి పోయినదని ఆతడు తలపలేదు. తాను అతులైశ్వర్యసంపన్ను డైనను పల్లెలందు వసించి, నిరుపేదల సమస్యలను పరిశీ లించి, బహుభంగుల వారికి రవి సాహాయ్యము నలిపినాడు.

'శాంతినికేతనము'నకు రెండుమైళ్లదూరములో నున్న 'శ్రీ నికేతనము' గ్రామపునరుద్ధరణమునకు సంబంధించిన మేలిసంస్థ. ఈ సముద్ధరణముపై చూపుంచియే ఆతడు సహకారోద్యమమునకు భుజమొడ్డి, దాని యంతర్జాతీయ ప్రయోజన ప్రభావములను ముక్తకంఠముతో వెల్లడించినాడు.

రవీంద్రునకు సోనార్‌బంగ్లాపై (స్వర్ణవంగావనిపై) ప్రీతి మెండు; భారతాంబపైగల మక్కువ యొక్కువయైనది. సమస్తవిశ్వముపై అతనికిగల గాఢానురాగము ఘనతరమైనది. ఆతడు విశ్వకవి. విశ్వవిస్తృతదృష్టిగల ప్రవక్తయగుటచే పృథ్వీవాసులను తనగుండెపై చేర్చుకొనగలిగినాడు. శాంతినికేతనమున విశ్వభారతిని స్థాపించినాడు. శతపత్రపుష్పమందలి దళములవలె సర్వదేశవాసులు ఉందు జేరి అంతేవాసులై, అధ్యాపకులై సంయుక్తసాంస్కృతిక కర్తవ్యమును నిర్వహించుచున్నారు. కేవలము రంగారు బంగారుకలలు కని స్వీయభావాలోకమున మురిసియుండు కవికాడు రవి. ఆతడు తనకలలను నిక్కములొనరించుకొనినాడు.

కవి అస్తమించినను, కవికృతు లస్తమింపవు. కాళిదాసు, భవభూతి, షేక్స్‌పియర్, హోమరు, డాంటే, వర్జిల్ ప్రభృతులు ఎన్నడో అస్తమించినను వారి వ్రాతలు వియత్తలమందలి భాసురతారలవలె తేజరిల్లుచున్నవి. రవీంద్రుని రచనలును అట్టివే ! కావుననే రవికవి శతవార్షికోత్సవములు సమస్త వసుంధరలోను జరుగుచున్నవి. స్వర్గసీమయందు దాతని సమక్షమునసంయుతము అవి నెరపబడుచుండె నేమో !

భారతాంబ తల పెక్కు యిక్కట్టులవలన భారవహమైనను, ఒక్కొక్కపుడు రుధిరప్లావితమైనను, రవిప్రభృతుల ప్రబోధమువలన వంగలేదు. ప్రాపంచికప్రయోజనమే, ప్రాకృతాభ్యుదయమే, భౌతికప్రశస్తియే అంబరచుంబి హిమాద్రినిమించి తలలెత్తుచున్నను, నవయుగమున కవిత్వార్థమే కర్కశయంత్రముల ననుసరించుచున్నను, ఋషిసంప్రదాయమును తూర్పారబట్టువారి సైనికబలము అధికమగుచున్నను, మానవహృదయస్థ ఈశ్వరవిభూతియే కవితావిభూతి కావలెనని సచలసంప్రదాయమును సంరక్షించుచు తోడ్తోడనే నవయుగము వలచు విస్తృత భావసంచయమునకు, మానసనరస్సు తనహృదయమున మానసౌకములకు తావొసగునట్లు, రవీంద్రుడు తనమనస్సున చోటొసగెను. సృష్టి కర్తయూహలను వియత్తలమందలి రంగవల్లులందును, ప్రకృతిచిత్రములందును గమనించి మురియునట్లు రవి తన కవిత నవలోకించినపుడు పరితోషమందుచుందుము.

ప్రతీచీసంస్కృతికి తర్క మిలువేలుపైనది. దైవీ భావానుభూతి లేనిదే ఇహజగత్తు హుళక్కియని మన సంస్కృతి ఘోషించుచున్నది. మానసికసంపదయే నైవేద్యమునకు పనికివచ్చునని భారతీయు డెన్నడును విశ్వసింపలేదు. జగతియంతయు పైడిమూటయై యొడిబడుచున్నను, రత్నాకరమెండి తన రతనములను మానవుని కప్పగించినను, మనుష్యుని అంతరంగము సంతృప్తిపడునని తలచుట తప్పు. యజ్ఞకుండమందలి వేంగ్రడమువలె అందలి తితిక్ష నిలింపులకు సంయుతము ఈసుగొలుపుచుండును. తన్ను దాను గుర్తింపనివాడు క్షణికమూల్యములకు దాసోహమని, వాని నందుటకై ఆఱ్ఱులుచాపి, అవి యందనపుడు "అయ్యో !" అని "హత విధీ!" యని "అభాగ్యుడ"నని ఆత డంగలార్చును. తన యాతనలో నీతడు కన్నులు తెఱువవచ్చును. వీని యభ్యుదయము. వీని అపజయమందే, ఆశాభంగమందే, పంకిలము నుండి స్మితముఖియై వెడలు ప్రసవమట్లు, సత్యసందీప్తలక్ష్యము అగపడును. దానిని వీక్షించిన ముహూర్తమున వీని వ్యక్తిత్వమహత్త్వము ప్రకటితమగును. వీని కన్నీటిలో గోచరించు అమృతకలశయు క్షణికాశయసిద్ధియందు అగపడదు. తాత్కాలికాశయములు చిత్తపుటంచులనుండి రాలినపుడే, వెఱ్ఱియూహలకుప్ప ధూళ్యవలుంఠితమైనపుడే బహుముఖములతో అనందజగతి జిజ్ఞాసువుసమక్షమున సాక్షాత్కరించును. "ఆనందరూపమ్ అమృతమ్ యద్ విభాతి." రవీంద్రుని కవిత ఈసత్యమును ముక్త కంఠముతో తెలుపుచున్నది.

ఏకాంతవాసియై, సమాధిస్థుడైనవాని హృదయము స్వర్ణద్యుతిసంస్పర్శనందిన పుండరీకమువలె ప్రఫుల్లమగును. అందలి మకరందమే యానందము. జుఱ్ఱుకొనజాలువారికి తన వాక్కులతో దాని నతడు వడ్డింపజాలును.

గంటకు ఇరువేలమైళ్ల పోవు అంతరిక్షనౌకలో పయనించి, మానవుడు 108 నిముషములలో నేడు పుడమిని చుట్టివచ్చినాడు. ఈ యద్భుతక్రియ మానవుని యంతరంగమందలి అనిర్వచనీయశక్తికి ప్రత్యక్ష దృష్టాంతము. బాహ్యప్రకృతి మానవుని చరణాశ్రితదాసియై ప్రవర్తించుచున్నది. "భళి!" యనుచున్నాము. తనప్రకృతి నాతడు జయించుచో, ఎన్నెన్నిబ్రహ్మాండములో తనలో నున్నట్లాతడు గుర్తింపగలడు. ప్రశాంతచిత్తునకు, మనననిదిధ్యాసనధ్యానములం దారితేరిన ఋషికవి యంతర్దృష్టికి ఇవి గోచరించును. పంచకోశములలోనుండి ఈ చూపును లోనికి జొనిపి ఆత్మసంస్పర్శసుఖానుభూతి నాత డందును. వేయియూడల మఱ్ఱిచెట్టును ఝంఝానిలము కూకటి వ్రేళ్లతో నూడబెఱుకును. భయంకర ఝంఝానిలము కంటె భయానకమైన కోటి పిలుగుల యాఘాతము మునిమనసులోని నిస్తబ్ధతను చెరుపలేవు; అందలి ప్రశాంతిలో అలలుప్పొంగవు. ప్రాకృతగిరిశృంగమునకు శృంగభంగము కావ

కవీంద్రుడు రవీంద్రుడు

చ్చును; కాని పారమార్థికచింతను పారపొచ్చెమంటనేరదు. క్షుద్రచింతలు మునిమనసుపై ప్రాలజాలవు. ఇందుండి వెడలు భావధారయే మహితకవితాధార యగును. బ్రహ్మముహూర్తమున లేచి సమాధిస్థుడగుచుండిన రవీంద్రుని యంతరంగము ఉదాత్త కవిత్వహ్రదము కాదా ?

ఆధ్యాత్మిక భావశబలతకు మేలివిలువగట్టిన ఋషికవి ప్రపంచమునుండి పారిపోవునని తలపజెల్లదు. తనలోని దివ్యాలోకము నీతడు జగతిపై ప్రసరింపజేయును. మునిసమ్రాట్టైన మహాదేవునివలె జగతిని రక్షించుటకై ఈతడు హాలాహలమును గుటుక్కున మ్రింగుటకై సమకట్టును. అట్లొనరించునపుడు వాని నొసటనున్న సుధాంశుడు నిప్పుకణము కాడు. వాని జడలోని గంగ యెడారిలోని యెండమావి కాదు. హృదయమందలి శాంతరసమున తుఫాను విజృంభించదు. పరార్థజీవియైన కవి అవిచలితచిత్తుడై కర్మయోగియై వర్ధిలును. జ్ఞానయోగియై, ధ్యానయోగియై, మంత్రద్రష్టయై, స్వరస్రష్టయై, తత్త్వవేత్తయై, గురుదేవుడై, కృత్యవిదుడై, అభినేతయై, చిత్రశిల్పియైన రవీంద్రుడు కర్మయోగియైనాడు. మననసమయమున ఉడుగములతో కలిసి ఆతడు సయ్యాటలాడినను, నేలమీది ధూళిలో చేతులు జొనిపి ఆతడు కృషిసలిపినాడు. పంకమందలి దుస్థితిని ప్రజ్ఞానద్యుతిలో వీక్షించినాడు. ఈశ్వరుడే మనుష్యజీవనశృంఖలములను ధరించినపుడు బుద్ధిమంతుడైన మానవుడు ప్రాపంచిక సేవాబాధ్యతనుండి ఎట్లు తప్పించుకొని పోగలడు? ఉపనిషత్తులను జీర్ణించుకొనిన రవీంద్రుడు, గీతాశయము నెరిగిన కవీంద్రుడు తన వైదుష్యమునకు చరితార్థత జేకూర్చినాడు; కాని మధురప్రసంగములందే దానిని వెచ్చింపలేదు. తన విశ్వభారతిలో ప్రతి బుధవారము తత్త్వప్రబోధము చేయుట ఆతని యభ్యాసము. శాంతినికేతనము నుండి వెలారెడి ప్రబోధధుని శ్రీనికేతనమున క్రియాస్వరూపమున గోచరించెడిది. "ఎల్లర హృదయములందలి ఈశ్వరు నవలోకించి ధర్మము ననుష్ఠింపుడు" అను హితవును "మనుష్యుని ధర్మము" (The Religion of Man) అను శీర్షికతో 1931 లో ఆక్స్‌ఫర్డ్‌లో తానొసగిన హిబ్బర్టు ఉపన్యాసము (Hibbert Lectures) లందును, "మానవుడు" (Man) అను శీర్షికతో ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో నిచ్చిన ఉపన్యాసములందును రవీంద్రుడు తెలిపెను.

"ఇనుపకచ్చడాల్ కట్టుకొను మునుముచ్చు" అని వరూధిని ప్రవరుని ఎత్తిపొడిచినది. కలుషితహృదయముగల దేవవేశ్యమాటలు ప్రమాణవాక్కులు కావు. భారతీయ సాంస్కృతికచరిత్రనుండి మునిముఖ్యుల సాధనోదంతమును తొలగించినయెడల మనకు సంస్కృతియే లేదని కంఠమెత్తి వచింతును. ఏయాశ్రమమందున్నను మనుష్యుడు తోడివారియెడల తాను నిర్వహింపవలసిన పవిత్రకర్తవ్యమును నెరపితీరవలెను. ఈ ధర్మనిర్వహణమునకు అనుకూలమైన రీతిని మనుష్యహృదయము నిర్మింపబడినది. దీనిని నిర్వహించువాడు జ్ఞానయోగి కావచ్చును; కర్మయోగి కావచ్చును.; భక్తియోగి కావచ్చును. జనకుడు కర్మయోగి. అతని గురువు యాజ్ఞవల్క్యుడు జ్ఞానయోగి. శిష్యుడు శుకయోగి జ్ఞానయోగి. ధర్మనిర్వహణమున వీరిలో నెట్టి వ్యత్యాసములును అగపడలేదు. వరూధినియొడ్డిన వాగురమునబడని ప్రవరుడు గృహస్థుడు. ఆత్మసంయమమున నాత డేయోగికి తీసిపోయెను ? సన్యాసమనినపుడు ప్రలోభనాసన్యాసమని, స్వార్థత్యాగమని మనమర్థము చేసుకొనవలెను. రవీంద్రుడు రచించిన "సన్న్యాసి" యను యోగిహృదయమందలి ప్రణయసింధువు ఎండిపోలేదు. అంగలార్చు పసిబాలిక నవలోకించినపుడు అంతరంగమందలి కారుణ్యసింధువు ఉత్తాలతరంగసంకులమై విజృంభించినది. పసినిసుగు నాతడు అనుకంపాసంభరితఅంతరంగమున చేర్చుకొనినాడు. జగతినుండి తరలదలచినవానిని జగతి తన ప్రణయపీఠమునుండి జారనిచ్చినది కాదు. ఈశ్వరప్రదత్త రసబంధురహృదయము మధురమై మహత్తరమైన జీవితమున స్వీయస్పందనమును గోల్పోవదని తెలుపుట రవీంద్రుని ఉద్దేశ్యము. దుగ్ధపిపాసువులు కట్టెదుట నిలిచియుండ గామధేనువు తనపాదుగును మరుగుపరచుకొని ఎడారిలోని ఇసుకతిన్నెలకు ప్రేమధారలను ధారపోయునా ?

లక్ష్యసిద్ధికి వలసిన నిర్దుష్టమార్గావలంబన మొనరించునపుడు ప్రతికూలపరిస్థితులు ముఖముపై చరుపులు వేయుట నిక్కము. చరుపుల నెదిరించునది శాంతితారకము. సహనశాంతులతో సాధకుడగ్రేసరుడగునపుడు కోలారు నుండి పసిడి బయలుపడునట్లు అంతరంగమందలి అపరంజి వ్యక్తమగును. సాధకుడైన కవి నెదిరించునవి ఈర్ష్యాద్వేషములు. ఇవి రవీంద్రుని ఎదుర్కొనినవి. కాని సహృదయుల నిస్తులశ్రద్ధ మేలియుష్ణీషమై ఆతని వ్యక్తిత్వమును కాపాడుటవలన కుత్సితము విసరిన రాలు ఆతనిపై పడలేదు. "అవమానధూళి కొండొకవడి వదనముపై పడినను, ప్రభాకలితమైన సత్యము కాలక్రమమున వ్యక్తముకాక మానదు." అని రవీంద్రుడు "జాతీయత్వము" (Nationalism) అను తన యుద్గ్రంథమున తెలిపెను.

"సత్యమ్, సుందరమ్, శివమ్" రవికవి ఆరాధించిన వేలుపులు. ఈశ్వరుడే సత్యముకావున ఈశ్వరశాసనములందు సత్యము విరాజిల్లుచుండును. మానవుడొనరించు చట్టములందు

(సాంఘికాచారములందనుడు, రాజకీయ వ్యవస్థ లందనుడు) అనవరతము, సత్యము తేజరిల్లదు. నీతిపై ఆఘాతమువేసి, నిరంకుశత్వమునకు పట్టముగట్టి, గ్రామదేవత నారాధించి నట్లు మౌఢ్యమునకు జాతరసేవజేసి, నిరీహులను, నిర్దోషు లను దారుణాత్యాచారయూపకాష్ఠముపై బలిదానము చేసినవారు ప్రపంచచరిత్రలో అగపడుచున్నారు. ఈ నిష్ఠుర చర్యలను రవీంద్రుడు ధృతిసహనములతో నెదిరించెను. ద్వేషీనీమములకే తలయొగ్గవలెనని, నిస్తులప్రేమచే హృద యము నప్పగింపవలెనని "సతి" అను నాటకమందు రవీం ద్రుడు పాత్రచిత్రణమున వ్యంగ్యవిభూతితో తెలిపెను. సీమ లెన్నో యున్నవి. జాతులును, మతములును, భాషలును బహుళముగా నున్నవి. కాని వాని లక్ష్యములో తేజరిల్లు సత్యసందీప్తమహదాశయ మొక్కటియే! ఎల్లరహృదయ ములందు జీవితమహిమను విస్తరింపవలెనని పూనిక ఆతని యందు గలదు. తాను బ్రహ్మసమాజప్రథ ననుసరించినను బ్రహ్మసమాజము హిందూధర్మప్రాంగణమున కవ్వల కల దని ఆతడెన్నడును విశ్వసింపలేదు. "గోరా" మున్నగు గ్రంథములందు "నేను హిందువును; నేను హిందువు" నని ఆతడు తన పాత్రలచే పలికించినాడు.

మతమందు నైతికసూత్రములలో సత్యము వ్యక్త మగునట్లు కవిత్వ, చిత్రలేఖన, సంగీత నృత్యములందును అది వ్యక్తమగునని దాని పరిపాలనమువలన చేకురు మేలును, ఉల్లం ఘనమున దాపురించు కీడును తన నాటికలందు రవీంద్రుడు వ్యక్తీకరించినాడు. సంగీతనృత్యములందు ఆరితేరిన ఒక వ్యక్తి దేవేంద్రుని సమక్షమున తన ప్రదర్శనమును నిర్వహించుచు అపస్వరమును గీతికాలాపనమున జొరనిచ్చుటచే శాపమునకు గురియగుట రవిసాహితిలో మనము విలోకింతుము. పదపడి 'శాపవిమోచన'మున అవ్యక్తికి నిష్కృతి లభించినది.

రవీంద్రుని ప్రతిభ గంగోత్తరికెనయైన దంటెని. విస్తృతైన అడ్డంకులను ఛేదించి, కదువడిగ దివిజకల్లోలిని తన లక్ష్యసిద్ధిదెస సాగిపోయినది. రవికవిహృదయమందలి అమరవాహిని అట్లే స్రవించినది. నూతన ఛందస్సు, నవవ్యాకరణ నిధానము, నవ్యశబ్దప్రయోగప్రథ, క్రొత్త జాతీయములు, కొంగ్రొత్త పోకడలు, అపూర్వాలంకారికసృష్టి ఆతని రచనలో అగపడును. నవయుగమున అపూర్వభావధుని స్రవించుచున్నది కదా! నూతనభావము, నూతనభాష వికాసమును కాంక్షించును. వికాసము వినా కళ ఎందుండును?

రవీంద్రుని రచనాప్రభావము భారతదేశమందలి ప్రధాన వాఙ్మయములపై ప్రసరించినది. అనువాదములు, అనుకరణములు, అనుసరణములు తలలెత్తినవి. నూతనేతి వృత్తములు ఆదరింపబడినవి. అరవములో భారతి నవయుగ సందేశమును వ్యక్తీకరింపసాగెను. కాని రవివలె తపసానరించిన వాడే రెండవరని కాగలడు; అతనివాక్కు లుపనిషత్తులు కాజా లును; ఉదధివీచికలకవి సహపాఠులగును. తెలుగు గద్యములో ముట్నూరు కృష్ణారావుగారు తొలుత వంగదేశముపై చూపు నిలిపిరి. గురజాడ అప్పారావుగారు రవీంద్రుని పరిచయము సంపాదించిరి. ఇరువురకు ఉత్తరప్రత్యుత్తరములు జరిగెడివి. అప్పారావుకృతులలో వీని యుదంతము కొంత అగపడు చున్నది. రాయప్రోలు, దేవులపల్లి, దువ్వూరి వైతాళికులు నవయుగతేజస్సునవలోకించి తమ రచనలను సాగించిరి.

రవీంద్ర ప్రభావమువలన ప్రపంచవాఙ్మయమందే సంచలన ముదయించినది. ప్రపంచమందలి ప్రధానభాషలలోనికి ఆతని కృతులు అనువదింపబడినవి. అందలి ఆనందజ్యోతి, అనురాగజ్యోతి, జ్ఞానజ్యోతి తమ ద్యుతులను జగతికి ప్రసాదింపలేదా?

తొలుత రవికవి క్రొత్తపోకడలు ఆతని సీమయందే కొన్నికొన్ని కిచకిచలను పుట్టించినవి. కొందఱు తమ హృదయ ములందు రవరవలు రవుల్కొలుపుకొనిరి. దుర్విమర్శకు చేయిజేసుకొనిరి. ఆత్మవిశ్వాసముగల రవికవి గీతాంజలి మున్నగు గ్రంథములను నాంగ్లీకరించి ఏట్సు, ఆండ్రూస్ ప్రభృతుల ప్రశంస పడసి నోబులుబహూకృతినంది ప్రపంచ సాహిత్య సామ్రాజ్యములో పరంజ్యోతియై వెలుగొందుటచే, సర స్వతియే విజయడిండిమమును మ్రోగించినది.

నేటి శతవార్షికమహోత్సవములలో విజయధ్వనులు ఘనతరమగుచున్నవి. సత్యమున కెన్నటికైనను సర్వలోకము లందును పూజ లభించునుగదా! ఈ యుత్సవముల నవలో కించువారు రవీంద్రు డస్తమించెనందురా? ఆత డమ రుడు. ఆతని కృతు లమృతమయములు. ఆతనికతమున మన సంస్కృతి అమరవిభూతి నందినది!

రవీంద్రుడు వెలిగించినది అమరజ్యోతి కాదా?

మా లి ని

మూ ల ము :
శ్రీ రవీంద్రనాథ టాగూరు

అ ను వా ద ము :
శ్రీ కొటూరి విజయసారథి

[దూరంగా జనుల కోలాహలం]

మాలిని : (స్వగతం) నాకు సమయ మాసన్నమైంది. ఈ కాల గర్భమను తామరాకుపై నీటి బొట్టులా నా జీవితం గజగజ వణికిపోతోంది. కనులు మూసుకుంటే ఆకాశంలో ప్రళయ గర్జనలు వినిపిస్తున్నవి. ఎందుకో యీ సంక్షోభం...ఎందుకో నా మనస్సుకీ వ్యథ...

రాణి : (ప్రవేశించి) అమ్మా మాలినీ...ఏమిటమ్మా యీ వేషం. నీ యౌవన సౌందర్యాలకు తగిన పట్టుపుట్టాలు విడిచి భూషణ పంక్తులు తిగిచి—ఈ కావికట్టు ఏమిటమ్మా....ఎందుకమ్మా నీ కీ విరక్తి.

మాలిని : అమ్మా, రాజగృహంలో కూడా పేదలై పుట్టేవా రుంటారమ్మా ...... పేదరికంలో, సిరిసంపదలు వెతుక్కునేవారి విధివ్రాత ఇంతే....

రాణి : చంటి పిల్లలకు చెప్పే కట్టుకథలు నాకు చెబుతా వెందుకు తల్లీ. నీ మాటలు వింటుంటే నాకు భయంగాఉంది. మన మతగ్రంథాలు తిరస్కరించే యీ క్రొత్తమతం నీ కెక్కడ దాపురించిందమ్మా.... మాలినీ, నీకీ క్రొత్త మతం నేర్పిన గురువులు వంచకులు. బౌద్ధభిక్షువులంటే మాంత్రికులు. ఆచరణ యోగ్యంకాని కఠిన సిద్ధాంతాలతో నీవంటి అమాయికల మనసుల వశపరుచుకుని అసత్యాలతో ముగ్ధుల్ని చేస్తారు. అయినా మతం అనేది వెతికి పట్టు కోడానికి అదేమైనా ఒక వస్తువుటమ్మా....నిత్య తేజోభాసమానమైన సూర్యకాంతికాదా తల్లీ.... నేనొక సామాన్య స్త్రీని. ఈ పురుషులు చెప్పే సిద్ధాంతాలు నాకు అర్థంకావు. ఆడదానికి తన భర్తా పిల్లలే ప్రత్యక్ష దైవాలు. అయాచితంగా దర్శన మిచ్చే దైవతాలు. ఆ దేవతలను పూజించడమే ఆడ పుట్టుకకు కర్తవ్యం....

రాజు : (ప్రవేశించి) మాలినీ, రాజగృహాన్ని కారుమబ్బులు చుట్టుముట్టుతున్నవి. ఇంక నీ పథగమనాన్ని ఆపమ్మా....భయానకయానం కట్టిపెట్టమ్మా....

రాణి : మహారాజా....ఏమిటా మాటలు ?

రాజు : మాలినీ.... నీ నూతన మతాన్ని యీ రాజ్యంలో ప్రచారం చేయదలచుకొంటే చెయ్యి....కాదనను— కాని ఆ మత ప్రవాహాన్ని వరదవెల్లువగా రానిచ్చి కట్టపైఉన్న పాత కాపులంతా భయపడేలా చేయ బోకు. నీ విశ్వాసాన్ని కాదనను.— కాని—నీ విశ్వాసం పట్న ప్రజల వైమనస్యాన్నీ వైముఖ్యాన్నీ పెంపొందింపచేయకు.

రాణి : నా బిడ్డ నలా ఎందుకు ఆడిపోసుకుంటారు? మీ మంత్రాంగ కుతంత్రాలన్నీ ఈ పసిదానికి నూరి పోయకండి మహారాజా....తన మతాన్ని గురుదేవు లని తానై నిర్ణయించుకుని ఆచరిస్తే ఎవరుగాని ఆమె నెందుకు నిందిస్తారు ?

రాజు : దేవీ, ప్రజలందరూ మా తనయను రాజ్యంనుంచి బహిష్కరించమని ఆందోళన చేస్తున్నారు.

రాణి : రాజ్య బహిష్కరణా......మీ తనయకా....

రాజు : ఆమె ధర్మశాస్త్ర ద్వేషానికి బ్రాహ్మణులంతా భయార్తులవుతున్నారు.

రాణి : శాస్త్రద్వేషం! బూజుపట్టిన ఆ శాస్త్రాల్లో నిబద్ధమైనదేనా ధర్మమంటే ? చెదపట్టిన వారి శాస్త్రాలను, ధర్మాలను విసిరి పారేసి నా బిడ్డదగ్గర వారందర్ని క్రొత్త పాఠాలు. నేర్చుకోమనండి ప్రభూ! మన మాలిని సామాన్య బాలిక అనుకుంటున్నారా! కాదు మహారాజా ! కాదు .... మాలిని పావకాచ్ఛకీల ! దేవాంశసంభూతురాలు, కారణ జన్మురాలు.... ఆమెను నిందించకండి.....నా మాట మన్నించండి... లేకుంటే ఒకనాటికి మాలిని ఎక్కడా కనుపించ కుండా పోతే తలబాదుకున్నా ప్రయోజనం వుండదు... (విచారగాద్గద్యం)

మాలిని : నాయనగారూ....మీ ప్రజాభీష్టమే నెరవేర్చండి. నా నిష్క్రమణకు సమయ మాసన్నమైంది. నన్ను బహిష్కరించండి మహారాజా!....

రాజు : అదేమిటమ్మా.....నీ పుట్టింట యీ అంతఃపురంలో నీకేం లోటు చెప్పమ్మా....

మాలిని : అలా అనకండి! ...యీ రోజున నా బహిష్కృతికి ఆందోళన చేస్తున్న వారంతా రేపు నాకోసం పశ్చాత్తప్తు లవుతారు. అమ్మా, నా మనసులో ఏదో మహత్తరభావం నిండివుంది. దాన్ని నీకెలా వివరించి చెప్పాలో మాటలు రావటం లేదు. నిర్విచారంగా పూలు రాల్చిన మహావృక్షంలా నన్ను వదిలెయ్యండి. నాకు సెలవీయండి. ప్రజలలోకి నన్ను వెళ్లనీయండి. ఈ రాజహస్తాల్నుంచి ప్రపంచమే నన్ను దరియ రమ్మని కోరుతోంది. నా మాట మన్నించండి...

రాణి : (విచార గాద్గదిక) నా కెటూ పాలుపోవటం లేదమ్మా..

మాలిని : నాన్నా మీరు ప్రభువులు....మహా రాజులు....ధర్మ రక్షకులు......స్థిరచిత్తంతో మీ ధర్మాన్ని నిర్వహించండి.

రాజా : మాలినీ, యీ విశాల రాజాంతఃపురంలో నీ మనుగడకు చోటే లేదా? ఈ జగద్భారమంతా నీ చిన్నారి లేత భుజాలకోసమే ఎదురు చూస్తోందామ్మా.....?

మాలిని : అవును మహారాజా.....నేను జాగృతిలోనే కల కంటున్నాను. హోరుమంటూ గాలి వీచింది. జలభాగాలన్నీ కల్లోలము లైనాయి. రేయి రేయంతా చిమ్మచీకటై పోయిన ఆ కాళరాత్రిలో నావ లంగరు వేయబడి వుంది. తోవ తెలియక కొట్టుమిట్టాడుతున్న యాత్రికులను కాచి దరిజేర్చే సరంగు ఎవరు? ఆ మార్గమేదో నాకు తెలుసుననిపిస్తోంది. నా స్పర్శతో అనావ నూతనోజ్జీవంపొంది పురోగామి కావాలి.

రాణి : విన్నారా ప్రభూ విన్నారా ఆ మాటలు ? యీ మాటలన్నీ మన కన్నతల్లి మాలిని అంటున్నవేనా? మాలినీ, నువ్వు మా కన్నారివి కావా? యీ మాటలన్నీ ఏమిటమ్మా.....?

రాజా : అవును....ఈ మాటలు నీ కన్నతల్లి మాలినివే దేవీ. ఉషస్సుందరిని నిశాదేవియే కన్నప్పటికీ, ఉషోదయం రాత్రిది కాదు.......విశాల విశ్వానిది.

రాణి : మహారాజా....యీామె నింక మీరు ఆపలేరా? (విచారం) ఈ ఇంటివెల్గు ఇంతటితో దూరమైపోవలసిందేనా? అయ్యో నా చిట్టి తల్లీ......చూడమ్మా—పట్టుకుచ్చులాంటి నీ కేశాలు ఎలా చెదరిపడ్డాయో—నన్ను ఒక్కసారి జడవేయనీయమ్మా!! ప్రభూ! అమ్మాయిని బహిష్కరించక తప్పదా? మాలినిని బహిష్కరించటమే వారి ధర్మంలో ప్రధానాంగమైతే వారిని యీ నవధర్మాన్ని నేర్చుకోనీయండి. ఆ విప్రులందరికీ యీ నూత్న సత్యాన్ని బోధించనీయండి.

రాజా : దేవీ, విచారించి లాభం లేదు. చూశావా...(జనుల కోలాహలం) వీధిలో జనం ఎలా గోల చేస్తున్నారో చూడు....పద......లోనికి పోదాం.....

....

[రాకుమారిని రాజ్యంనుంచి బహిష్కరించాలి....రాజ్య బహిష్కృతి జరిగి తీరవలిసిందే....అంటూ వేయి గొంతులతో విప్రుల కేకలు.]

క్షేమంకరుడు: మిత్రులారా! మీలో మండుతున్న విప్లవాగ్నిని ఆరనీకండి. మానవుడు భయపడితే, అతనికి ఎవరేనా శత్రువులున్నారంటే—ఒక్క ఆడదే ఆ పరమ శత్రువు. శత్రువుల్లోకల్లా భయంకరమైన శత్రువు. ఆమెతో వాదోపవాదాలు మన కనవసరం. బలాత్కారణ సిగ్గుచేటు. స్త్రీయొక్క అశక్తతకు పురుష శక్తి నవ్వుతూ సంతోషంతో లోబడిపోతుంది. కనుక మనం చాలా జాగ్రత్తగా వుండాలి. స్త్రీ అనే పరమ శత్రువు చివరకు మన హృదయాల్లోనే ప్రశాంతంగా విశ్రాంతి తీసుకుంటుంది. మీ పట్టుదల మాత్రం సడల నీకండి!

ఒక వి. : అంతఃపురంలోనే విషపుకోరల కోడెనాగు పడగవిప్పి కోరలుచాచి పవిత్రమైన మన మత హృదయాన్ని దహించి వేస్తున్నదని మహారాజులతో ప్రత్యక్షంగానే విన్నవించుకొందాము.

సుప్రియుడు: (నిరసనగా) అయ్యలారా, నేను మూర్ఖుణ్ణి. మిమ్మల నర్థంచేసుకోలేకపోతున్నాను.అభము, శుభము ఎరుగని అమాయకురాలి రాజ్యబహిష్కరణ కోరేదేనా మీ మతం? తెలియక అడుగుతున్నాను చెప్పండయ్యా.

ఒక. వి : సుప్రియా....నువ్వు మా పూనికకు అడ్డుగోడవి....భవిష్యత్పథంలో కంటకప్రాయమైన సంకటానివి....

రెం. వి : మా ధర్మాన్ని రక్షించుకోవటానికి మేము ఐక్యమై భిత్తికవలె నిల్చున్నాము. దానికి బీటలాదాపురించావు నువ్వు. ఔదుగరచిన పెదవులమీది విషపునవ్వువు నీవు.

సుప్రి : ప్రజాబలంతో దౌర్జన్యంతో సత్యాన్ని మీరు మట్టుపెట్టదలచుకొన్నారు. మీ అరుపులూ అర్భటులతో సత్యాన్ని ముంచేద్దామనుకొంటున్నారు.

ఒక.వి :సుప్రియా!నువ్వు మాసంఘానికే అవమానం తెస్తున్నావు. ఘోరమైన తలవంపులు తెస్తున్నావు....

సుప్రి : తలవంపులు తెస్తున్నది నేను కాదు—స్వార్థబుద్ధితో సంకుచితత్వంతో మీ శాస్త్రాల్ని నియమించి ఆదేశించిన నిర్ణేతలే మీకు అవమానం కలిగించారు.

రెం. వి : చూస్తారేం....మెడబట్టి అవతలకి గెంటండి. వీడు మన సంఘంలో ఉండటానికి అనర్హుడు.

ఒక. వి : రాకుమారి బహిష్కరణకు మేమంతా ఏకగ్రీవంగా సమ్మతించాం.మా నిర్ణయానికిప్రతికూలంగాప్రవర్తించే నీవంటి క్షుద్రునికి మా సంఘంలో స్థానం లేదు.

సుప్రి : విప్రవర్యులు శాంతించాలి. మీ సమితిలో నన్నొక సభ్యుడుగా అంగీకరించిన దోషంమీది. నేను మీరూపానికి నీడను;కాను, మీ మాటకు ప్రతిధ్వనినికాను. మీ కేకలతో, అట్టహాసాలతో సత్యాన్ని త్రోసిపుచ్చటం నే నెన్నడు అంగీకరించను. నేనూ అలాంటి అన్యాయ సంఘంలో ఒకడినని చెప్పుకోటానికి చాలాసిగ్గుపడతాను. మిత్రమా! నాకు యీ సంఘాచారాలకి సరిపడదు. నాకు సెలవియ్యి క్షేమంకరా.....పోతాను.....

క్షేమం : సుప్రియా, చెలికాడనై ఉండి అపాటి ఎరుగకపోను. బ్రాహ్మణమతంమీద గౌరవంలేనివాడివికావు....కాని, వీ వాదనవల్ల కావేమోననే అనుమానం కలిగిస్తావంతే.... మిత్రమా ! రోజులు మనవి కానప్పుడు శాంతించడం మంచిది.

సుప్రి : మూర్ఖత్వం మూఢ విశ్వాసంకంటె దుర్భరమైంది ఇంకోటిలేదు. క్షేమంకరా....మీ మతాన్ని, ధర్మాన్ని

సురక్షితంగా కాపాడుకోవటానికి అభము శుభము ఎరగని ఆడపిల్లని తన పుట్టినింటినుంచి గెంటించు తారా....ఆమె ఏమపరాధం చేసిందని యీ శిక్ష విధించారు. మతానికి ధర్మానికి దయా సత్యాలే మనో జేహాలని ఆమెమాత్రం నమ్మటం లేదా? సర్వధర్మసారము, సత్యభూత దయాశీల త్రిశబ్దయుక్తంకాదా?

క్షేమం : సారం ఒకటే కావచ్చు. ఆ యా నేలలనుబట్టి జల రాశికి స్వరూప భేదం కలిగినట్లు వివిధమతస్థులు వివిధ రకాలుగా తమ ధర్మాన్ని నిర్ణయించుకుంటారు. నీ కోసం నువ్వు నీ పెరటిలో ఒక మంచినీటి నూయి తవ్వుకుంటే ఇబ్బందిలేదు...కాని జనమంతా నీ బావి నీటినే తాగాలని ఆదేశించినా వారు పూర్వం త్రాగుతున్న నీరు కలుషితమని అసహ్యించుకొన్నా ఎవరు సహించరు. తర తరాలనుంచి పరిపక్వమై పసర్ను కమ్మిన దిగుడు బావినుంచే వారి లొట్టెడు నీరు వాళ్ళని తెచ్చుకోనీ.....

సుప్రి : క్షేమంకరా! ఇక యీ విషయంలో నేను నిన్నే అనుసరిస్తాను. ఇలాంటి మత విషయాల్లో ఎన్నడూ వాదోప వాదాలకు దిగకూడదు.

మూడో వి : (ప్రవేశించి) వినండయ్యా శుభవార్త వినండి వినండి. మన వాదన నెగ్గింది. రాజభటులు కూడా ప్రత్యక్షంగా మన పక్షమే పలుకుతున్నారు....

రెం. వి. : రాజభటులేకి ఏమో నా కదంత ఇష్టం లేదు.

ఒక. వి : నాకూ ఇష్టంలేదు—యీ విప్లవం విలయానికి దారి తీస్తుంది....

రెం. వి : విన్నావటయ్యా క్షేమంకరా!.....ఆగడం మితిమీరుతోంది.

ఒక. వి : మన మత విశ్వాసమే మనకు విజయలక్ష్మిని ప్రసాదిస్తుంది. మనకు చేతులు కలిపే పనిలేదు. దీక్ష వహించి మన భద్ర దేవతల నారాధించుదాము.

రెం. వి. హే మాతా.....జగజ్జననీ.....అనుగ్రహించు తల్లీ..... నాస్తికులయెడ నీవు చూపే కోపం నీభక్తకోటికి రామరక్ష. మా మనోవిశ్వాసం నిజమని నీవే నిరూపించి విజయాన్ని ప్రసాదించు తల్లీ....

అందరు : మేలుకో తల్లీ నీ భక్తులను ఏలుకో....స్వర్గధామం నుంచి దిగివచ్చి ఆశ్రితులను రక్షించు.

మాలిని : (ప్రవేశించి) ఇదుగో వచ్చాను.

రెం. వి : అదిగో జనని సాక్షాత్కరించింది. తల్లీ చివరకు నీవే వచ్చావా? మానవమాత్రుని తనయగా యీ అవనిలో అవతరించావా? నీభయంకర జ్వాలాజిహ్వను రక్తనేత్రాలను ప్రళయస్వరూపాన్నిమార్చుకొనిఅందాలచందనపు బొమ్మలా సుప్రసన్నవైనావా తల్లీ....జగజ్జననీ, నీ ఆకాంక్ష ఏమిటోతెలుపవమ్మా... నీ భక్తులు.... నీ తనయులు...నీ ముంగిట నతగాత్రులై నిలిచివున్నారు.

మాలిని : మీ పిలుపువిని బహిష్కృతనై వచ్చాను....

రెం. వి : స్వర్గ బహిష్కారమా తల్లీ....నీ బిడ్డల ఆక్రందన విని దివినుంచి ప్రవాసినివై వచ్చావా జననీ !....

ఒక. వి : క్షమించు తల్లీ !....దురాచారాలు ప్రబలి నీ సృష్టి భీతిల్లి విలపిస్తున్నది. నీ దయాభిక్షకోసం ఆక్రోసిస్తున్నది....

మాలిని : మిమ్మెన్నడూ విడనాడను. నాకోసం మీఇంటి తలుపులు సర్వదా తెరిచేఉంటాయని నాకు తెలుసు. నా బహిష్కారానికై మీరు చేసిన రోదన విని రాజ భోగాలనుంచి మేలుకున్నాను....

క్షేమం : యువరాణీ ! (ఆశ్చర్యంతో)

అందరు : రాకుమారి !

మాలిని : మీ యిబ్బ్లు మీ బ్రతుకు హాయిగా చేసుకోవటానికే నా ప్రవాసం. ఇంక నిజం చెప్పండి. వాస్తవంగా మీకు నా అవసరం వున్నదా....పరులకు దూరంగా ఒంటరిగా బ్రతుకుతున్న యీ బాలికను బాహిరజగత్తునుంచి మీరు పిలిచారా ? అది కేవలం నా కలా ?

ఒక. వి : తల్లీ! నీవు విచ్చేసి మా హృదయాల లోలోపల ఉపవిష్టురాలివయ్యావు.....

మాలిని : రాజప్రాసాదంలో నా పుట్టుక. బయటి ప్రపంచాన్ని ఎన్నడు తొంగిచూడనైనా చూడనిదాన్ని. నా చేరికకు దూరమైన యీవిశ్వమంతా దుఃఖమయమని విన్నాను. కాని యీ విశ్వానికి ఎక్కడ బాధ కలిగి విలపిస్తోందో నాకు తెలియదు. మీ బాధా నివారణకు మార్గమేదో నాకు తెలియచెప్పండి.

ఒక. వి : నీ చల్లనిమాట మమ్మల నార్ద్ర మనస్కులను చేస్తోందమ్మా....

మాలిని : అదిగో ఆ నీలిమబ్బుల మాటున ఇప్పు డిప్పుడే చంద్రోదయమవుతోంది. విశాల గగనం తన వెన్నెల కౌగిట యీ విశ్వాన్నంతటినీ పొదివికొన్నది. నీడలు పరచుకొని నిశ్చలంగా ఉన్న యీ పాల వృక్షాల స్నేహాన్ని వీడి యీ బాట ఏ దూర తీరాలకో పరుగులిడుతోంది. అవిగో కుటీరాలు. అదే స్వామి కోవెల.....విషాదమైన ఎడారిలా అదుగో దూరాన నదీ తీరం. కలల జలదంనుంచి జారిపడిన జల్లులాగానే నే నీ దారిని నరజగత్తుకి దిగివచ్చాను.

ఒక. వి : ఈ విశ్వానికి దేవతాత్మవమ్మా నువ్వు....

రెం. వి : ఆ స్వర్గంనుంచి నిన్ను బహిష్కరించమని కోరినప్పుడు వారి నాలుకలు చీలిక లెందుకు కాలేదు తల్లీ....

ఒక. వి : విప్రులారా రండి.....తల్లిని నిజ నివాసానికి తీసుక వెళ్ళి దింపివద్దాం....

అందరు : నరపుత్రివై ధర నవతరించిన కరుణామయీ ! జయ వరదాయనీ ! జయ—ఆది శక్తీ ! జయ !

(నినాదాలు దూరమవుతాయి)

క్షేమం : సుప్రియా ! యీ భ్రమ నిలాగే అంతరించనీ. నిదురలో నడుస్తున్నట్లు ఎక్కడికలా వెళ్ళిపోతున్నావు....

సుప్రి : నన్ను వెళ్ళనీ క్షేమంకరా......నన్ను వెళ్ళిపోనీ....

క్షేమం : ఆవేశాన్ని తగ్గించి ఆలోచనని పెంచు...ఈ గుడ్డి మిడతల దండులో నువ్వూ ఒకడివై అగ్నిలో దూకుతావా ?

సుప్రి : ఇది కల కాదుగదా....

క్షేమ : కాక మరేవిటి ? కాస్త మేలుకుని కనులువిచ్చి చూడు సుప్రియా......

సుప్రి : మోక్షంమీద నీకున్న ఆశ పొరపాటు క్షేమంకరా ! యిన్నాళ్ళూ యీ సిద్ధాంతాల ఎడారిలో వృథాగా తిరిగాను. అవంతైనా శాంతి లభించలేదు. ఈ జన సందోహం నమ్మిన భగవంతుడు — మత గ్రంథాల్లో బందీ అయిన దేవుడు నా స్వామి ఆ దేవుడు కాదు. నా సందేహనివృత్తికి ఇది చోటు కాదు. వీళ్ళు నన్ను సమాధానపరచలేరు. ఈ నరజగత్తులోని అమరత్వాన్నే నే నారాధించడానికి నిశ్చయించుకున్నాను.

క్షేమం : మనస్సే మనిషిని వంచించిందంటే అంతకంటే దుర్ముహూర్తం ఇంకోటి ఉండదు మిత్రమా ! వెర్రి కోరికలు వేదాలైపోయి పిచ్చి పిచ్చి వూహాలు చెలరేగి పవిత్రమైన ఆశయాలను తొలగించి దురాక్రమణ చేస్తాయి. అదిగో ! అటు చూడు — మెత్తని ఉన్నివన్నె మేఘాల్లో దోబూచులాడే చంద్ర బింబమే పరమ సత్యానికి ప్రమాణమంటావా సుప్రియా ! ....తెల్లవారిందంటే ప్రజలంతా బ్రతుకుతెరువు కోసం సతమతమైపోతారు ఆమండు టెండలో గడచిపోయిన అందాల చందమామా, వెన్నెల మిన్నూ ! ఇవన్నీ కనీసం గుర్తుకైనా రావు. ఆ వూహాలన్నీ కలగా కరిగిపోతాయి. అందని అందాల అతిసౌందర్యపు టింద్రజాలం నిత్యసత్యానికి సాటి వస్తుందా ? అంతే మిత్రమా.... నీ వూహాలు కూడా అంతే....

సుప్రి : అదేమో నాకు తెలియదు క్షేమంకరా !

క్షేమం : తెలియకపోతే కళ్ళు విప్పి చూడు....తరతరాల సంప్రదాయాల చిరుపాపల కునికిపట్టయిన పురాగృహం దగ్ధమైపోతోంది. గూడుకూలిన పక్షులు విలపించినట్లు ఆ శిథిల గృహాన్ని చూచి మన తాత ముత్తాతల ఆత్మలు ఘోషిస్తున్నవి. అమావాస్య అర్ధరాత్రిలో,శత్రువులు తలుపు తట్టుతుంటే,ప్రజలంతా ఒళ్ళుతెలియని నిద్రమత్తులోవుంటే—దురభిప్రాయాల మత్తులోపడి దురహంకారాలతో, ఒకరి కుత్తుక లొకరు కత్తులతో ఉత్తరించుకోజూచే యీ సమయంలోనా నీ అస్థిమితత....ఆపత్సమయంలో, అనిశ్చయత తగదు సుప్రియా....

సుప్రి : నీకు నే నండగా వుంటాను....

క్షేమం : కాదు....తక్షణం నే నిక్కడనుండి వెళ్ళిపోవాలి....

సుప్రి : ఎక్కడికీ ? ఎందుకూ....?

క్షేమం : పరదేశాలకి. యీ క్రోధానల కీలలు రక్తదాహం గొన్నాయి. ఆ మహోగ్ని నార్పటానికి సైన్యాన్ని తీసుకొస్తాను.

సుప్రి : అందుకు మన సైనికులే సిద్ధంగా వున్నారు....

క్షేమం : మన సైనికులు—హు—వారి సహకారాన్ని కోరడం అవివేకం. వారంతా యీ మహోగ్నిలో దూకే మిడతలే. అవివేకంతో వాళ్ళంతా చేసే అర్భాటులు నీకు వినబడటంలేదా? నగరమంతా పిచ్చెక్కిపోయింది. పవిత్రాశయాల చితాగ్నితో దీపావళి దివిటీలు వెలిగించుకుంటున్నారు.

సుప్రి : సరే మిత్రమా !.... నీకు వెళ్ళక తప్పకపోతే నన్ను కూడా తీసుకువెళ్ళు....

క్షేమం : అలా వీల్లేదు.....నువ్విక్కడేవుండి ఎప్పటికప్పుడు సమాచారాలు నాకు అందజేస్తూ ఉండాలి. కాని మిత్రమా!......అసత్యపు క్రొత్తదనంలోపడి నన్ను మరచిపోకు.

సుప్రి : అసత్యం క్రొత్తదే కావచ్చు. మన స్నేహంమాత్రం పాతది. క్షేమంకరా ! మనం ఆబాల్య మిత్రులం. ఇదే మన తొలి వియోగం.

క్షేమం : తుది వియోగం కూడా ఇదే కావాలి. కాలం కలిసి రాకపోతే ఎంతటి గాఢానుబంధాలూ సడలిపోతవి. అన్నదమ్ములు కొట్లుకుంటారు. ఆప్తమిత్రులే ఆజన్మ శత్రువులవుతారు. నేని చీకట్లోకి వెళ్ళిపోయి మళ్ళీ యీ చీకటిలోనే యీ ప్రాంగణంలో కాలు పెడతాను. అప్పుడు నా మిత్రుడు నా సుప్రియుడు నా కోసం వెలుగు దివిటీ పట్టుకుని ఎదురు చూస్తూంటాడనే ఆశనే నేను నాతో మోసుకుపోతాను.

(క్షేమంకరుడు దూరమవుతున్నట్లు వియోగ సూచకంగా నేపథ్య సంగీతం వినిపిస్తుంది)

(రాజు, యువరాజు ప్రవేశిస్తారు)

రాజు : మాలినిని బహిష్కరించక తప్పనట్లుంది యువరాజా..

యువ : అవును మహారాజా....అలసిస్తే ఆపదలు కూడా వస్తాయి.

రాజు : సాధు కుమారా సాధు...... నా ధర్మనిర్వహణలో లోపం కలుగుతుందని భయపడకు. ఆమెను బహిష్కరించి తీరుతాను....

(యువరాజు నిష్క్రమించగా మహారాణి ప్రవేశం)

రాణి : మహారాజా ! ఏదీ ఎక్కడుంది ? నా కన్నుకూడా కప్పి దాచారా ?

రాజు : ఎవరిని ?

రాణి : నా తల్లి మాలినిని....

రాజు : ఆ ఏమిటీ....మాలిని తన గదిలో లేదా ?

రాణి : లేదు ప్రభూ !.....లేదు....ఎక్కడా కనిపించటం లేదు. తమ సైన్యాన్ని తీసుకెళ్ళి నగరమంతా ఇళ్లిల్లూ గాలించి వెతికించండి. నా చిట్టి తల్లిని యీ పౌరులే ఎత్తుకుపోయివుంటారు. యువరాణీ కనుపించక పోతే ప్రజలందరికీ రాజ్య బహిష్కరణ తప్పదని చెప్పండి....

రాజు : నా రాజ్యం సర్వనాశనమైపోయినా సరే....యువ రాణిని వెతికి తీసుకొస్తాను......

(సైనికులూ, విప్రులూ కాగడాలతో మాలినిని తీసు కొస్తున్న కలకలం)

రాణి : ప్రభూ !.....ఏమిటా కాగడాలు....ఏమిటా కలకలం ?

రాజు : ఎవరక్కడ ? ఏమిటీ ముట్టడి...

ఒక. వి : ఆగండి మహారాజా.....ఇది ముట్టడికాదు....ఇదిగో తమ మాలిని. యువరాణిని మేమే తీసుకొచ్చాం.

రాణి : అమ్మా మాలినీ ! వచ్చావా తల్లీ....నా కళ్ళన్నీ నీ మీదనే పెట్టుకున్నానే—నా కనుమొరగి ఎలా వెళ్ళి పోయావమ్మా.....

రెం. వి : మమ్ములను దీవించటానికి మా ఇంటికి విచ్చేసింది యువరాణి....ఆమెపై ఆగ్రహించకండి మహారాజా..

ఒక. వి : ఈ తల్లి మీ ఒక్కరిది మాత్రమేనా—మాకు మాత్రం తల్లికాదా ?

రెం. వి : చిన్నారి తల్లీ—మమ్మెన్నడూ మరచిపోకమ్మా— అగమ్యగోచరమైన మా జీవితపథాలకి ధ్రువతార వమ్మా నీవు....

మాలిని : మీకోసం యీ ఇంటి తలుపులు సర్వదా తెరిచే ఉంటా యి. ఈ గోడలు ఇకముందు మనలని వేరు చెయ్య లేవు.....

విప్రులు : ధన్యులం తల్లీ ధన్యులం....మేము పుట్టిన యీ ధరణి ధన్య...... (విప్రులు నిష్క్రమిస్తారు)

మాలిని : అమ్మా....ఆ బాహిర జగత్తు నీ అంతఃపురంలోకి తీసుకొచ్చాను. నా భౌతికబంధాలు త్రెంచుకొని జీవ కోటిలో నేనూ ఒకదాన్నయిపోయాను....

రాణి : అవునమ్మా.....ఇంక నువ్వు బయటకు వెళ్ళవలసిన అవసరంలేదు. యీ ప్రపంచాన్ని నీకు, నీ తల్లికి చేరువకానియ్యి. (దూరంగా గంటలు) రెండు జాము లైంది. యీ జీవనజ్వాల నీ నిద్రను దహించి వేసింది. కాస్త విశ్రాంతి తీసుకో తల్లీ....

మాలిని : అమ్మా !....నా కలవటగా వుంది. నాకు వణకు పుడుతోంది. యీ ప్రపంచం ఎంత విశాలమైం దమ్మా....అమ్మా! నాకు జోలపాడి నిద్రబుచ్చవమ్మా (జోలపాటను సూచిస్తూ హాయిగా వాద్య సంగీతం)

2

రా జో ద్యా న వ న ం

మాలిని : నీకు నేను చెప్పగలిగినదానినా సుప్రియా—నీకెలా చెప్పాలో తెలియటంలేదు. నీతో వాదించటానికి మీ మత గ్రంథాలు నేను చదువలేదు.

సుప్రి : రాకుమారీ...నేను మహాఋషుల దగ్గర గ్రుడ్డిగా శుష్క వేదాంతం నేర్చుకున్నాను. ఆ సిద్ధాంతాలకూ, ఆ గ్రంథాలకూ అన్నిటికీ ఉద్వాసనచెప్పి నీవద్దకు వచ్చాను. ఇంక నన్ను నీవే నడిపించాలి యువరాణీ....జ్యోతిని అనుసరించే ఛాయలా నేను మిమ్మల్ని అనుగమిస్తాను.

మాలిని : నువ్వు ప్రశ్నించినప్పుడల్లా నా జ్ఞానం మూగవో తోంది. నా శక్తి వీగిపోతోంది. నీవంటి సర్వజ్ఞుడు సందేహాలు నాముందు పెడితే నేను విస్తుపోవటం కంటె ఏం చెప్పగలను.....

సుప్రి : యువరాణీ . . . . నేను మీ వద్దకు జ్ఞాన సముపార్జనకోసం రాలేదు. నీముందు నా తెలివిని మరిచిపోదామని వచ్చాను. కాంతిహీనమైన చీకటి బాటలమీద పోతున్న అంధుణ్ణి.

మాలిని : మీ మాటలు విన్నకొద్దీ నేను అజ్ఞాని నవుతున్నాను. మెరుపులాగా నా హృదయంలో ప్రవేశించిన ఆ అమరవాణి ఇప్పుడేమైపోయిందో తెలియటంలేదు. మీ రా నాడు రాకపోయారు. ఈ జగత్తులో ప్రత్యక్ష బంధం ఏర్పరచుకొన్న తరవాత నేను పిరికిపంద నైపోయాను. ఈ విశాల విశ్వంలో నేను ఒంటరినై పోయాను. దివినుండి వచ్చిన కాంతి క్షణికమైన మెరుపులా మెరిసి యీ అనంత పథాలమీద ప్రకా శించి మాయమైపోయింది. చదువుకున్నవారు, జ్ఞానులు, మీరే నాకు చేయూత నివ్వాలిగాని....

సుప్రి : నా సహాయాన్ని మీరు కోరాలేగాని అంతకంటె అదృ ష్టమా ?

మాలిని : జనసందోహంలో నన్ను నేను పరిశీలించుకొన్న క్షణాన నా జీవనస్రవంతిలో నిరాశాతరంగా

తెగసి నన్ను భయపెట్టినవి. మళ్ళీ నా కా దుర్మార్గుడవస్తే నాకొక మంచి మాటచెప్పి చేయూత నివ్వగలవా సుప్రియా !....

సుప్రి : నిరభ్యంతరంగా.....మీకు సపర్యలు చేయటానికే విశ్వాసంతో, నిష్కల్మష హృదయంతో, ప్రశాంత చిత్తంతో సర్వదా సంసిద్ధుడనై ఉంటాను.

సేవకుడు : (ప్రవేశించి) యువరాణీ.....పౌరులు తమ దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు.

మాలిని : నేను చాలా అలిసిపోయాను......ఇప్పుడు చూడలేక పోతున్నందుకు విచారిస్తున్నామని చెప్పు....(సేవకుని నిష్క్రమణం) చెప్పు సుప్రియా—నీ మిత్రుడు క్షేమంకరుని గురించీ. అతనితోటి నీ సాహచర్యం గురించీ తెలుసుకోవాలని చాలా కుతూహలంగా వుంది.

సుప్రి : క్షేమంకరుడు నా చెలికాడు. సోదరుడు. గురుడు. అర్థంలేని అనుమానాలతో, చిన్నతనంనుంచీ నా మనస్సు చంచలంగా వుండేది. క్షేమంకరుడు మాత్రం మొదటినుంచీ దృఢచిత్తుడే. వెన్నెలరేడు తనలోని చీకటి మచ్చను కూడా ఆదరించినట్లు నిత్యశంకితుణ్ణయిన నన్ను క్షేమంకరుడు సర్వదా ఆదరించాడు. హు, ఓడ. ఎంత పెద్దదయితే మాత్రం ఏం ప్రయోజనం—అడుగునపడ్డ చిన్న రంధ్రం చాలు ఓడను ముంచివేయటానికి. (క్షణం విరామం) నీ పాలిట నే నొక క్షుద్రమైన రంధ్రాన్నయిపోయాను క్షేమంకరా....

మాలి : అంతటి దృఢమనస్కుణ్ణి నువ్వే ముంచివేశావా ?

సుప్రి : అవును నేనే—మీ నోట వెలువడిన మృదులవాక్సుధా వేణువు నాలకించి, మీ ముఖజ్యోతుల కాంతుల నీక్షించి విప్లవవీరులంతా లజ్జావనతముఖులై మరలిపోయిన నాడు క్షేమంకరు డొక్కడే స్థిరచిత్తంతో అచంచలంగా నిలబడ్డాడు. దూరతీరాలకు పోయి, వీర సేననుతెచ్చి పవిత్ర వారణాశి కేదారాలలో మొలిచిన యీ నూతన మతాంకురాన్ని సమూలంగా పెకలించుతానని ప్రతినచేసి నన్నిక్కడ విడిచిపోయాడు. ఆ తరవాత కథ మీకు తెలుసు. యీ సరిక్రొత్త పుట్టుగడ్డమీద నన్ను పునర్జీవితుణ్ణి చేశారు. జీవితమంతా ప్రేమించుమన్న ఆర్యోక్తి ఇన్నాళ్ళుగా ఉక్తిమాత్రంగానే విన్నాను. నేటికి ఆమాట నిజమై మీరుగా దర్శనమిచ్చింది. నామిత్రుడు క్షేమంకరుని కోసం నా ఆత్మ ఘోషిస్తున్నది. కాని అతడు నా చేరికకు దూరమైపోయాడు. పరాయిసేనను వెంటబెట్టుకు వస్తున్నానని, మీలో ప్రత్యణువునా పాతుకుపోయిన నూతన విశ్వాసాన్నీ, మిమ్మల్నీ నిర్మూలిస్తాననీ జాబు పంపినా (ఆందోళన) ఆ జాబు నేను దాచలేక పోయాను......మహారాజులకు చూపించాను....

మాలిని : నిన్ను నీవు మరచి ఇంత వెర్రిపని ఎందుకు చేశావు సుప్రియా.....ఇంత భయం నీ కెక్కడ దాపురించింది. అతనికీ, అతని సేనకీ మాత్రం నే నాతిథ్యం ఇవ్వలేనా....

రాజు : (ప్రవేశించి) మేలు సుప్రియా మేలు.....నీవు చేసిన ఉపకారంవల్ల క్షేమంకరుని, సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయేలా హఠాత్తుగా ముట్టడించాం. కొంచె మాలస్యమైతే నా నిద్రలోనే నా ఇంటిపై పిడుగు పడేది. నీ ఉపకృతికి మే మెంతో కృతజ్ఞులం. నీవు మా మిత్రుడివి....

సుప్రి : (స్వగతం) పరమేశ్వరా నన్ను క్షమించు....

రాజు : మహారాజుల అనుగ్రహానికి హద్దులుండవని తెలియదా సుప్రియా.....కోరుకో.....ఏం కావాలో కోరుకో.....నీవేం కోరినా కాదనము....

సుప్రి : వద్దు ప్రభూ వద్దు.....నాకేమీ వద్దు.....గడప గడప వద్దా బిచ్చమెత్తుకు బ్రతునిస్తే అంతే చాలు.

రాజు : అడగటమే తడవుగా మహా రాజులను సైతం మోహపెట్టే రాజ్యా లివ్వడానికి సిద్ధంగా వున్నాము....

సుప్రి : అవి నన్ను మోహపెట్టలేవు ప్రభూ....

రాజు : మాకు తెలుసు సుప్రియా.....అందని ఏ అందాల పొందుకోసం అర్రులుచాస్తున్నావో మాకు తెలుసు. వెర్రివాడా ..... అసాధ్యమైనాసరే నిస్సంకోచంగా అడుగు. ఏం.....మాట్లాడవేం....మా మాలిని బహిష్కృతికై ఆనాడు నీవు చేసిన విప్లవం గుర్తున్నదా? మాలినిని తన పుట్టినింటినుంచి బహిష్కరించమని మళ్ళీ యీనాడు ఆందోళన చెయ్యగలవా? అమ్మా మాలినీ.....నీ జీవితమంతా ఇతనికి ఋణపడ్డావన్న సంగతి నీకు తెలుసా....నీవై యీ ఋణ విముక్తికి నీ సర్వం....

సుప్రి : ప్రభూ....దయయుంచి ఆపైన చెప్పకండి. జీవితమంతా ఆరాధించి పరమపదాన్ని చేరిన మహానుభావు లెందరో వున్నారు. నేనూ వారిలో ఒకడినైతే చాలు.....కృతఘ్నతకు మెచ్చి ఇస్తారా ప్రభూ నాకు బహుమతి.....అమ్మా, సుఖశాంతులకు కొరతలేని కలవారలు మీరు.....పేదరికపు కాకలో ప్రమగ్గిపోతున్న వారి మనోవాంఛలు మీకు తెలియవు. సర్వజీవుల యందు సమహితత్వంతో సంచరించే మీ భూతదయకంటే నాకణుమాత్రమైనా అధికం అక్కరలేదు.

మాలిని : చే జిక్కిన శత్రువుకు మీరేం శిక్ష విధిస్తారు మహా రాజా !

రాజు : మరణదండన....

మాలిని : మీ పాదాలుపట్టి వేడుకొంటాను....క్షేమంకరుని క్షమించండి !

రాజు : అతడు విద్రోహి.......దేశద్రోహి తల్లీ....

సుప్రి : క్షేమంకరుని దేశద్రోహిగా నిర్ణయిస్తారా ప్రభూ.... మీ రాజ్యాన్ని అపహరించటానికి కాకుండా కేవలం మిమ్ములను దండించటానికి వచ్చినప్పుడు క్షేమం కరుడు కూడా మిమ్మల్ని.....

మాలి : అతన్ని రక్షించండి తండ్రీ....మిమ్ముల నీ మహా విపత్తునుండి రక్షించిన సుప్రియుని ఋణం తీర్చుకోవాలంటే మీరు క్షేమంకరుని రక్షించి తీరాలి.

రాజు : ఏమంటావు సుప్రియా....విడివడిన మీస్నేహ వల్లరిని మళ్ళా నన్ను ముడిపెట్టమంటావా ?

సుప్రి : అందులోనే తమ రాజసం ఉట్టిపడుతుంది.

రాజు : రాజసం ఉట్టిపడే తరుణం త్వరలోనే వస్తుంది. నీ మిత్రుణ్ణి నీవు మళ్ళీ త్వరలోనే కలుసుకుంటావు. కాని ప్రభువుల వదాన్యత ఇంతటితో ఆగిపోదు. నీ ఆశకు మించిన అపూర్వమైన కానుక నీ కివ్వ బోతున్నాను. నీవు మా మనసు చూరగొన్నావు కనుక మా హృదయాధినిధినే నీకు సమర్పించుకొంటాము. (చిన్న నవ్వు) అమ్మా మాలినీ, ఇంతలోనే అంత సిగ్గెం దుకమ్మా, నీ కన్నుల మెరసే ధాళధళ్యమునుచూస్తే యీ సిగ్గుప్రొద్దు కొంత్రొద్దు కాదనిపించుతోంది. కాని నీ కనుతుదల మెదలే ఆనందబాష్పాలు నా మన సుకు హాయి గొల్పుతున్నవి. లే సుప్రియా లే... పాదాలు వదలిపెట్టు.....ఒక్కసారి నిన్ను హృద యానికి హత్తుకోనీ. మధురవ్యధాతిరిక్తతకు మా మనసు తాళలేకపోతోంది. మేము మాలినితో ఏకాం తంగా మాట్లాడాలి.....నీవు కొంచెం ఆవలకు వెళ్ళు.....(సుప్రియుడు వెళ్ళతాడు) మాలినీ, నీలా కాశంలోని చందమామలాకాక పుడమితల్లి ఒడిలో విరిసిన క్రొన్ననలా ఇప్పుడు ఎందుకో మళ్ళీ నిన్ను క్రొత్తగా చూస్తున్నట్లుంది.

సేవ : (ప్రవేశించి) నేరస్థుడు క్షేమంకరుడు....

రాజు : ప్రవేశపెట్టు....అడుగో వస్తున్నాడు చూడు.... మాలినీ అతనిలో ఏదో దృఢ నిశ్చయము, దర్పో న్నతి కనిపిస్తున్నవి.—కాని, గాలివానకు ముందరి కారుమబ్బులాగే అతని ముఖంలో ఏవో నీలినీడలు కూడా అలముకొన్నవి. కాదు మాలినీ.....

మాలిని : అంతేనా.....అతని చేతులకు వేసిన ఇనుప సంకెళ్ళ సిగ్గుపడటం లేదూ.....నిర్బంధా న్నెదిరించే దైవాంశ అతనిలో ప్రకాశించటం లేదా. ఔన్నత్యానికి అమ ర్యాద తలపెడితే ఆ తలవంపులు ఉన్నతికికాదు అమర్యాదకే సిగ్గుచేటు....

(క్షేమంకరుడు వచ్చాడు, గొలుసుల గలగల)

రాజు : నీకు విధించబోయే శిక్ష ఏమిటో నీకు తెలుసా?

క్షేమం : మరణ శిక్ష....

రాజు : నిన్ను క్షమించి వదలిపెడితేనో....

క్షేమం : తలపెట్టిన కార్యాన్ని చక్కబెట్టే అవకాశాన్ని కల్గించి నట్లవుతుంది.....

రాజు : ప్రజలకుమీసు ఆశపేసినాడిలా పున్నావు....నీ తుది కోరిక ఏమిటో విన్నవించుకో.

క్షేమం : చనిపోబోయేముందు నా ప్రియమిత్రుడు సుప్రి యునితో ఒక మాట మాట్లాడాలి.

రాజు : (భటునితో) సుప్రియుని ప్రవేశపెట్టండి....

మాలిని : అతని ముఖంలోని ఏదో దివ్యశక్తి నన్ను భయపెడు తోంది. యీ సమయంలో సుప్రియుని రానీయడం క్షేమంకాదు మహారాజా!

రాజు : నీ భయానికి అర్థంలేదు....

సుప్రి : (చేతులు చాచుకొంటూ ప్రవేశిస్తాడు) క్షేమంకరా !

క్షేమం : ఆగు సుప్రియా ఆగు.....మన గాఢ పరిష్వంగ సుఖా నికి ఇంకా సమయం ఉంది. ప్రేమాభినందనకు ముందు మన ప్రమాణాలను పునశ్చరణ చేసు కొందాం. ఇలా దగ్గరగా రా సుప్రియా.....నేను మాట్లాడటం చేతకానివాడినని నీకు తెలుసు.... నా తుది ఘడియలు కూడా సమీపించినవి. నా విచా రణ పూర్తయింది. కాని నీ విచారణ మాత్రం జరగ లేదు.....చెప్పు సుప్రియా.....ఇలా ఎందుకు చేశావు?

సుప్రి : నన్ను అర్థం చేసుకోలేకపోతున్నావు క్షేమంకరా.... నా కర్తవ్య నిర్వహణకోసం ప్రేమ స్నేహితం పరిగ ణించ లేదు....

క్షేమం : నా కన్నీ తెలుసు.....నిన్ను బాగా అర్థం చేసు కొన్నాను. కనిపించే మాటలా, లోవెలుగులు ప్రకా శించే ఆమె ముఖవర్చస్సు నే నెరుగుదును. నీ తాతల నాటి విశ్వాసాన్ని, నీ దేశ క్షేమాన్ని ఆమె కను మంట లలో ఆహుతిచేసి కృతఘ్నతే పునాదిగా ఒక క్రొత్త మతాన్ని స్థాపించావు....

సుప్రి : నిజం మిత్రమా నిజం....ఆమెలో నా విశ్వాసం పరి ణతి చెందింది. నీ పవిత్ర మత గ్రంథాలన్నీ నా సంశ యాలకు నిరుత్తరములై మూగవోయినవి. ఆమె

కను వెలుగులో సృష్టి అనే పురాతనగ్రంథాన్ని పఠించాను. ప్రతి ప్రాణిని ప్రేమించటమే ఆ ఉద్గ్రంథంనుంచి నేర్చుకున్నాను. తల్లి చూపే పుత్రవాత్సల్యంలో ప్రతిఫలించి ప్రతిఫలంగా బిడ్డచూపే మాతృభక్తిలోనిండి తిరిగి ఆ మాతృమూర్తిలోనే ప్రతిబింబించే పవిత్ర ప్రేమనే నేను నేర్చుకున్నాను. ఇచ్చేవారినుండి పుచ్చుకొనేవారి హృదయంలో దర్శన మిచ్చేదే ఆ భూతదయ....మానవునిలోనే దైవాంశను కనుపింపజేసే ఆ ప్రేమపాశాన్నే నేను అంగీకరించాను......ఆమె వదనంలో నా చూపును నిలిపినప్పుడు ఆ భగవదంశ, ఆభూతదయ, ఆ నిగూఢ విజ్ఞానం నాకు సాక్షాత్కరించినవి.

క్షేమం : ఆ కళ్ళలోకి ఒకప్పుడు నేనూ చూచాను. క్షణకాలం స్వప్నలోకంలో విహరించాను. మానవ హృదయాలను స్వర్గపంథాలకు నడిపించగల స్త్రీమూర్తిగా నాకూ ఆ మతం దర్శనమిచ్చింది. ఒక్క క్షణకాలం నా హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. నా ఆశలన్నీ అరవిచ్చుకొన్నాయి. అయినాసరే, చిననాటి మన స్నేహాన్ని కెడసి, దూర దూర తీరాలకు పోయి, అప్రయోజకుల కించలకు కుంచించుకు పోయి, నేను ఆ మోహజాలంనుంచి తప్పించుకు పోలేదా? నేను పోయిన తర్వాత నువ్వేం చేస్తున్నట్లు? నీ దురభిమానాన్ని, నీ ప్రేమను, మతం పేరిట నిరూపించి ప్రచారం చేయటానికి అసత్యాల కథ అల్లుకుంటూ రాజోపవనంలో చల్లగా కూర్చున్నావు... అవునా....?

సుప్రి : వివిధ చిత్తవృత్తులుగలవారికి స్థావరమైనది కాదా మిత్రమా యీ ప్రపంచం.....నీలాకాశంలోని తారా నివహంలో ప్రతి తారా తానే ఆధిపత్యం వహించాలని తగవులాడుకుంటున్నాయా? చూడు. ఎవరికి నచ్చిన మతాన్ని వా రవలంబించి విభిన్న చిత్త ప్రవృత్తులుగల మానవులు సుఖ శాంతులతో బ్రతుకలేరా ?

క్షేమం : ఎందుకు సుప్రియా....యీ వ్యర్థ ప్రసంగం. సత్యాసత్యములను కలిసిమెలిసి జీవించ నిచ్చేటంత విశాలమైనదా యీ లోకం? మానవుని పంట కిరవైన చేలు ముళ్ళకంచెలకు కూడా చోటు నిస్తాయా? అలా పెరిగిన కలుపు మొక్కలను పెరికి వెయ్యవా? అర్థం లేకుండా ప్రతివారినీ గ్రుడ్డిగా ప్రేమించటమే ప్రేమ కాదు. కృతఘ్నతతో చెలిమికి చెంపపెట్టు పెట్టించగల ఓర్పు గలదా నీ సహనం? సత్యంకోసం ప్రాకులాడే ప్రాణి దొంగలాగా దిక్కులేని చావు చావాలా? అసత్యవాది సుఖభోగాల ముసుగులో గౌరవంగా, పరువు ప్రతిష్ఠలతో బ్రతకాలా? కాదు ! సుప్రియా కాదు— ఇంత హేయమైన వైవిధ్యాన్ని భరించగల కఠిన పాషాణ హృదయకాదు యీ జగత్తు.

సుప్రి : (శాంతంగా మాలినితో) మాలినీ, యీ అవమానం మీకు కాదు—మీ తరఫున నేను భరిస్తాను. క్షేమంకరా......నువ్వు నీ మతంకోసం నీ జీవిత సర్వస్వాన్ని బలిపెట్టుకున్నావు.....నీ జీవితంకంటే, అమూల్యమైన నీ ప్రేమనే నేను బలిపెట్టుకుంటున్నాను...

క్షేమం : ఈ వాదనలతో పనిలేదు. మృత్యువు సముఖంలో మన సత్యాలకు విచారణ జరుగుతుంది. నీకు గుర్తున్నదా సుప్రియా? మనం చదువుకొనే రోజుల్లో చిన్న చిన్న విషయాలకు రేయి రేయంతా వాదులాడుకుని చిట్టచివరికి తెల్లవారిన తర్వాత గురువుగారివద్దకువెళ్ళి ఒక్క త్రుటిలో సమాధాన పడేవాళ్ళం—మరచిపోయావా ? మళ్ళీ అలాంటి శుభోదయం కోసమే ఎదురుచూద్దాం. మన మిరుపురం యీ పుడమి కావలిదెసకు పోదాం. మన సంశయాలన్నీ మృత్యువుముందుపెట్టి చేతులు కట్టుకుని నిల్చుందాం. ఒక్క త్రుటిలో సందేహాల మంచు తెరలు వీడి, పరమ సత్య శిఖరాగ్రాలను దర్శించి మన తెలివితక్కువతనానికి విస్తుపోదాం. ఉత్తమము, శాశ్వతము అని నీవు తలచే ఆ మతాన్ని మృత్యువు కట్టెదుట నిలబెట్టు....

సుప్రి : మిత్రమా....నీ ఇష్టంవచ్చినట్లే కానియ్యి.

తేమం : రా సుప్రియా...ఇహ నా హృదయానికి చేరువగా రా... ఇన్నాళ్ళుగా నీ ప్రియమిత్రుని చేరికకు అనంతమైన దూరంలో సంచరించావు....మిత్రమా ఇప్పుడింక శాశ్వతంగా నాలో చేరిపో......నిస్వత్యన్నతంగా ప్రేమించే నీ మిత్రునినుండే నీ మరణాన్ని స్వీకరించు....

(క్షేమంకరుడు చేతి గొలుసులు గలగలలాడగా సుప్రియుని మోదుతాడు. సుప్రియుడు నేలకూలుతాడు. అతని మృతదేహాన్ని గాఢంగా కౌగిలించికొని) ఇప్పుడు నన్ను నీ హంతకుడని పిలువు సుప్రియా.....? నన్ను హంతకుడని పిలువు!....

రాజు : ఎవ రక్కడ.....? మా కరవాల మెక్కడ ? (ఒర నుంచి కత్తిలాగిన శబ్దం.)

మాలిని : మహారాజా...క్షేమంకరుని క్షమించండి!..క్షమించండి !

తెర

బాలవ్యాకరణము : పుట్టుపూర్వోత్తరాలు

శ్రీ నిడదవోలు వేంకటరావు

గత సంచిక తరవాయి

బాలవ్యాకరణము, సంధిపరిచ్ఛేదము— (సూత్రము 46)

"పడ్వాదులు పరంబగునపుడు మువర్ణంబునకు లోప పూర్ణ బిందువులు విభాషనగు.

భయము ...... పడె ...... { భయపడె / భయంపడె / భయము పడె

సూత్రము ...... పట్టె ..... { సూత్ర పట్టె / సూత్రం పట్టె / సూత్రము పట్టె

పట్టాభిరామ పండితీయము సీసమాలిక :

మఱియును నల ప్రథమావిభక్తికమైన
యట్టి మాకు బడు పడ్వాదులైన
హ్రస్వ దీర్ఘావర్ణ భాస్వరంబగు పకా
రం బాదియైన శబ్దంబులున్న
నిది పక్షమున వచ్చు నది గాక యది మూకు
రాని పక్షమునందు దాని గొట్టి
బిందువు పూర్ణమై యుందంబుగా వచ్చు
నొక పక్షమున మువర్ణకము యుండు
భయము పడియె, భయపడె, భయంపడె నిట్లు
సూత్రము పట్టెను సూత్రపట్టె
ననియు సూత్రంపట్టె నా జెల్లు నిట్లగు.
(56 పద్యము.)

ఇట్లే మరియొక పట్టు చూడుడు :—బాలవ్యాకరణము సంజ్ఞాపరిచ్ఛేదము.

"లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు. 22. వస్తాడు. తెస్తాడు. వచ్చేని. తెచ్చేని వచ్చేవాడు. వచ్చేటివాడు. తెచ్చేటివాడు. ఈ భాష ప్రయోగంబున కనర్హంబు.

ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు. 23.

పెద్దలు వ్యవహరించిన మాట గ్రామ్యంబయిన గ్రహింపందగునని తాత్పర్యము. కరకంఠుడు, ప్రాణగొడ్డము, జీవగఱ్ఱ, కపిల కన్నులు, కపిలగడ్డము, కపిలజడలు.

పై రెండు సూత్రములలో "వస్తాడు, తెస్తాడు" అను లక్ష్యములు రెండును, "కరకంఠుడు, ప్రాణగొడ్డము" అనునవి రెండును "ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణము" నుండి సూరిగారు గ్రహించిరి.

ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణ కర్త పుదూరి సీతారామ శాస్త్రి. ఈతడే, తెలుగువారిలో మున్ను పిన్నలకు, నేడు పెద్దలకు గూడ నత్యావశ్యకమైన 'పెద్దబాలశిక్ష' యను గ్రంథము రచించిన పండితుడు. ఈ ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణము క్రీ. శ. 1834 లోను, క్రీ. శ. 1852 లోను సూరిగారు జీవించియుండిన కాలమున రెండుతడవలు ముద్రితమైనది.

పై రెండు సూత్రముల వ్యాఖ్యలో ననావశ్యకము ననంబద్ధమగు ప్రసంగము చాల గలదు. తనకు ముందుగల యే వ్యాకరణ చ్ఛందో లక్షణ గ్రంథకర్త లుదాహరింపని, 'కపిల కన్నులు, కపిల గడ్డము, కపిల జడలు' అనువానిని సూరి ప్రామాదికముగా నుదాహరింరించినాడు. అవి నన్నయభట్టు భారతమందున్న కారణమున (ఇందును సూరి యిచ్చిన క్రమము భారత పద్యక్రమమునకు విరుద్ధము) వాని ప్రామాణికత కొరకు వాదులాడి కలము కాలము పండితులు వ్యర్థము చేసిరి. ఇట్టి పట్లు లింకను గలవు.

సూత్రము :—

పడ్వాదులు పరంబులగునపుడు మువర్ణకంబునకు లోప పూర్ణబిందువులు విభాషనగు

భయము	పడె	భయపడె
		భయంపడె
		భయముపడె
సూత్రము	పట్టె	సూత్రపట్టె
		సూత్రంపట్టె
		సూత్రముపట్టె

పై సూత్రము పట్టాభిరామ పండితీయమునగల యీక్రింది పద్యముననుసరించి చేయబడినది.

సీ. మరియును నలప్రథమావిభక్తికమైన
యట్టి మూకు బడుపట్టాదులైన
హ్రస్వ దీర్ఘావర్ణ భాస్వరంబగు పకా
రంబాదియైన శబ్దంబులున్న

నిది పక్షమున వచ్చునదిగాక యది మూకు
రానిపక్షమునందు దాని గొట్టి
బిందువు పూర్ణమై యందంబుగావచ్చు
నొక పక్షమున మువర్ణకమయుండు
భయముపడియె భయపడె భయంపడె నిట్లు
సూత్రము పట్టెను సూత్రపట్టె
ననియు సూత్రంపట్టె నా! జెల్లునిట్లగు. (56పద్యము)

సూరి సూత్రమున లక్ష్య లక్షణములు రెండును పై వ్యాకరణమునుండి గ్రహింపబడిన వనుట స్పష్టము. ఇంకను మరియొకటి.

బాల వ్యాకరణ సూత్రము :

లక్షణవిరుద్ధంబగు భాష గ్రామ్యంబు. సంజ్ఞా 22 సూ. వస్తాడు—తెస్తాడు—వచ్చేని—తెచ్చేని — వచ్చేవాడు — తెచ్చేవాడు — వచ్చేటివాడు—తెచ్చేటివాడు—ఈ భాష ప్రయోగంబున కనర్హంబు

పై సూత్రమున—లక్షణము పట్టాభిరామ పండితీయమునుండి గ్రహింపబడినది.

గీ. లక్షణగతి విరుద్ధంబులైన మాట
లింక గ్రామ్య సంజ్ఞ పదంబు లవేవి యునిన
దాన్ని చూస్తాను చేస్తాను దీన్ని వస్తి
చూస్తి పోతాను వాడికి నిస్తి వాణ్ణి—సంజ్ఞ 28వ పద్యము.

పై వ్యాకరణమున లక్షణము గ్రహించినను సూరి లక్ష్యములను [1]ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణమునుండి గ్రహించి యున్నాడు.

ప్ర. గ్రామ్యంబు లెన్ని విధంబులు ?

ఉ. నింద్యగ్రామ్యంబు లనింద్యగ్రామ్యంబులని రెండు విధంబులు.

ప్ర. నింద్యగ్రామ్యంబు లేలాగంటివి ? అనింద్యగ్రామ్యంబు లేలాగంటివి ?

ఉ. వస్తాడు, తెస్తాడు, ఇస్తాడు మొదలగు ప్రయోగారూఢంబులుగాని శబ్దంబులు నింద్యగ్రామ్యంబులు. కలికంఠుడు, ప్రాణగొడ్డము మొదలగు ప్రయోగరూఢంబులగు శబ్దంబు లనింద్య గ్రామ్యంబులు.

సూరి 22 సూత్రమున వస్తాడు, తెస్తాడు అని లక్ష్యములను గ్రహించి అనింద్య గ్రామ్యంబులకు—వేరుసూత్రము చేసియున్నాడు.

ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు 23.

పెద్దలు వ్యవహరించిన మాట గ్రామ్యంబైన గ్రహింపం దగునని తాత్పర్యము. కలికంతుడు, ప్రాణగొడ్డము జీవగఱ్ఱ, కపిల కన్నులు, కపిల గడ్డము, కపిలజడలు. ఇందు కలికంతుడు ప్రాణ గొడ్డము పై వ్యాకరణమునుండి సూరి గ్రహించినవి, తక్కినవి యాతడు స్వంతముగ జేర్చినవి.

అనింద్య, నింద్య గ్రామ్య శబ్దములు సూరి యుపయోగింపలేదు. సీతారామాచార్యులవారు, శబ్దరత్నాకరములో 'అనింద్య గ్రామ్య' శబ్దము వాడియున్నారు చూడుడు. సంజ్ఞావివరణ పట్టిక. గ్రా. గ్రామ్యము (అనింద్యము) కాని నింద్య గ్రామ్యములకును ప్రయోగములు కన్పట్టు చున్నవి.

క. వస్తాఁడు నీలభూపతి
తెస్తాఁడు ధనంబు నీ కతిప్రమదముగా
నిస్తాఁడు విరహవేదన
చస్తాఁడా ? నమ్మి మదిని సందియమేలా ?
చంద్రరేఖా విలాపము (1—73)

'వస్తాఁడు' మున్నగునవి గ్రామ్య రూపములనుచు వానిలో ఖండమును సూరి నిల్పుట యసంగతము. (బాలవ్యాకరణోద్ద్యోతము) పుట 33.

చంద్రరేఖా విలాపము కూచిమంచి జగ్గకవికృతము. క్రీ. శ. 1750 ప్రాంతమున రచితమైనది. ఆ గ్రంథము ముద్రించి నప్పు డందు, ఉద్ద్యోతకర్తలవంటి పరిష్కర్తలు ఖండములను—అనగా అర సున్నలను నిల్పరు కాబోలు !

ఈ పట్టున బాలవ్యాకరణ వ్యాఖ్యాత లొనర్చిన విషయములను విమర్శించిన పెద్ద గ్రంథమగును గాన నిట విడచితిని.

బాలవ్యాకరణావతరణము

సూరి తన కాలమున, తనకుముందునున్న వ్యాకరణములను పరిశీలించి, కొన్ని గ్రహించినను, నాతని బాల వ్యాకరణము ప్రత్యేక స్వతంత్ర రచన. సూరికిముందు వ్యాకరణములు పద్యాత్మకములు, వాక్యాత్మకములు. కాని సూత్రాత్మకములు గావు. వ్యాకరణమన్న సూత్రములతో వెలయవలెను. అప్పుడే యీ వ్యాకరణమునకు స్థాయిత్వము. ప్రామాణికత సిద్ధించును. సంస్కృతమున పాణినీయమునకువలె, తెలుగునకు గూడ నట్టి వ్యాకరణము నిర్మింపదలచి, సూరి తెలుగు భాషలోనే వ్యాకరణ సూత్ర సంపాదనచేసి కృతకృత్యుడైనాడు.

1. ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణము. శ్రీ పుదూరి సీతారామ శాస్త్రికృతము. ఈతడు పెద్దబాలశిక్ష యను ప్రశస్తసంగ్రహ విజ్ఞానకోశము రచించిన మనీషి. ఈ వ్యాకరణము క్రీ. శ. 1834 లోను, 1852 లోను బాలవ్యాకరణముకన్న ముందుగా రెండు సారులు ముద్రితమైనది.

బాలవ్యాకరణ రచనముకొఱకు కాత డెన్నియో యభ్యాసములు చేసియున్నాడు.

ప్రథమమున సంస్కృతములో సూత్రాంధ్ర వ్యాకరణము రచించినాడు. దీనివలన సూత్ర సంపాదన సులభమే. సూత్రభాష సంస్కృతము—ఉదాహరణలు తెలుగు. కాని కావలసినది తెలుగులోనే సూత్ర రచనము. సంస్కృతములోనున్న తెలుగు వారికి టీకాతాత్పర్యము లావశ్యకములు. కాబట్టి యా పద్ధతి వీడి, యావెనుక, పద్యాంధ్ర వ్యాకరణము రచించినాడు. దీని వలన లాభమేమనగా [2]సూత్రములలో వ్యర్థ పదములు రాకుండ చేయుటయని చెప్పనచ్చును. పద్యములలో యతిప్రాస నిర్బంధమున వ్యర్థపదములు చూచి పరిహరింపవచ్చును.

సూత్రములో వ్యర్థమైన పదమేకాదు. అక్షరము కూడ నుండదు.

ఆవెనుక [1]'శబ్దలక్షణ సంగ్రహము' అనుపేర తెనుగు సూత్ర గ్రంథము రచించెను.

''సిద్ధిలోకంబువలన దెలియనగు''
శాసనం బియ్యది దిక్ప్రదర్శనంబు''

అను రీతిని యిందలి సూత్రము లుండును కాని యివి మిక్కిలి సంగ్రహ రూపమున నుండుటచేత—ఆంధ్ర శబ్దానుశాసనము అను మరియొక సూత్ర గ్రంథము రచించెను. ఇందలి సూత్రములు పైవానికన్న విపులములు.

''ఉత్వంబున కచ్చురా సంధియగు''
''ప్రథమాంతంబున కన్మద్విశేషణంబునకు బహుత్వమున మువర్ణకంబగు.''

కాని యిందు సూత్ర వివరణము, ప్రయోగములు లేవు. సూత్ర వివరణతో ప్రయోగములతో పదునారేండ్లి రీతిని గాఢ పరిశ్రమ మూలమున [2]బాలవ్యాకరణ మవతరించినది. ఆంధ్ర వ్యాకరణ చరిత్రయందేకాక, ఆంధ్ర భాషా చరిత్రమున, బాల వ్యాకరణ రచన యొక ప్రత్యేక విశిష్టత గల ఘట్టము.

బాలవ్యాకరణము - లక్ష్యలక్షణములు

సూరి బాల వ్యాకరణము నందిచ్చిన లక్ష్యముల కన్నింటికిని కవి ప్రయోగములు గలవు. ఈ సందర్భమున సూరి ప్రస్తుత వైయాకరణులవలె నిఘంటువులపై నాధారపడలేదు. తాను స్వయముగా గ్రంథము లన్నింటిని నామూలాగ్రముగ చదివి, ప్రయోగ సేకరణము గావించి యున్నాడు. అతడే అకారాదిగా ప్రామాణికమగు [3]తెలుగు నిఘంటువును నిర్మించుటకు నాద్యుడని తెలియవలెను. సూరి గ్రహించిన గ్రంథములో కొన్ని యిప్పుడు మనకు లభ్యముకావు. కాని యా ప్రయోగము లితరత్ర లభ్యమగుచునే యున్నవి. ఛందోబద్ధమగు రచనల కన్నింటికి సూరి ప్రామాణ్యము నిచ్చియున్నాడు. 'చికిత్సా సంగ్రహము' అను చిన్న వైద్యగ్రంథమునుండి ఆతడు యతి ప్రాస నిబద్ధములగు పదములు గ్రహించినాడన్నచో, నాతనికి కవుల ప్రయోగముల యందుగల గౌరవము తేటపడును. మరియు నిప్పటి 'సంహితోద్ధృత కర్తలవలె, మహా కవులని ప్రాచీన మహా కవులని—అర్వాచీన కవులని—సామాన్య కవులని—వ్యవస్థ చేయకుండగనే కవిమాన్యనిభాగము గావింపలేదు. ఉద్ధృతకర్తలవలె ప్రకటితమైన నిఘంటువులపైనే యాధారపడలేదు. సూరి యుదాహరించిన ప్రయోగములు స్వయముగా మూల గ్రంథములు పరిశీలించినవి. ఏ ప్రయోగ మేకవి చేసెనో తెలియకుండ, అథవా కవుల పేళ్ళయిన తెలియకుండ, ఉద్ధృత కర్తలు చిన్నయసూరి నాక్షేపించుట మహాసాహసము !

విజ్ఞప్తి యనుబంధము—బాల వ్యాకరణోద్ధృతము.

''కవిలియ—కవిలె. అను శబ్దములు లేవని యెవ్వరును జెప్పలేదే. దమ్మకవిల—దమ్మకవిలె అను తద్భవ రూపముల నంగీకరించి పాపము! బసవకవిని వైరిపదదోషము పాలు కాకుండ జేయరాదా!'' పుట 10.

పై వాక్యములో బసవకవి యెవరో ? ద్విపద బసవ పురాణకర్తను బసవ కవిగా పరిగణించినవారితో వాదించుట యేల ? ఉద్ధృతము పుట 401.

''ముజ్జు పరంబగునపుడు 'కొ' శబ్దంబు కొనుటకు బహుళంబుగా నగును 20.

బహుళంబగుటచేత దీనికి నొకానొకచో నతిచారంబని యెరుంగునది. అనగా ముజ్జు పరమగునపుడేకాక జేత్తులలోని

1. ఇది క్రీ. శ. 1853 లో ముద్రితమైనది. ఇది యలభ్యమగుటచేత నా వద్దనున్న ముద్రిత ప్రతినుండి యొక ప్రతిని వ్రాసి కీర్తిశేషులు గిడుగు రామమూర్తిపంతులుగారి కొసగితిని. ఇది నలుబదేండ్ల నాటి మాట.
2. నా రచించిన చిన్నయసూరి జీవితమున పై రచనలను గూర్చి విపులముగా గాంచనగును.
3. చూడుడు. శబ్ద రత్నాకర పీఠిక. ఈనిఘంటువు సూరి స్వహస్త లిఖితము. 7 సంపుటములుగా సూర్యరాయ నిఘంటు కార్యస్థానమున నుండెడిది. తక్కినవి పదములు, ఆకరములుక్కు పినితో కొంత చిత్తుగా నున్నను మొదటి సంపుటము ముద్రణ కొరకు వ్రాయబడినట్లు కానవచ్చును. ఈనాడు వాని యునికియే యెరుకపడదు.

వ్యతిరేకార్థకములు, నుఙ్యంతములు మున్నగునవి పరమమగు నపుడును, యథా ప్రయోగముగ నీ యాదేశము విభాష నగునని తాత్పర్యము—భారతేతర గ్రంథములందే యిట్టి యాదేశమగునని యెఱుంగునది. వ. "తుది రాజ్యమ్ము సగమ్ము గొమ్ము" అనుచో నన్నయ 'కో' అను నాదేశమును ప్రయోగించెననరాదు. అచట తుది రాజ్యమ్ము 'గొన్ము' అనునది కవి ప్రయుక్తము. శబ్దాలంకారప్రియులగు సంస్కర్తలట్లు ప్రక్షిప్తము చేసిరని యెరుగునది."

'తుది రాజ్యమ్ము సగమ్ము కొమ్ము" అన్న పద్యము, తిక్కన భారతము, ఉద్యోగ పర్వమున (3—97) నున్నదని, పండితుల మాట యటుండనిచ్చి పాఠశాలా విద్యార్థులకు నైతము తెలిసిన విషయము. కాని 'ఉద్ద్యోతకర్తల' కది తెలియకపోవుటచే దానిని "ముఖ్యమైగు తప్పొప్పుల పట్టిక"లో చేర్చలేదు. అచ్చులో స్పష్టముగా "నన్నయ" అని యున్నది. ఒక్క ప్రాచీన గ్రంథమైన మూలతాళపత్ర ప్రతులతో పరిశీలించి ప్రకటింపని యుద్ద్యోతకర్తలు, ప్రాచీనాంధ్ర గ్రంథ పరిష్కర్తలకు, పాండిత్యము లేదని, పలుమారులు నిరసించుట యవిమృశ్య కారిత్వము.

బాల వ్యాకరణములోని గంభీరార్థ ముద్ద్యోతకర్తలకు నెరుకపడలేదని యీక్రింది సూత్రార్థములు విమర్శనబట్టి తెలియగలదు.

సంధి 20. అవసానంబునందు ద్రుత స్వరంబునకేని ద్రుతంబున కేని లోపంబు విభాషగా నగు.

వాడు వచ్చెన్—వాడు వచ్చె—వాడు వచ్చెను— ఈ లోపంబు పద్యాంతములయందు గణానుసారంబుగ వ్యవస్థితంబై యుండు—గుర్వవసాయియగు పద్యంబు తుదను స్వత్వంబు లేదు. అతిశయముగ బుద్ధిమంతుడగు బుధసేవన్.

ఉద్ద్యోతమున (పుట 51) పుట యడుగున నా సూత్రముక్రింద నీ వాక్యములు గలవు.

"గుర్వవసాయియగు పద్యంబు తుదను స్వత్వంబులేదు. అతిశయముగ బుద్ధిమంతుడగు బుధసేవన్—ఈ సూరి వాక్యము లనావశ్యకములు."

సూరి వాక్యము లనావశ్యకములట? సూరి గుర్వవసాయియగు పద్యంబు తుదను స్వత్వములేదని సూత్రించుటకు కారణమిది. మన తాళపత్ర గ్రంథములయందనుసరించు నట్టి లేఖన సంప్రదాయము ననుసరించి లేఖకుడు "అతిశయముగ బుద్ధిమంతుండగు బుధ సేవనూ" అని దీర్ఘ స్వత్వములతో వ్రాయును—పద్యములు చదువునప్పుడు పదము చివరి స్వరము దీర్ఘముగా చదువుదుము—అట్టి ఉచ్చారణ ననుసరించి ప్రాత వ్రాతలలో చివర స్వత్వరూపములే యుండును. భారతాది ప్రాచీన గ్రంథముల ముద్రణ ప్రారంభమగుచున్న కాలములో తాళపత్రములలోని వ్రాతలను యథామాత్రుకముగ నచ్చువేసిన భాషా పరిపాటి తెలియదని సూరి స్వత్వము లేదని సూత్రించెను. నేటి ముద్రణములలో స్వత్వముండదు. ఇట్లెంతయో దీర్ఘ దర్శిత్వమున సూత్రింపగా, తాళపత్ర లేఖన సంప్రదాయము నెరుంగకుండ, 'యీ వాక్యము లనావశ్యకములనుట' [1]యుద్ద్యోతకర్త సూత్రార్థము గ్రహింపలేదని స్పష్టమగుచున్నది.

ఇంక నొక సందర్భమును నుదాహరించి యీ వ్యాసము ముగింతును.

బాల వ్యాకరణము—సంధి 14 సూత్రము.

తెనుగుమీది సాంస్కృతిక పరుషములకు గసడదవలు రావు.

వాడు + కంసారి = వాడుకంసారి

వీడు + చక్రపాణి = వీడు చక్రపాణి.

ఆయది + టంకృతి = ఆయదిటంకృతి

అది + తథ్యము = అది తథ్యము

ఇది + పథ్యము = ఇది పథ్యము

దీనిపై సంహితా సర్వస్వములో నిట్లు గలదు.

సంజీవని 78 IV విష :—ఈ సూత్రము నిర్మూలము. భారత ప్రయోగములకేకాక, యీ సూత్ర మెల్ల ప్రామాణిక గ్రంథ ప్రయోగములకును విరుద్ధమై యున్నది అని. 'ఎంతగుమతులు' 'ఎవ్వండు పఠించు' 'పెంపు పరీక్షింపమొ' 'ఇట్లు దపంబు' వీరలొగ్గిపించిన 'వేవణములు' అని యుదాహరణ లీయబడియున్నది.

బాల వ్యాకరణోద్ద్యోతమున (పుట 46).

"తెనుగులమీది సాంస్కృతిక పురుషములకు గ...స..డ...ద....వా....' దేశము లేదను సూరి సూత్రము విమర్శక కృతము" అని మీది యుదాహరణములలో మూడు మాత్రమీయబడి యున్నవి.

---

1. వ్యాకరణ సంహితా సర్వస్వము. మొదటి సంపుటము. పుట 190. తాళపత్ర మాతృకనుండి యుదాహరణ. "పెంపును వృథ శాయగాజనదు భూవలయేశ్వర యింమ్ము నెమ్మితోనూ" అని స్వత్వరూపమే గలదు. ఉద్ద్యోతకర్త లిది విస్మరించి యుందురు.

పై లేఖన పద్ధతి నెరింగిన—వ్యా. సం. సర్వస్వ కర్త 307, 308 పుటలలో ననావశ్యకముగ నంత విషయమును విస్తరింపబనిలేదు.

ఉద్ద్యోతకర్తల యభిప్రాయము ననుసరించి సూరి, భారత, నిర్వచనోత్తర రామాయణ, ఉత్తర హరివంశ, కాశీ ఖండ, వసు చరిత్రలలోని ప్రయోగములను కూడ నెఱుగడన్న మాట! అట్టివానిని పరిశీలింపకయే యిట్టి రీతి సూత్రించినా డన్నమాట. ఉద్ద్యోతకర్తలచే యుదాహృతములైన ప్రయోగములన్నియు నితరులవియే—వాని దొకటియులేదు—వానిలో విజ్ఞా—ప్రాయకాం 49 ప. అని కలదు. ఇది కేతనకృతి. 1 విజ్ఞానేశ్వరము—ఉద్ద్యోతకర్తలీ గ్రంథమెప్పుడైన చూచి యున్నారా ? చిన్నయసూరి యెరుగును.

అది యట్లుండ నిండు. ఈ సూత్రమున సూరి లోకోత్తర ప్రతిభ ప్రదర్శించినాడు.

కంసారి, చక్రపాణి అనునవి సంజ్ఞావాచకములు. వీనికి గసడదవాదేశము చేసిన వ్యవహారజ్ఞానము నశించును. కంసారిని గంసారియన్న—కామయ్యను గామయ్య అన్న రీతిగా సంజ్ఞాబోధకము కాదు. చక్రపాణి—సక్రపాణియైన—అది సశల భేదము వ్రాతలో తారుమారై, శక్రపాణి యగును. అప్పుడు దాని యర్థమేమగును ?

నామ వాచకములయందు గసడదవాదేశము చేసిన నెట్టి యపార్థములు గలుగునో, ముద్రిత పండితారాధ్యచరిత్రము నుండి యొక యుదాహరణము చూపుచున్నాను. దీక్షా ప్రకరణము—పుట 31.

"ద్వి ...... వీరవ్రతోద్యుక్తి నడవ
బుడివుళ్ళు వోవుచు భూసురుల్ నరులు
బండితు జూచి సైపక యుక్కనాడు
వండితయ్యా ! నీవు వౌరాణికుడవు
వద్ద్విజోత్తముడవు సచ్చరిత్రుడవు"

పై పాదములలో.

వండితయ్యా—అనగా 'వండితివయ్యా' అను నపార్థము గలుగును. ఇక 'వౌరాణికుడవు' అన నెవరు !

"పండితయ్యా ! నీవు పౌరాణికుడవు" అని యుండిన గదా యర్థ స్ఫూర్తి కలుగును.

సూరి సూత్రమిట్టి యపార్థములను వారించుచున్నది. అయితే గసడదవాదేశము నిత్యము, తాళపత్ర గ్రంథములందున్నది యన్నచో, మూలపాఠమున సంస్కరింపబడిన పై పాఠమిచ్చి, పుట యడుగున తాళ పత్రమాతృకాపాఠము చూపనగును. ఇక ప్రాసస్థలములైనప్పుడు నిర్వివాదమే కదా.

సూరి చూపిన తక్కిన యుదాహరణములు నిట్టి జాగరూకతతో నీయబడినవియే.

ఆయది 'టంకృతి'—ఆయది 'డంకృతి' అనిన ధ్వనులు టం, డం అనునవి వేఱుగదా : 2'టంగ్' అని గంట మ్రోత. డం అని తుపాకి మ్రోత. ఇట్లే.

అది తథ్యము—అది 'దథ్యము' అయిన 'దధి' సంబంధమైనదను భ్రాంతి కలిగించును. ఇది పథ్యము—అను చోట ఇది 'బథ్యము' అన్నచో, పథ్యముగా మనము పుచ్చుకొనదగిన పదార్థముయొక్క జ్ఞానమే నశించును.

ఇంత గంభీరార్థము నొక్క సూత్రమున నిమిడించిన సూరిని 'ఆంధ్రపాణిని' యని ప్రశంసించుటకు బదులుగా నుద్ద్యోతకర్త లాతని సూత్రములను నిర్మూలములనుట యవిమర్శనకృతము.

పై విషయములనుబట్టి సూరి హృదయము ననుసరించి సంగ్రహముగ, శాస్త్రీయముగ నొక వ్యాఖ్య యత్యావశ్యకమని తేలుచున్నది. వర్ణనాత్మకమగు బాల వ్యాకరణమునకు చరిత్రాత్మకమగు వ్యాఖ్యతో సాధికార ముద్రణము వెలసిన నది—యాంధ్రపాణినీయమగును.

---

1. చిన్నయసూరి తన నిఘంటువు కొరకు విజ్ఞానేశ్వరమునుండి, యెన్నియో ప్రయోగములను సేకరించినాడు. ధర్మశాస్త్రగ్రంథమగుటచేత అందలి పారిభాషిక పదములకు తెలుగున నేపదములు వాడినాడో తెలిసికొనుటకు మూల శ్లోకములు గూడ నుదహరించినాడు. సీతారామాచార్యులవారు, శబ్దరత్నాకరమున విజ్ఞానేశ్వరమునుండి గ్రహించిన పదములన్నియు చిన్నయసూరి వ్రాసికొనినవియేకాని వేరుకావు.

2. 'టంగ్ టంగ్ అనునది వర్ణ విప్లుతి' (Metathesis) చేత 'గంట'గా మారినదని యెరుంగునది.

పడగనీడల్లో....

శ్రీ దుత్తా దుర్గాప్రసాద్

ప్రతి సంఘటనలోంచీ ఓ సిద్ధాంతం లేవదీస్తాడు క్రిష్ణమూర్తి. దానికో చిన్న పిట్టకథ! ఏదో సిగరెట్టు ఇవ్వబోయాడు. వద్దన్నాను నేను. వద్దనడమే కాకుండా "అబ్బ—యీ సిగరెట్లు తాగేవాళ్ళకి నిజంగా బుర్రలేదురా. ఈ వాసనే భరించలేకుండా ఉన్నాను. ఆ సిగరెట్లెలా తాగుతారో" అన్నాను.

అదీ నా తప్పు!

దానిమీద సిద్ధాంతం లేచింది.

యిహ పిట్టకథకోసం చెవులు రిక్కించుకొని కాస్త సర్దుకొని యిసకలో వాలిపోయి అలా పైకి చూడసాగాను.

"రామ్మూర్తి అని యింటర్లో మాకో క్లాసుమేటు ఉండేవాడు. ఎర్రగా, పొడుగాటి మొహమూ, పెద్ద నిలువుబొట్టూ చూస్తుంటే ఏడిపించాలనిపించేది కుర్రాళ్ళకి. ఎప్పుడూ పూర్వుల గొప్పతనాన్ని గురించీ, మన తక్కువతనాన్ని గురించీ వనపిట్టలాగు వాగుతుండేవాడు.

శ్రీకాకుళం దాటిపోయాక మరో యిరవై మైళ్ళలో అదేదో చిన్న ప్రాజెక్టు ఉంది. దానిపేరు గుర్తు రావడంలేదు. సరే, ఏదయితేనేం, చిన్న ప్రాజక్టు.

రామ్మూర్తి వాళ్ళ నాన్న అర్చకుడు. ఆయనకి జ్యోతిషము బాగా తెలును. పెద్ద యింజనీరుగారి ఆఫీసులో మేనేజరుగారికి జ్యోతిషం అంటే వల్లమాలిన నమ్మకం. చదువుకొనే రోజులనుండీ ఆచార్లు గారంటే ఆయనకి ఎంతో గురి కుదిరింది. చిన్నదానికీ, పెద్దదానికీ ఈయన్ని సంప్రదిస్తేనేగాని ఏ పనీ చేసేవాడుకాదు.

సరే, ఆయన ప్రాపకంతో అక్కడో మేస్త్రీ ఉద్యోగం సంపాయించాడు రామ్మూర్తికి ఆచార్లుగారు. మనవాడు మంచిరోజు చూసుకొని పోయి ఒక శుభముహూర్తాన ఉద్యోగంలో చేరాడు.

అక్కడో చిన్న చెరువు తయారు చేస్తున్నారు. ఇద్దరు జూనియరు యింజనీర్లు ఉండేవారు ప్రాజెక్టుకంతా. అసిస్టెంట్ యింజనీరు శ్రీకాకుళంలోనేఉండి అప్పుడప్పుడు వచ్చి పోతూ ఉంటాడు. ఇద్దరు 'జేయీ'ల్లోనూ, ఒకాయన 'హెడ్‌వర్క్సు' మరో ఆయన పిల్ల కాలువల పనీ చూస్తూ ఉంటారు. రామ్మూర్తిని 'బండ్' మీద వేశారు.

జోరుగా తిరిగే లారీలూ, చెవులు దిబ్బళ్ళుపడేట్టు శబ్దం చేసే బుల్‌డోజర్లూ, భూకంపం పుట్టించే స్క్రేపర్లూ, నోరు తెరుచుకు చూస్తూ కాలం గడిపాడు రామ్మూర్తి మొదటి రోజంతా.

రెండో రోజున అక్కడవుండే యిద్దరి మేస్త్రీలతోటీ పరిచయమైంది. సింహాద్రి ఒకతని పేరు. ఏమంత చదువుకొన్నవాడు కాదతను. అతివినయం, కలుపుగోలుతనం ఎక్కువ. ఎంతో మర్యాదగా అవీ యివీ చూపించి రెండో మేస్త్రి సత్యనారాయణతో పరిచయం చేశాడు.

సత్యనారాయణ హైస్కూలు చదువు ముగించినవాడు. నున్నటి క్రాపూ, పైజామా, లాల్చీ—పూల రంగడులా ఉంటాడు. ఎన్నో ఢక్కా ముక్కీలు తిని బండపారిన మనిషి. ఎంతటివాడినీ మూడు నిముషాల్లో కట్టుకురాగలడు. అవసరమైతే ఎదురు తిరిగి ఆఫీసర్లని ఒక్క వూపు వూపగల శక్తికూడా వుంది. పనిలోని లోటుపాటులన్నీ తెలుసుకొన్నవాడు కనుక వోరకంగా అతనంటే భయపడతారు ఆఫీసర్లు. కాని, అది బైట పడనీయకుండా బెట్టుగానే పని చేయించుకు పోయేవాడు జేయీగారు. ఆయనలో వో మూలని సత్యనారాయణంటే ద్వేషం లేకపోలేదు. అయితే, నిండైన మనిషి కనక పైకి కనపడనిచ్చేవాడుకాదు దాన్ని.

మస్టరువేసే మనిషి సత్యనారాయణో అక్కడ. మస్టరు మేస్త్రీకిడున్న విలువ పెద్దపెద్ద ఆఫీసర్లకూడా ఉండదు కూలీల దగ్గర. అతన్ని తప్పిస్తే మరో మేస్త్రీని లెక్కచేసే వాళ్లుకాదు అక్కడి కూలీలు.

ఆ రోజుల్లో అలా నిలబడి అక్కడి వ్యవహారాలన్నీ తెలుసుకోసాగాడు రామ్మూర్తి. సింహాద్రి గొంతుపగిలేటట్టు అరుస్తున్నా అతన్నెవరూ లెక్కచేయడంలేదు. సింహాద్రి పోయి సత్యనారాయణతో మొరపెట్టుకుంటే అతను పోయి "అప్పలమ్మా, ఉషారెక్కుతున్నట్టుందే, ఏయ్ సీతీ, తిమ్మిరి తిమ్మిరిగా ఉన్నట్టుంది........జాగ్రత్త" అంటూ అసహ్యంగా మోటుగా మాట్లాడడమూ, వాళ్ళు కళ్ళెగరేసి, మూతిబిగించి వెక్కిరిస్తూ, ముసిముసి నవ్వులు నవ్వడం, యిదంతా చూచి 'సత్యనారాయణ వో పశువు' అనుకొన్నాడు రామ్మూర్తి.

ఇంటికొచ్చేటప్పుడు అదే అన్నాడు సింహాద్రితోటి. సింహాద్రి నవ్వి "అతని స్వభావమే అంతండీ—మళ్ళీ బాగా చదువుకున్నవాడుట గూడా. ఆడమనిషి కనిపిస్తే చాలు, సరసాలాడకుండా వదలడు. అలా వాళ్లంట పడుతుంటే మేస్తుఫ్ఫుంటే వాళ్లకి ఏం లెక్కుంటుంది. చెప్పండి! మరీ అ అప్పలమ్మ ఉంది చూశారూ—అ కనకాంబరాలు తల్లో పెట్టుకున్న మనిషండీ—స్టౌవుమీద నీళ్ళు చల్లడం లేదూ యిందాక అ మనిషి—దాంతో యీాయనికి బోలెడు వ్యవహారాలు ఉన్నయ్యి! నారాయణరావుగారనీ, యస్. డి. వో. మొన్నే బదిలీ అయిపోయారు. ఆయన మొదలుకొని క్లీనర్లవరకూ అ మనిషంటే పడి ఛస్తారండీ! అందుకే దానికంత గర్వం. మనిషంటే లెక్కే లేదు...." చెప్పుకుపోతున్నాడు సింహాద్రి.

సరిగ్గా యిక్కడే రామ్మూర్తి బుర్ర తపీమని అగి ఆలోచించసాగింది. 'ఛీ—వెధవ మనుష్యులు—ఎంత హీనాతి హీనమైన జీవులు వీళ్ళు! ఒకడు సూటు వేస్తాడు. కార్లమీద తిరుగుతాడు. పెద్దపెద్ద విషయాలు ఆలోచిస్తాడు. మరొకడు అతి తక్కువ హోదాలో బతకలేక బతుకుతూంటాడు, మానలేని అవగుణాలతో. కాని యిద్దరూ ఈ విషయం వచ్చేసరికి ఒకే చోటుకి చేరుకుంటారు. అ హోదాలన్నీ ఎటు పోతాయో! ఛీ, ఛీ, మనస్సుకి దాసానుదాసులు వీళ్ళు! అయినా ఆ అప్పలమ్మకి ఎలా బుద్ధిలేదో! అప్పలమ్మంటే యిందాక సత్యనారాయణ తిడుతోంటే వెకిలినవ్వు నవ్వుతున్న మనిషే కాబోలు. అ బట్టలూ, అ వైఖరీ చూస్తుంటే అప్పుడే అనిపించింది తనకి, పని చేసే రకం కాదని. మడత నలగని చీరా, అ సినిమా జాకెట్టూ, తలనిండా పూలూ అవీ చూసి. ఈ సత్యనారాయణకి బుద్ధి లేకపోతే పోయింది. అ పెద్ద అధికారులెలా వూరుకొంటున్నారో!'

ఇంటికి పోయి పడుకొన్నాడు. నిద్దర రావడంలేదు. బుర్రనిండా ఆలోచనలు. తన చేతికే మస్టరువస్తే నలభైయేళ్లకి తక్కువ వాళ్లంటూ వుండనీయకూడదు పని మీద. ముందీ అప్పలమ్మని పనిమీదినుండి గెంటివేయాలి. చల్లగా జేయీ దగ్గర పలుకుబడి సంపాయించాలి. పొద్దున బాగానే మాట్లాడాడాయన. పాపం యివన్నీ పట్టినట్టు లేదాయనికి. "అవుట్ టరన్" వచ్చిందా అని కనిపించినవాడినల్లా అడగడమేలాగుంది ఆయన పని. తనకి అ మాటకి అర్థం కూడా తెలియలేదు. వెర్రిమొహం వేసుకొని నిలబడితే, ఆయనే తెలుసుకొని అన్నాడు. "ఎన్ని యూనిట్లు రోల్ అయింది?" అని. రోజుకి యిరవైమూడు యూనిట్లన్నా అయితేగాని అ కూలీలకి మస్టరు రాదట. అప్పుడర్థమయింది, యీ గొడవతనకి.

మరో రెండు రోజులు కొత్తకొత్తగానే గడిచిపోయాయి. కాస్త అర్థమయింది రామ్మూర్తికి ప్రాజెక్టంటే యేమిటో. తనంతట తానే పని చేయించగల స్థితికి వచ్చాడు మరికొన్నాళ్ళకి. ఆ రోజు సాయంకాలం జేయీగారు కబురంపాడు యింటికి రమ్మని. ఆవేవో స్టేట్‌మెంట్లు యిచ్చి కాపీ చేయమన్నాడు. అ తర్వాత లేబరు చార్టులకి రంగులు పూయించాడు. "రోజూ వచ్చి ఆఫీసులో వో అరగంట పని చేయండి. మీకూ పని తెలుస్తుంది" అన్నాడు వచ్చేటప్పుడు. తను సరేనన్నాడు.

రోజూ ఆఫీసుకు వెళుతూనే ఉన్నాడు. పని కూడా ఏమంతలేదు. ఏవో నాలుగు కాగితాలు 'ఫేర్ కాపీ' రాసి పడేస్తే చాలు. దాంతో కబుర్లు అందుకొంటాడు ఆయన. వాళ్ళ కాలేజీ రోజులూ, అనంతపురం బజార్లూ కాలేజీ ప్రొఫెసర్లూ అ గొడవలన్నీ చెప్పుకొస్తాడు. కాని, ఎంతసేపు మాట్లాడినా వినుగెత్తదు ఆయనతోటి.

జేయీగారి దగ్గర కాస్త చనువు దొరికినప్పటినుంచీ సత్యనారాయణ తనని తప్పుకు తిరగసాగాడు. ఎప్పుడన్నా మాట్లాడినా, వెక్కిరింతగా, వ్యంగ్యంగా మాట్లాడలాడు. అంటుకని రామ్మూర్తి అసలు మాట్లాడడమే మానేశాడు అతనితోటి.

ఆ విధంగా ఉండగా వో శుభదినాన సత్యనారాయణ ఎందుకో పది రోజులు సెలవుపెట్టి యింటికి పోయాడు. జేయీ రామ్మూర్తిని, పిలిచి మస్టరు చేతిలో పెట్టాడు. అప్పుడు నిజంగా రామ్మూర్తి మొహమైతే మామూలుగానే పెట్టాడుగాని, మనస్సులో తానో రాజాధిరాజు అయినట్టు ఫీలయ్యాడు.

బయటికొచ్చి సింహాద్రికి చెప్తే అతను మొహం యింత చేసుకొని "కాఫీ యిప్పించాలండీ" అన్నాడు.

"ఎందుకు?" అన్నాడు రామ్మూర్తి.

"ఎందుకేమిటి! నేను రెండేళ్ళబట్టి పని చేస్తున్నాను యిక్కడ. మన జేయీగారు సత్యనారాయణకి తప్పితే దేవుడికూడా యివ్వలేదు మస్టరు. అతను లేనప్పుడు ఆయనే వచ్చి 'మార్కు' చేసుకొంటాడు. అలాంటిది మీ చేతికిచ్చాడంటే నిజంగా మీ అదృష్టమే అనాలి!"

"అదృష్టం ఏముంది యిందులో?"

"అలా అంటారేమిటండీ—మీ వోపికకొద్దీ ఫలం" అన్నాడు సింహాద్రి నవ్వుతూ, మహాతెలివిగా మాట్లాడుతున్నట్టు.

చచ్చిందాకా పట్టుకు తందామనిపించింది రామ్మూర్తికి. సింహాద్రిని. అయినా అతని అమాయకత్వంచూచి వోర్చుకొన్నాడు.

ఆరాత్రి నిద్రపట్టలేదు. బయటికొచ్చి మర్రిచెట్టు కింద వెన్నెట్లో కూర్చుని రేప్పొద్దుటి కార్యక్రమం ఆలోచించుకోసాగాడు. పోగానే అప్పలమ్మకి ఆబ్సెంటు మార్కుచేసి యింటికి పంపేయాలి. మిగిలినవాళ్ళని గట్టిగా దబాయించేయాలి ఒకసారి. అప్పలమ్మ అదరిపోతుంది! పొగరూ, గిగరూ గాలికి పోవాలి.

అయితే, పాపం యింటి దగ్గర ఏమైనా తినడానికిఉన్న మనిషో కాదో! తనిక్కడ అబ్సెంటువేసి పంపిస్తే తన జీవానికి పడి అల్లాడుతుందేమో! వో మారు దబాయించి వదిలితే పోదూ? లేదు, లేదు, దాని పొగరు అలాపోదు. రామ రామ ఎంత గర్వం! ఆ రోజున తను 'బండు' మీద నడిచి వస్తుంటే పుసుక్కున ''ఏం మేస్త్రిగారూ, కాళ్ళాపుకొంటూ వచ్చావ్, వర్షం పడిందిగా నిన్న—యియ్యాల పనొద్దన్నారంట బేయ్‌గారు—పాపం ఎల్లండి యింటికి'' అంది ముసిముసి నవ్వులు నవ్వుతూ! తనకి నోటంట మాట పెగిలి రాలేదు. కాస్త దూరంపోయి ఏదో చెప్పుకొంటూ గొల్లున నవ్వారు పక్కనున్న వాళ్ళంతా! అబ్బా—ఆరోజున తల పగలగొట్టుకు చద్దామనిపించింది.

''లాభంలేదు. అప్పలమ్మకి ఆబ్సెంటు చేయాలిసిందే' అని నిర్ణయించుకొన్నాడు. కోడి కూసేసింది.

ఒక్క కునుకుతీసి, పొద్దున్నేలేచి శుభ్రంగా స్నానం చేసి మంచి బట్టలు లగాయించి బయలుదేరాడు రామ్మూర్తి పని మీదికి.

సింహాద్రిగాడు అప్పుడే కబురు చేరేశాడులావుంది, అంతా బుద్ధిమంతుల్లా నిలబడి భయంభయంగా చూస్తున్నారు తనకేసి. అప్పలమ్మ ఎక్కడుందా అని చూశాడు. సీతి చాటున దాక్కుని నిక్కి నిక్కి చూస్తోంది. అదే అవతారం! నాలుగు కళ్ళూ దఘాలున కలవగానే ఒంట్లో కరెంటు పుట్టుకొచ్చింది. హడలిపోయి మస్టరు తెరిచేశాడు.

మొగాళ్ళకి మార్కింగు అయిపోయింది. యిహ ఆడాళ్ళు—

అంజమ్మ ప్రజెంటు.

అంకమ్మ ప్రజెంటు.

అప్పలమ్మ ప్రజెంటు—కాదు!

గుండెలు దడదడలాడుతున్నయ్. ఒళ్ళంతా చెమట పట్టేసింది. శిలలా నిలబడిపోయి ఆలోచించసాగాడు. అప్పలమ్మ జేయాతో రిపోర్టు చేస్తుందేమో! అందులో ఆ రిపోర్టు చేస్తూ చేస్తూ రెండు సొంత మాటలు జోడించిందంటే తన పని ఖాళీయే! తనను కూడా సత్యనారాయణ రకంకిందే జమ కట్టేస్తుంది లోకం దాంతోటి.

ఒణికిపోతున్నాడు రామ్మూర్తి.

బుల్‌డోజరు హోరున గోడు పెడుతూ తన దగ్గరికొచ్చి ఆగిపోయింది. డ్రైవరు కిందికి దూకి సలాం కొట్టాడు. చటుక్కున యీ లోకంలో పడ్డాడు రామ్మూర్తి. కాని, మస్టర్లో అప్పటికే ప్రజెంటు పడిపోయిఉంది, అప్పలమ్మపేరు ఎదురుగా! తన బలహీనతని గమనించి నిశ్చేష్టుడైపోయాడు.

ఆ రోజంతా పనేమీ చేయలేదు. మొహం పాలిపోయి నోట మాట రావడంలేదు. నిశ్శబ్దంగా పాకలోకిపోయి కూర్చున్నాడు.

ఇంటికొచ్చి ఆలోచించుకోసాగాడు. 'తనలో అంత బలహీనత ప్రవేశించడానికి కారణం యేమిటూ' అని. అప్పలమ్మ పుకారు లేపుతుందనే భయమేనా? అదొక్కటే కారణంఅయి ఉండదు!

తనావైపు చూసినప్పుడు తనకేసే కన్నార్పకుండా చూస్తోంది. ఆ కళ్ళల్లో అంతకుముందటి అప్పలమ్మ కనిపించలేదు తనకి. అమాయికంగా లేడికళ్ళలా ఉన్నాయి. అప్పలమ్మ నిజంగా అందాలరాసి. ఆ కాటుక కళ్ళల్లో ఎంతో ఆకర్షణవుంది. అందుకనే అంత పెద్ద పెద్దవాళ్లు కూడా ''దాసోహం'' అని ఉంటారు. ఈ బలహీనతే తన్నలాచేసి వుంటుంది. తను కూడా మామూలు రకం మనిషే అయిపోయాడు... ఛీ ఛీ......ఏమిటీ ఆలోచనలు! ఆ నీతిలేనిమనిషిని గురించి యింతగా ఆలోచించడం అర్థంలేని పని. వదిలేస్తే ఏ గొడవాలేదు. లేనిపోని సమస్యలు కొని తెచ్చుకోడం దేనికి పది రోజుల భాగ్యానికి?

ఎంతో గట్టిగా అనుకున్నా డీ మాటలు. కాని నిద్ర మాత్రం పట్టలేదు.

మర్నాడు పనిమీదికెళ్ళాడు. మనసు ప్రశాంతంగానే అట్టిపెట్టుకొన్నాడు ఎంతో ప్రయత్నంమీద. అందర్నీ దబాయించేస్తున్నాడు పని చేయండని. అటూయిటూ కేకలు పెడుతూ తిరుగుతున్నాడు. రోలరు డ్రైవరుతో చక్రం దగ్గర దగ్గరగా తిప్పమని చెబుతున్నాడు. నీళ్ళలారీ క్లీనరుతో నీళ్లు పల్చగా చల్లమంటున్నాడు. అటువైపు స్లోపుమీద దిమ్మెసలతో బాదిస్తున్నాడు.

కాని, యింత గొడవలోనూ—ఒక్కసారి, ఒకే ఒక్కసారి ఆలా చూద్దామని అనిపిస్తోంది. తెచ్చిపెట్టుకొన్న ఈ ఆర్భాటమంతా మంచులా కరిగిపోయింది. వోరగా చూశాడు.

యిటే చూస్తోంది అప్పలమ్మ, చేతులో కడవ పెట్టుకొని వయ్యారంగా! గతుక్కుమన్నాడు. బెంబేలుపడిపోయి పాకలోకి పరిగెత్తాడు.

'అరె— ఆ పిశాచం గమనించేసింది! యిహ తనెందుకూ పనికిరాని వెధవ దానిదగ్గర. యిక్కడ పడివున్న శతకోటి వెధవల్లోనూ వో వెధవకింద జమ కడుతుంది కాబోలు తనని కూడా! తనెందుకూ కొరగాడిక!

అయినా, అనుమానం మళ్ళీ తగిలింది. తడిక సందులోంచి మరోమారు చూశాడు అటుకేసి. లేత ఆకు పచ్చ చీర, దానిమీద బిర్రుగా తెల్లటి వాయిల్ జాకెట్టు—మనిషి బిగువుగా బొద్దుగా వుంది. తలనిండా పూలు—గుండ్రటి మొహం—కాటుక పులిమిన కళ్ళు!

"బాబోయ్ నాకు పిచ్చెత్తింది! నాకు పిచ్చెత్తేసింది' అంటూ భోరున యేడిచాడు తల బల్లమీద ఆనించి. బిరబిరా వో కాయితంతీసి సెలవు రాసేసి సింహాద్రి చేతికిచ్చి పరిగెత్తుకొంటూ పోయాడు యింటికి.

ఆ దెబ్బతో రెండు రోజులదాకా మళ్ళీ వాకిలి దాటలేదు. సింహాద్రివచ్చి "ఏమిటండీ, ఎందుకు సెలవు పెట్టారు?" అంటూ ఆరాలు తీయసాగాడు. ఏమీ చెప్పలేక 'రక్త విరేచనాలు' అన్నాడు. ఆ రోజు సాయంకాలం జేయీ చీటి రాసి పంపాడు, ప్యూన్‌చేత, తను అవసరంగా శ్రీకాకుళం వెళుతున్నాననీ, తప్పకుండా పనిమీదికెళ్ళి జాగ్రత్తగా చూచుకోమనీ.

ఈ నలభై యెనిమిది గంటల్లోనూ బుర్ర కాస్త దారి కొచ్చింది. తనూ, తన చదువూ, తల్లిలేని తన చెల్లెళ్ళూ యింకా బోలెడన్ని విషయాలూ గుర్తుకు తెచ్చుకొన్నాడు. నేరుగా పనిమీదికిపోయి అందరికీ మస్టరేసి తాను దూరంగా 'బారోపిట్సు' దగ్గరికెళ్ళి నిల్చున్నాడు. ఆ రోజున స్క్రేపర్సూ అవీ చూస్తూ హుషారుగానే గడిపేశాడు.

మరో వారం రోజులు ఏ గొడవా లేకుండా గడిచిపోయాయి. సత్యనారాయణ దిగాడు సెలవు అయిపోగానే.

"మస్టరు సత్యనారాయణ కిచ్చేస్తానండి" అన్నాడు రామ్మూర్తి జేయీగారితో.

"ఒద్దు, మీ దగ్గరే వుంచండి" అన్నా డాయన సీరియస్‌గా.

రామ్మూర్తి ఏదో చెప్పాలనుకొన్నాడుగాని, ఆయన మొహంమీది నిశ్చలమైన నిశ్చితాన్ని చూసి మరి మాట్లాడలేదు.

ఆ రోజునుంచి సత్యనారాయణ తనకేసి పులిలా చూడసాగాడు. బండుమీద గొడవ లెక్కువయ్యాయి. కూలీలంతా కట్టకట్టుకొని సత్యనారాయణకి ఎదురు తిరిగారు. అణచి పెట్టుకున్న వాళ్ళ కోపమంతా కాస్త సందు దొరకగానే నురుగులు కక్కసాగింది. రామ్మూర్తే వెళ్ళి దబాయించి సర్దేశాడు అప్పటికి.

రోజులు మెల్లిగా గడచిపోతూ ఉన్నాయి. జేయీ దగ్గర 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' తీసుకొని చదవసాగాడు. దానితో శుభ్రంగా కాలక్షేపం అవుతోంది.

ఈ సెప్టెంబరు పరీక్షలతో అదే బాధ. పాసయి కూడా గోళ్ళు గిల్లుకొంటూ మళ్ళీ కాలేజీలు ఎప్పుడు తెరుస్తారా అని జపం చేయాలి. ఒక గాడిలో తిరిగే విద్యార్థి జీవితం, కాస్త విరామం దొరికేసరికి పిచ్చివేషాలు వేయడం సాగిస్తుంది. దాంతో భవిష్యత్తంతా పెద్ద దెబ్బతింటుంది. లేకపోతే బి. ఏ. చదువుతూ ఉండవలసిన రామ్మూర్తికి అర్థాంతరంగా ఈ ఉద్యోగం ఏమిటి.

అన్ని రోజుల్లాగానే ఆ రోజూ వచ్చింది. కాని ఆ రోజు అతని జీవితాన్ని ఒక్క వూపు వూపి పోయింది.

అయిదింటికి గంట కొట్టించి అందర్నీ పంపేశాడు. పడిపోయిన 'పెగ్గు'లు మళ్ళీ కొట్టిస్తున్నాడు బండుమీద రేపటి పనికి ఆటంకం లేకుండా. ఇంతలోనే జేయీగారు వచ్చాడు సైకిలుమీద. "మీకు లెవలింగు తెలుసా?" అని అడిగాడు రామ్మూర్తిని. తెలియదన్నా డతను.

బండుమీద లెవలుపెట్టి రీడింగులు రాసుకొన్నాడు పుస్తకంలో. రామ్మూర్తిని దగ్గరికి పిలిచి చూడమన్నాడు. ఏదో మసకమసకగా ఉంది అందులోంచి చూస్తే.

"ఏం కనిపిస్తోంది?"

"ఏమీ కనిపించడంలేదండి"

"సరిగ్గా చూసి చెప్పండి—ఆఁ యిప్పుడు చూడండి" అంటూ పక్కనేఉన్న ఓ చక్రం తిప్పాడు.

అవును. యిప్పుడు కనిపిస్తోంది. కొలతబద్దమీద 'V' తిరగబడి కనిపిస్తోంది. ఆ మాటే చెప్పాడు ఆయనకి.

"గుడ్—మీరు చూచింది పాయింట్ ఫైవ్, అన్నమాట. వస్తువులు తలకిందులుగా కనిపిస్తయ్‌లెండి యిందులో—సరే, యిహ లోపల పెట్టించేయండి" అని పెట్టె సర్దేశాడు.

"రండి వెళదాం" అన్నాడాయన సైకిలెక్కకుండా నడుస్తూ.

దారిలో ఆయన చాల విషయాలు మాట్లాడాడు. తన ప్రమోషనూ, పెళ్ళి వ్యవహారం, తన యిష్టాయిష్టాలూ చాలా చెప్పుకొచ్చాడు. ఇంత నిర్మలమైన మనుషులుంటారా అనిపించింది తనకి. లేకపోతే ఆయన పెళ్ళి వ్యవహారాలు తనతో చెప్పవలసిన అవసరం యేమిటి!

కాంటీను దగ్గర కాఫీ యిప్పించి ఆయన క్యాంపులోకి వెళ్ళిపోయాడు సైకిలుమీద.

ఆరుగంటలు దాటిపోయింది. మసకమసకగా వుంది. రెండు మైళ్ళు నడవాలిప్పుడు. ఈ నడకనుంచి తప్పించుకోవాలని ఎంతో ప్రయత్నం చేశాడతను. కాని క్యాంపులో ఎంత ప్రయత్నం చేసినా యిల్లు యివ్వలేదు. అందువల్ల దగ్గర్లోనేవున్న మిట్టపల్లి అనే ఊళ్ళో చిన్న యిల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. పని మీదికివెళ్ళే కూలీలంతా దాదాపు ఆవూరినుంచే వస్తారు.

మెల్లగా నడుస్తూ ఉన్నాడు దిక్కులు చూస్తూ. ఆకాశం సంజకాంతులు కక్కుతూ, అప్పుడే నేర్చుకొంటున్న

కుర్రాడు వేసిన రంగుల బొమ్మలావుంది. చుట్టూ పేర్చి పారేసిన రాయంతా గుట్టలు గుట్టలుగా పేర్చి వుంది. ఏదో ఆలోచించుకొంటూ వస్తున్నవాడల్లా పాముతోక తొక్కినట్టు అదిరిపడ్డాడు. గుండె యింజనులాగు కొట్టుకోసాగింది. ఒళ్ళంతా చెమట పట్టేసింది. రాళ్ళ గుట్టల మధ్యనుంచి నడిచివచ్చి రోడ్డు అందుకొంది అప్పలమ్మ. బట్టలన్నీ నలిగిపోయివున్నయ్. జుట్టంతా రేగిపోయి గాలికి కొట్టుకొంటోంది. తలలోంచి నలిగి రాలిన పూలు భుజాలమీదపడి మూలుగుతున్నయ్.

రామ్మూర్తినిచూసి గాభరా పడింది అప్పలమ్మ. కాని వెంటనే తెరులుకొని మెల్లగా పలకరించింది.

"యింత ఆలెసెంగా పోతున్నావేం మేస్త్రిగారూ యియ్యాల"

రామ్మూర్తి తెప్పరిల్లి "ఆఁ......మ......మరి....ప.....పనుండి.....ఆగిపోయాను" అన్నాడు.

అప్పలమ్మ నవ్వుకొంది ముసిముసిగా.

రామ్మూర్తి ముందు నడుస్తున్నాడు ఉక్కిరి బిక్కిరయిపోతూ. గాలి పీలవడమే మహా కష్టమయిపోతోంది. గబగబా నడుస్తున్నాడు.

"అంత బేగీ లగెడతారేటండి మరీనీ" అంది గోముగా.

"అబ్బే....యింటి దగ్గర ముసిల్ది కాచుక్కూచునివుంటుంది, నీళ్ళ కడవకోసం. నీళ్ళు లేకపోతే పస్తే యివ్వాళ" అన్నాడు గబగబా పాఠం ఒప్పచెప్పినట్టు.

"అంత కరువేటండి నీళ్ళకి. నే తెచ్చి పోత్తాన్లెండి ఆనక వో కడవ. దాని కంత బయమేటి మేస్త్రిగారూ"

అదిరిపోయాడు యీ సలహాకి రామ్మూర్తి. అయినా మాట్లాడలేదు. మెదలకుండా నడుస్తున్నాడు.

"మేస్త్రిగారూ—మీకు పెళ్ళవలేదేటండి యింకా"

భూకంపం పుట్టింది! హరహరా అనుకొన్నాడు. కాళ్ళు గజగజ వణికిపోతున్నయ్. 'ఈ కాళ్ళల్లో మేకులు దిగగొడితే ఎంత బావుణ్ను' అనుకొన్నాడు రామ్మూర్తి. దఢాలున ఒంగి పాదాలు చూచుకోసాగాడు, "ముల్లు దిగినట్టుంది' అని సణుగుతూ. ఈలోగా అప్పలమ్మ అతన్నిదాటి ముందుకొచ్చి, వెనక్కి తిరిగి అతనికేసి చూస్తూ "ఏటండి" అంది ఆదుర్దాగా.

కళ్ళెత్తి చూశాడు రామ్మూర్తి.

రేగిపోయిన జుట్టు చిందరవందరగా గాలికి ఎగురుతూ ఉంది. గుండ్రటి మొహంలోంచి రెండు నల్లటి కళ్ళు చిలిపిగా చూస్తూ వున్నయ్. పిచ్చెత్తుతోంది రామ్మూర్తికి. నడక సాగించాడు మళ్ళీ.

ఈ మారు అప్పలమ్మ ముందు నడుస్తోంది. రెండు మూడు గజాల వెనక ఉన్నాడు రామ్మూర్తి. వెనకకి వచ్చాక కాస్త ఊపిరి ఆడసాగిందతనికి. రెండు కళ్ళూ తాటికాయలంతచేసి, అప్పలమ్మ ప్రతి కదలికనీ గమనిస్తున్నాడు వెనకనుంచి. గుండెల మధ్య ఏదో డైనమో పని చేస్తోంది. అక్కడినుండి నాడినాడికీ విద్యుత్తు పరిగెడుతోంది.

కాలిబాట దగ్గర ఆగి వెనక్కి తిరిగి "నీళ్ళు నేనట్టు కొత్తానులెండి మేస్త్రిగారూ" అనేసి వెళ్ళిపోయింది.

రామ్మూర్తికి నూటికి నూరు పాళ్ళూ పిచ్చెత్తింది, ఈ పాటికి. వాకిలి తెరిచి ముసలమ్మకి కడవ అందించాడు. మర్రిచెట్టుకింద కూచుని ఎక్కడెక్కడో వూహాలోకంలో తిరగ సాగాడు. ఏడయింది— ఎనిమిదయింది.

లోపలికెళ్ళి పొద్దుటి అన్నంవుంటే పెట్టుకుతిన్నాడు, వో అవకాయ ముక్కేసుకొని. కాని తిండిమీద లేదతని మనసు.

భోంచేసి మంచం వేసుకు పడుకొన్నాడు బయట. ఆకాశంలోకి చూస్తూ ఆలోచించ సాగాడు. మళ్ళీ ఎదురు తిరిగింది మనస్సు.

తనూ, తన చదువూ, తల్లిలేని చెల్లెళ్ళూ, తండ్రి ఆచారం—తన ఆదర్శాలూ—అన్నీ గుర్తుకొచ్చాయి.

"ఛీఛీ నేను పశువుని—పశువుని—నూటికి నూరుపాళ్ళు పశువుని" అని దిండులో తలదూర్చి వెక్కివెక్కి యేడిచాడు.

దిండు తడిసి ముద్దయింది.

ఉన్నట్టుండి గభుక్కున లేచాడు. ఏదో నిశ్చయానికొచ్చినట్టు ముహం గంభీరంగా పెట్టుకు కూర్చున్నాడు. లోపలికెళ్ళి చరచరా వో పోస్టుకార్డు రాశాడు యింటికి, తను క్షేమంగా ఉన్నాననీ, చెల్లెళ్ళ క్షేమాలు తెలుపమనీ, వారం రోజుల్లో డబ్బు పంపుతున్నాననీ, వాళ్ళకి బట్టలు కుట్టించమనీ.

అడ్రసురాసి గూట్లో పెట్టి వచ్చి మళ్ళీ పడుకొన్నాడు. తలుపేసి. ఈ మారు కాస్త తేరుకొన్నట్టుంది మనస్సు. దుప్పటి గొంతుదాకా బిగించి, మర్రిచెట్టుకేసి చూస్తూ తన బి. ఏ. గురించి ఆలోచించసాగాడు. రేపటినుంచి తన పని తప్పితే మరో విషయం పట్టించుకోగూడదనుకొన్నాడు. తన పిచ్చిగాని యిప్పటిదాకా జరిగిందాన్లో ఏముంది అనుకొన్నాడు. హృదయం తేలికయింది. అదోరకమైన మైకం కమ్ముకొచ్చింది. మగతగా కళ్ళు మూయసాగాడు.

వాకిటి దగ్గర చప్పుడైంది. తలెత్తి చూశాడు. సున్నం కొట్టినట్టయింది మొహం. పాలిపోయి ప్రేతకళ ఆవరించింది దానిమీద.

యుద్ధం జరుగుతోంది అతనిలో—మంచికీ చెడుకీ, మనస్సుకీ శరీరానికీ మధ్య యుద్ధం జరుగుతోంది.

మెల్లిగా కళ్ళు తెరిచి చూశాడు లేచి కూర్చుని.

అప్పలమ్మ ప్రహరీ దాటి లోపలి కొచ్చేసింది.

చంకలో కడవ, సన్నని వాయిల్ చీర గాలికి రెపరెపలాడుతోంది. నున్నటి శాటిన్ జాకెట్టుమీద వెన్నెలపడి మెరిసిపోతోంది. తలనిండా తెల్లటి మల్లెపూలు అప్పుడప్పుడే విచ్చుతూ, మత్తయిన సువాసనని వెదజల్లుతున్నయ్. బెరుకు బెరుకుగా చూశాడు అప్పలమ్మ కళ్ళలోకి, తోడేలు ముందు నిల్చున్న మేకపిల్లలాగు.

"నీళ్ళు కావాలన్నారు కదండీ" అంది గోముగా మొహం పెట్టి, కడవదించి నేలమీద పెడుతూ.

పన్నెండు గంటలప్పుడు నీళ్ళు!

ఈ అవతారంలో నీళ్ళు.

ఆ కళ్ళతో నీళ్ళు!!!

పిశాచం పట్టిన వాడిలాగు లేచి నిలబడ్డాడు రామ్మూర్తి. శరీరమంతా సలసలకాగిపోతూ పొగలు కక్కుతూవుంది. కుడి చేయి యాంత్రికంగా వెళ్ళి అప్పలమ్మ ఎడమభుజంమీద వాలింది.

చేతికి స్పర్శ తగలగానే వింతైన మార్పు కలిగింది. రామ్మూర్తిలోంచి విద్యుత్తులాగు ఒక 'శక్తి' ఛళ్ళున లేచింది. ఆ శక్తి అతనిలో అంతకుముందు ఉన్న బలహీనతని పార దోలింది. భావిలో రెండు రోజులు నాని బైటపడిన శవాన్ని చూచినప్పుడు కలిగేటటువంటి జుగుప్సాకరమైన ఓ అనుభూతితో ఒళ్ళు జలదరించింది.

దాంతో అతనిలోని పిశాచం మరో రూపం దాలిచి రెండింతలైంది. పిడికిలి బిగించి అప్పలమ్మ గడ్డంమీద ఒక్క గుద్దు గుద్ది హుంకరించాడు, బలమంతా ఉపయోగించి.

అప్పలమ్మ వెళ్ళి నాకిలి దగ్గర పడింది. నోటంట మాట రాలేదు. అరవడానికి ప్రయత్నం కూడా చేయలేదు.

రామ్మూర్తి కోపంతో నురుగులు కక్కుతున్నాడు. కళ్ళు చింతనిప్పుల్లా మండిపోతూవున్నయ్. మెట్లపక్కఉన్న ఒక పెద్ద బండ తీసి అప్పలమ్మ మీదికి విసరడానికి రెండు చేతులతోనూ పైకి ఎత్తాడు.

ఎదురుగా సత్యనారాయణ ప్రత్యక్షమయ్యాడు! నిర్వికారంగా నిలబడి సన్నగా నవ్వుతున్నాడు.

రామ్మూర్తి హడలిపోయాడు. రెండు క్షణాలు అలాగే చూసి రాయి విసిరిపారేసి మౌనంగా నిలుచున్నాడు.

"ఊరికే తోచక ఎలా ఉన్నారో చూద్దామని వచ్చాను. ఏదో కోపంలో ఉన్నట్టుంది. వెళ్ళొస్తాను" అనేసి వెళ్ళి పోయాడు సత్యనారాయణ. అప్పలమ్మ కూడా కనిపించలేదు. అంతకుముందే వెళ్ళిపోయినట్లుంది.

రామ్మూర్తి సిగ్గుతోనూ, అవమానంతోనూ కుదించుకు పోయాడు. ఒక్క రెప్పపాటులో భయంకరమైన హత్య తప్పి పోయింది. సత్యనారాయణ దేవుడిలా వచ్చాడు సమయానికి. కృతజ్ఞతతో వెయ్యి నమస్కారాలు చెప్పుకొన్నాడు సత్యనారాయణకి మనస్సులో.

దాంతో మామూలు మనిషయ్యాడు రామ్మూర్తి. సుళ్ళుకక్కే నదిలోంచి ఈదుకొచ్చి బైటపడినవాడిలాగు ఒళ్ళు తెలియకుండా నిద్రపోయాడు.

కథ చెప్పడం ఆపాడు కృష్ణమూర్తి.

అయిపోయిందేమోననుకొని "కథ కంచికిపోయుంటుంది" అన్నాను నేను.

"లేదు—మరో ఎనిమిది గంటలు ఆగింది"

తెల్లవారగానే స్నానం అదీ చేసి ఆదరాబాదరా పరిగెత్తాడు రామ్మూర్తి పనిమీదికి, లేటయిందని భయపడుతూ.

కాని పనిదాకా పోనక్కర్లేకపోయింది!

దారిలో తాటిచెట్టుకి ఓ బోర్డుకట్టి ఉంది. "మిట్ట పల్లెలో రామ్మూర్తి ప్రణయకలాపాలు! ఆడవాళ్ళమీద బక్క మేస్త్రి దౌర్జన్యాలు!!"

గుండెలు బేజారెత్తిపోయినయ్. అటూ యిటూ చూశాడు. దూరంగా అయిదారు తాటిచెట్లకి అలాంటి బోర్డులే ఉన్నయ్. ఇవన్నీ, ఒక్క రోజులో రాసినవిలా లేవు. ఒక్కడికంటె ఎక్కువ మంది రాతగా కూడా లేదు. అలా రంగుతో రాయగలిగినవాళ్ళు యిద్దరు ముగ్గురే ఉన్నారక్కడ. అందులో సత్యనారాయణ ఒకడు.

'సత్యనారాయణ ఎందుకు రాస్తాడు? అనుకొన్నాడు. రాత్రి సత్యనారాయణ నవ్విన నవ్వు గుర్తుకొచ్చింది. "ఎంతటి వల పన్నారు!" అనుకొన్నాడు.

సరే ఏమయితేనేం మొత్తంమీద కథ కంచికి వెళ్ళి పోయింది. ఇటు రామ్మూర్తి నురుగులు కక్కుకొంటూ స్టేషను చేరుకొని టిక్కట్టు కలెక్టరు కనిపిస్తే రైలు మించి దూకేయడానికి వీలుగా అట్టడుగు ఫుట్‌బోర్డుమీద నిలబడి ప్రయాణం చేసి యిల్లు చేరుకున్నాడు. ఆ తర్వాత సింహాద్రికి ఉత్తరం రాసి పెట్టె బేడా తెప్పించుకొన్నాడు.

"ఒరేయ్ యిదంతా కట్టుకథ కాదంటావా?" అని నిలేసి అడిగాను కృష్ణమూర్తిని.

"కేవలం కట్టుకథే అయితే రామ్మూర్తి పేరు చెప్పక పోదును. చాలామట్టుకు జరిగిందే. కాస్త వూహాగానం కూడా ఉందనుకో. మొత్తంమీద నే చెప్పొచ్చేదేమిటంటే—

జీవితం కూడా అంతే—

మనిషి పతనం చెందేముందు అతనిలో తీవ్రమయిన సంక్షోభం చెలరేగుతుంది. శరీరానికీ, హృదయానికీ మధ్య జరిగే ఆ యుద్ధంలో లోపలినుంచి ఒక 'శక్తి' ఆఖరిసారిగా విజృంభించి ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తుంది. దాన్ని లెక్కచేయకపోతే, బాధగా ఒక్క మూలుగు మూలిగి చచ్చిపోతుంది. ఆ తర్వాత ఎవడి కర్మ వాడిది!"

ఏమిటి మాట్లాడుతున్నా డీ కృష్ణమూర్తి? సిగరెట్టు గురించి యింత కథ చెప్పడంటే అర్థంలేదు. ఆఖరు మాటలు అనేటప్పుడు కృష్ణమూర్తి కంఠంలోని జీరా, ఆ మాటల్లోని తొట్రుపాటు ఏదో మనసులో చూసి బిగబట్టుకొని మాట్లాడు తున్నాడనిపించింది నాకు.

కొంపతీసి వీడే ఆ రామ్మూర్తి కాడు గదా?

నిలబడి పరీక్షగా కథలోని 'రామ్మూర్తి'నీ, ఏదో లోకం లోకి నిశ్శబ్దంగా కళ్ళార్పకుండా చూస్తోన్న కృష్ణమూర్తినీ పోల్చి చూశాను.

భయంతో ఒళ్ళు గగుర్పొడిచింది.

అపరిష్కృతమైన యోగదర్శనము

శ్రీ ఆర్థర్ కోస్లర్

గత సంచిక తరవాయి

అతిమానుష శక్తులు

భారతదేశములో నున్నప్పుడు నేను సుమారు నలువది మందితో యోగమునుగూర్చి ప్రస్తావించితిని. వారందరును ఎప్పుడో ఒకప్పుడు యోగమభ్యసించినవారే. వారిలో పెద్దలు, ఉన్నతాధికార పదవు లలంకరించినవారు, యువ పత్రికా రచయితలు, ఉద్యోగులు, యోగ పరిశోధకులు, వారి ననుసరించిన అభ్యాసకులు, మత విశ్వాసులు, అజ్ఞతావాదులు, గాంధేయులు మార్క్సిస్టులు, భూతపూర్వ కమ్యూనిస్టులు కలరు. కాని మహిళ లెవరు లేరని తెలుపుట కెంతయు చింతించుచున్నాను. యోగ మొక వృత్తిగా స్వీకరించినవారి మాట అటుండనిచ్చి పరిశీలించినచో, పై యోగాభ్యాసకులలో మూడు వారములు మొదలుకొని పండ్రెండేళ్ల పర్యంతమును నిరంతసాధన సాగించిన వారున్నారు. వీరి వృత్తులు, వయఃపరిమాణములు. పూర్వ సాంఘిక పరిస్థితులు మిక్కిలి విభిన్నములు. అయినను అచంచల దీక్షతో ఏకాగ్ర లక్ష్యముతో తమ యోగాభ్యాస దీక్ష కొనసాగించిన యెడల అతిమానుష సిద్ధులు తప్పక కరతలామలకములు కాగలవని వారందరికి సర్వ సాధారణముగా నొక సుదృఢ విశ్వాస మేర్పడినది. కాని వారిలో మిక్కిలి కొలదిమంది మాత్రమే తమ సాధన దశలలో నెప్పుడో యొకప్పు డట్టి సిద్ధుల ప్రయోగ శక్తి కలిగినదన్న నిశ్చితబుద్ధి కలిగినది. అయినను వారందరును అలసత, బ్రహ్మచర్య నియమ హీనత మాత్రమే తమ లక్ష్య ప్రాప్తికంతరాయములుగ నున్నవని ఏకగ్రీవముగా తలచిరి. యోగ విషయములలో శాస్త్రీయ పరిశోధనలతో సంబంధ మేర్పరుచుకొన్న వారందరును తమ కిష్టము లేకున్నను ఇదే యభిప్రాయముతో నేకీభవించిరి.

ఈ విషయమున బరమప్రమాణగ్రంథమగ పతంజలియోగసూత్రములో నాలుగధ్యాయములున్నవి. వీనిలో మూడవ యధ్యాయమునందంతటను ఇంచుమించుగ నీయతిలోక సిద్ధులను గూర్చి ప్రస్తావనయే కన్పట్టుచున్నది. పూర్వజన్మ సంస్మరణము మొదలుకొని భవిష్యద్విజ్ఞాన శక్తి, యోగదృష్టి, పైకి తేలిపోవుట, పరకాయప్రవేశ సామర్థ్యము, భౌతిక పదార్థ విపరిణామ పాటవము, సర్వజ్ఞత మొదలుగా గలిగిన వీ సిద్ధులలో పేర్కొనబడినవి. తరువాతి యోగశాస్త్రగ్రంథములలో అణిమ, మహిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము, కామవశయిత అని సిద్ధులెనిమిది పేర్కొనబడినవి. అణిమ యనగా అణువువంటి సూక్ష్మ స్వరూపము స్వీకరించుట. మహిమ యనగా అపరిమిత దేశ వ్యాపక శక్తి. లఘిమ యనగా మిక్కిలి తేలికదనము, పైకి తేలిపోవుట. ప్రాప్తి యనగా నెంతటి సుదూరప్రదేశమునైనను నిచ్ఛామాత్రముచేతనే చేరగలుగుట. ప్రాకామ్యమనగా నెచ్చోటను అడ్డమాకలులేని ఇచ్ఛాశక్తి. ఈశత్వమనగా సృజనశక్తి. వశిత్వమనగా నాత్మనిగ్రహము. కామయిత యనగా సమస్త కాంక్షల, శారీరి కావసరాల నిగ్రహము. శివసంహిత అదృశ్యత్వము. శరీర మెచ్చటికయిన కొనిపోవుట అను మరి రెండు క్రొత్త సిద్ధులను గూడ నీ సిద్ధుల పట్టికలో జేర్చుచున్నది.

ఈ అత్యద్భుత సిద్ధుల వశీకరణము యోగ లక్ష్యము కాదనియు, ఇవి కేవలము ఆనుషంగికములనియు, వీనికొరకయి ఉవ్విళ్లూరవలదని సద్గురువులు తమ శిష్యుల నెల్లప్పుడు హెచ్చరింతురనియు సర్వసాధారణముగ పాశ్చాత్య పాఠకుల నుద్దేశించి రచించిన యోగ గ్రంథము లుగ్గడించుచున్నవి. ఈ పద్ధతి క్రైస్తవాధ్యాత్మికవాదుల ధోరణి ననుసరించుచున్నది. వారిటువంటిసిద్ధులు మానసిక వ్యధాహేతువులనియు వీని జోలికి పోరాదనియు హెచ్చరించిరి. అకస్మాత్తుగా గాలిలో తేలిపోవుట తన కెంతో మానసిక వ్యథ కలిగించినదని సెయింట్ థెరసా తన జీవిత చరిత్రలో నుడివినది. ఇటువంటి అనుభూతులింకముందెన్నడు ప్రసాదింపవలదని ఆమె పరమేశ్వరుని కంజలి ఘటించి వేడుకొన్నది. ఒకానొకప్పుడు గాలిలో తేలిపోయెడు విచిత్రానుభూతితో ఒక క్రైస్తవ సన్యాసిని నిలువున నిర్ఘాంతపడి గజగజవణికినది. అప్పుడా విషయ మెవ్వరికిని దెలియనీయవలదని సెయింట్ థెరసా ఆమె కొకగట్టి కట్టుడి చేసినది.1

హైందవాధ్యాత్మికవేత్త లిదే వైఖరి అవలంబించిరని నిర్ధరించుటకై పతంజలి యోగసూత్రమున నొక సుప్రసిద్ధ సూత్ర ముదాహరించుచున్నారు. ఆచార్య రాఘవన్ అనువాదంవలన ఆ సూత్ర తాత్పర్య మీ విధముగా వివరించవచ్చును. "వాస్తవముగ పరమ లక్ష్యప్రాప్తికి, సర్వ సంపూర్ణతకు సిద్ధులధిగమించరాని యంతరాయముల 37 వ పతంజలి యోగసూత్రము హెచ్చరించుచున్నది.

---

1 ది ఫిజికల్ ఫినోమెనా ఆఫ్ మిస్టిసిజమ్. హెర్బర్ట్‌థర్‌స్టన్ పుటలు 10, 12.

అపరిష్కృతమైన యోగదర్శనము

'బాహిర ప్రవృత్తియుక్తమగు మానసమందు కొన్ని ఈ సిద్ధులు సమాధి కన్నివిధముల విఘాతము లేర్పరచగలవు' అని ఎర్నెస్ట్‌వుడ్ రచించిన యోగసూత్రానువాదమున గానవచ్చుచున్నది. ప్రాచీనమగు నింకొక యనువాదమున నీ హెచ్చరిక ఒక నియమ నియంత్రితమై యున్నది.[2] ''పరిపూర్ణ మానసికైకాగ్రత కింతకుమునుపు వివరించినసిద్ధు లంతరాయము కలిగింపగలవు. వీని వినియోగ కాలమున యోగికి ఆశ్చర్య సమ్మిళితమయిన పరమానందానుభూతి కలుగగలదు. ఇందువల్లనే వీని వినియోగమెంతయు నిషిద్ధము. కాని చిర కాలాభ్యాసమున పరిపూర్ణుడయిన యోగీశ్వరుని కివి ఒకించుకయినను అడ్డంకి కలిగించనేరవు. ఈ మూడనువాదములలోను యథాతథముగ మూలము ననుసరించుచున్న అనుసరణ మేదో నిర్ణయించగల శక్తి నాకు లేదు. ఎర్నెస్ట్‌వుడ్ ఈ విషయమై 36 వ సూత్ర ముదాహరించుచున్నాడు. అచార్య రాఘవన్ 37 వ సూత్రమని పేర్కొనుచున్నాడు. జడ్జ్, కోనల్లీ లిరువురును 38 వ సూత్రమని నిర్దేశించుచున్నారు. ఒక విషయము మాత్రము విస్పష్టముగ గోచరించుచున్నది.

పతంజలి యోగ గ్రంథమునందెల్ల ఈ ఒక్క సూత్రమే సాధకుల నీ విషయమై హెచ్చరించుచున్నది. ఈ హెచ్చరిక దీనికి వెనుకటి యధ్యాయములలో పేర్కొన్న మానసిక శక్తులను గూర్చినది మాత్రమేయని మన మిక్కడ ముఖ్యముగా జ్ఞాపకముంచుకొనవలసియున్నది. దీని తరువాత పరకాయప్రవేశము, సర్వజ్ఞత్వము, గాలిలో తేలిపోవుట మొదలుగాగల అత్యద్భుత సిద్ధులు కొన్ని ప్రస్తావింపబడినవి. అత్యుత్తమములగు ఏకాగ్రసాధనల కివి న్యాయ్యములయిన ఫలితములని కూడ పాతంజల గ్రంథము ప్రతిపాదించుచున్నది. ఇక తరువాతి యోగశాస్త్ర గ్రంథములలో నీ విషయ మొకించుక పరిశీలింతము. హఠయోగప్రదీపికయందును, దాని ననుసరించిన మరి కొన్ని గ్రంథములందును, కష్టసాధ్యములయిన ముద్రలకన్నింటికిని నీ సిద్ధు లెనిమిదియు సముచిత ప్రతిఫలితములని ప్రతి పుటలోను విస్పష్టముగా పేర్కొనుట కానవచ్చుచున్నది. కాదు కాదని ఎవరెన్ని విధముల వాదించినను నీ సిద్ధు లెనిమిదియు యోగమున నంతర్గర్భితములయిన ప్రముఖ లక్ష్యములు.

యోగ మొక ముఖ్యవృత్తిగా స్వీకరించినవారితోగాని, తదితరులతోగాని ఈ విషయమున నడిచిన ప్రసంగము లించుమించుగ ఒకే ధోరణిలో సాగిపోయినవి. సంభాషణ ప్రారంభమున యోగాభ్యాసకుడు సిద్ధిప్రాప్తి తన లక్ష్యము కానేకాదని రోషపూరిత స్వరముతో నొక్కి వక్కాణించును. తాడు, బొంగరము లేని ఇట్టి అసంబద్ధ ప్రవాదములు పండితమ్మన్యులయిన బైరాగులు, ఫకీరులు మాత్రమే వ్యాపింపజేయుదురని వివదించును. నిశ్చలధ్యానమున కత్యావశ్యకములయిన శారీరికారోగ్యము, మానసికశాంతి మాత్రమే యోగాభ్యాస ప్రధాన లక్ష్యములని అసందిగ్ధముగ వెల్లడించును. కాని (టెలిపతీ) అతిలోక మానసవిజ్ఞానము విషయమున లభించుచున్న సాక్ష్యము మిక్కిలి విశ్వసనీయముగ నున్నదనియు, మిగిలిన ఇట్టి అద్భుత సంఘటనల విషయమున తగినంత ఋజువు చేకూరినయెడల నమ్ముటకు సిద్ధముగ నున్నానని వెల్లడించినంతలోనే ప్రసంగ వాతావరణమే మారిపోయెడిది!

ఈ సందర్భమున బి. యను నొక వ్యక్తినిగూర్చి ప్రస్తావింతును.

ఈత డిరువదియారేండ్ల యువకుడు. పట్టభద్రుడయిన పిమ్మట భౌతికశాస్త్ర పరిశోధన కొనసాగించుచున్నాడు. హైందవ యువ మేధావుల కీతని నొక ఉదాహరణముగ స్వీకరింపవచ్చును. కొంత పాండిత్యాడంబరమున్నదిగాని స్తిమితమనస్కుడు. మూడేళ్లపాటు ఆతడేకాగ్రనిష్ఠతో యోగాభ్యాస మొనర్చెనని విని నే నాశ్చర్యపడితిని. కాని ఆపైన తగినంత పట్టుదల లేకపోవుటవలన నా దీక్ష విరమించినాడు. స్వయముగ నాతనికి యోగసిద్ధు లేవియు లభించలేదు. కాని ఒకటి రెండు మారులు సిద్ధిగృహ ద్వారమున నడుగిడిన ట్లనుభూతి కలిగినది. చిన్న తనమున తొమ్మిదవయేట నాతడొక వింత కనుగొన్నాడు. మైసూరు నగరమున కనతి దూరముననున్న స్వగ్రామమున నొక యోగి మూడు నాలు గడుగుల మేర గాలిలో పైకి తేలినాడట. ఆపైన తిరిగి మరల మెల్లగ క్రిందికి దిగివచ్చినాడట. ఇరువదవయేట ఆతనిట్టిదే మరి ఒక యోగి చేసిన విడ్డూరము చూచినాడట. ఒక యోగి 6 అడుగుల పొడవు 8 అడుగుల వెడల్పు గల దిగుడుబావిపై తేలినాడట! ఒకప్పు డాతాడు శీర్షాసన పద్ధతిలోను వేరొకప్పుడు కూరుచున్న పద్ధతిలోను ఈ అత్యద్భుత కృత్యము నిర్వర్తించినాడట. కేవల వాస్తవిక దృష్టితో వక్కాణించిన ఈ గాథ నా కొకింత నమ్మిక కలిగించినది. అంతలోనే ఆతడొక తగరపు దుర్గాదేవి ప్రతిమ బయట పెట్టినాడు. అత్యద్భుత కృత్యము లొనర్చెడి ఒక మహిళ గాలిలోనుండి తన అరచేతిలో ఈ ప్రతిమ రూపొందజేసినదని అదే విధమయిన కేవల వాస్తవిక ధోరణిలో వెల్లడించినాడు. నే నా మహిళను గూర్చి ఒక చోట జదివితిని. ఇటువంటి కనుకట్టు వింతలతో లోకుల నానందింపజేయుటయే ఆమె వృత్తి. దానివల్లనే ఆమె తన జీవితయాత్ర కొనసాగించుకొనుచున్నది. అంతకన్న అత్యద్భుతశక్తులున్నవని ఆ స్త్రీ కూడ నెప్పుడు ప్రకటించి యుండలేదు. అటువంటి దుర్గాప్రతిమ బజారులో నెక్కడయిన నొక్క రూపాయి వెల యిచ్చి కొనవచ్చునుగదా యని నేనా శాస్త్ర విద్యార్థితో నంటిని. ఆతని కది తెలియక పోలేదు. కాని 'దానికిని దీనికిని నే మాత్రమును సంబంధము లేదు! నేనుద్దేశించిన విషయము మీరు తిన్నగ గ్రహింపలేరు!' అన్నాడాతడు.

ఇదే విధమైన వృత్తాంత మొకటి నా దినచర్యలో నుల్లేఖించుకొన్నాను. అదే నేనిచట ఉదాహరించుచున్నాను.

'వి. యన్. నిజముగ నెన్నదగిన వ్యక్తి. ఆతని నొకనాడు కళాశాలలో సందర్శించినాను. వి. యన్. అచ్చట వేదాంతోపన్యాసకుడు. టాజ్ మహల్ హొటలులో విందారగించుట కతనిని వెంటబెట్టుకొని పోయితిని. వి. యన్. బక్కపలుచని

2. Thc yoga Aphorisms of Patanjali P. 52.

వ్యక్తి. పొడగరి. పాశ్చాత్య వైఖరిలో నల్లని దుస్తులు ధరించినాడు. కాంతివంతములయిన విమల నేత్రములు. చెంపల నుండి ఒత్తుగా పెరిగిన శిరోజము లిరువైపుల వ్రేలాడుతున్నవి. మాటిమాటికిని కోటు జేబులోనున్న దువ్వెనతో వానిని సరి జేసుకొనువాడు. మొట్టమొదట మిక్కిలి ముక్తసరిగ ప్రసంగించినాడు. కేవలము శాస్త్రీయవైఖరి అవలంచినాడు. హోటలు వరకు కారులో సుదూరము ప్రయాణము చేసినను విందారగించు సమయముననుగూడ ఆతని బింకము సడల లేదు. వయస్సు 33 సంవత్సరములు. అవివాహితుడు. ఆతని యోగాభ్యాసమున కది మిక్కిలి సహాయ్యకారి. 11, 12 సంవత్సరములనుండి యోగ మభ్యసించుచున్నాడు. మూడు నెలల కొకమా రాహారవిధానము మార్చుచున్నాడు. (కర్మయోగి అయినను గాంధీ ఇదే మార్గ మవలంబించుచున్నాడు) వివిధ యోగ సిద్ధులు సాధించినాడు. వాని నిట వివరించుచున్నాను. సన్యాసులు మాత్రమే నివసించదగిన యొక యేకాంతగృహమున తలుపు గట్టిగా బిగించుకొని కేవలము ఇచ్ఛాశక్తివలన రెండు మూడు డిగ్రీల వరకు నెక్కువగ వేడిమి పెంపొందింపజేసినాడు. ఇది ఒకే సాధనలో రెండు మారులు జరిగినది. కాని అటు పిమ్మట మిక్కిలి నీరసపడినట్లును రెండు మూడు వారముల వరకును పక్కమీదినుండి లేవజాలని పరిస్థితి ఏర్పడినట్లును ఆతడే చెప్పినాడు. ఒకప్పుడాతడు నిశ్చలమానస్థితిలోనుండగ సర్ప మొకటి గదిలో ప్రవేశించి అటు నిటు తిరిగినదట! ఇది మనోవిభ్రాంతి కాదని యాతని దృఢనిశ్చయము. ఒకప్పుడాతని ఇంటి పొరుగున నొక కోతి కాయలేవో కొరికి తినుచున్నదట! కేవలము మానసికాజ్ఞతో దాని నాతడు నిషేధించి ఆపివేసినాడట! ఒకనా డతడు తన ఆచార్యుని ప్రాంగణమున నిలబడినాడు. అంతలోనే వట్టి దిగంబరులయిన అడవి మానినులు ముచ్వరు అకస్మాత్తుగ ఆ ఇంటి తలుపు దగ్గర ఆతని సమక్షమున సాక్షాత్కరించి, ఆ గురువుతో సంభాషించి అంతలోనే అదృశ్యులయినారట! వారాతని గురువును తమ సమావేశ వసతి కాహ్వానింపదలచి యచ్చటికి విచ్చేసిరట! యూరపు ఖండమున నయినచో నిట్టి వ్యక్తికి మతి చలించినదని నిశ్చయించెడివాడను. కాని ఇచ్చట ఇదియంతయు దైనికకార్యక్రమము!

ఇట్టి ప్రత్యేక విచిత్ర గాథ లొక్క యోగాభ్యాసకులకు మాత్రమే సంబంధించినవని భావించరాదు. గారడీ ప్రపంచముతో భారతదేశ మెన్నడు విడివడలేదు. సుప్రసిద్ధ భారతీయ దైనిక పత్రిక లన్నిటియందును ఇరువదియవ శతాబ్దపు ప్రగాఢ ముద్ర కానవచ్చుచునే యుండును. ఇక వెనుక పుటలలో నొక్క లినోటైపుతక్క మిగిలినదంతయు పదునారవ శతాబ్దముననే అచ్చొత్తింపబడినట్లు గోచరించును. ఆ పుటలలో వివాహ ప్రకటనలలో తలిదండ్రులు తమ పుత్రికాపుత్రుల మతము, వర్ణము, రంగు, పొడవు, విద్యాభ్యాసము ప్రత్యేకముగ అత్యుత్తమ జాతకములు ప్రకటింతురు. పైన పేర్కొన్న వానిలో నేదైన నొక విషయము విడిచిపెట్టవచ్చును. కాని జాతక ప్రస్తావన మాత్రముండి తీరవలిసినదే! వధూవరుల నిర్ణయమునందేకాక వివాహ ముహూర్త నిర్ణయమున గూడ నది యత్యావశ్యకము. భారత దేశమున నయిదు లక్షల గ్రామములలో మొత్తము జనాభాలో నూటి కెనుబది వంతుల మంది నివసించుచున్నారు. వీ రిప్పటికి ప్రతి ముఖ్య నిర్ణయమునకును తారకలమీద నాధారపడుచున్నారు.

దీనికి కారణమిది. భారత దేశమున నొక విధమగు పారిశ్రామిక విప్లవము కొనసాగుచున్నను, 17 వ శతాబ్దమున ఐరోపీయ దృక్పథమును కూకటివేళ్ళతో పెల్లగించివేసిన శాస్త్రీయ విప్లవ మెన్నడు పొడచూపలేదు. ఐరోపా ఖండమున తలఎత్తిన శాస్త్రీయ విప్లవము గారడీ కారణములకన్నింటికి భౌతికహేతువు లున్నవని నిర్దేశించినది. ఆ మహత్పరిణామ మేర్పడు వరకును యూరపు ఖండమును నేటి భారత దేశమువలెనే జ్యోతిషము మొదలుగాగల గారడీ విద్యలలో పడి పెనుగులాడినది. యూరపు ఖండమున శాస్త్రీయ విప్లవమునకు పూర్వము భావవిప్లవ మేర్పడినది. భారత దేశమున నిది తారుమారయినది. ద్వితీయ పంచవర్ష ప్రణాళికాకాలమున నిర్మించిన పెద్ద పెద్ద విద్యుత్కేంద్రములకు, ఉక్కు యంత్రాగారములకు నట్టడుగున గానుపించునదీ పురాతన భూతలమే. దాని లోతులెవరయిన పరిశీలించినచో వట్టి గారడీ మాయల దుర్వాసన బయలు వెడలును!

గాలిలో తేలిపోవుట

ఈ పరిస్థితులలో యోగ శాస్త్ర వాఙ్మయమున పేర్కొనబడిన భౌతికాతీతసిద్ధులనుగూర్చి అనుకూలముగగాని, వ్యతిరేకముగగాని విశ్వసింపదగిన సాక్ష్య సేకరణ మిక్కిలి దుష్కరమగుచున్నది. ఇది వివరించుటకే నేనొకించుక శాఖాచంక్రమణ మొనర్పరచవలసిన ఆవశ్యకత ఏర్పడినది. కొంత కాలమువరకు భారతదేశమున నివసించి ఇదే విధమయిన గారడీ వాతావరణముచే వ్యామోహితులయిన ఐరోపీయసాక్షు లితర విషయముల నెంతగా సూక్ష్మదృష్టి కలవారయినను, యోగమున కేవల మవిశ్వసనీయులగుచున్నారు. యోగముపై ప్రకటించిన పెన్గ్విను ప్రచురణలో ఎర్నెస్ట్ఉడ్ ఇట్లు వ్రాయుచున్నాడు :

"భూతలి మీదినుంచి కొన్ని యడుగులవరకు శరీరము గాలిలో తేలిపోవుట భారత దేశమున సర్వ సాధారణముగ నందరును అంగీకరించిన విషయము. ఒకప్పుడొక వృద్ధయోగి పండుకొనియున్నట్టుండి పొలములో ఆరడుగుల ఎత్తువరకును ఒక అరగంట వరకును గాలిలో తేలియుండుట నేనొక మారు చూచితిని. ఆ సమయమున ప్రేక్షకులు ఆతనికిని భూమికిని మధ్య కర్రలల్లాడించి ఆ యద్భుతము మిక్కిలి మెళకువతో పరిశీలించిరి."

నిజాయితీగల విద్వాంసు డిట్టి సందర్భమున ఇది ఎప్పు డెచ్చట జరిగినదో విస్పష్టముగ పేర్కొనవలెననియు, దొరకినంతవరకు సాక్షుల ప్రమాణ పత్రములన్నియు సేకరించియుండవలయుననియు మన మాశింతుము. కాని మన కీ

విషయమున 'నా కొకసారి జరిగిన సంఘటన యొక్కటి జ్ఞాపకమున్నది' అను వాక్య మొక్కటే ప్రమాణముగ గానుపించుచున్నది. సామాన్యముగ నిటువంటి వ్యవహారములనుగూర్చి రచించు గ్రంథకర్తల కందరికి నిది యొక అలవాటయినది. ఎర్నెస్ట్‌వుడ్ తాను వ్రాయుచున్నదాని కింకొక ప్రమాణముట్టంకించినాడు. అదియు పైన బేర్కొన్న సాక్ష్యము వంటిదే.

అది ఫ్రాస్కో మరైనీ రచించిన 'సీక్రెట్ టిబెట్' అను గ్రంథములోని విషయము. గాలిలో తేలిపోవు యోగాభ్యాసము తన పినతండ్రి కొనసాగించుచుండెవారనియు, ఆయన గాలిలో ఆకాశమధ్యమున తేలెడివారనియు, వారి కొరకై తాను అన్నము తీసికొనిపోవుచుండెడిదాననియు, తానెన్నటికి ఆ యద్భుతము విస్మరించలేననియు సిక్కిం మహారాజ కుమారి తన బాల్యానుభూతి ఫ్రాస్కో మరైనీతో జెప్పినదట.

గాలిలో తేలిపోవుట సాధ్యమా? అసాధ్యమా? అన్న సమస్య నే నిచ్చట చర్చించుచుండుటలేదు. సాక్ష్యస్వభావ మెట్టిది? అని మాత్రమే నేనడుగుచున్నాను. గాలిలో తేలుట భారతదేశము నందంతట సర్వ సాధారణముగ వాస్తవమని విశ్వసించుచున్నారని ఎర్నెస్ట్‌వుడ్ వ్రాసినది మాత్రము యధార్థము. ఖేచరీముద్ర ద్వారా ఇది అవలీలగా సాధింపదగిన సిద్ధియని భావింపబడుచున్నది. ఆధ్యాత్మికవిషయమున నధికారియని ఎలెయిన్ డేనియల్ అన్న ఐరోపీయ రచయితకు భారత దేశమున గొప్ప ప్రతిష్ఠ కలిగినది.

అతని కిటువంటి సిద్ధులన్నియు యథార్థములని గట్టి నమ్మిక ఏర్పడినది. ఎలెయిన్ డేనియల్ తేలిపోవు విషయమున నిట్లు వ్రాయుచున్నాడు: "ఖేచరీ ముద్ర సాధన కొంతవరకు సులభమయినదని భావింపబడుచున్నది. తరుచుగ నొనరించు వాయువిహారమున కీముద్ర ఉపయోగించుచున్నారు." కాని ఈ రచయిత కూడ అధ్యాయముగాని, శ్లోక సంఖ్యగాని పేర్కొనలేదు.

కొన్ని శతాబ్దములనుండి సర్వ సాధారణముగ నందరు యథార్థమని విశ్వసించిన విషయమున కొంత సత్యముండి తీరవలయునని ఎవ్వరయిన వాదించవచ్చును. కాని ఇది సరి కాదు. చీపురుకట్టలపై స్వారిచేయు మంత్రకత్తెల మూర్తులత్యంత ప్రాచీన కాలముల సంకేతములు కావచ్చును. కాని ఇవి జాతి స్మృతి చిహ్నములు కాజాలవు. ఈ సందర్భమున రెండు విషయములు ముఖ్యముగ నాలోచించవలసియున్నవి. తాము స్వయముగ సందర్శించినామన్న సాక్ష్యములన్నియు, ప్రత్యక్షములయినను, పరోక్షములయినను నొకే పద్ధతియనుసరించుచున్నవి. సాక్షులందరు మేము పసివారమయి యున్నప్పుడు, అనగా సామాన్యముగ 5, 9 సంవత్సరముల వయఃపరిమితిలో నిట్టి యత్యద్భుత సంఘటనల నవలోకించినట్లు నుడువుచున్నారు. ఇంతకుపూర్వము నేనొక భౌతిక శాస్త్ర విద్యార్థితో ప్రసంగించినట్లు పేర్కొన్నాను. అతడుకాక మరి ఇరువురితో ఈ విషయము సంప్రతించినాను. వారిలో నొకడు మనస్తత్త్వ శాస్త్ర వైద్యుడు. రెండవవాడొక వ్యవసాయదారుడు. వీరిరువురు వాయువిహార సంఘటన స్వయముగ సందర్శించినామని నాతో నన్నారు. వీరుభయులును తమ బాల్యమున నొక పల్లెలో జన సందోహ మధ్యమున నీ అత్యద్భుతము చూచినట్లు నుడివినారు. తేదీలేని ఎర్నెస్ట్‌ఉడ్ సాక్ష్యమొక్కటి తక్క వయస్సులో పెద్దవారి సాక్ష్యమొక్కటియు నాకింతవరకును లభింపలేదు. బాల్యవయస్సు విశ్వాసముల కాలవాలము. అందును భారతదేశము బాలకులయందీధోరణి ఎక్కువ. ఈవయసున కళ్ళకు గట్టినట్లు వర్ణించిన గాథ ఏదయినను, తరువాత తరువాత స్వయముగ తిలకించినట్లు భావించుట కవకాశమున్నది. ఇందువల్లనే ఇంతమంది కింతటి దృఢవిశ్వాస మేర్పడియుండవచ్చును.

ఇక రెండవ విషయము. భారత దేశమున వేర్వేరు యోగ పరిశోధనసంస్థలలో అనేక పరిశోధనలు జరుగుచున్నవి. వీనిలో నెచ్చటను వాయువిహారమునగూర్చిన పరిశోధన లెచ్చటను పేర్కొనలేదు. అంతేకాదు. నాతో నీ వ్యవహార మెవ్వరును ప్రస్తావించలేను. ఇది నా కెంతయు విడ్డూరముగ నున్నది. నే నిపుడు కొన్ని పరిశోధనలనుగూర్చి ప్రస్తావించుచున్నాను. వీని కొరకు మిక్కిలి విలువగల పరికరము లుపయోగించవలసి యున్నది. యోగాభ్యాసకుడొక తూనిక యంత్రముపై గూరుచుండి ఖేచరీ ముద్రాబంధమునమన్నప్పు డాతని శరీరభారమేమయిన క్షీణించినదేమో పరిశీలించుట ఒకసులభమయిన పరిశోధన పద్ధతి కాగలదు. ఈ సందర్భమున నాత డేమాత్రము పైకి లేవనక్కరలేదు. కొన్ని ఔనుల బరువు తగ్గినను భూమ్యాకర్షణశక్తిపై మానసమున కెంతటి ప్రాభవమున్నదో విస్పష్టముగ వెల్లడి కాగలదు. ఒక పరిశోధన సంస్థయందు నేనిదే విషయము సూచించితిని. కాని పరిశోధన ఫలితము కేవలము విరుద్ధముగ నున్నట్లు గోచరించినది. ఏది ఏమయినను అతి పురాతనమయిన ఈ వాయువిహార వ్యవహారము మిక్కిలి జాగరూకతతో పరిశీలింపదలచుకొన్నప్పుడు పైన సూచించిన విధానము మిక్కిలి ఓరిమితో అనుసరించవలసి యున్నది. ఎన్ని మారులు వైఫల్య మెదురయినను సరిఅయిన పరిస్థితులలో నొక్క పరిశోధన సఫలమయినప్పుడు మన ప్రాపంచిక దృక్పథముపై నొక గొప్ప విప్లవము ప్రారంభము కాగలదు.

సజీవభూతల సమాధి

నే నిచ్చట పేర్కొన్న కొన్ని లోపములున్నను, ఈ విషయమున నేకాగ్ర పరిశోధన కృషి జరుగుచున్నదని విన్నప్పు డెంతయు నుత్సాహము కలిగినది. ఈ విధములయిన పరిశీలనలకై నెలకొన్న సంస్థ లన్నింటిలోను ప్రప్రథముగ బేర్కొనదగినది బెంగుళూరుననున్న యావద్భారత మానసికారోగ్య సంస్థ. రెండవది లోనవాలాలో నున్న స్వామి కువలయానందుని యోగ పరిశోధన సంస్థ. బొంబాయిలో సముద్రతీరమున నీ స్వామి సంస్థాపించిన ఆరోగ్య కేంద్ర మొకటి యున్నది. ఈ సంస్థ కార్యకలాపములపై నా కంతగ నమ్మిక కుదరక పోయినను, ఆయన పరిశోధనల విషయమున నా కిట్టి దృక్పథ మేర్పడలేదు. లోనవాలా పూనా సమీపమున సహ్యాద్రిపై ఒక సమున్నత భూభాగమున నున్నది. ఇది మిక్కిలి ప్రశాంతమగ

ప్రదేశము. గ్రీసు మనోహర పరిసరములవలె నాహ్లాదకరము. ఇచ్చట సాగరతరంగ శీతల మారుతము లెల్లప్పుడు వీచుచుండును. ఈ సంస్థ కొక ఏబది యెకరముల భూభాగము కలదు. దానిలో కొండలు రెండున్నవి. స్వామి కువలయానందుని స్వీయాశ్రమమును అందేయున్నది. ఇక యోగ పరిశోధనాగార పరికరములన్ననో అత్యంత ప్రశస్తములు. అసత్య నిరూపక యంత్రము, శ్వాస పరిశీలక యంత్రము, ఎక్స్‌రే విభాగము మొదలుగాగల పరికరములున్నవి. అందొక గ్రంథాలయము, వాఙ్మయ విభాగము కూడ నున్నవి. దీనియం దయిదుగురు విద్వాంసులు పది సంపుటముల యోగ విజ్ఞానసర్వస్వము సంకలనమున నియుక్తులై నిరంతర కృషి కొనసాగించుచున్నారు.

ప్రస్తుతము యోగ పరిశోధనకై ఎన్నుకొన్న ఒక వ్యక్తితో స్వామీజీ నాకు పరిచయము కలిగించిరి. ఆ మానిసి అంతగ పొడగరిగగాని, పొట్టిగగాని కానుపించలేదు. మధ్యమ వయస్కుడు. కండలుదేరిన శరీరముతో వస్తాదువలె నున్నాడు. మన్నన మర్యాద లెరిగిన వ్యక్తి. సుతీక్ష్ణమయిన కనుదోయి. యోగాభ్యాసకుల కందరికిని నీ లక్షణముండుట నేను కనుగొంటిని. పల్లెపట్టులలో ఉత్సవములతో యోగ ప్రదర్శనము లిచ్చుచు, సంచారము చేయుట అంతకుమును పాతని కలవాటు. కువలయానందస్వామి తమ పరిశోధనకొరకై ఇటువంటి వారి నన్వేషించుచున్నప్పుడు ఒకనా డతనిని గుర్తించి ఆశ్రమమున జేర్చి తమ పరిశోధన కుపయోగించు గినీపిగ్ రూపమున నుపయోగింప దొడగిరి. ఆత డిప్పుడు సుదీర్ఘ కుటిల శ్వేతజటాధారియగు స్వామిని తన గురుదేవమూర్తిగ నారాధించుచున్నాడు. మేము పరిశోధనాగారము తిలకించు సమయమున నాతడు స్వామి అజ్ఞ లత్యంత ప్రగాఢ భక్తితో ఔదల ధరించుచు మిక్కిలి అణకువతో ఒక పెంపుడు కుక్కవలె అనుసరించినాడు. తన యోగపాటవవంతయు స్వామి యనుగ్రహభాగ్యమువలననే లభించినదని అతడు నాతో నన్నాడు. పరిశోధనాగార పరిశీలన ముగిసిన పిదప యోగ ప్రదర్శన మారంభింపవలసినదని స్వామి అతని కాజ్ఞాపించినారు. ఆ యోగి దాని కానందించి శీఘ్రమే లోనికిపోయి ఒక నిమిషములోనే మరలివచ్చినాడు. అతడప్పుడొక గౌను ధరించి సర్కసు వస్తాదు రంగమున ప్రవేశించినట్లు బిరుదపతకముల మాలతో మా సమక్షమున నిల్చుచున్నాడు. గౌను తొలగించిన పిమ్మట అతని శరీరము వ్యాఘ్రచర్మావృత్తమై పొడకట్టినది. హస్తమున చిత్రకంకణము లల్లల్లాడినవి. అతని అకృతి యత్యద్భుతము. నల్లని కనుదోయి సముజ్జ్వలమై తళతళ లాడినది. మున్ముందుగ శాస్త్రీయ యోగబంధము లారంభించినాడు. అతడు మొట్టమొదట ప్రదర్శించినది ఉడ్డియాన బంధము. దీనివలన ఉదర కండరములన్నియు లోని కక్కళింపబడి ఒక చిన్న గుహావంటి దేర్పడును. ఈ బంధమున నున్నప్పు డుదరభాగము మాంసవిహీనమయిన వటి, అస్థి పంజరమువలె భీకరముగ గన్పట్టును. దీనివలన ఉదరమున సుదీర్ఘ కండరములన్నియు పైకి చొచ్చుకొనివచ్చి నాభిచుట్టును పరిభ్రమించును. నాభి, వెన్నుపూస కటి సన్నిహితమున నక్కళింపబడును. ఇది చూచువారి కత్యద్భుతముగ నుండుటయేగాక, యొకింత దుస్సహముగ గూడ నుండును. మిగిలిన శీర్షాసనాది బంధములందు శరీరావయవములన్నియు నొండొంటితో సంశ్లిష్టములై, నావికుల చిక్కుముడివలె గానగును. అ యోగి ఆపైన తన వక్షస్థల కండరముల అత్యద్భుతశక్తి ప్రదర్శించెను. ప్రాణాయామమువలన నాతనికట్టి ప్రబలశక్తి లభించినది. గట్టి ఉక్కు తీగ నొకదాని నాతడు తన శరీరము చుట్టును గట్టిగ బిగించి బంధించి ఒక్క మారుగ గాలిలోనికిచీల్చి దానిని తుత్తునియలుగ దెంపివేసినాడు. ఆపైన నాతడు దాదాపుగ నొక యంగుళము మందమున్న ఇనుప గొలుసు గుండెకు చుట్టుకొని అచ్ఛాదనలేని తన పాదము దానిలోనికి పోనిచ్చి నెమ్మదిగా తెంపివేసినాడు. ఆ తీగ, గొలుసు నేను భద్ర పరిచితిని. వాని నిర్మాణమున నెట్టి లోపమును గానుపింపలేదు. ఒక గొప్ప ప్రదర్శనమున మహా బలశాలి యెవ్వడయిన నిట్టి యత్యద్భుతకృత్యము నాచరింపవచ్చును. కాని యాతని కట్టకడపంటి ప్రదర్శనము పైవానికన్న విశిష్టమువమయినది. ఆ యోగి అప్పుడే కోసిన యొక తాటియాకు తీసికొనివచ్చి దానిని రెండుమారులు మడిచినాడు. ఆపైన తన తర్జనీమధ్యమాంగుళులు రెండును నొక కత్తెరవలె రూపొందించి ఆ తాటియాకు చక్కగ రెండు తునియలుగ ఖండించినాడు. వాని యంగుళుల కెముక పుష్టి, దార్ఢ్యమునున్నవి. కాని యవి బండబారినట్లు కానరాలేదు. తన జీవశక్తి యంతయు ఆ రెండు వేళుల మధ్య కేంద్రీకరించినానని అతడా యత్యద్భుతకృత్యము వివరించినాడు. కండరములమీదనేగాక లోలోపలి కండలపై సంపాదించిన ప్రబలశక్తి కీ కృత్యములు చక్కని తార్కాణములు. బొంబాయిలోనున్న విఖ్యాత మనస్తత్త్వశాస్త్ర వైద్యుడొకడు నాకొక అత్యద్భుత సంఘటన వెరిగించినాడు. ఒక యోగి తన రహస్యావయవాగ్రమున కొక తీగతో ఇరువది పౌనుల బరువు కట్టుకొని దాని ననేక ప్రేక్షకుల సమక్షమున పైకెత్తినాడు. బొంబాయి డాక్టరా సంఘటన కొక ఛాయాచిత్ర మెత్తినాడు. ఆఫోటోలో గానవచ్చిన వ్యక్తి పొడగరి. బక్కపలుచగనున్నాడు. ఒడలికంతటికి విభూతి అలదుకొన్నాడు. జుట్టు జడలు కట్టినది. దృష్టి గంభీరము, భీకరము. అతడు భంగు మొదలగు మాదకద్రవ్యము లుపయోగించుచున్నాడని బొంబాయి డాక్టరు నా కెరిగించినాడు. తన గురువర్యుని శిక్షణమున నిట్టి మాదకద్రవ్యసేవ ముఖ్య విషయమని ఆ యోగి బొంబాయి వైద్యునితో జెప్పినాడట! హఠయోగాభ్యాసమున భంగు చాల ప్రముఖ పాత్ర వహించుచున్నది. చిట్టచివరి యుపదేశమునకు బూర్వము డాక్టరు బెర్మార్డ్ గురు వాతనిచే భంగు సేవ చేయించినాడు.

సశేషం

ఎన్‌కౌంటర్ పత్రిక సౌజన్యముతో

మిత్రమా!

శ్రీ 'చారుబాల'

బ్రతుకుబాటల సాగిపోయెడి
మిత్రమా! విశ్రాంతి వేళల
తలచుకొను మెప్పుడైన నొకపరి
మనసులో నీ మిత్రమున్!

ఎచట నుంటివో ఏమి చేయుచు
నుంటివో మరి, తలపు లేమో
యనుచు నెప్పుడు నిన్ను గూర్చి
యెంచుకొనుచుందున్.

నిండు జాబిలివోలె నెచ్చెలి!
నీవు నిలిచినయంత మదిలో
పొంగిపొరలును హృదయవార్నిధి
స్నేహ మాధురిచే

గానమందలి శక్తి యేమో
ఈశునందలి మహిమ యేమో
స్నేహమందలి తీపియేమో
వాగతీతముగా!

ఉజ్జ్వలమ్మగు నుదయమునకై
కాంక్ష సేయుట కంటె మదిలో
నేమి చేయగ నేర్తు నీకై
ప్రాణసమ మిత్రమా!
చతుర మేధాసంపదలచే
పూతచరితా దీప్తికలనన్
జగతినంత ప్రకాశవంతము
చేయుమంతే మదభిలషితము!

ఎచట నున్నను ఏమి చేయుచు
నున్న, నీదగు భావి నెప్పుడు
గాంచుచుందును హర్షపూరిత
హృదయ నేత్రములన్!

రామః సత్యపరాక్రమః

శ్రీ ఆదిభట్ల వేంకటరమణ

శ్రీరాముడు సత్యపరాక్రముడని వాల్మీకి చాల సందర్భములలో పేర్కొనియున్నాడు. సత్యమే పరాక్రమముగాగల వాడనియు, సత్యముకంటె పరమగు దివ్యస్థానము నాక్రమించిన వాడనియు వ్యాఖ్యాతలు తమ మేధాశక్తి ననుసరించి వివరించిరి. పై రెండు విషయములనుబట్టి చూడ రామాయణమున ఆర్షకవి వాక్కు శ్రీరాముడు భగవంతుడని ధ్వనింపజేసినదనుట స్పష్టము. "సత్యపరాక్రముడ"ను పదమునకు శ్రీరాముని సమస్త సద్గుణసంపన్నతనంతను చెప్పగలిగిన శక్తిని వ్యాఖ్యాతలు ప్రసాదించిరి. మానవధర్మాచరణ కవసరమగునంతవరకా పదము శ్రీరాముని సకలగుణ సంపూర్ణత్వమునే విశదపరచుచున్నది.

లోకములో నన్ని గుణములు సత్యము నాశ్రయించినవి. సత్యనిష నూనినవానినే సద్గుణములన్నియు నాశ్రయించి యుండుట యుదాత్తనాయకునిలో మనము గమనించి యున్నాము. శ్రీరాముని దివ్య శక్తియందు, మానవోచితము లగు గుణములయందు ఆత్మశక్తియందు ఆ సత్యపరాక్రము డను పదము మిక్కిలి యర్థవంతము. శ్రీమన్నారాయణుడు ధర్మ సంస్థాపనకై లోకమందవతరించెననుడు, మానవ ధర్మము నాచరణలోనుంచి ప్రవర్తన కాదివ్యపురుషుడు ఒరవడి పెట్టెననుడు, కార్యాకార్యములయందు పురుషులను నియోగింప జేసెడి సామాన్య మానవగుణములచే దివ్యత్వము నాభాసింప జేసినాడు. కావున శ్రీరాముని సత్య పరాక్రమము తన్మాత్రమునకే సమన్వయము చేసికొనవలసియున్నది. "శ్రీరాము డెట్టివాడు?" అని ప్రశ్నించిన "సత్యపరాక్రముడ"ని చెప్పిన చాలును. లోకమందేదివ్యగుణసంపద మానవత్వమున కవసరమను కొందుమో, ఆ గుణము లన్నిటిని ఏకరువు పెట్టుటకు బదులు సత్యపరాక్రముడని చెప్పుట చాలునని ఆర్షకవిమతముకానోపు నని వ్యాఖ్యాతలు సూచించిరి.

వశ్యవాక్కులగు కవులనే మహాకవులందురు. వాల్మీకి కాళి దాసాదులగు నిద్దరో, ముగ్గురో మాత్రమే మహాకవులుగా లెక్కింపబడుచున్నారని ఆనందవర్ధనాచార్యులనిరి. సకలగుణ సంపద్వరిష్ఠునిగా నిర్వచించెడి ఏకైక పదమగు 'సత్యపరాక్రము'డను పదమునే వాడుటలో వాల్మీకి వాక్శక్తికేముందు నమస్కరింపవలసియున్నది.

ధర్మసంస్థాపనకొఱకే మహాత్ము లవతరింతురని విను చున్నాము. శంఖ చక్రానంతులతో కూడిన శ్రీ మన్నారాయణుడా పరికరములు లేనివాడై భూలోకమున నిక్ష్వాకు వర్ధనుడయ్యెను. (విష్ణోరర్థం మహాభాగం పుత్ర మైక్ష్వాకు వర్ధనమ్) అని రామ జనన సందర్భమున వాల్మీకి చెప్పెను. ఇటు శ్రీ మన్నారాయణుడు కేవల ధర్మసంస్థాపనకే భూలోకమం దవతరించుట లేదు. దుష్ట శిక్షణ, శిష్టరక్షణలు మాత్రమే ధర్మ సంస్థాపన కాజాలదు. మానవత్వమున కవసరమగు సత్యనిష్ఠ, పితృవాక్పాలనము, ప్రజాధర్మపరీరక్షణము, రాజధర్మపాలనము, ప్రజాధర్మ పరీరక్షణముమందాసక్తి, శరణాగతరక్షణము మొదలగు ఉదాత్తగుణ సంపత్తి రామదేవునిలో మూర్తీభవించినది. కావుననే యతడు పురుషోత్తముడన బరగినాడు. ఇక నట్టి పరంధాముని సత్యపరాక్రమమును వ్యక్తము చేయ బూనుట ఆ రామదేవునిపై గౌరవభావము నూదియనియే తలంపవలెను.

శ్రీరాముని అసాధారణగుణసంపదను శాణఘృష్ట మొనర్చినవాడు విశ్వామిత్రుడు. అతడు లౌకికదృష్టికి శ్రీరాముని దిద్దితీర్చినవాడు. అందుల కతడు సాధనమాత్రుడు కూడ. అతడు దశరథునియొద్దకేతెంచి ఊనషోడశవర్షప్రాయుడగు రాముని తన యజ్ఞ విఘాత మొనర్చు రాక్షసులను వధించుటకు పంపగోరినాడు. "రాజా! నీ కుమారున కన్ని విధముల శుభము చేకూర్తును. దాన నాతడు ముల్లోకముల కీర్తిగాంచగలడు.

శ్లో. శ్రేయశ్చాస్మై ప్రదాస్యామి బహురూపం న సంశయః
త్రయాణా మపి లోకానాం ఖ్యాతిం గమిష్యతి.

అని చెప్పినను దశరథుడు పుత్రమోహాతురుడై రాజీవలోచనుడగు రాముని విడువజాలననినాడు. అది విని శ్రీరాముని దివ్యశక్తి నిగూఢముగా సూచింపదలచి కౌశిక ఋషి "రాజా! రామచంద్రుడు మహాత్ముడు. అతడు సత్యపరాక్రముడు. నే నా విషయము నెరుగుదును. నేనేకాదు. మహాతేజుడగు వశిష్ఠుడు, ఇతర తపస్వులుకూడా ఎరుగుదురు.

శ్లో. అహంవేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమం
వశిష్ఠోపిమహాతేజాః యేచాన్యేతపసి స్థితాః.

అని రాముని దివ్యశక్తిని కొంతవరకు వ్యక్తపరచినాడు. కాని దశరథునకు రాముడు గాదిలిపట్టికదా? త్రోవబోవు జడదారికి సుకుమారగాత్రుని తన పుత్రుని వశపరుపగలడా? పుత్రమోహాతురుడగు వృద్ధరాజు ఆ మాటలను వినడు. దానిపై విశ్వామిత్రుడు చివరి మాటగా "రాజా! ఇంకొకమాట వినుము. భూలోకములో ధర్మాభివృద్ధియు, నిరుపమాన యశస్సు, స్థిరముగా నుండగోరితివేని రాముని నా వెనుక వంపుము" అని కోరినాడు.

ఇంక శ్రీరాముడు కుశికనందను నాజ్ఞతో తాను గావింపవలసిన ధర్మాచరణకు బూనుకొనినాడు. దుష్టశిక్షణ, శిష్ట

రక్షణయే తన ప్రస్తుత కర్తవ్యము. ఋషి ధర్మమును భగ్న పరచు దుష్టచారిణి తాటకపై విఘ్నేశ్వర పూజగా విల్లెత్తినాడు. రామ కృష్ణావతారములలో స్త్రీవధారంభములు శిష్టరక్షణకై అచ్చు వచ్చినవి. గో బ్రాహ్మణహితమునకు తాటకను వధింప శ్రీరాముని తొలిసారిగా కౌశికుడు నియోగించినాడు. (గో బ్రాహ్మణ హితార్థాయ జహి దుష్టపరాక్రమామ్) ఆడుదానిపై తొలిసారిగా ధనువెత్తవలసి వచ్చినందుకు లోకమునకు గలిగెడి సందేహము తీరునట్లు కౌశికునిచే రాముడీపని చేయించెను. ప్రజా హితమునకై బహుపుత్రులు గలిగిన స్త్రీనైనను పాలకుడు వధించి శాంతిగూర్పవలెనని విశ్వామిత్రుడు సప్రమాణముగ స్థిరపరచెను. గాధిసూనుడు చెప్పినట్లు చేయుమని దశరథుడు తన్ను నియోగించినాడు. గురువుల ఆజ్ఞాపాలనమే తన కర్తవ్యమని "గో బ్రాహ్మణ హితమునకు, దేశ క్షేమమునకు దుష్టచారిణి తాటకను చంపుచున్నాను" (గో బ్రాహ్మణ హితార్థాయ దేశస్యాస్యసుఖాయచ) అని తొలిసారిగావింట నిషువు తొడిగినాడు. అతని ప్రజాధర్మపాలనము రావణసంహారమువరకు పూర్తిగా సాగినది.

దివ్యాస్త్రశక్తి పూర్తిగా రామునకు వశమయినది. కౌశికుడు తన యస్త్ర శక్తినంతయు రామునకు వశపరచి "రామా! నీకు మంగళమగుగాక. దండచక్రము, ధర్మచక్రము, కాలచక్రము మున్నగునమోఘాస్త్రముల నిచ్చుచున్నాను. వాని మూలమున నిన్ను దేవతలు కూడ చెనకలేరు" అనగా రాముడు శుచియై గ్రహించి మునినిగాంచి ఆ యస్త్రముల ఉపసంహార శక్తిని కూడ దయచేయగోరినాడు. అస్త్రము నుపసంహరింపనచో దాని తీవ్రశక్తి లోకమునకు బాధ కలిగించదు. అస్త్రశక్తి ప్రయోగించినవాని యధీనమున లేకున్న లోకమే నాశనమగును. దేశ క్షేమమునకు, ప్రజాహితమునకై విల్లెత్తుటలో రాముడు దృఢప్రతిజ్ఞుడు. ఈ శాంతి ప్రయోగమును రాముని చేతనే వాల్మీకి చేయించినాడు. అందు శ్రీరాముని లోకానుగ్రహకాంక్ష వ్యక్తమగుచున్నది. శ్రీరాము డడిగినంతనే విశ్వామిత్రుడు అస్త్రముల ఉపసంహార శక్తిని కూడ నిచ్చినాడు. శిష్యుడు అడుగకపోయినను దివ్యాస్త్రముల ఉపసంహారమును తప్పక యీయవలయును. శ్రీరాముని ప్రాక్తనదివ్యశక్తి, చిత్తశుద్ధి యెట్టివోకాని భృశాశ్వదత్తములు దివ్యాయుధము లన్నియు నాతనియొద్ద మోకరిల్లినవి. రాఘవుల వంశానుగతముగా సంక్రమించెడి జృంభకాస్త్రములు రామదేవుని యెదుట సాగిలపడినవి. "ఇమేస్మపరమోదారాః కింకరా స్తవ రాఘవ" అని కింకర భావము నూని రామాజ్ఞ వేడినవి.

ఇక రాముడు వినయమునకు సౌజన్యమునకు నిధానము. జనకుడు శంకరచాపమును సభలోనికి దెప్పించెను. రాము నొకమారు ధనువును పరికింపుమని కౌశికుడు హెచ్చరించెను. రాము డా చాపముదరికి సింహకిశోరమువలె వెళ్ళి మందసమును తెరచెడి నాడు. ధనువు నెక్కిడుటకు గురు ననుజ్ఞ కోరినాడు.

శ్లో. ఇదంధనుర్వరం బ్రహ్మన్ సంస్పృశా మీహపాణినా
యత్నవాంశ్చ భవిష్యామి తో లనే పూరణేఽపివా.

రామున కా ధనువు సులభ సాధ్యమని తెలియకపోలేదు. కాని దానిని తాను నిమేషమాత్రమున ఎక్కుపెట్టగలననలేదు. ప్రశాంత వినయవచనములతో "ప్రయత్నింతు"ననినాడు. ఎక్కిడినంతనే అది విరిగిపోయినది. దాని కెవ్వరేమి చేతురు? ఆ దివ్యమూర్తి సౌజన్యము నాది కవి అంతసునిశితముగ మలచినాడు.

శ్రీరాముడు సోదరవాత్సల్యమును, రాజనీతిని చక్కగ పాలించినాడు. ధర్మము దానిఫలమగు సంపత్తి శ్రీరాముని నుండి కలిగినవి. భరతుడు రామునిగొనిపోవ చిత్రకూటమునకు వచ్చుచున్నాడు. లక్ష్మణుడు ఆ పరివారపాదపరాగము గాంచి భరతుడు ససైన్యుడై తమ్ము వధింపవచ్చుచున్నాడని తలచి రాముని యుద్ధమునకాయత్తము కమ్మని హెచ్చరించెను. అప్పుడు రాముని మాటలను చదివి తీరవలయును. లక్ష్మణుని మాటలువిని రాముడు ప్రశాంత గంభీరుడైనాడు. కుపితుడై భరతునిపై దండెత్తబూను లక్ష్మణునిచూచి శాంతపరచుచు "తమ్ముడా, మేటి విలుకాడు ప్రాజ్ఞుడు నగు భరతుడు ఇతర ప్రేరణలేకయే మనపై వచ్చిన ధనుః ఖడ్గములతో పని యేమి? ఇంతవఱకు పితృవాక్యమును పాలించి భరతునిప్పుడు వధించితినేని "తండ్రి భరతునకు రాజ్యమునీయు మనగా రాముడాతని వధించి రాజ్యము నపహరించెనని" లోకు లనుమానింపరా? అట్లు సంక్రమించిన రాజ్యము నాకేల? పురుషార్థములను, భూమిని సంపాదించుట నాకు కష్టసాధ్యము కాదు. అయినను అధర్మ మూలమున దేవేంద్ర పదవి కలిగినను తిరస్కరింతును." అనినాడు.

శ్లో. ధర్మ మర్థం చ కామంచ పృధివీం చాపి లక్ష్మణ
ఇచ్ఛామి భవతా మర్థే ఏతత్ప్రతిశృణోమి తే
నేయం మమ మహీ సౌమ్య దుర్లభా సాగరాంబరా
నహీచ్ఛేయ మధర్మేణ శక్రత్వ మపి లక్ష్మణ!

ఇట "అధర్మేణ" అనగా "శస్త్ర మూలమునకాక" అని వ్యాఖ్యానము. వింటిసహాయమునకాక వేరొక నెపమున కలిగిన యింద్రత్వమును కూడ వలదనుచున్నాడు. తన సెలవింటి బద్ధ శత్రువుల యెదుట వంగుటయే తన యవతారమునకు ఫలమని రాముడు తన ఆత్మప్రత్యయమును కూడ సూచించుచున్నాడు.

శ్రీరాముడు భార్యానుజ సహితుడై చిత్రకూటమునుండి దండకారణ్యమునకు పోవునప్పుడు త్రోవలో తన ధర్మ ధనువును సంధించియేయున్నాడు. సాధారణముగా యుద్ధములో వీరులు శత్రువుల యెదుటనే సజ్యీకృతకార్ముకులగుదురు. రాక్షస సంహారమే రామమూర్తి కర్తవ్యము. రాక్షసుల నాహుతి చేయుటకే కరాళజ్వాలాభీలముగ ఆతని విల్లు సిద్ధముగ నున్నది. దండకారణ్యము శోభావంతమగు తాపసాశ్రమమండలము చేరినంతనే శ్రీరాముడు తన వింటిని సడలించినాడని ప్రత్యేకముగా పేర్కొనినాడు.

శ్లో. సదృష్ట్వా రాఘవ శ్శ్రీమాన్ తాపసాశ్రమ మండలం
అభ్యగచ్ఛన్మహాతేజాః విజ్యం కృత్వామహద్ధనుః.

ఇట్లు రాముని ప్రతి చర్యలోను ధర్మ సూక్ష్మతను, సత్య పరాక్రమమును ఆర్షకవి వ్యక్తపరచినాడు. శాంతాశ్రమభూములలో హింసాసాధనములకే పనిలేదు. కావున రామచంద్రుడు వింటి నారి నెక్కుడించినాడు. ఇందువలన ఆ రాఘవునకు ఆశ్రమ భూములపైగల భక్తి సువ్యక్తమగుచున్నది.

రాఘవుడు గొప్ప ధర్మ సూక్ష్మజ్ఞుడు. అతని రక్కసి మూకలవేట దండకారణ్యములో విరాధవధతో ప్రారంభమైనది. ఆ రక్కసి నెన్ని ఆయుధములతో ప్రహరించినను వాని ప్రాణములు పోకున్నవి. పీదు మిక్కిలి విరాధుడు సీతా రామ లక్ష్మణుల నెత్తుకొనిపోయి కాకులుదూరని కారడవిలో పడవేయ నున్నాడు. తపస్సు చేసిన దానవుడుకాన ఆతడు ఆయుధములచే చావడని గ్రహించి, దనుజుని గోతిలో పూడ్చుమని తమ్మునకు హుకుము నిచ్చినాడు. ఆ మాటలు విన్నంతనే విరాధునకు దివ్య జ్ఞానము కలిగినది. విరాధుడు రాముని కీర్తించి తన్ను భూస్థాపితుని చేయ గోరినాడు. భూస్థాపితులగు వారికి అక్షయ లోకములు కలుగునని దానవుల నమ్మకము, సదాచారమునై యున్నవి.

శ్లో. అవటే చాపి మాం రామ ప్రక్షిప్య కుశలీ వ్రజ
రాక్షసాం గతసత్వానాం ఏషధర్మస్సనాతనః
అవటే యే నిధీయంతే తేషాంలోకా స్సనాతనాః.

ఈ యర్థమును రాము డెరిగిన తజ్ఞుడుగాన విరాధుని పూడ్పించుట కాజ్ఞనిడినాడు. ఈ ధర్మసూక్ష్మత విరాధునకే అచ్చెరువు కొలిపినది. మనకుకాకమానునా?

తరువాత శ్రీరాముడు జనస్థానరక్షణకై దీక్ష వహించి శరభంగాశ్రమమున దుష్టశిక్షణకు మాత్రమే తాను ధనువెత్తెదనని, రాక్షసులను సమూలముగా నాశనము చేతునని ప్రతిన బూనెను. ఆ యాశ్రమమున దుష్ట రాక్షసులచే పీడితులగు మునులను చూచినాడు. ఆ ఋషులందరు తమ బాధను సర్వలోక శరణ్యుడగు రామునాశ్రయించి, చెప్పుకొని తమ తపస్సులు నిర్విఘ్నము సాగుటకు సాయపడుమని కోరినారు. రాఘవుడు కరుణా సముద్రుడు "ఆపదా మపహర్తారం దాతారం సర్వ సంపదా" మని భక్తులచే నుతిగన్నవాడు. "మీకు రాక్షసులవలన బాధ తొలగించుటయే నాకు విధి. నేనందులకే యడవులకు వచ్చితిని. దైవికముగా తండ్రి మాట పాలింపవలసి వచ్చినది. తపస్వి జన విరోధులగు మాంసాశనులను చంపగోరుచున్నాను. నా శక్తిని, నా తమ్ముని శక్తిని తపోధను లెల్లరు కనుగొందురు గాక".

శ్లో. తపస్వినాంరణే శత్రూన్ హంతు మిచ్ఛామి రాక్షసాన్
పశ్యంతు వీర్యం ఋషయ స్సభ్రాతు ర్మే తపోధనాః.

అని ఋషులకు రాముడు అభయమిచ్చి తన ఆర్తత్రాణ పరాయణత్వమును వ్యక్తపరచినాడు.

శ్రీరాముని యీ తీవ్రప్రతిజ్ఞ సీత విన్నది. "రక్కసి మూకలతో తమ కెందు కీ తేనిపోని విరోధము? వారు తమకే యపకారము చేయకయే వారిపై కత్తికట్టుట రామునకు తగని పని" అని సీత భావించినది. ఆమె భావించుటకాదు. "వైరము లేకయే పగబూనుట రామునకు తగునా" యని ధర్మసందేహము మనకేల కలుగరాదు? అందుకే సీతచే మహాకవి శ్రీరాము నట్లడిగించినాడు. "ప్రభూ! అసత్యభాషణము, పరదారాపహరణము, వైరములేకయే పగబూనుట ఉత్తరోత్తర బలీయములగు దోషములని పెద్దలందురు. మొదటి రెండుదోషములులేని మీయందు వైరములేకయే పరహింసచేయబూనుట మహారౌద్ర వ్యసనము. దానిని పామరు లాచరింతురు. ధర్మమునకు, సత్యమునకు నీవాధారభూతుడవు. ఇట్టి శక్తి జితేంద్రియులయందే యుండును. కాన అకారణవైరముచే కష్టము తెచ్చుకొనుట తగునా?" అని సీతాసతి తన మనస్సులోని యుద్దేశము రాముని యెదుట వ్యక్తపరచినది. రాము డా వచనము నాదరించినాడు. 'జానకీ! నీవు ధర్మజ్ఞురాలవు. ఫలమూలచ్ఛదనాంబుభక్షులై యడవిలో తపముచేసికొనువారిని బాధించువారు దేశోపద్రవ కారకులు. అట్టివారిని రాజెట్లు ఉపేక్షించును? దుష్టుల నాశన మొనర్చినగాని శిష్టుల రక్షణ సాగుటెట్లు? వర్ణాశ్రమ ధర్మ రక్షణ రాజుల కర్తవ్యముకదా? భరతుని పంపున నేనా ధర్మమును నిర్వర్తించుచున్నాను. మునులను బాధించు రాక్షసులు నాకు బద్ధశత్రువులు. సత్యమే సర్వకాలములయందు నాకు ప్రియమని నీ వెఱుగుదువు. నా ప్రాణములను, నిన్ను, లక్ష్మణునైన విడుతునుగాని ఆడి తప్పను. అందును మునులకిచ్చిన మాట తప్పుదునా ?

శ్లో. రక్షనస్త్వం సహభ్రాత్రా త్వం నాథా హి వయం రణే
అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతేసలక్ష్మణాం
నతు ప్రతిజ్ఞాం సంస్కృత్య బ్రాహ్మణేభ్యో విశేషతః.

అని సీతకు కలిగిన సందియముదీర్చి "తా నేధర్మమును సంకల్పించెనో ఆమె కూడ అదియే ధర్మమును సంకల్పించవలసి యున్నదని సూచించినాడు. ఇంతటితో శ్రీరాముని దృఢనిష్ఠ పరాకాష్ఠ నొందినది. ఇందు "రాజు, తన కపకారము చేయకున్నను ధర్మమునకుగాని, తత్కర్తలకుగాని హాని సంభవించునపుడు దుష్టులను వధించి ధర్మరక్షణ గావింపవలెను. అది పాపకారణముకాదను నీతిని రాము డిందు మనకు బోధించినాడు. ఈ భావమునే కాళిదాసు శాకుంతలములో "ఆర్తత్రాణాయ వశ్శస్త్రం, నప్రహర్తు మనాగసి" అను శ్లోకరూపమున వ్యక్తపరచినాడు.

తదుపరి శ్రీరాముని సత్యపరాక్రమము, ఔదార్యము ఖరాయోధనమందు గమనింపదగ్గది. శూర్పణఖాపరాభవము జరిగినతరువాత సమయజ్ఞుడగు రాముడు రాక్షసప్రమాదమును గుర్తించెను. ఇంతలో రక్కసి మూకల పెడబొబ్బలు వినబడుచున్నవి. "లక్ష్మణా! బహుయోధులగు నిశాచరులు మనపై వచ్చుచున్నట్లున్నది. నీ వొక్కడవే యీ రక్కసి మూకలను నుగ్గాడ గలవు. నీవు శూరుడవు, బలవంతుడవు. శంకలేదు. కాని, నేనే వీరినెల్ల వధింపదలచితిని.

శ్లో. త్వంహి శూరశ్చబలవాన్ హన్యా హ్యేతా న్న సంశయః
స్వయంతు హంతు మిచ్ఛామి సర్వానేవ నిశాచరాన్.

అని రాముడనినాడు. ఇట ఖరదూషణ త్రిశరాది పదునాలుగు వేవురు దానవుల వధను కాలరుద్రుడై రాముడొక్కడే చేయనున్నాడు. అది సీతా లక్ష్మణులు చూడరాదు. అంతేకాక ఖరాది దానవ వధ, వారి శాపవిముక్తి శంకరుడనినట్లు రాముడొక్కనివలననే

జరిగితీరవలయును. లక్ష్మణుడు రామాజ్ఞను శిరసావహించినాడు. రాముడు సాక్షాత్పినాకపాణివలె కోదండమూని అవచ్చు రాక్షససేనావాహిని నింకింప నిలచినాడు. రామదేవుని ప్రళయ రుద్రావతారమునకు భూతములు వణకినవి.

శ్లో. ఆవిష్టం తేజసా రామం సంగ్రామశిరసిస్థితం
దృష్ట్వా సర్వాణి భూతాని భయా ద్వి వ్యథిరేతదా
రూపమప్రతిమంతస్య రామస్యాక్లిష్టకర్మణః
బభూవ రూపం కృద్ధస్య రుద్ర స్యేవ పినాకినః.

ఆ మహా సంగ్రామమున ఖరాసురుని యనుచరులందరు మడిసిరి. రాముడొక్క ఖరుని మాత్రమే మిగల్చి పరిహాసవచనములతో వానితో వినోదించుచున్నాడు. నిరాయుధుడై నిలిచియున్న ఆ దానవుని బాణమేయక రాముడు తననింటిని భూమి కానించి దాని కోపును గడ్డముక్రింద నానించి ముఖమున చిరునవ్వులు చిందించుచున్నాడు. ఆ వీరమూర్తికి పదునాల్గువేవురు కంచురథాలవారితో ఒంటరిపోరాటము ఒక విలాస క్రీడగా నున్నది. తన చేతిలోనున్న గదను ఖరుడు విసరగా ధర్మవత్సలుడగు రాఘవుడు దానిని ఖండించి ఖరునితో పరియాచకములాడుచున్నాడు.

శ్లో. ఛిత్వాతు తాంగదాంబాణై రాఘవో ధర్మవత్సలః
స్మయమానఃఖరం వాక్యం సంరబ్ధ మిద మబ్రవీత్.

పై శ్లోకమునకు వ్యాఖ్య చేయుచు "ధర్మవత్సల ఇత్యనేన నిరాయుధ వధోనుచిత ఇతి శ్రీరామోవమన్యత ఇత్యవగమ్యతే" అని వ్యాఖ్యాతలు వ్రాసిరి. రాముడు ధర్మవత్సలుడు గావుననే నిరాయుధవధము అనౌచిత్యమని తలచినాడని భావము.

ఖరుడు రక్త మాంసములు శరీరమునుండి వరదలై పారగా శ్రీరామునిపై వచ్చిపడుచున్నాడు. బాణము వేయుటకైన వారిరువురి నడుమ ఎడమము లేకుండెను. అప్పుడు రాముడు కొంచెము వెనుకకు తగ్గెను.

శ్లో. తమాపతంతం సంరుద్ధం కృతాస్త్రో రుధిరాప్లుతం
అపాసర్పత్ప్రతిపదం కించిత్త్వరితవిక్రమః.

శూరుడు వెనుకంజ వేయరాదు. ఇట రాముడు వెనుకకు తగ్గెను. జంకికాదు. రాక్షసునకు తనకు మధ్య నెడము చేసికొని బాణమువేయుటకు రాముడు వెనుకకు తగ్గెను. ఈ భాగమున గల "అపాసర్పత్ప్రతిపదం కించిత్" అను దానికి "మూడడుగులు వెనుకకు తగ్గెను" అను నర్థమును గ్రహించి ఉత్తర రామ చరిత్ర నాటకమున అవుడు రాముని పరాక్రమమును దెప్పుచు

శ్లో. వృద్ధాస్తేనవిచారణీయచరితా స్తిష్ఠంతు కిం వర్ణ్యతే
సుందస్త్రీ దమనేప్యఖండయశశోలోకే మహాంతోహితే
యాని త్రీణికరాణ్యఖాన్యపి పదా న్యాసన్ ఖరాయోధనే
యద్వా కౌశల మింద్రసూనునిధనేత్రాప్యభిజ్ఞో జనః.

అని నట్లు భవభూతి చమత్కరించెను.

శ్రీరాముడు ఖరుని చంపుటకు బ్రహ్మ దండమువంటి దివ్యాస్త్రమును తీసినాడు. మతిమంతుడగు నింద్రుడు భావి కాలగతులనారసి ఆ బాణము నగస్త్యనిమూలమున శ్రీరామునకు సంక్రమింపచేసెను. తనకు ఖరుడు చేసిన పరాభవమునకు ప్రతీకార్య మెప్పుడు చేతునాయని ఆ బాణములో నింద్రుడు దైవత్వశక్తిసంతతిని పొదిగి పెట్టినాడట.

శ్లో. తతః పావక సంకాశం వధాయ సమరే శరం
ఖరస్య రామో జగ్రాహ బ్రహ్మదండమివాపరః
సతం దత్తం మఘవతా సురరాజేనధీమతా
సందధే చాపి ధర్మాత్మా ముమోచ చ ఖరం ప్రతి.

అట్టి శక్తివంతమగు దివ్యాస్త్రముచే ఖరుని రాముడు వధించినాడు. ఖరదూషణాది దానవవధమాచరించి జనస్థాన రక్షణ గావించుటలోను ఖరుని మూలబలమును స్వయముగా నుగ్గాడి వానరుల భయమును బాపుటలోను హతశేషు లుండకుండుట, తన దివ్యాస్త్ర శక్తిని ప్రచండ పరాక్రమమును వ్యక్తము చేయుట మొదలగునవి ఫలితములు.

ఇక శ్రీరాము డనాథనాథుడనుటకు జటాయుదర్శన ఘట్టమును ప్రమాణీకరించినాడు. జటాయువు రామ కార్యార్థమై అసువులబాసినాడు. తనతండ్రికి మిత్రుడు. అత డనాథ మరణము నొందరాదు. వెంటనే లక్ష్మణుని సమిధలగూర్చి అగ్నిని ప్రజ్వలింపజేయుమని యాజ్ఞాపించినాడు. "ఓ గృధ్రరాజా! యజ్ఞము చేయువారలకు, పంచాగ్ని మధ్యమున తపము చేయువారలకు, వాన ప్రస్థులకు, ఏ పుణ్య లోకములు కలుగునో నాచే సంస్కరింపచేయబడిన నీకును అట్టి పుణ్యలోకములు కలుగును. నా యాజ్ఞనుపొంది నీవు దివ్య లోకమునొందు"మని చితిని జ్వలింపజేసి బంధువువలె విలపించుచు జటాయువున కగ్ని సంస్కారము గావించెను.

"యాగతిర్యజ్ఞశీలా నా మాహితాగ్నేశ్చ యాగతిః
మయాత్వం సమనుజ్ఞాతో గచ్ఛలోకా న నుత్తమాన్
గృధ్రరాజ మహారాజ సంస్కృతశ్చ మయావ్రజ"

ఇందు శ్రీరాముని ఆశ్రిత వాత్సల్యము విదితము. తాను భగవదంశ సంభూతుడనువిషయ మెరిగినవాడనుటకంటె ఆత్మశక్తిని సత్యనిష్ఠను నమ్మినవాడు కాన దశరథునట్లే వాని మిత్రుడగు జటాయువునకు పుత్రతుల్యుడనియు రాముడు పక్షిరాజునకు పరాం గతినిచ్చితి ననగలిగినాడు. ఆశ్రితత్రాణవిషయమున శ్రీరాము డెట్టి పరాయణత్వము వహించెనో యీఘట్టమున వ్యక్తమయినది.

శ్రీ రామభద్రుడు స్నేహధర్మరక్షణకు తావలమయినవాడు. సుగ్రీవునితో నతడు అగ్నిజ్వలనము సాక్షిగా సఖ్యమొనర్చినాడు. సుగ్రీవ రాములు పరస్పరము తమ కష్ట కథలను వినిపించుకొన్నారు. సుగ్రీవుని యవస్థవిని రాముడు జాలి నొందినాడు. రాముడు వానరాధిపుని విత్రస్త వచనములు విని సహజ ధైర్యము తొణికిసలాడ దరహాసము గావించినాడు. "ఉపకారము చేయుటయే మిత్ర లక్షణమని యెరుంగుదును. ఓ మహాకపీ! నీ భార్య నపహరించినవానిని వధింతును. నా బాణములు అమోఘములని యెరుగుము.

శ్లో. ఉపకారఫలం మిత్రం విదితం మే మహాకపే
వాలినం తం వధిష్యామి తవ భార్యాపహారిణమ్"

అని సుగ్రీవు నోదార్చినాడు.ఒకని భార్య నింకొక గర్వి,ఒకని రాజ్యము నింకొక మదాంధుడు అపహరించుటయే శ్రీరాముని దృష్టిలో దోషము అట్టి దోషిని వధించుటయే యాతని లక్ష్యము. అట్లు యినగాని శిష్ట రక్షణ పొసగదు.

ఇట్లు సుగ్రీవ రాముల ప్రణయ ప్రసంగము సాగినంతనే వానరపతి కూడ తగిన మిత్రధర్మమునే నెరపినాడు. "మధుకైటభుల చంపి వేదముల దెచ్చిన విష్ణునివలె ఆ సీత యెక్కడనున్నను నే దెచ్చి నీ కిత్తును (అహం తా మానయిష్యామి నష్టాం వేదశ్రుతీ మివ) అని రామునోదార్చి తన నెయ్యము నెరపినాడు. వా రిరువురి స్నేహమువలన ప్రకృతిలో నొక విచిత్ర పరిణామము కలిగినది. ఏక కాలమందే సుగ్రీవ రాముల ప్రణయ ప్రసంగ మయినంతనే సీతకు, వాలికి, రావణునకు ఎడమ కన్నులదరెనని కవి ఆ సర్గకు భరతవాక్యమును పాడినాడు.

శ్లో. సీతా కపీంద్ర క్షణదాచరాణాం
రాజీవ హేమజ్వలనోపమాని
సుగ్రీవ రామ ప్రణయ ప్రసంగే
వామాని నేత్రాణి సమంస్ఫురంతి."

ఇట్టి మహోదారమగు స్నేహధర్మమునే సుగ్రీవ రాములు చివఱవఱకు నెరపి దేశ కల్యాణమునకై పాటుపడినారు.

ఇక శ్రీరాముని యస్త్రశక్తి తానుద్దేశించిన మాత్రమునకే పని చేయును. వాలి దుష్టుడై తమ్ముని భార్య నపహరించినవాడైనను తానెదుటపడి చంపలేదు. కావున తాను వాలికొకవిధముగా నపకారము చేసినట్లే రాముడు తలచియున్నాడు. వాలి సుగ్రీవుల యుద్ధములో యముని కాలచక్రము వంటిది, కాలసర్పము వంటిది, తక్షణ దివ్యలోకముల నిచ్చునదగు మహాస్త్రమును వాలిపై నేసినాడు.

శ్లో. తదస్త్రం తస్య వీరస్య తస్య మార్గ ప్రధావనం
రామబాణాసనాక్షిప్త మావహ త్పరమాంగతిమ్.

ఒకేయస్త్ర మందరి వీరులయొద్ద నుండవచ్చు. దాని మారణశక్తికూడ సమానమే కావచ్చును. కాని అస్త్రశస్త్రాదులు స్వర్గలోకాది దివ్యసుఖముల నీయవు. కాని, రాముని వంటి దివ్యశక్తిసంపన్నుని యస్త్రశక్తిమాత్రమే వాలికి ముక్తి నీయగలిగినది. ఇక రాముని యవతారఫలమును తెలియజేయుఘట్టము విభీషణ శరణాగతి. అందు శ్రీరాముని మహాదీక్షత ఎంత వ్రాయవలెనన్న అంతయున్నది. విభీషణుడు తన నలువురు మంత్రులతో సాగరముదాటి యంబరవీధినుండియే.

శ్లో. "సర్వలోకశరణ్యాయ రాఘవాయ మహాత్మనే
నివేదయ మాం క్షిప్రం విభీషణ ముపస్థితమ్"

అని విన్నవించుకొనగా రాఘవుడు కూడ "ఒక్కమారే నేను నీ వాడను, కాచిరక్షింపుమని యెవ్వడు వేడునో వానికి దేనివలన భయమున్నను కాచి రక్షింతు"నని అభయము నొసగినాడు. విభీషణుడు మాయావి. అతడు శత్రుపక్షమునుండి వచ్చినాడు. మోసగించి తమ్మెవ్వరు చంపునోయని సుగ్రీవుడు భయమును వ్యక్తపరుపగా "పిశాచములను, దానవులను, యక్షులను, పృథివియందలి రాక్షసుల నందరను కోరినచో పాదాంగుష్ఠముచేతనే చంపగలను" అని తన ఆత్మశక్తిపై విశ్వాసమును ప్రకటించినాడు విభీషణశరణాగతిలో రాముడు. శ్రీరాముని శరణాగతదీక్షను పరాకాష్ఠ నొందించినఘట్టము విభీషణ శరణాగతి, అది ప్రత్యేకముగా జేర్కొనవలసిన విషయము.

రాఘవులు శత్రువు నిరాయుధుడై చేజిక్కినప్పుడు వానిజోలికిపోరు. వాని నప్పుడు మన్నింతురు. రావణుడు తొలి యుద్ధములోనే రామునిబారి పడినాడు. రామ బాణముల వేడిమికి లంకాపతి సొమ్మసిల్లినాడు. ఇంతేనా తనశత్రువు పరాక్రమమని వానిజోలికి రాముడు పోలేదు. రావణుడు తెప్పరిల్లినంతనే "రాక్షసా! యుద్ధమున నీ వలసితివని ఎఱిగి చంపక విడిచితిని. శలవిచ్చితిని. లంకకుపోయి రథికుడవై శరశరాసనములతో సుసజ్జితుడవై రమ్ము. అప్పుడు నా బలమును చూడగలవు.

శ్లో. కృతంత్వయా కర్మ మహత్సుభీమం
హత ప్రవీరశ్చ కృత స్త్వయాహం
తస్మాత్పరి శ్రాంత ఇవ వ్యవస్య
నత్వాంశరై ర్మృత్యువశం నయామి.

శ్లో. గచ్ఛానుజానామి రణార్దిత స్త్వం
ప్రవిశ్యరాత్రించరరాజ లంకాం
ఆశ్వాస్య నిర్యాహి రథీచ ధన్వీ
తదాబలం ద్రక్ష్యసి మేరథస్థః"

అని రాఘవుడు శత్రువును మన్నించెను. శ్రీరాముని భావనా సారమంతయు నిందిమడ్పబడియున్నది. ఎవని వధకై తానెదురు చూచుచున్నాడో అట్టి శత్రువు అయాచితముగా జిక్కినాడు. కాని ఆ రక్కసిమృత్యువున కది సమయముకాదు. ఇందు శ్రీరాముని రణనీతి, వీరపురుషలక్షణములు అనన్యసాధారణములు.

ఆ మహాత్ముని ఆత్మశక్తియే మహా రణరంగ మధ్యమున సౌమిత్రికి, వానరులకు రక్షాకవచమై శక్తి నిచ్చినది. ఆ దేవుని దివ్యశక్తియే ఇంద్రజిల్లక్ష్మణుల యుద్ధములో రామానుజుని కాచినది. రామాయణయుద్ధ మొక యెత్తు. మేఘనాధుని యుద్ధ మొకయెత్తు. ఆతడు వానర సేనావాహిని నింకింపజేయుచు రాఘవుల కొక పెద్ద సమస్య యయినాడు. ఆతని చంపుటలో లక్ష్మణుడు విసుగెత్తిపోయినాడు. చివరకు తన సోదరభక్తిని, దివ్యశక్తిని, శ్రీరాముని ధర్మనిష్ఠను, సత్యసంధత్వమును, పితృవాక్పాలనమును, ఐంద్రాస్త్రమందభిమంత్రించి చంపవలసి వచ్చినది. ఇంద్రజిత్తుపై వైరకారణమున మహేంద్రు డాయస్త్రరూపమున సౌమిత్రికి సంక్రమించినాడు. దాని మహిమను వాల్మీకి సహస్రనామార్చనగావించినంత చేసినాడు, అగ్నిహోత్రమువలె దహించునది, ఇంద్రశత్రు మారకమైనది, దురావారము దుర్నిరీక్ష్యము, రాక్షసత్రాసము, యుద్ధములలో ఇంద్రునకు విజయము నిచ్చు ప్రచండాస్త్రమది. దానిని సౌమిత్రి సంధించి అభిమంత్రించినాడు. "దశరథనందనుడగు రాముడు ధర్మాత్ముడు, సత్యసంధుడు, అప్రతిహత పరాక్రముడు అగునేని ఓశరమా! యీ రావణాత్మజుని తుదముట్టింపుము."

శ్లో. ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది
పౌరుషేచాప్రతిద్వంద్వశ్శరైనం జహి రావణిమ్"

అని రామునేనమ్మి వాని శక్తినంతను శరమందుంచి విడిచినాడు. ఇంకేమున్నది. సకుండలభ్రాజితమగు రావణితల నేలకూలినది. శ్రీరాముని సత్యపరాక్రమమున కంతకన్న నిదర్శనమేమి కావలెను? మేఘనాధుని వధవలన కలిగిన సంతసముకంటె వానరు

లకు, దేవతలకు రావణవధవలన కలిగిన సంతసమధికము కాదేమో అనిపించును. విభీషణుడు జాంబవంతుడు, హనుమంతుడు మున్నగువారు సౌమిత్రి నగ్గించిరి. వానరులు కిచ కిచలాడిరి. అరచిరి. గర్జించిరి. తోకల నెత్తిగెంతిరి. వారి యానందము వర్ణనాతీతము.

శ్లో॥ క్ష్వేళంతశ్చ నదంతశ్చ గర్జంతశ్చ ప్లవంగమాః
లాంగూలాని ప్రవిధ్యంతి స్ఫోటయంతశ్చ వానరాః
లక్ష్మణో జయతీత్యేవం వాక్యం విశ్రావయన్ తథా''

దీనికంతకు రామదేవుని దివ్యశక్తికాక వే రేమి కావలెను ?

ఇక రాముని మూలబల యుద్ధమున ఆతని దివ్య శక్తిని సత్యపరాక్రమమును కనుగొనగలము. ఒక్కొక్క రాక్షసుడొక్కొక్క మేఘనాథతుల్యుడు. వారిని స్వరూపనాశన మొనర్చుటకు రాముడే స్వయముగా వైష్ణవ చాపము నెత్తెను. రావణుని మూలబలములో హతశేషు లుండరాదు. ఒక్కడు కూడ లంకాముఖద్వారము చూడరాదు. వారందరు రణాగ్రమున ద్రుంగవలసినదే. శరవర్షమును కురిపించుచు రాఘవుడు రాక్షసుల కందర కన్ని రూపులై విజృంభించినాడు ''ఇడుగో రాముడు ఏనుగులను నుగ్గు చేయుచున్నాడు. అడుగో నాతడు గుఱ్ఱములను కూల్చుచున్నాడు. అడుగో మహారథులను, కాల్బలమును నాశనము చేయుచున్నాడు'' అని రాముని పోలికతో నుండువారినిగూర్చి చెప్పుచు ఒండొరులు కొట్టుకొనుచున్నారు.

శ్లో. ఏషహంతి గజానీక మేషహంతి మహారథాన్
ఏషహంతి శరైస్తీక్ష్ణైః పదాతీన్ వాజిభిస్సదా
ఇతితే రాక్షసాస్సర్వే రామస్యసదృశాన్ రణే,
అన్యోన్యం కుపితాజఘ్నుః సాదృశ్యాద్రాఘవస్యతే''

శ్రీరాముని రణకర్మచే హతములైన చతురంగబలములతో కూడిన రణభూమి కుపితుడగు భూతపతి యుద్యానవనమువలెనున్నదట.

శ్లో॥ హతైర్గజపదాత్యశ్వై స్తద్బభూవ రణాజిరం
అక్రీడమివ రుద్రస్య క్రుద్ధస్యేవ పినాకినః''

మూలబలము నాశనమైనది. ప్రచండరాఘవులు ప్రసన్నరాఘవులైరి. వానర సేనావాహిని ఉప్పొంగినది. సుగ్రీవాది వానరశ్రేష్ఠులు శ్రీరాముని దివ్యాస్త్రశక్తిని శతధా నుతించిరి. రామదేవుని రణావేశమును హనుమత్సుగ్రీవ జాంబవాది వానరయోధు లానాడే కాంచగలిగిరి. శ్రీరాముడు మందహాస సుందరుడై, అట్టి దివ్యాస్త్ర శక్తి తనకు మహేశ్వరునకు మాత్రమే కలదు. (ఏతదస్త్రబలం దివ్యం మమవా త్ర్యంబకస్యవా) అని చెప్పి వారిని విస్మితులను చేసినాడు.

ఇక మిగిలినది రావణవధ. అందు శ్రీరాముని పరాక్రమము పరాకాష్ఠ నొందినది. శ్రీరాముని దుష్టరాక్షససంహారదీక్ష ఆనాటితో ముగియును. అందుచే రాము డానాడు ప్రకృతికి కన్నుల పండువొనర్చినాడు. రావణునితో యుద్ధమొనర్చుటకు శ్రీరామునకు మహేంద్రుడు దివ్యరథమును మాతలిచే పంపెను. గీర్వాణు లందరు వినువీధిని విమానాలపై చూడ వచ్చినారు. రావణుడుమాత్రము యుద్ధములో ఏ తన్మాత్రుడా? ఆతడు విజయ లబ్ధ ప్రతిష్ఠవిభవుడు. రావణునితో తీవ్రయుద్ధము చేసి కోదండరాముడే అలసిపోయినాడు. ''ఈ రక్కసుని చంపుటెట్లా''యని కూడ చింతించినాడు. (తతో యుద్ధపరిశ్రాంతం సమరేచింతయాస్థితమ్) అట్టిసమయములో నాదిత్యహృదయోపదేశము రామునకు నూతనోత్సాహము నిచ్చినది. రామరావణయుద్ధమును దేవతలు కొనియాడిరి. రాక్షసులు, వానరులు యుద్ధమును మాని చూచుచుండిరి.

శ్లో. గగనం గగనాకారం సాగరస్సాగరోపమః
రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ''

అని కవి ఆ యుద్ధమునకు అనన్వయాలంకారము వాడినాడు. ఆ వాక్యమువలన ఆ సన్నివేశమును వర్ణించి, వర్ణించి ఇక రాను వర్ణించలేనని ఒప్పుకొనినట్లున్నది. ఆ పరమేశ్వరుని దివ్యత్వము నందలి యొక్కొక్కగుణమునుమాత్రమే వర్ణింపలేక వేదములే అలిసి తలగిపోయినవి. (యదేకైక గుణప్రాంతే శ్రాంతా నిగమవాదినః) అని అప్పయ్యదీక్షితుల దివ్యవాక్కు. ఇక్కడ ఎంతటి మహాకవియైనను పరమేశ్వరుని భవ్యసన్నివేశమును వర్ణింపలేక అలిసిపోవుటలో నాశ్చర్యమేమున్నది ? అదియే ఆ ఘట్టమునకు పరాకాష్ఠ అన్నమాట.


ఇక రావణునకు కాలము మూడినది. త్వరపడుమని రాముని దేవతలు హెచ్చరించుచున్నారు. అతడు బ్రహ్మాస్త్రమును వింటతొడిగి వేదోక్తముగా నభిమంత్రించినాడు. ఆ యస్త్రసంధాన మాత్రముననే సర్వభూతములు గజగజలాడినవి. భూమి కదలినది.

శ్లో॥ అభిమంత్ర్య తతోరామః తం మహేషుం మహాబలః
వేదప్రోక్తేన విధినా సందధే కార్ముకే బలే
తస్మిన్ సంధీయమానేతు రాఘవేణ శరోత్తమే
సర్వభూతానివిత్రేసుః చచాలచ వసుంధరా''

ఇంత పంక్తికంధరుడు ధరణి కొరిగిపోయినాడు. ఆతని మరణముతో భూమి తేలికపడినది. బ్రహ్మేంద్రాదులు, దశరథుడు వచ్చి శ్రీరాము నగ్గించిరి.

తదుపరి సీత అగ్నిప్రవేశ మొనర్చిన ఘట్టము. సీత అగ్నిశుద్ధ యగుటతోడనే రాముని లోకసేవాపరాయణత్వము వ్యక్తమయినది. మహాత్ముల హృదయములు వజ్రములకంటె కఠోరములైనవి. పూవులకంటె మృదువైనవి. అట్టివారి హృదయము లెవరు తెలిసికొనగలరు? కాకాసురుని, విభీషణుని శరణన్నమాత్రాన కాచి రక్షించిన ఆ రాముడే సీతకై వనములలో విలపించిన ఆ కరుణామయుడే సీత నగ్ని ప్రవేశ మొనర్చు నున్నప్పుడు, కఠోర గర్భయగు నా మె నడవులకు పోదోలునపుడు ఎట్టి కఠోరమూర్తి యయ్యెనాయని అనుకొనక మానము. లోకారాధనమే మహాత్ముల మతము. ''స్నేహమును, దయను, సౌఖ్యమును, చివరకు ప్రాణప్రియయగు జానకినే లోకారాధనకు విడువగలను'' అని భవభూతి రామ హృదయమును నావిష్కరించినాడు.

భారతీయుల భాగ్యపరిపాకమువలన భారతదేశములో లోకోత్తర దివ్యచరిత్రగల రాఘవుని ధీరోదాత్తగుణాదివర్ణన గావించి వాల్మీకి ఖ్యాతి గాంచినాడు. రామగుణవర్ణనచే ఆర్షకవి ప్రసిద్ధుడయినాడు. కాన వస్తుగౌరవమునుబట్టియే కవికి ప్రతీతి కలుగుననుట స్పష్టము. రామదేవుని ధీరోదాత్తాది గుణములేకాక, ఆతనిలోనున్న సద్గుణ సంపత్తి, ఆతని సత్య పరాక్రమమును సుస్థిరము గావించినది.


వడ్డీకి వడ్డి
అకస్మాత్తుగా ఒకనాడు రామయ్య ఎద్దుకు జబ్బు చేసి చచ్చిపోయింది. అతడికది పెద్ద దెబ్బ. భార్యతో అన్నాడు
"పొలం దున్నటం ఏలాగ? మరో ఎద్దును కొనటానికి డబ్బు లేదు."
రామయ్య నిరాశతో మామ దగ్గరికి వెళ్లాడు
"సాహుకారు వద్ద అప్పు చెయ్యవద్దు. వడ్డీకి వడ్డి. ఏం! ఏడేళ్ల క్రితం జీవిత భీమా పట్టా తీసుకొన్నావుగా! దానిమీద తక్కువ వడ్డీతో అప్పు తీసుకోవడం సులభం. నేను చెప్తాను రా..."
వెంటనే రామయ్య అప్పు కోసం జీవిత భీమా కార్పొరేషనుకు దరఖాస్తు చేశాడు. కొద్ది రోజులకే డబ్బు చేతికి వచ్చింది.
ఆడబ్బుతో సంతకు వెళ్లి మంచి ఎద్దును కొన్నాడు
కొంత కాలానికి
రామయ్య సమస్యలు తీరిపోయాయి. తన ఎద్దుల్ని అప్పుడప్పుడు ఇతరులకు కూడ ఎరువిచ్చి, వచ్చే డబ్బుతో, వాయిదాలలో తన అప్పులు పూర్తిగా తీర్చివేశాడు. రామయ్యకు నిజంగా జీవిత భీమా సహాయపడింది.
జీవిత భీమా అవసరానికి ఆదుకుంటుంది
ASP/LIC/R/8

కలగూరగంప

కేయూరబాహు చరిత్ర పాఠాలు

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

కడచిననెల 'భారతి'లో శ్రీ బులుసు వెంకట రమణయ్య గారు మంచనకవి ప్రణీతమయిన కేయూరబాహుచరిత్రమును గూర్చి పెక్కు విశేషములను దెలిపి ఆంధ్రసాహిత్యలోకమునకు మహోపకారము గావించిరి. అందు 'విశేషములు' అను శీర్షిక క్రింద నిటీవల నేను ప్రకటించిన కేయూరబాహుచరిత్రములో గొన్ని సవరణలు సూచించుచు నిట్లు వ్రాసిరి.

"ముద్రితప్రతినిబట్టిచూచిన సంస్కరణాపేక్షము లగు భాగములు కొన్ని స్థూల దృష్టికే కానవచ్చుచున్నవి. ఇందు ప్రథమాశ్వాసము చివరను, ద్వితీయాశ్వాసము చివరను కృతి పతిని ప్రశంసించుచు మూడేసి పద్యములు ద్వితీయావిభక్త్యంత ములుగా ఉన్నవి. అట్లే ద్వితీయ, తృతీయశ్వాసముల తొలి పద్యములును ద్వితీయాంతములుగా నున్నవి. తక్కిన పద్యము లతో వీనికి సమన్వయము కుదురకున్నది. ఇట్లే తృతీయాశ్వాసము చివరి మూడు పద్యములు, చతుర్థాశ్వాసములోని తొలి పద్యము ప్రథమాంతములుగా ఉన్నవి. వానికిని తక్కిన వానితో అన్వయము కుదురదు. ఇట్టియెడల 'పురుషతను సుమేరున్ పోలమాంబాకుమారున్' అను దానిని 'పురుషతను సుమేరూ! పోలమాంబా కుమారా!' అనియు, 'యశస్తారకితదశాశుగుండ దండాధీశున్' అనుదానిని 'యశస్తారకితదశాశ! గుండదండాధీశా' అనియును సవరించుకొనవలసియున్నది. ఇట్లే ప్రథమాంతము లుగా ఉన్నవానిని సంబోధనప్రథమాంతములుగా మార్చుకొన వలెను. అప్పుడే సమన్వయము కుదురును."

కాని ప్రాచీనాంధ్రకావ్యములలోని యాశ్వాసాద్యంత పద్యముల రచనాసంప్రదాయమునుబట్టి చూచినచో శ్రీ వేంకట రమణయ్యగారు పేర్కొనిన స్థలముల నెట్టి సవరణము నవసరము లేదనువిషయము తెల్లము కాగలదు. నన్నిచోడుడు, తిక్కన సోమయాజి, కేతన, మంచన యను కవీశ్వరు లాశ్వాసాద్యంత పద్యముల రచనలో నొక్కవిధమయిన శిల్పమునే పాటించిరి. ఆ శిల్పమెట్టిదనగా తరువాతి యాశ్వాసములోని యాశ్వాసాది పద్యమునకు తరువాతి తొలిపద్యము లేక తొలి వచనములోని తొలి పదము లేక కర్తృ పదమే విభక్త్యంతముగానున్న నా విభక్త్యంతములుగా బూర్వాశ్వాసాంత్యపద్యములను, నా యాశ్వాసాదిపద్యమును రచించుట యనునది. కేయూరబాహు చరిత్రములో నీ శిల్పమెట్లు పాటింపబడినదో యరయుదము.

ద్వితీయాశ్వాసాదిపద్యమునకు దరువాతి పద్యము 'తన మేనల్లుని సోమదత్తు బహుతంత్రప్రౌఢు ధీమంతు' నిత్యాదిగా ద్వితీయావిభక్త్యంతముగా బ్రారంభమగుచున్నది. అందుచే ప్రథమాశ్వాసాంత్యపద్యములు మూడును, ద్వితీయాశ్వాసాది పద్యమును ద్వితీయాంతములుగా రచింపబడినవి.

అట్లే తృతీయాశ్వాసాది పద్యమునకు దరువాతి వచనములో 'కేయూరబాహు మహీనాథుం గటాక్షించి' యనుచో దొలి పదము ద్వితీయాంతముగా నుండుటచే ద్వితీయాశ్వాసమునందలి యాశ్వాసాంత పద్యములు మూడును, తృతీయాశ్వాసాది పద్యమును ద్వితీయాంతములుగా నుండుట సమర్థితమగుచున్నది.

చతుర్థాశ్వాసమునందుగూడ నిట్లే యాశ్వాసాది పద్యమునకు దరువాతి వచనములో మొదటి పదము 'భాగు రాయణుడు' ప్రథమాంతమగుటచే తృతీయాశ్వాసాంత పద్యములు మూడును, చతుర్థాశ్వాసాది పద్యమును ప్రథమాంతములు గనే యున్నవి.

చతుర్థాశ్వాసాంతమున నదే శిల్పము పాటింప నవసరము లేకపోవుటచే—దానితో గ్రంథము పరిసమాప్తియగుచున్నది గనుక నా యాశ్వాసాంతపద్యములు సంబోధనాంతములుగా నిర్వహింపబడినవి.

తిక్కన నిర్వచనోత్తర రామాయణమునను, కేతన దశకుమార చరిత్రమునందును, నన్నిచోడుని కుమార సంభవము నందును నిట్టి శిల్పమే పాటింపబడినది. చూడుడు.

దశకుమార చరిత్రము :

ఆశ్వాస సంఖ్య	పద్యాది	విభక్తి	పూర్వాశ్వాసాంత — ఆశ్వాసాది — పద్యములు
3.	మునినాదుండగు	ప్రథమావిభక్తి	ప్రథమాంతములు
4.	దేవ ! భవదీయ	సంబోధనప్రథమావిభక్తి	సంబోధనాంతములు
5.	రాజవాహన మహీవల్లభునకుం	షష్ఠీ విభక్తి	షష్ఠ్యంతములు
6.	అతని కిట్లని	,,	,,
7.	ఉపహారవర్మఁ గనుఁగొని	ద్వితీయావిభక్తి	ద్వితీయాంతములు
8.	భూపలలామ !	సంబోధన	సంబోధనాంతములు
9.	దేవా ! దేవర	,,	,,
10.	రాజవాహన ధరాధీశ్వరుండు	ప్రథమావిభక్తి	ప్రథమాంతములు
11.	రాజవాహన మహీవల్లభుండు	,,	,,
12.	మహాపురుషా !	సంబోధన ప్రథమా విభక్తి	సంబోధనాంతములు

నిర్వచనోత్తర రామాయణము :

2.	శ్రీరామచంద్రు డిట్లు	ప్రథమావిభక్తి	ప్రథమాంతములు
3.	హరి గని	ద్వితీయావిభక్తి	ద్వితీయాంతములు
4.	అదశకంధరు డఖిల	ప్రథమావిభక్తి	ప్రథమాంతములు
5.	శంభునిచే	తృతీయావిభక్తి	తృతీయాంతములు
6.	దనుజాధీశ్వరునకు	షష్ఠీ విభక్తి	షష్ఠ్యంతములు
7.	అక్కడ గమలాసను డా	ప్రథమావిభక్తి	ప్రథమాంతములు
8.	అంత నొకనాడు నృపుడు	,,	,,
9.	జననాథు డుడుగరలు	,,	,,
10.	రేపకడ నక్కుమారుడు	,,	,,

దశమాశ్వాసాంతమున 'ధారుణియేలె రాఘవపుంగవుండు మహోన్నతిన్' అనుటలో 'రాఘవ పుంగవుండు' ప్రథమాంతమగుటచే నచటి యాశ్వాసాంతపద్యములు మూడును ప్రథమాంతములుగనే నిర్వహింపబడినవి.

నన్నిచోడని కుమార సంభవమున గూడ నాశ్వాసాద్యంత పద్యములం దిట్టి శిల్పమే పాటింపబడినది. చూడుడు—ఇక్కడ నొక్క విషయము చెప్పవలసి యున్నది. నన్నిచోడుడు తన కుమార సంభవమున గృతిపతియగు జంగమమల్లికార్జునునకును, కథానాయకుడగు పరమేశ్వరునికిని నభేదము పాటించుటచే నాశ్వాసాద్యంత పద్యములు కృతిపతి కృతి నాయక పరములగునట్లు కూర్చి రచించినాడు. తదనుగుణముగా నా యాయి పద్యములు తత్తదుచిత విభక్త్యంతములుగా నాశ్వాసాద్యంతముల యందు రచింపబడినవి. నన్నిచోడునికి దరువాత తిక్కన తన కావ్యమునందట్టి యభేదము నెలకొల్పకున్నను, నాశ్వాసాద్యంత పద్యముల రచనలో నన్నిచోడని త్రోవ ననుకరించినాడు. తరువాత కేతన కూడ దన దశకుమారచరిత్రములో నీ త్రోవ నే త్రొక్కుట యరసితిమి. మారనమాత్రము కుమార సంభవమునందువలె నభేదకల్పనములేని తన కావ్యమున—మార్కండేయ పురాణమున—నాశ్వాసాద్యంతపద్యముల నట్టి నియమము పాటించుటవలన సమన్వయము కుదురదని తలచి కాబోలును తిక్కన, కేతన లనుసరించిన మార్గమును బరిహరించి నన్నయ మార్గము నవలంబించి—తన మార్కండేయ పురాణమున నాశ్వాసాద్యంతపద్యముల నన్నింటిని సంబోధన ప్రథమావిభక్త్యంతములుగనే రచించెను. తిక్కన తన భారతమున మాత్రము నన్నయనే యనుసరించి యాశ్వాసాద్యంత పద్యములను సంబోధనాంతములుగా రచించుట గమనార్హము. కాని నన్నయవలె గాక తిక్కన ప్రతియాశ్వాసప్రారంభమునను 'దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె' అని సంబోధనాంతములుగా ప్రారంభించి యాశ్వాసాద్యంత పద్యముల సంబోధనాంతతను సార్థకపరిచికొనినాడు. మంచన కవి తిక్కన, కేతనల మార్గము ననుసరించి తనకేయూర బాహు చరిత్రములో నయి జూపినట్లు అశ్వాసాద్యంత పద్యములందు విభక్తి నియమమును బూర్ణముగా బాటించినాడని చెప్పవలసి యున్నది. ఈ పద్ధతికి నన్నిచోడడు మార్గదర్శియనియు దీనినిబట్టి కూడ నన్నిచోడడు తిక్కనకు బూర్వుడనియు నిర్ధరింప వీలగుచున్నది.

ఈ చర్చనుబట్టి శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు నాచే బరిష్కరింపబడిన కేయూరబాహుచరిత్రములో స్థూల దృష్టికే సంస్కరణాపేక్షములుగా గానవచ్చునవి యని పేర్కొనిన యా యాశ్వాసాద్యంతపద్యములు యథా తథముగా నుండుటయే సమంజసమనియు, నంజెట్టి సంస్కారమునుగాని చేయుట భాషా సంప్రదాయ విరుద్ధమనియు దేలుచున్నది.

కనుక సమన్వయము కుదుర్చుటకై వానినెల్ల సంబోధనాంతములుగా మార్ప నవసరములేదు.

*　　*　　*

అందే చతుర్థాశ్వాసములో 26 వ పద్యములోని యెత్తుగీతినిగూర్చి వ్రాయుచు శ్రీ వెంకట రమణయ్యగారు నేను ఛందోభంగమును సూచించుచు, ప్రశ్నార్థక చిహ్నము లుంచినచోట

'విరులపై నళి గోరంట విరుల దొరయ
నలినములు కలువల నవ్వ నలుదెసలును'

అని సవరణలు సూచించిరి. 'కలువల' అనుటకు బదులు కుముదము అని మార్చినను—దానిని జాత్యేక వచనముగా గ్రహించినను నిర్బాధక మగునని సెలవిచ్చిరి. కాని నా మట్టుకు నాకది తృప్తికరముగా దోపలేదు. 'విరులపై కళులు' అనుటను గణభంగ దోషమును సరిపఱుచుటకై 'విరులపై నళి' యని నేనును సులభముగా మార్చియుందును. కాని యర్థము మాట యేమి? 'దొరయు' అను పదమునకు పోలు—సమానమగు—అని యర్థముకదా! పూవులమీది తుమ్మెద గోరంట విరులను పోలగా—అనగా నర్థమేమి? గోరంట విరులు అని బహువచనాంతముగా నుండుటచే 'విరులపై నళులు' అని యది కూడ బహువచనాంతముగనేకదా యుండవలెను. బహువచనముగా నిలిపినచో గణభంగము ఏకవచనము చేసినచో భిన్న విభక్తిక దోషము. అర్థము రెంటను గుదురలేదు. అందుకే యట ప్రశ్నార్థక చిహ్నము నుంచితిని. తరువాతి పాదమున 'కలువల' అను సవరణ చేసియుండవచ్చును. కాని యది ప్రకృత పాఠమును పూర్తిగా మార్చివేయుట. 'కుముదము' అని—దానిని జాత్యేక వచనముగా బరిగ్రహింపదగునని వారి యాశయము. ఒకే పాదములో 'నలినములు' అని బహు వచనాంతముగా నొకచో జేర్చ్కొని మరొకచో గణభంగమగునని 'కుముదము' అని జాత్యేక వచనముగా మంచన ప్రయోగించియుండునని నేననుకోను. అప్పుడును నా కూర్పు ధోరణి ధారాళముగా లేక కుంటువడుచున్నది. అందుకే మంచి పాఠము లేవైన దొరకకపోవునా యన్న యాశతో నచట ప్రశ్నార్థక చిహ్నము లుంచి వదలిపెట్టితిని. ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోని వ్రాతప్రతులలో నా పాఠములు ముద్రితప్రతిలో నున్నట్లే యున్నవి. (ఆ వ్రాతప్రతులిపుడుతిరుపతిలో శ్రీ వేంకటేశ్వరప్రాచ్యవిద్యాపరిశోధనాలయ గ్రంథభాండాగారమున నున్నవి.) వారు సూచించిన మరొక్క సంస్కారము సరసమయినదే. మంచనకవి కృతినిగూర్చి మంచి విమర్శ వెలయించిన శ్రీ బులుసు వెంకట రమణయ్యగారికి మరొకతూరి కృతజ్ఞత తెలుపుచు విరమింతును.

ఇక్కడ నొకమాట. శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోని ముద్రిత ప్రతినిగూర్చి వ్రాయుచు, 'మూడు నాలుగు సారులు ప్రయత్నింపగా 'ఆ పుస్తకము నెవ్వరో చదువుటకు తీసికొనిపోయిరి' అనియే పోయినపుడెల్ల సమాధానము వచ్చుచున్నది' అని వ్రాసిరి. గురువర్యులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగా రా గ్రంథ భాండాగారమున నుద్యోగించుచుండినపు డందలి వ్రాత ప్రతుల తోడ్పాటుతో నచట నచట దమకు తోచిన సవరణలను వ్రాసియుంచిన గ్రంథ మిది. దానిఁ గూర్చిన సత్యమేమనగా నాయమూల్య గ్రంథము నెవరో మహానుభావులు కొట్టివేసిరి! దాని నెవరుగాని చదువుటకు దీసికొనిపోలేదు. కతిపయవత్సరములకు మునుపటివలనే యది యచటినుండి యదృశ్యమయినది! దానిపోక యెట్టిదో యచటి గ్రంథాలయ పండితులకే యెరుక! ప్రభుత్వ గ్రంథభాండాగారములలో ప్రజోపయోగమునకై భద్రపఱుపబడిన యమూల్య గ్రంథములకు బట్టిన యీ దుస్థితి గూర్చి యింతకంటె వివరింప నవసరము లేదు.

కన్నడ గురజాడ కైలాసం

టి. రాఘవేంద్రరావు

శ్రీగురజాడ అప్పారావుగారు కన్యాశుల్కాది నాటకములను రచించి ఆంధ్ర నాటకరంగాన్ని చైతన్యవంతంచేశారు. ఆయననాటకాలు ఒరవడిగా తరువాత యెన్నో సాంఘికనాటకాలు రచింపబడ్డాయి. శ్రీ రాజమన్నారు, చలం, ముద్దుకృష్ణ ప్రభృత రచయితలు తమరచనలద్వారా తెలుగునాటకరంగానికి నూతన కాంతిని ప్రసాదించారు.

ఇంచుమించు శ్రీ గురజాడవారి ధోరణిలో కన్నడ నాటక రచన చేసినవారు శ్రీ కైలాసంగారు. కన్నడ నాటకరంగంలో నవ్యదృక్పథానికి, వినూతనభావసృష్టికి కారకులయ్యారు. నేటి కన్నడ నాటక రచయితలకు శ్రీ కైలాసంగారు మార్గదర్శకు లయ్యారు. శ్రీ పర్వతవాణి, కస్తూరి, అ. న. కృష్ణరావు ప్రభృతులు కైలాసంగారి మార్గంలో నాటక రచనకు పూనుకొని కన్నడ నాటకరంగాన్ని చైతన్యవంతం చేశారు.

సామాజిక పరిస్థితులను, అలాంటి పరిస్థితులకు కారకులైన వ్యక్తులను ప్రతిబింబిస్తూ, సాంఘిక దురాచారాలను ఖండిస్తూ, సాంఘిక చైతన్యానికి, నైర్మల్యానికి దోహదకారులయిన నాటకాలను రచించడంద్వారా కైలాసంగారు కన్నడ

నాటకరంగంలో యుగకర్తలయ్యారు. హాస్యరస ప్రధానాలై వినోదవిజ్ఞానదాయకాలై ప్రజల్లో ముఖ్యంగా యువకుల్లో నూతనోత్తేజాన్ని కలిగించాయి, ఆయన నాటకాలు.

అప్పారావుగారికిమల్లే శ్రీ కైలాసంగారు విశ్వశ్రేయస్సుకోసం, సంఘకల్యాణం కోసం నాటకరచన చేశారు. మానవసమాజంపట్ల రచయితగా తమకున్న మహత్తర బాధ్యతను గుర్తించి నాటకరచన సాగించారు. జీవితంలోని వైవిధ్యాన్ని, తీవ్రగమనాన్ని దర్శించి, నిత్యజీవితంలోంచి వస్తువును స్వీకరించి ప్రజలు ప్రతినిత్యం వాడే శైలిలో వ్యావహారిక భాషలో రచన సాగించారు. సామాజికేతివృత్తాలు గల కైలాసంగారి నాటకాలలోని పాత్రలు యదార్థప్రపంచం లోనివి. నిత్యము సమాజంలో మన కెదురయ్యేవి. సున్నితమైన హాస్యము, సంభాషణచమత్కృతి, పాత్ర చిత్రణ, రచనాశిల్పం దృష్ట్యా కైలాసంగారి నాటకాలు పండితపామరజనరంజకాలై బహుళవ్యాప్తిని, బహుజనామోదాన్ని పొందాయి. బళ్లారి రాఘవ వంటి మహానటుల ప్రశంసల నందుకొన్నాయి.

సాహిత్యం—అందులోను నాటకం ప్రజాజీవనప్రతిబింబం. మనసంస్కృతిని వివిధదశలలో ప్రతిబింబించి పరిపూర్ణమూ, పరిపక్వమూ అయిన సంస్కృతి వివిధాంగాలను ప్రదర్శించి వాటికి భాష్యాన్ని అందజేస్తోంది, నాటకీయమైన శిల్పం. సమాజ శిక్షణకు, సంఘ సంస్కరణకు కామధేనువు వంటిదది.

ప్రజాజీవితంతో సన్నిహిత సంబంధం గల నాటకాలు రచనలో ప్రయోగంలో సమస్త ప్రజానీకానికి అందుబాటులో ఉండాలి. అందుచేతనే కైలాసంగారు వ్యావహారికభాషలో నాటకాలు రచించారు. వ్యావహారిక భాషలో విరచితాలయిన నాటకాలను దర్శించి, చదివి సామాన్యప్రజలు—కేవలం అక్షర పరిచయం ఉన్నవారు సంస్కారభాగ్యమును పొందగలరు. ఉపదేశం, ఉద్దీపనం నాటకాలలో ముఖ్య భాగాలు.

శ్రీ కైలాసంగారు "హోం రూలు, సూళే (లంజె), నం కంపెనీ (మన కంపెనీ), బండవాళ్ళ విల్లదె బడాయి. (బండారంలేని బడాయి)" మొదలైన నాటకాలు రచించారు. వీటిలో కొన్ని హాస్యరసప్రధానాలు, మరికొన్ని ఆలోచనలను రేకెత్తించే భావప్రపూరితాలు.

"హోంరూలు" నాటకంలో ఆదర్శజీవనానికి సాధనలు సూచించబడ్డాయి. ఇందులోని పాత్రలు విపరీత మనస్తత్వాలకు, కొన్ని వ్యసనాలకు దాసులు. ఇందులోని ప్రధాన పాత్ర రామన్న. ఇతడు లాయరు, మునిసిపల్ కౌన్సిలరు, సంఘసంస్కరణ సభాధ్యక్షుడు, కాంగ్రెసు మెంబరు. సంఘంలో అన్ని హంగులూ, పదవులూ ఉన్నవాడు. ఇతని ద్వితీయభార్య వెంకమ్మ. తల్లి వృద్ధవితంతువు. సంఘ సంస్కారాన్ని గురించి, భార్యల్ని అదుపులోపెట్టవలసిన అవసరాన్ని గురించి ప్రగల్భాలు పలికే రామన్న ఇంట్లో భార్యా దాసుడు. భార్యకు, తల్లికి మధ్య ఉప్పెనలా చెలరేగే కీచులాటలను సర్దలేకపోతాడు. నానా అవస్థ పడతాడు. కైలాసంగారి హాస్యం కడు సున్నితం. మాటిమాటికి పుట్టినింటికి వెళ్తానని బెదిరించే భార్యను, కాశీకి వెళ్తానని బెదిరించే తల్లిని సర్దలేక సతమతమయ్యే రామన్న అవస్థను హాస్యరసమయసన్నివేశములతో, సంభాషణలతో చక్కగా చిత్రించారు కైలాసంగారు.

"బండవాళవిల్లదె బడాయి" లో తినటానికి లేకున్నా మీసాలకు సంపెంగనూనె కావాలనే మనస్తత్వంగల వ్యక్తుల ప్రవర్తన చిత్రించబడింది. కైలాసంగారి ప్రతిభ సంభాషణ చాతురిలో, పాత్ర చిత్రణలో, మనస్తత్వపరిశీలనలో, సన్నివేశకల్పనలో ద్యోతకమవుతుంది. వాచాలుడూ, గొప్పలు, ప్రగల్భాలు చెప్పుకునేవాడూ అయిన లాయరు చివరికి నష్టాలకు, అవమానానికి గురి అవుతాడు.

గురజాడ అప్పారావుగారికిమల్లే ప్రాచ్య, పాశ్చాత్య సంప్రదాయాలను బాగా గుర్తెరిగినవారు శ్రీ కైలాసంగారు. సమాజజీవనమున కింత సన్నిహితంగా రచనలు సాగించినవారు కనుకనే వీరి నాటకాలు బహుజనామోదాన్ని పొందాయి.

కైలాసంగారి నాటకాలలో ప్రసిద్ధమయిన మరో నాటకం "సూళె" (లంజ). కైలాసంగారి రచనాశక్తితో బహుముఖాల విజృంభించి అత్యుత్తమనాటికగా ప్రసిద్ధిచెందింది. ఇది వేశ్యాజీవనంలోని నీడలపై, ఘనీభవించిన చీకటిపై వెలుగును ప్రసరించిన విజ్ఞాన కరదీపిక. సంఘ క్రౌర్యానికి బలియైన సహస్రాధిక పతితస్త్రీ జనసమూహానికి కానుకగా అర్పించబడ్డ యీ నాటకంలోని వేశ్యాపాత్రచిత్రణం అద్భుతరీతిలో జరిగింది.

అప్పారావుగారి మధురవాణి వచోమధురిమను, సోయగాన్ని, చమత్కారాన్ని, శూద్రకుడి వసంతసేన కళాహృదయాన్ని, గుడిపాటి వెంకటచలం గారి "త్యాగం" లోని వనకుమారి ఆర్ద్రతను, మధుర మనస్కతను సర్వవిధాల ప్రతిబింబించే మహత్తరపాత్రను సృష్టించారు, "సూళె" నాటకంలో కైలాసంగారు. వేశ్యపాత్రద్వారా దీన్ని సాధించారు.

ఈవేశ్య రోజూ తనదగ్గరకు ఆనందం కోసం వస్తున్న విటుల సంసార పరిస్థితుల్ని గమనించి ప్రవర్తిస్తుంది. ధనాశాప్రపూరితం కాని ఆర్ద్రహృదయంతో, దయతో వర్తిస్తుంది. స్త్రీలు వేశ్యాజీవనం గడపడానికి దారితీసిన ఆర్థికదుస్థితిని చూసి పరితపిస్తుంది. సాంఘిక దౌర్జన్యానికి గురియై ఇహపరాలకు దూరులైన తనజాతిమీద అనంతమయిన సానుభూతిని ప్రదర్శిస్తుంది. నేటి కాలంలో సంసారాన్ని గురించి మాట్లాడేవాళ్లలో నిజమయిన సానుభూతి, హృదయపరిన వర్తన లేకపోవడం చూసి ఆమె హృదయం దహించుకుపోతుంది. తను చనిపోయేపరిస్థితుల్లో తనబిడ్డ తన

తరువాత వేశ్యాపుత్రికగా సంఘంచేత దారుణశిక్షలకు, నిందలకు, అపహాస్యానికి క్రౌర్యానికి బలి అవుతుందేమోనని మథనపడుతుంది. తుదిక్షణంలో తన జీవితాన్ని, తనబిడ్డజీవితాన్ని అంతం చేసుకుంటుంది.

ఈ పాత్రద్వారా మానవత్వానికి జరుగుతున్న మహాపరాధాన్ని, అత్యాచారాన్ని విశిష్టధోరణిలో చిత్రించారు శ్రీ కైలాసంగారు.

హాస్యరసప్రధానమైన మరోనాటకం "నం కంపెనీ" ప్రథమరంగంలో రావణుడి రంగస్థల ప్రవేశం, మంత్రి సేనాపతుల ప్రవర్తనా, పుత్రప్రాప్తికై రాజు పడే అవస్థ, కన్నడ, హిందూస్థానీ, కేరళ సఖుల పాటలు గురజాడవారినీ, భమిడిపాటివారినీ జ్ఞాపకానికి తెస్తాయి. గిరీశం ఇంగ్లీషు పాటల ధోరణి, దానిద్వారా సాధింపబడ్డ హాస్యమూ చదువరుల హృదయాలలో మెదలుతుంది.

శ్రీ కైలాసంగారు ఇంగ్లీషుభాషలో కొన్ని నాటకాలు రచించారు. "Purpose" (పర్పస్) మొదలైన నాటకాలు బహుళవ్యాప్తిని పొందాయి. కైలాసంగారి నాటకాలలో నూతన భావోత్తేజమూ, నవ్యతా పుష్కలంగా కనిపిస్తాయి. పౌరాణికేతివృత్తాలు విప్లవకధోరణిలో మలచడంలో శ్రీ కైలాసంగారు సిద్ధహస్తు లనిపించుకున్నారు. అనితరసాధ్యమైన ప్రజ్ఞావిశేషాలు ప్రదర్శించారు. నగ్నసత్యాలు, చేదుసత్యాలు ఉన్నవి ఉన్నట్లుగా చెబితే కొందరికి నచ్చవు. అందుచేత ఆయన హాస్యమనే చక్కెరపూతతో సంస్కారాన్ని సాధించడానికి యీ ధోరణిలో రచన సాగించారు. నాటకం తేనెతో తీసుకునే ఔషధంగా ఉండాలని మహానటుడు శ్రీ బళ్లారి రాఘవ ప్రభృతుల అభిప్రాయం. అందుచేత రాఘవ గారికి కైలాసం నాటకాల పట్ల అమితాభిమానం ఉండేది.

కన్నడాంగ్ల భాషలలో పాండిత్యమూ, సంస్కృత భాషా పరిచయమూ, ఆధునికాంగ్ల రచయితల నిశితదృక్కూ కైలాసంగారి రచనలు మేధావుల నాకర్షించడానికి కారణాలు. వీరి నాటకాలు సాంఘిక చైతన్యానికి, సంఘ సంస్కారోద్యమ వ్యాప్తికి సహాయపడ్డాయి. కైలాసంగారి రచనలు ఇతర భాషలలో అనువాదం కావలసిన అవసరం ఉన్నది.

కాటమరాజు కాత్రేడు దేవత ప్రతినిధియా?

శ్రీ సోమరాజుపల్లి చెంచయ్య

గత ఏప్రియల్ నెల "భారతి"—"కలగూరగంప" యందు "కాత్రేడు—కాటమరాజు"—శీర్షికను ప్రచురితమైన వ్యాసమునందు శ్రీ ఆరుద్రగారు ఈ క్రింది విషయములను సిద్ధాంతీకరించియున్నారు.

1. కాత్రేడు—వేటకాండ్ర ఆరాధ్యదేవతయేగాక—స్త్రీలకు సంతానప్రాప్తిని గలిగించు దేవత.

2. కాటమరాజు — కాత్రేడుప్రతినిధిగా మారుటవలన—కాత్రేడుదేవత కాస్తా కనుమరుగైపోయి—కాత్రేడు దేవతకు మారుగా—కాటమరాజు చలామణి అగుచున్నాడు.

3. కాత్రేడు మాత్రమే దేవతగాని—కాటమరాజు మృతవీరుడు.

ఆరుద్రగారి కలమునుండి చిందిన మాటలనే ఉటంకించి తర్వాత నా అభిప్రాయములను వ్రాస్తాను.

"తెలుగు బాలింతలు కాత్రేడు చీరెలు కడతారు."

ఆరుద్ర ఊహించినట్లవి "కాత్రేడుచీరెలు" గావు. ఆ చీరెలను "కాటేరుకో (గో) కలు" అంటారు.

సాధారణముగా కొందరు స్త్రీలకు కలిగెడి "ప్రదర" అనువ్యాధి "కాటేరు (రి)" అను క్షుద్రదేవతవలన కలుగుచుండునని ప్రజానీకముయొక్క ప్రాచీన విశ్వాసము !

దీనినే "కాటేరు (రి)" "రక్త కాటేరు (రి)" అని రెండు రకములుగా పిలుస్తారు. సాధారణ 'ప్రదర' వ్యాధి మొదటి దేవతవలన; "రక్త—ప్రదర" అను వ్యాధి "రక్త కాటేరు (రి)" వలన కలుగునని వారి విశ్వాసము.

బసవరాజీయము, నందినాథీయము, ఆయుర్వేద వైద్యచింతామణివంటి ఆయుర్వేద వైద్యగ్రంథములు—ఈ వ్యాధులను "ప్రదర—రక్తప్రదర" అను వ్యాధులనియు, జీర్ణించిన వ్యాధులను "కుసుమ వ్యాధులు" అనియు పేర్కొని అతి మైథునమువలన ఈ వ్యాధులు కోమలులకు కలుగుచుండునని నిర్ధరించుచున్నవి.

ఈ వ్యాధులు "కాటేరు" మంత్రప్రయోగమువలన గూడా కలుగుచుండునని కొందరి నమ్మకము. దీని నివారణకుగాను నడుకునూలు చీరె అంచులకు నీలి తొగరు గళ్ళు ఉండునట్లు నేయించి—అమావాశ్య రోజు ఉదయము ఆ వ్యాధి పీడితురాలైన యువతి, ఇంటి బయటి వసారాయందు పొంగలి బెట్టి, ఆ పొంగలితోబాటు ఒక కోడిని గూడా బలి ఇచ్చి—అవి చాకలికి ఇచ్చిపంపి—ఆ చీరెను ధరిస్తుంది. ఇలా చేసిన ఎడల ఆ వ్యాధి నివారణయగునని పల్లీయుల నమ్మకమై యున్నది.

ఈ చీరనే "కాటేరు కోక" అంటారు. ఇలాగే సంతాన ప్రాప్తికిగాను "నాగులు (నాగుపాములు) ఉండే పుట్టలను

పూజించి—'నాగులకోక' ధరిస్తుండడముగూడా ప్రాచీన పల్లెపడతుల సంప్రదాయము. ఇంకను బాలారిష్టములకు లోనైపోయి బిడ్డలు బ్రతుకనివారు "చెంచుపేరంటాలు" కోక—ఎఱ్ఱి తొగరు గళ్ళు—అర అంగుళము వెడల్పుగా నిట్ట నిలువు చిట్టెలు నేయబడిన—చీరెలు కట్టుకోవడము, పడక మీద పరుచుకోవడము పరిపాటి.

ప్రసూతిగృహములయందు ఈ "కాటేరు" అను క్షుద్ర దేవత ప్రవేశించి—శిశువులను చంపకుండుటకై—ఆ ఇంటిగోడలునాలుగు మూలలమీదా, గారకంపతెచ్చి పెట్ట డమేగాక—వృద్ధస్త్రీలు ఎవరో ఒకరు ఆ ప్రసూతి గృహము నందు కూర్చొని —

"బ్రాహ్మడికూతురు మాదిగోడి పెండ్లాం—ఏరు దాటిపోయింది ఎల్లమ్మ" అని ఉచ్చరిస్తుంటారు.

ఈ క్షుద్రదేవత పుట్టుపూర్వోత్తరాలనుగుఱించి జన సామాన్యమునందొక కథ గలదు. అది ఇదియై యున్నది:

వేదపారంగతుడైన ఒకానొక బ్రాహ్మణుడి యింట వ్యవసాయము పనులు చేయుటకై ఒక మాదిగయువకుడు తన వర్ణవృత్తాంతమును మరుగుపఱిచి, శూద్ర నామధేయుడై ఆతని ఇంట జీతమునకుచేరి వారి ఇంటనే భుజించుచు పశువుల సాలలో నివాసముండెడివాడట !

ఆ బ్రాహ్మణకుటుంబ సాహచర్యమువలననేమి, ఆతని మేథాశక్తివలన గానీండి కొలది రోజులలోనే—శ్రుతపాండితీ శక్తివలన యుక్త వయస్కురాలు, అవివాహిత అయిన యజ మాని కుమార్తె ప్రేమకు పాత్రుడై అమెను వివాహమాడి సంతానవంతుడయ్యెనట !

వృద్ధయైన ఆతని తల్లి కొడుకు కోడండ్రవద్ద శేషజీవితమును గడుపదలచి వారివద్ద జేరెనట !

ఆ బ్రాహ్మణయువతి భర్తకును అత్తగారికిని ఒకే పర్యాయము భోజనము వడ్డించెనట! ఆనాడు గుమ్మడికాయ కూర వండెనట!

మాదిగఇంట బుట్టి పెరిగిన అత్తగారు ఆ గుమ్మడి కాయ ముక్కలను తినుచు—పశుమాంసముగా భ్రమించి— "పెద్దగొడ్డు మాంసము ఎచట తెచ్చితివిరా" అని విస్తు పోవుచు కొడుకు నడిగెనట!

ఆవిడ తాను వంచిత అయినట్లు తెలుసుకుని—ఆ రాత్రియే తన భర్తను, అత్తగారిని, బిడ్డలను నిదురపుచ్చి ఆ ఇంటికి చిచ్చుబెట్టి తన వారితోబాటు తాను గూడా మరణిం చెనట!

అలా మరణించిన ఆవిడయే "కాటేరు" అయినదట.

ఇదీ జనసామాన్యము చెప్పుకునే "కాటేరు" గాథ!

పురుటిఇండ్లయందున్న శిశువులను చంపుట, యువ తులను ప్రదరవ్యాధిపీడితల గావించి—చంపుచుండుట—ఈ దేవత కార్యక్రమము!

అందుచేత బాలెంతలను, పల్లీయులు గాలిదూరని గదులయందుంచి—"బ్రాహ్మడి కూతురు.....ఎల్లమ్మ" అని ఉచ్చరిస్తుంటారు.

దీనివలన "కాటేరు" నా పూర్వ వృత్తాంతము ఈ ఇంటివాళ్ళకుగూడా తెలిసిపోయిందే?" అని వెళ్ళిపోతుందట!

శిశువు క్షేమముగా ఉంటాడట!

ఇది సాధారణజనుల నమ్మిక! ఈ విశ్వాసముతోనే— వరి ఊకపోసి నిప్పు అంటించిన కుంపటియందు పశువుల కొమ్మును కాలబెట్టుటగూడా ఒక అచారమై ఉన్నది. ఈ ప్రక్రియ గూడా ఆ క్షుద్ర దేవత ఆగమనమును అరి కట్టుటకై ఏర్పాటుచేయబడిన ప్రాచీన ప్రసూతీగృహ రక్షణ విధానమం దొకటియైన సాంప్రదాయికమైన అచారమై ఉన్నది.

అలాంటప్పుడు ఈ "కాటేరు (రి) దేవత, "కాట్రేడు" దేవత ఒకరే అనుటకు అవకాశము లేశమాత్రమైన కనుపిం చుట లేదు.

"ఏరుదాటిపోయింది ఎల్లమ్మ"—

ఈ ఎల్లమ్మ ఒక దేవత. ఈవిడను గుఱించి స్వర్గీయ శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" యందు ఇలా చర్చించిరి: "ఏకవీర—ఈ దేవత శైవ దేవతయై యుండును. "కాకతమ్మకు సైదోడు ఏకవీర"అని వర్ణించిన పద్యమునుబట్టి ఈ దేవత రేణుక (పరశురాముని తల్లి) యని స్పష్టము. ఈమె మాహురము అను గ్రామమున నెలకొన్న దగుటచే మాహురమ్మ (ఈమెయే "మారెమ్మ" అని నెల్లూరు మాండలికము) యనియు పిలువబడెను. ఈమె నగ్న దేవత.

ఈమెనే ఇప్పుడు తెలంగాణములో రాయలసీమలో "ఎల్లమ్మ దేవర" అని యందురు. (ఏక వీరమ్మకు మాహు రమ్మకు అధో హ్రీంకార మధ్యాత్మకున్"—క్రీడాభిరామము)

ఇక ఈ ఎల్లమ్మ విగ్రహము ఆలంపూరునం దున్నదని శ్రీ రెడ్డిగారే వ్రాశారు.

అంతేగాదు—మరికొన్ని వివరాలుకూడా ఇలా తెలియ జేశారాయన!

"అట్టి యలంపూరులోని బ్రహ్మేశ్వరాలయములో తలలేని మొండెము, నగ్నత్వముతోనున్న ఒక స్థూల దేవతా శిల్ప మును స్థానికులు ఎల్లమ్మ అనియు, రేణుకయనియు పిలు తురు. తండ్రి యాజ్ఞచే తల్లియగు రేణుకతలను పరశు రాముడు నరుకగా తల ఎగిరి మాలవాడలో బడెనట! మొండెము మాత్రము అచట నిలిచెనట. ఆమె గొడ్డాండ్రకు పిల్లలనిచ్చు దేవతయని ఆలంపురీ మహాత్మ్య మను స్థానిక లభ్యమాన లిఖితపుస్తకమందు వర్ణితము.

ఈ ఎల్లమ్మ కథను రేణుకకథగా నేటికిని రాయలసీమ పల్లెలలోను, పాలమూరు జిల్లాలోను బవనీండ్లు అను (బైనీం డ్లు అనునది నెల్లూరుజిల్లా మాండలికము) మాదిగ జాతివారు "జవనిక" (జమిడిలి) వాయించుచు కథగా రెండు దినాలు చెప్పుదురు.

ఈ "కాట్రేడు చీర", "కాటేరు కోక"—ప్రయోగములు నాకు దెలియునంతవరకు చందాల కేశవదాసుగారిచే వ్రాయబడిన "కనకతార"—తొట్టతొలి తెలుగు చిత్రములో అనాథయైన, కమలను కామించి గవయగోరిన జాలరి పాడిన పాటయందు, మొదటిది ఉపయోగింపబడియున్నది :—

"కాట్రేడు సీ (చీ)రెగట్టి
గోటేసిన రైక దొడిగి
మాలచ్చోలిగనుంటాయే......"

ఇక రెండవది అయిన "కాటేరు" కో(గో)క" అను దాని ప్రయోగము ఒక జానపద గేయశకలమునందు ఉపయోగింపబడియున్నది.

ఆ గేయశకలము నిచట ఉదాహరించుచున్నాను.

"కందుకూరు చిన్నదాన
కాటేరు (రి) కోకదాన;
కట్టు చెంగులమీద
సజ్జాకు పసరేడదే?

* * *

"కాటిరేడు" పేరిట సప్తవింశతి కథలయందు వ్రాయబడియున్నదని శ్రీ రెడ్డిగారే "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" (P. 318)—యందు ప్రస్తాపించిఉన్నారు.

'కాటిరేడు' కాస్తా 'కాట్రేడు'గా మారిపోయినాడు.

"కాడు" అనగా స్మశానము; వనము" అని గూడా అర్థము కలదు.

ఇచట "కాట్రేడు" అనగా వన దేవత—అని నా మనవి.

ఈ దేవత ప్రాచీన ద్రావిడదేవతలయందు ఒక దేవత!

ఆ రోజులయందు చెట్లను, గుట్టలను ఆరాధించుచుండుట మనదేశీయుల ప్రాచీన సంప్రదాయము. ఇక వేటకు వెళ్లెడి వేటకాండ్లు—తాము వేటనుండి సురక్షితముగా తిరిగి ఇండ్లకు జేరునట్లు చేయుమని, వన దేవతను ప్రార్థించుచుందురు. అంతేగాదు. ఏదేని చెట్టు ఎక్కునపుడు దిగునపుడు ఆ వృక్షమునకు నమస్కరించి వచ్చుచుండుట పల్లెసీమయందలి అనాది ఆచారము.

'కాటిరేడు' అనునదియే జనసామాన్యము నోళ్ళయందు బడి "కాట్రేడు"గా మారియుండుననుకుంటాను.

స్త్రీలకు ప్రదరవ్యాధులను కలిగించు "కాటేరి"(రు) అను క్షుద్ర దేవత, ఈ "కాట్రేడు" దేవత (లు) మాత్రము ఒకరే కాజాలరు.

కాట్రేడుదేవతకు బదులుగా కాటమరాజును ప్రజలు ఆరాధించుచున్నారని ఆరుద్రగారు అభిప్రాయపడిరి. కాట్రేడు దేవతకును, కాటమరాజులకు ఎలాంటి సంబంధములేదు.

1943 సంవత్సరము సెప్టెంబరు నెలయందు నెల్లూరుజిల్లాయందలి పొదిలి డివిజను గ్రామములు అయిన "చిమట" "సన్నమూరు" అను గ్రామములమీదుగా కాలిబాటన పొదిలి వెళ్ళదలచి ప్రయాణము జేయుచుంటిని.

సన్నమూరు గ్రామపొలిమేరయందు "కాటమరాజు" దేవాలయము ఉండుట స్వయముగా జూచియుంటిని.

ప్రతి సంవత్సరము ఈ కాటమరాజు తిరుణాళ్ళు గావించుచుందురని—ఆ గ్రామప్రజలు నాకు జెప్పిరి. అంతేగాక, ఈ కాటమరాజు—పశుపాలనయే వృత్తిగాగల్గిన "యాదవుల" ఆరాధ్య దైవము. యాదవులయందు కొందరు "కాటమరాజు" పేరు పెట్టుకునేవారు గూడా గలరు. ఈ కాటమరాజు నెల్లూరుజిల్లా కనిగిరిసీమయందలి ఎఱిగడ్డపాటి కాటమరాజే!

ఇలాగే ఈశ్వరుని—మల్లయ్య, మల్లయ్యస్వామి" అని గూడా అంటారు.

పైరుపచ్చలు బాగా ఫలించుటకై ఆరాధించెడి దేవుడినిగూడా "మల్లయ్య (ఈయననే "పిచ్చి మల్లయ్య అని గూడా పిలుస్తుంటారు)—ఈ (పిచ్చి) మల్లయ్య (సామిని)ను, మల్లయ్యసామి (ఈశ్వరుడు) ఒకరే అని అనడానికి అవకాశము లేదుగదా ? అలాగే "కాట్రేడు" — కాటమ రాజులు "కాట్రేడి" — "కాటేరి (రు)" — దేవతలు ఒకరేగాని, కాటమరాజు వారి ప్రతినిధిగాని కాజాలరు.

"కాటమరాజు"ను (మృత)వీరుడని కొలుస్తారు" అన్నారు, ఆరుద్ర.

వీరులు చాలా రకాలున్నారు.

నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకా కొండపిబ్లాకునందు చేరిన గ్రామమైన "పెట్లూరు" అను గ్రామమునందు "ఈర్లదేవాలయము" కలదు.

ఈరయ్య, ఈరమ్మ "అని ఈ దేవత పేర్లను పెట్టుకునేవారున్నారు—

చినపీరు సాహేబు, పెదపీరు సాహెబ్ అని పీర్ల పేరులను తమబిడ్డలకు పెట్టుకునే—మహమ్మదీయుల్లాగా !

ఇవాళ మారుతున్న గ్రామసీమయందు కాట్రేడు దేవతను గొల్చు ఆచారమేగాదు—మరే గ్రామీణదేవతల ఆరాధనలపట్లగాని ప్రజానీకమునకు విశ్వాసము క్రమక్రమముగా సన్నగిలుచుండుట గమనార్హము !

శ్రీ ఆరుద్ర మదరాసు మహా నగరమునందు సినీ కవి. ప్రాచీనపుస్తకముల ఆధారముతో — పల్లెటి సీమకు దూరముగా ఉంటూ— మారుతున్న పల్లెసీమయందొకనాడు చలామణియందుండి — క్రమక్రమముగా కనుమరుగైపోవుచున్న గ్రామీణ దేవతలనుగుఱించి, గ్రామీణ ఆచారములను గుఱించి గావించెడి ఊహాగానమువలన ఎలాంటి పొరపాట్లు కలుగుచున్నది ఎత్తిచూపుట కొఱకే—ఈ నాలుగు ముక్కలు రాస్తున్నాను.

ఆరుద్రగారు, కాటమరాజు కాట్రేడుదేవత ప్రతినిధి అనే అభిప్రాయాన్ని ఇంతటనైనా మార్చుకొనగలరని విశ్వసిస్తున్నాను.

గ్రంథ విమర్శనము

రామరాజ్యము, అశోకరాజ్యము, మోహన విజయము, వినోద—బహిష్కరణములు (ఖండ కావ్యములు)

కర్త :—సాహిత్య శిరోమణి, ఉభయభాషాప్రవీణ, శ్రీ కాండూరు నరసింహాచార్యులు, ప్రధానాంధ్రపండితులు, పి. ఆర్. బోర్డు హైస్కూలు, జమ్మలమడుగు, కడపజిల్లా.

మిక్కుటమైన సాంఘికప్రజ్ఞలో, మేదినిపై మరల రామరాజ్య మవతరింపవలెనను మేదురకాంక్షతో కావ్యములు వ్రాసినవారిలో శ్రీ కాండూరు నరసింహాచార్యులగారొకరు. వీరు సాహిత్య శిరోమణి, ఉభయ భాషాప్రవీణ, పట్టభద్రులు. వీరు వ్రాసిన 'రామరాజ్యము' ఐతిహాసికమే. 'అశోకరాజ్యము' చారిత్రకము. 'మోహనవిజయము' సాంఘికము—వినోద—బహిష్కరణములను ఖండకావ్యద్వయముగూడ నిట్టిదె. లోకసంగ్రహము నాకాంక్షించు కవి సాంఘికదృష్టిని మనసులో బెట్టుకొని ఈ నాల్గు గ్రంథముల నించుక పరిశీలింప వలసియున్నది.

రామరాజ్యము

మహా ప్రబంధము, 261 పుటలు. వెల రు. 3.

రామకథ లోకాభిరామమైన కథ. అజరామరమైన ఈ కథను నరసింహాచార్యులుగారు ఆరాశ్వాసముల మహాప్రబంధముగా నమరించి వ్రాసినారు. "జాతీయతాభివృద్ధియే కావ్య నిర్మాణమునకు పరమప్రయోజనమగునేని అట్టి ప్రయత్నమే గదా రసికజనహృదయంగమ మగుచున్నది?....మన స్వతంత్ర భారతమును క్రీ. శ. 1947 ఆగస్టు 15 నుండి రామరాజ్యముగా భావించుకొనుచున్నాము. ఇందుగల సత్యమెంతమాత్రము? ....మనము స్వతంత్రులమైన వెంటనే మననాయకు లనిర్వచనీయమైనసంఘటనల నెన్నింటినో యెదుర్కొనవలసి వచ్చిన మాట మరువరానిది. ఇంకను మనమనేక విషయములను సాధించి సంపూర్ణస్వాతంత్ర్యమును నిలువబెట్టుకోవలసి యున్నది." కవిగారి యీ పరిచయవాక్యము లాయన దృష్టిని, ఈ కావ్యరచన వెనుకనున్న చోదకశక్తిని నిరూపించుచున్నవి. తన్ను అయోధ్యకు మరలించుకొనిపోవ వచ్చిన భరతునితో రాము డిట్లనుచున్నాడు : "ధర్మశాసనంబు సమస్తప్రజానీకంబునకు సామాన్యంబు. దానికి శాస్య శాసక తారతమ్యంబు లుండవు. ఎందాక లోకంబు నియమబద్ధంబగు నందాక సుఖసమృద్ధి వెల్లివిరియు" ఈ మాటలు కవి దృష్టిని చక్కగా పట్టి యిచ్చునవి. శ్రీ రామ వాలి సంవాదములో కవి రామునిచేతనే రామరాజ్యస్వరూపము నించుక చెప్పించినాడు. శ్రీ రామపట్టాభిషేకానంతరము రామరాజ్యమును వర్ణింపబడినది. "నిద్రాణావస్థ తొలంగి పౌరు లెసగవలె"ననియు "శ్రీ రంజిల్ల ప్రజాప్రభుత్వములు సచ్ఛ్రేయంబు చేకూర్పగం ధీరుల్మెచ్చగ పాలనంబుసలుపం దీవించి పాలించు" మనుచు వ్రాసిన ఆశ్వాసాంతపద్యము లీకవి సామాజిక వ్యగ్రతను బుజువు చేయుచున్నవి.

ఈ కావ్యమున కథాగమనము చటుల వేగముతో సాగినది. వాల్మీకి రచనలోని భావము లచ్చటచ్చట తొంగి చూచుచు మరులు గొల్పును. ఆ యా చోట్ల చేసిన ఋతువర్ణనలు ప్రసన్న మధురములు. వర్షర్తువు రాగా విరహియైన రాముడు లక్ష్మణునితో ఇట్లనుచున్నాడు :

జలధి సలిలంబు గ్రోలుచు,
దెలియకబడబాగ్ని మ్రింగి తికమకపడుచున్
లలి మెరపు తీగె నెపమున వెలి
గ్రక్కెడు మేఘపంక్తి వీక్షించెదవో?"

సీతపై వాదునకుబోవుచు శూర్పణఖ "నవ్వెదవేల నా సవతి! నవ్వులు గివ్వలు పుచ్చివైచెదన్, చివ్వకు జీరు నేర్పిదియొ ఛీ" యని చీత్కరించి మాటాడును. పాత్రచిత్రణమిట్లు తత్తత్స్వభావసముచితముగా నున్నది. రచన ధారాళము. ప్రసన్నము. కాని ఛందోభంగము కాకుండుటకై చేసిన 'శ్వేత ఛత్రము' వంటి ప్రయోగములు సకృత్తుగా గానవచ్చుచున్నవి.

అశోకరాజ్యము

చారిత్రక ప్రబంధము : 150 పుటలు. వెల రు. 2.

రామ రాజ్యము తరువాత మరల నట్టిరాజ్య మశోక రాజమను నమ్మికతో వ్రాసిన దీ కావ్యము. ఇది మూడాశ్వాసముల చారిత్రక ప్రబంధము. మగధరాజ్య చరిత్రతో నారంభించి అలెగ్జాండర్ చంద్రగుప్త బిందుసారుల స్పృశించి అశోక రాజ్యారంభమును వర్ణించి మొదటి ఆశ్వాసము ముగియును. కళింగ యుద్ధమున కాకరమైన కథయంతయు ద్వితీయాశ్వాసము. తృతీయాశ్వాసమున అశోకరాజ్య పాలనము అతని శాసనములు బౌద్ధమతవ్యాప్తి చెప్పబడినవి.

గ్రంథ విమర్శనము

ఈ పాతిక ముప్పది సంవత్సరములలో మనకు మహా కావ్య సదృశములైన ఉత్తమచారిత్రక ప్రబంధములు వచ్చినవి. రాణాప్రతాపసింహ చరిత్ర, శివభారతము, ఆంధ్ర పురాణములవంటి మహాకావ్యముల నిట స్మరింపవలసియున్నది. కాని చరిత్రను కావ్యముగా జేయుటకు దానిని చాది సారము మూసపోయవలెను. ఆ యా వ్యక్తుల ఆత్మస్వరూపమును భావవిస్ఫూర్తితో బయటకు చిందింపవలెను. నీరస విషయముల బరిహరింపవలెను.

అశోకరాజ్యమున కండపట్టుగల కథాభాగము ద్వితీయాశ్వాసము. త్రికళింగాధిపతి కళింగమల్లుడు దంత పురమున పాలించువాడు. వాని మంత్రి నాగవర్మ. ఉత్తరమున మహేంద్రవర్మ తోసలిరాజు. అతని మంత్రి హేమనంది. ఇంద్రవర్మ కూతురు నాగవల్లి. మరింతపైగా పాటలీపుత్రమున అశోకుడు. మంత్రి సారంగపాణి. కళింగ మల్లుడు దక్షిణాపథ రాజ్యముల కూటమి నేర్పరుపదలచిన జిగీషువు. ఇంద్రవర్మ కుమార్తె నాగవల్లిని పరిణయమాడి మగ సంతులేని అతని రాజ్యమును కైవసము చేసికొనవలెనని కళింగ మల్లుని ఆశ. హేమనందిని రాయబారము పంపగా ఇంద్రవర్మ వృద్ధుడగు కళింగమల్లునకు కూతునీయను పొమ్మనెను. దానితో వ్యవహారము బెడిసెను. కళింగమల్లుడు తోసలిని పట్టుకొనెను. అశోకుని సాహాయ్యమర్థించి ఇంద్రవర్మ అంతకు మునుపే హేమనందిని అశోకునివద్దకు రాయబారమంపియుండెను. కాని అశోకుని సేనలు వచ్చుసరికి కొంచె మాలస్యమై ఇంద్రవర్మ పారిపోయి అడవిలో తలదాచుకొనవలసి వచ్చెను. సాహాయ్యవార్త తెచ్చుచుండిన హేమనంది కళింగమల్లుని భటులకు చిక్కెను. ఇంద్రవర్మ నాగవల్లులు ఎట్లు తప్పించుకొని యుందురన్నది చెప్పకపోగా కళింగమల్లు డాతని ఉరి తీయించెను. ఇంతలో అశోకుని సేనలు వచ్చి మహానదీతీరమున విడిసెను. ఇంద్రవర్మ అశోకుని దర్శనము సంపాదించుకొని పరిస్థితి చెప్పుకొనెను. తర్వాత యుద్ధము. అశోకుని విజయము. ఇంద్రవర్మ తానుగూడ యుద్ధమున పోరి అశోకసన్నిధిలో మరణించెను. విజయముతర్వాత అశోకునిలో పరివర్తనము. నాగవల్లి నశోకుడు వివాహమయి ఆమెను తోసలిలోనుండుమనెనుగాని ఆమె పాటలికిపోయి భర్తకు తోడుగ దీక్ష వహించెను. ఈ కథాభాగమున ఆచార్యులవారి కవితాప్రతిభ సముచితముగ ప్రతిభాసించినది. పూర్వప్రబంధముల రచనా భాగముల దలపించు పంక్తులెన్నైన నున్నవి.

కాని ఈ కావ్యమున సంవిధానరాహిత్య మొక గొప్ప లోపమనక తీరదు. అశోకుని రాజ్యపరిపాలనారంభముతోనే కావ్య మారంభించి వెనుకటి చరిత్ర నించుక స్ఫురింపించి యుండిన చాల బాగుండెడిది. ప్రథమాశ్వాసమున అశోకుడు వేటకుపోయి శ్రమణకుని ఆశ్రమము ప్రవేశించుట దుష్యంతుని కణ్వాశ్రమప్రవేశమును మనసులో బెట్టుకొని వ్రాసినను అంతగా కదలించుటలేదు. మూడవ ఆశ్వాసమున బౌద్ధమతవ్యాప్తి, అశోకుని పదునాలుగు శిలాశాసనములు, ఆరు స్తంభశాసనములు, కళింగ, రూపనాథ, బ్రాబా శాసనములు, కట్టడములు, అశోకుని తీర్థయాత్రలు వర్ణింపబడినవి. శాసనస్థవిషయములను పద్యములలో వ్రాయుటవలన ప్రయోజనమేమో చెప్పుట కష్టము. ఇది కావ్యపద్ధతికి భిన్నము. దీనితో నీ కావ్యము నీత్యుపదేశ పద్ధతికి తిరుగుచున్నది. ప్రసన్న మధురమైన ఆచార్యులగారి శైలి కొక ఉదాహరణ చిత్తగింపుడు :

ఇచ్చల దేలువారవని నింతులు, వారి మనో రథమ్ముల
న్మెచ్చక కుచ్చితుండగుచు మేదిని నొక్కనికంటగట్టనా
యిచ్చినవాడు మూర్ఖుడగు హెచ్చుగ గోపుర ముందరింపదే
మిచ్చిన నెంతనాడయిన నిచ్చకముల్పచరింప బండునే.

యస్. కె.

మోహన విజయము

సాంఘిక ప్రబంధము. 97 పుటలు. వెల. రు. 2.

భార్యతో ననురాగముగనున్నచో బిడ్డలు గలిగి డబ్బు ఖర్చగునని భావించియున్న విశ్వపతియను ధనిక లోభికి మోహనుడొక్కగా నొక్క కొడుకు. విశ్వపతి వానికి చదువు సంధ్యలు చెప్పించునా? శంకరుడను దేశ సేవకుడొకడు తిరునాళ్ళ సందర్భమున నుపన్యసింపగా విని మోహనుడు చదువుకొనగోరి తండ్రి నడిగెను. తండ్రి యొప్పుకొనకపోగా కాశికి ప్రయాణమైపోయి అచట ఇరువది రెండేండ్ల వయసులోపల చక్కగా జదువుకొని దేశసంచారము జేయుచు, కాశ్మీరము చేరెను. అచట వానికొక స్నేహితుడు. కొన్నాళ్ళటనుండగా వాని చెల్లెలు సుశీలతో మైత్రి యేర్పడి ప్రేమగా మారినది. అటునుండి యతడు మరల దేశమంతయు దిరిగి తుద కిల్లుచేరినాడు. ఇంటికి వచ్చిన కొడుకునకు పెండ్లిచేసి కట్నము సంపాదింతమని తండ్రి యూహ. మోహను డాయూహ కడ్డుతిరిగి కాశ్మీరములోని తన ప్రియురాలినిగూర్చి చెప్పెను. తండ్రి ఏమియు చేయలేక ఊరకుండెను. సుశీల కోడలుగా నింటికి వచ్చినది. దంపతులిరువురు ప్రజా సేవలో బడినారు. మోహనుడు ఎలెక్షన్లమీద మోజు లేనివాడైనను మిత్రుల పట్టుదలచే పురపాలక సంఘమునకు అధ్యక్షుడై, తరువాత రాష్ట్రపు టెన్నికలలోను జయించి సముచితమార్గమున దేశసేవ

జేయువాడైనాడు. ఇది ఇందలి కథ. చాలవరకు సమకాలీన సంఘమును ప్రతిబింబించునది. గ్రంథకర్త రాజకీయముల లోని కొన్ని చేదైన సత్యములను అరలేక చెప్పినాడు. వర కట్నములు మొదలైన సాంఘిక దురాచారములు ఖండింపబడినవి. మొత్తముమీద ఇది సాంఘికనీతిని ఉద్బోధించుకావ్యము. విశ్వపతి లోభితనము నంతమిక్కుటముగా దీర్చుట, ఈ మధ్యలో ఒక చిలుకరాయబారము నిరికించుట అంత సహజముగా తోపవు. అయినను ప్రయోజనోద్దేశముతో వ్రాయబడిన రచన యిది. ఈ గ్రంథ వైఖరి కీపద్యము మచ్చుతునక.

> పౌరత యన్ననేమి, పరిపాలన పద్ధతులన్ననేమి, యం
> చారసి రాజకీయముల నంచితవిజ్ఞుడనంగఁ బొల్చి యె
> వ్వారలు నీతికోవిదులు, ప్రాజ్ఞులు, దేశహితైక దృక్కు ల
> వ్వారినె యెన్నుకొంచు దగఁబాలనసేతకు దోడ్పడన్వలెన్.

వినోద బహిష్కరణములు

ఖండ కావ్యములు. 16 పుటలు. వెల : ఆరు అణాలు.

విహారార్థము వచ్చి నదీతీరమున మాటాడుకొనుచున్న ఒక ప్రేయసీప్రియుల జంట అభిప్రాయములను గ్రంథకర్త విన్నట్లుగ తీర్చబడిన ఖండకావ్యము వినోదము. అమ్మాయి అభిప్రాయము ప్రకారము

> "భావములపంట ప్రణయులు పాయకుంట,
> నెఱివిలాసము వెనువెంటనించియుంట
> మది విచారము లేకుంట పదవినుంట,
> కలిమిగలదుంట స్వర్గసుఖంబుఁ గంట"

అబ్బాయి దృష్టి వేరు.

> "ప్రకృతిసేవను మునిగిన ప్రణయమింపు,
> పృథివి చీకటిబాసిన ప్రేమ సొంపు,
> కడగి జగనుద్ధరించెడు గరిమతెంపు
> రమణి భావ వికాసంబు రహివహింపు"

ఇది యిందలి పరమార్థము. బహిష్కరణము చారిత్రకము. రామానుజుల గురువులగు యామునాచార్యులు హరిజనునొకని యుద్ధరించుట ఇందలి కథ. హృదయము స్పృశించునది.

> "మాల కులమున బుట్టిన మారనేడ
> మఠము బాలించు యతికుల మాన్యుడేడ
> దైవయోగంబు లూహకు దవ్వులరయ
> నుత్తములు భేదమెంతురే చిత్తమందు."

ఎస్. కె.

మహాభారత తత్త్వకథనము

రచయిత : మహోపాధ్యాయ, బాలవ్యాస, తర్క, వ్యాకరణ, వేదాంతకేసరి శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, పిఠాపురం, తూర్పు గోదావరి జిల్లా.

మొదటి రెండు భాగములు కల సంపుటము డెమ్మీ 278 పుటలు వెల రు. 2—50.

తృతీయ భాగము. డెమ్మీ 276—534 పుటలు. వెల రు. 1—75.

చతుర్థ భాగము. డెమ్మీ 536—850 పుటలు. వెల రు. 2—00.

పంచమ భాగము. డెమ్మీ 851—1104 పుటలు. వెల రు. 2—00.

షష్ఠ భాగము డెమ్మీ 1105—1482 పుటలు. వెల రూ. 3—00.

తత్త్వ కథనపరిశిష్టము. డెమ్మీ 94+28 పుటలు. వెల రు. 1—50.

ఈ ప్రతులు కావలసినవారు గ్రంథకర్తకు వ్రాయవలెను.

భారత దేశీయ వాఙ్మయంలో—ఒక్క భారత దేశీయ వాఙ్మయంలోనేకాదు, ప్రపంచ వాఙ్మయంలో సంస్కృతమే మిక్కిలి ప్రాచీనమైనది. అందు మహా భారతం ప్రాచీన గ్రంథాల్లో ప్రధానమైనది. "భారతః పంచమో వేదః" అనే ప్రఖ్యాతియే దీని ప్రాశస్త్యాన్ని వెల్లడి చేస్తూ ఉన్నది.

మన దేశంలోని ప్రాచీన గ్రంథాల్లో—అందులోనూ ఎక్కువగా సంస్కృతగ్రంథాల్లో ప్రక్షిప్తాలూ, పాఠాంతరాలు అసంఖ్యాకంగా కానవస్తున్నవి. అందులో కొన్ని విషయాలు పరస్పరవిరుద్ధంగానూ కానరావడం కద్దు. వీటినిబట్టి భిన్న మార్గాలకు చెందిన విద్వాంసులు తమకు తోచిన రీతిగా నిర్ణయాలు చేయడమూ, వాటిమీద వాద వివాదాలు చెలరేగడమూ, వారి వారి అభిప్రాయాలూ, ఖండన మండనములూ బయలుదేరి, అవి పెరిగి పెద్దవయి గ్రంథ రూపంగా వెలువడడమూ జరుగుతూ ఉన్నది. అట్టి గ్రంథాలలో ఈ "మహాభారతతత్త్వ కథనం" ఒకటి. మహా విద్వాంసులూ, బహు శాస్త్రవేత్తలూ, సంస్కృతాంధ్రభారతాలను సవిమర్శంగా పఠించి వాని తత్త్వాన్ని నిర్ణయించగల ప్రతిభావంతులూ అయిన శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు మహా భారత ప్రాశస్త్యాన్ని వెల్లడిస్తూ, భారతంమీద బయలుదేరిన కువిమర్శనలకు పదహారు వందల పుటలకుపైగా వున్న యీ గ్రంథంలో విపులంగా సమాధానాలు ఇచ్చారు. యథార్థ నిర్ణయానికి జరిగిన పండిత సభల వృత్తాంతాలను ఆ యా భాగాలలో క్రోడీకరించారు. శ్రీ శాస్త్రిగారి సమగ్ర పరిశీలన యీ తత్త్వ కథనంలో వ్యక్తమవుతూ ఉన్నది.

గ్రంథ విమర్శనము

ఇందులో మొదటి భాగంలో అనేక కర్తృత్వ నిరాకరణ ఉన్నది. ఆశ్వలాయన సూత్రాన్నిబట్టి భారత, మహాభారతాలు విభిన్న కర్తృకములైన వేర్వేరు గ్రంథాలని ప్రతివాదుల మతం. దేవీ భాగవతాది వచన ప్రమాణాన్ని అనుసరించి ఆ సూత్రార్థాన్ని వివరిస్తూ, రచయిత ఆ ప్రతివాదుల అభిప్రాయాన్ని ఖండించారు. ఇంతే కాకుండా గణపతి మహాభారత లేఖకుడైన విషయం ప్రక్షిప్తం కాదనీ, పురాణాలను ప్రవచించిన సూతుడు బ్రాహ్మణుడే అనీ—ఈ మొదలైన విషయాలు మొదటి భాగంలో ఉన్నవి.

వేద వ్యాస నిందా నిరాకరణ రూపమైన ద్వితీయ భాగంలో 'వ్యాస వాల్మీకులు నిషాదులనే అభిప్రాయము, వ్యాస మహర్షి సంకీర్ణ జాతీయుడనే ఆశయము సయుక్తికంగా నిరసించబడినవి. బీజము ప్రధానమా? క్షేత్రము ప్రధానమా? అనే విషయం ప్రమాణోపపత్తులతో చక్కగా నిర్ణయించబడినది.

శ్రీకృష్ణనిందా నిరాకరణ రూపమైన మూడవ భాగంలో శ్రీ కృష్ణుడు భగవదవతారంకాదనే వాదం ఖండించబడి, అతని పరమేశ్వరత్వం బహు ముఖాల వివరింపబడినది. ద్రౌపదీ వస్త్రాపహరణం జరగనేలేదనీ, శ్రీ కృష్ణుడు కౌరవ పాండవులకు సంధి కలగకుండా చేశాడనీ ప్రతి పక్షులు చెప్పే విషయాలకు ఇందు తగిన ప్రత్యుత్తరాలు వున్నవి.

పాండవనిందానిరాకరణ రూపమైన చతుర్థ భాగంలో రాజ్యాధికారం పాండవులదేకాని, కౌరవులది ఎంత మాత్రము కాదని సప్రమాణంగా నిర్ణయించబడినది. పాండవులు ద్యూతంలో ప్రవర్తించడానికి కారణాలు చూపబడినవి. ధర్మరాజు ద్రౌపదిని రజస్వలావేషం ధరించి రావలసినదిగా కోరినట్లు చెప్పిన ప్రతివాదుల ఆరోపణ నిరాకరించబడినది.

ద్రౌపదీ నిందా నిరాకరణ వివరించబడిన అయిదవ భాగంలో ద్రౌపదీ పూర్వ జన్మ వృత్తాంతము, ఆమె ద్రుపదునికి పుత్రికగా పుట్టుట, వివాహము, ఐదుగురు భర్తలుండుటకు కారణము వివరముగా చెప్పబడినది. నీతిశాస్త్రం అనే పుస్తకంలోని "పంచమే పతయః సన్తి మహ్యంషష్ఠోఽపిరోచతే" అనేది ద్రౌపదీ వాక్యం కాదనీ, అసలు ఆ శ్లోకం ప్రమాణ రహితమనీ సప్రమాణంగా చెప్పబడినది. ద్రౌపదినిగురించిన నిందలన్నింటికీ యిందు తగిన జవాబులు ఉన్నవి.

దుష్టచతుష్టయ చర్య అనే ఆరవభాగంలో దుష్టచతుష్టయం అనబడే కర్ణ శకుని, దుర్యోధన దుశ్శాసనులు ఆదినుంచీ అంతంవరకూ చేస్తూ వచ్చిన దౌర్జన్య కార్యాలూ వాటి ఫలితాలూ వివరింపబడినవి. కురు వంశ నాశనమునకు ఆ నలుగురి దుష్టత్వమే కారణమనీ, యీ అంశాన్ని కౌరవ పక్షీయులు కూడా ఒప్పుకుంటున్నారనీ సప్రమాణంగా చూపబడినది. విశేషించి కర్ణ వృత్తాంతము, దానిపై ప్రతి పక్షుల అభిప్రాయములు వానికి సమాధానములు ఇందు విపులముగా ఉన్నవి.

తత్త్వ కథన పరిశిష్టములో "కర్ణోత్పత్తి విమర్శ" అనే గ్రంథంయొక్క సమీక్ష ఉన్నది. ఆ విమర్శ గ్రంథంలోని విషయాలన్నింటికీ యిందులో సమాధానాలు ఈయబడినవి. అంతేకాకుండామహామహోపాధ్యాయ, కవి సార్వభౌమ శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి కరపత్రాలూ, వాటికి ఈ గ్రంథకర్త యిచ్చిన సమాధానాలూ అనుబంధంగా చూపబడినవి. ఈ విధంగా మహాభారతప్రాశస్త్యానికి భంగకరరాలుగాఉండే విమర్శ లన్నింటికీ శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు సరిఅయిన సమాధానాలు ఇవ్వడానికి ఎంతో కృషి చేశారు.

శ్రీ శాస్త్రులుగారు తాము గ్రంథం రచించడానికి కారణాన్ని యిలా సూచించారు:

"ఫల పుష్పముల నిచ్చునట్టి యొక మహావృక్షము నాశ్రయించి జీవించుటలో వృక్షమునకు చేటు రాకుండ కాపాడుకొనుచు, ఆ పుష్పాదులను సంగ్రహించి లోకుల కందించుచు జీవించుట యొక పద్ధతి. ఆ వృక్ష శాఖలనే ఛేదించుచు కాల్చి బొగ్గులు చేయుచు వానిని లోకుల కందించుచు జీవించుట యొక పద్ధతి. ఇందు మొదటి పద్ధతి వంద్యము. రెండవ పద్ధతి నింద్యము."

ఈ పద్ధతులలో మొదటిదే ఉత్తమమయినందున దాన్ని అనుసరించి, మహాభారతతత్త్వాన్ని వివరిస్తూ, రెండవ పద్ధతిని అనుసరించిన విపరీత విమర్శకుల ఆశయాలను ఖండించారు.

వాస్తవానికి మహాభారతంలో విభిన్న కథాంశాలూ, పరస్పర విరుద్ధాలూ అయిన విషయాలూ, సందేహానికి అవకాశమిచ్చే భాగాలూ అక్కడక్కడ లేకపోలేదు.

అక్కడక్కడ కొన్ని ప్రక్షిప్తాలు చేరడం ప్రాచీన గ్రంథాలన్నిటికీ సహజం! రామాయణ. భాగవతాలలో కూడా ఇలా చేరేవున్నట్లు కానవస్తుంది. తెలుగు గ్రంథాలలో కూడా పాఠాంతరాలూ, ప్రక్షిప్తాలూ ఎన్నో కనబడుతూ ఉన్నవి. అలాటి ప్రక్షిప్తాలను ప్రక్షిప్తాలుగానే గ్రహించి, సమర్థించడానికి పూనుకోకుండా విడిచి పెట్టడమే శ్రేయస్కరం. పరస్పర విరుద్ధాలయిన కథా భాగాల విషయంలో—కల్ప భేదాలను బట్టి కథ విభిన్నంగా వుండవచ్చునని సమర్థించడం యుక్తిసహం కాదేమో !

విద్వాంసుల పద్ధతికీ, విమర్శకుల పద్ధతికీవుండే తారతమ్యాన్ని నిర్ణయిస్తూ శ్రీ శాస్త్రిగారు మొదటిభాగం 94—వ పుటలోనూ, 95—వ పుటలోను ఇలా గన్నారు.

"ఈ యార్ష గ్రంథములను గూర్చి రెండు మార్గము లున్నవి. లందొకటి యనాదిసిద్ధమైన విద్వన్మార్గము. రెండవది యాధునికమైన విమర్శక మార్గము. విద్వన్మార్గములో శబ్దార్థ పరిశీలనము, గ్రంథ సమన్వయము, ప్రమాణాంతర సంవాదము, పూర్వోత్తర విరోధ పరిహారము, సందర్భశుద్ధి, శాస్త్ర మర్యాదానుసరణము మున్నగునవి ముఖ్యాంశములు. విమర్శక మార్గములో నివి యన్నియును మృగ్యములగుట, ఉన్న దున్నట్లు గ్రంథమును వెల్లడింపకుండుట, స్పష్టముగా నున్న విషయమును కప్పిపుచ్చి దానికి విరుద్ధముగా గల్పించు చుండుట, ఏక వాక్యతతో బనిలేకయే గ్రంథములకు తోచి నట్లర్థము చెప్పుచుండుట, పూర్వోత్తర విరోధములను లక్ష్య పెట్టకుండుట, శబ్ద మర్యాదను పాటింపకుండుట ఇత్యాదులు ముఖ్యములు.

ఈ యార్ష గ్రంథములను పఠన పాఠనములలో బెట్టి, వ్యాఖ్యానములు వ్రాసి, నిబంధన గ్రంథములు రచించి చిరకాలాభ్యాస విశేషమున గ్రంథస్థ విషయమును ఆ మూలాగ్రముగ గ్రహించి అదియే తమ జీవిత సర్వస్వమని భావించి కృతకృత్యులై కూలంకష పాండిత్య ప్రతిభ కలవారు విద్వాంసులు !

ఆర్ష విద్యాభ్యాస విశేషములేక ఆంగ్ల భాషా పరిచయము ఆంగ్లేయ గ్రంథదర్శనము, ఆంగ్లేయ సంప్రదాయాభిరుచి కలిగి, ఆర్ష సంప్రదాయ విముఖులై విద్వన్మార్గ దూషణోద్యమము కలవారు విమర్శకులు. ఇట్టి స్థితిలో నార్ష గ్రంథ తత్త్వము విద్వద్వేద్యమా? విమర్శకవేద్యమా? అని పరిశీలింపవలెను"

నిదానించిచూస్తే విమర్శకులకు కూడా పాండిత్యం లేక పోలేదనీ, వారికీ కొంతలయినా ఆర్ష గ్రంథ సంప్రదాయాలు అవగతం కాగలవనీ, సమన్వయజ్ఞానం వుండగలదనీ మనవి. పండితులకు విమర్శన శక్తి అనవసరమయితే కావచ్చునుగాని, విమర్శకులకు మాత్రం పాండిత్యం అవసరమే! ప్రతిపక్షాల యెడలగల అనాదరణ కారణంగా విమర్శక లక్షణాన్ని శ్రీ శాస్త్రి గారివంటివారు పై విధంగా నిర్వచించడం సరసంగాలేదు. శ్రీ శాస్త్రిగారు విమర్శించిన విమర్శకులలో చాలమంది ప్రసిద్ధ విద్వాంసులే! క్షుణ్ణంగా, ఆర్ష సంప్రదాయానుసారంగా విద్యాభ్యాసం చేసినవారే! ఆంగ్ల భాషతో ఎక్కువ పరిచయంలేని వారే కూడాను. అట్టివారియెడ ఈ విమర్శక లక్షణం అవ్యాప్తం అవుతుందేమో!

ఈ విషయం ఎలావున్నా శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కృషీ, సునిశితమైనవారి ప్రజ్ఞా ప్రశంసనీయాలు, మహా భారతాన్నిగురించిన వాదోప వాదాలను సమగ్రంగా తెలుసుకోవాలంటే ఈ గ్రంథాన్ని తప్పకుండా చదవాలి. వాఙ్మయాభిమానులు అందరూ శ్రీ శాస్త్రిగారి కృషిని ప్రోత్సహింతురు గాక !

'అంగీరస'

శ్రీ సిద్ధేశ్వర చరిత్రము

కాకతీయ రాజుల చరిత్ర — ప్రతాప చరిత్ర

కాసె—సర్వప్ప ప్రణీతము : సంపాదకుడు శ్రీ ఖండవల్లి — లక్ష్మీరంజనం ఎం. ఏ. ఆంధ్ర శాఖాధ్యక్షుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయము. డెమ్మీ సైజు 10+106+175+12 పుటలు. మేలు కాగితము. వెల ఆరురూపాయలు. ప్రకాశకులు : *ఆంధ్ర రచయితల సంఘము, హైదరాబాదు.*

సిద్ధేశ్వర చరిత్రం అనే యీ పుస్తకంలో మూడాశ్వాసాలు వున్నవి. ఇది ద్విపద కావ్యం. మొదటి ఆశ్వాసంలో పార్వతీ పరమేశ్వరుల వివాహ కథా, ఆ ఆది దంపతులు సిద్ధేశ్వర, పద్మాక్షీనామములతో హనుమకొండ సమీపంలోని సిద్ధాశ్రమంలో వెలసి భక్తకోటికి అభీష్టవరాలు ప్రసాదిస్తూ వుండడమూ వర్ణించబడినది. రెండు, మూడు అశ్వాసాల్లో కాకతీయరాజులచరిత్రా, అందులో ప్రతాపరుద్రుని చరిత్రా కొంతవరకూ ఉన్నది. మూడవ ఆశ్వాసం అసమగ్రం. అందులో ప్రతాపరుద్రుని బాల్యంవరకూ మాత్రం ఉన్నది.

అసమగ్రం అయిన మూడవ ఆశ్వాసం తర్వాత అసమగ్రమైన వచనం కొంత ఉన్నది. ఇందులోని కథ—ప్రతాపరుద్రుని పుట్టుకకుముందు ప్రారంభమై, ప్రతాపరుద్ర నిర్యాణానంతరం అతని పుత్రుడు వీరభద్రయ్య రాజ్యం చేస్తూ నరపతి రాజులతో పోరలేక సంధి చేసుకుని, పిదప సుల్తాను ఓరుగల్లుపురాన్ని ఆక్రమించగా, కొండవీటికి పోయిన వరకూ ఉన్నది. ఈ గ్రంథం ప్రస్తావనలో శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు "సిద్ధేశ్వర చరిత్ర మనగా, కాకతీయ మహారాజుల చరిత్రయే! కేవలము కాకతీయ రాజ్యచరిత్రమును కథావస్తువుగా గైకొని మూడాశ్వాసములు ద్విపదలోను, చివరభాగము వచనములోను ఈ కవి నిబంధించియున్నాడు" అని వ్రాసియున్నారు. కాని ద్విపద రచనకూ, వచన రచనకూ చాలా వ్యత్యాసం కానవస్తున్నది. అంతే కాకుండా ఈ రెండు భాగాలనూ ఒకే కవి వ్రాసినపుడు చర్వితచర్వణంగా ద్విపదలో వున్న విషయమే తిరిగి వచనంలో వుండదు. మూడవ ఆశ్వాసం అసమగ్రంగా వుండడం కూడా విభిన్న కర్తృత్వాన్నే వెల్లడిస్తుంది.

సర్వప్పకవి తనగ్రంథం సిద్ధమాహాత్మ్యమంటూ "వాసిగాజెప్పె సర్వప్ప నాహ్వాయుడు, సిద్ధమాహాత్మ్యమన్ శ్రీకృతియందు—" అని ఆశ్వాసాంతాల్లో తన గ్రంథం సిద్ధమాహాత్మ్యం అని పేర్కొన్నాడు. ఇందులో మొదటి ఆశ్వాసంలో సిద్ధేశ్వరునిగురించిన విషయం ఉన్నదిగాని సిద్ధులను గురించి లేదు. సిద్ధేశ్వరుని గురించిన వృత్తాంతంలో పార్వతీ

గ్రంథ విమర్శనము

పరమేశ్వరులు సిద్ధేశ్వర పద్మాక్షులుగా అవతరించిన విషయమే ఉన్నదికాని మహత్తు వర్ణించబడలేదు. ద్వితీయ, తృతీయా శ్వాసాలలో కాకతిరాజులనుగురించీ, ప్రతాపరుద్రదేవుని గురించీ వున్నది. ఈ కారణాలను బట్టియే కాబోలు గ్రంథ సంపాటకులు దీనికి సిద్ధేశ్వర చరిత్రము (కాకటీయరాజుల చరిత్ర—ప్రతాప చరిత్ర) అని పేరు పెట్టారు.

సర్వప్పకవి సమర్థుడైన కవికాడు. తనకు శబ్ద లక్షణాలు తెలియవని, నాటకాలంకారాల రీతులు తెలియవనీ, గుణదోషములూ, ఛందోరీతులూ తాను ఎరగననీ, సిద్ధేశ్వరుని కృప వల్ల కవిత్వం అలవడిందనీ తెలుపుకొన్నాడు. అందువలన ఇందులో శబ్దదోషాలూ, ఛందో దోషాలూ అధికంగా ఉన్నవి. వాటిని కొన్నిటిని సంపాదకులు ఆయా సందర్భాలలో సూచించే వున్నారు. మరికొన్ని ఉదాహరణలు—"సద్య జీవన్ముక్తి—మది యుంచి — బుధబ్రాహ్మలవలన — గర్భ సేమంబునకు—వామ దక్షిణ పాదుల్ అతి సంతసమున—మాధవ శర్ముని—అంహ కర్ముల — ఘనవీరజడల—హరుషంబు—సత్కారుడగుచు—గుజ రాష్ట్ర మహరాష్ట్ర ఘూర్జర—త్రిభువనమేటి మల్లుండు (త్రిభువన మల్లుడనుటకు) మహదేవుడు—తిక్కన సోముడు (తిక్కన సోమయాజి అనుటకు)—క్రతులు—ఘనతోపచారము—రుద్రమహదేవి"—

ఇలాంటి కొన్నిటినిబట్టి సర్వప్ప కవి అనభ్యస్తుడనడం కంటె శివకవి సంప్రదాయాలను పాటించినాడనడం మేలని సంపాదకులు వ్రాసియున్నారు. కాని శివకవులు దేశంలో బహుళ వ్యాప్తిలోవుండే బ్రాహ్మలు—వంటి పదాలనూ, కొన్ని వైరి సమాసాలనూ ప్రయోగించినారేకాని, అడుగడుగునా ఛందో భంగంవుండే రచన సాగించడంలేదు. వారి రచనలో కవిత్వమున్నది. ఇతని రచనలో అది కూడా మృగ్యమే! ఇది కొంతవరకూ కాకతీయ రాజుల చరిత్రను తెలపడంవల్లనే దీనికి వాఙ్మయంలో స్థానం లభించినది. వాస్తవానికి—ఆ చరిత్రాంశమయినా ఇందులో ఏకామ్రనాథుని ప్రతాపచరిత్ర ననుసరించి వ్రాయబడినదేకాని వేరుకాదు.

ఇందు వచన భాగంలోఉన్న విషయాలు సరియైనవి కావు. కొన్ని విశ్వాస పాత్రాలూకావు. తిక్కన సోమయాజుల వర ప్రసాదంవల్ల కుమ్మరి మొల్ల రామాయణం వచనకావ్యంగా వ్రాసినదనడం, భాస్కర రామాయణాన్ని పూరించిన వారిలో ఒకడైన మల్లికార్జునభట్టు నిరోష్ఠ్య రామాయణాన్ని రచించినాడవి వ్రాయడం, పయివారినీ, రంగనాథునీ, ప్రతాపరుద్రుని సమకాలీనులుగా చెప్పడం చాలా వింతగా కానవస్తుంది.

యుద్ధంలో ఓడిపోయిన ప్రతాపరుద్రుని యవన సేనలు ఢిల్లీకి తీసుకొనిపోతూ నడుమ గోదావరీగర్భంలో మకాం చేసినప్పుడు ఒకానొక బ్రాహ్మణుడువచ్చి ఆ మహారాజుకు ప్రతాపరుద్రీయం అనే కావ్యాన్ని అంకితంయిచ్చి విద్యానాథ బిరుదాన్ని, గొప్ప మర్యాదలనూ పొందినట్లు యిందులో ఉన్నది. సుప్రసిద్ధుడైన యీ మహా విద్వాంసునిగూర్చి "అందు యొక్క విప్రుండు ప్రతాపరుద్రీయంబను కావ్యంబు చెప్పి ఆ రాజునకు అంకితంబుగా జేయుటయు—" అని వ్రాయడం వింతగా ఉన్నది. ప్రతాపరుద్రీయం సంస్కృతంలో వ్రాయబడిన అలంకార శాస్త్రగ్రంథంకాని, కావ్యం కాదు. ఇక్కడి వ్రాతనుబట్టి చూస్తే ఆ గ్రంథం సంస్కృతంలో వ్రాయబడినదో, తెలుగులో వ్రాయబడినదో కూడా ఈ వచన రచయితకు తెలిసినట్లు తోచదు.

మరొక వింత. ఖైదీగా ఢిల్లీకి తీసికొని పోబడిన ప్రతాపరుద్రుడు సుల్తానుతో కలిసి ఏకశయ్యపై నిద్రిస్తూ వుండగా సుల్తాను తల్లి వారిద్దరినీ పరిశీలించి, ఇరువురియందూ హరిహరాత్మకమైన తేజస్సు వున్నందున యిద్దరూ సమానమే అని అన్నదట! సుల్తాను తాను ప్రతాపరుద్రుని చెరపట్టి తీసుకునిరావడం మహాపరాధమనీ, తన్ను క్షమించాలనీ అంటూ ఎంతో గౌరవంగా ఏకశిలానగరానికి పంపినట్లూ, తిరిగి రాజ్య పాలనకు ప్రతాపరుద్రుడు విముఖుడుకాగా సుల్తానే నిర్బంధించి సమ్మతింపజేయడమూ విచిత్రమే! వీటిని చరిత్రకారులు సమ్మతిస్తారని అనుకోను.

సిద్ధేశ్వర చరిత్రకు అందలి కవిత్వాన్నిబట్టి ప్రాముఖ్యం లేకపోయినా, చారిత్రకంగా ప్రాధాన్యం లేకపోయినా ప్రాచీన గ్రంథముగుటవల్ల వాఙ్మయంలో స్థానం ఉన్నదనే చెప్పవలెను. మూలనుపడిఉన్న ఈ గ్రంథాన్ని బయటికి తీయించి సర్వాంగ సుందరంగా ముద్రింపించిన సంపాదకులు శ్రీ. లక్ష్మీరంజనం గారు ఎంతయు ప్రశంసనీయులు! మూల గ్రంథంకంటె ఈ గ్రంథానికి సంపాదకులు ఆంగ్ల భాషలో వ్రాసిన 98 పుటల ఉపోద్ఘాతం ఎంతో ఉపయోగకరమైనది. అందు గ్రంథ విషయాన్ని గురించిన్నీ, కాకతీయ ప్రభువులను గురించిన్నీ విపులమైన చర్చ వున్నది. అది ఆంధ్రులకే కాకుండా, ఆంధ్రేతరులైన చరిత్ర పరిశోధకులకు కూడా బాగా ఉపకరిస్తుంది.

చక్కని పీఠికలతోనూ, చిత్రాలతోనూ ఈ గ్రంథాన్ని ప్రకటించడానికి పూనుకొన్న హైదరాబాదు ఆంధ్ర రచయితల సంఘంవారి వాఙ్మయసేవ ప్రశంసనీయమైనది.

'ఆంగీరస'

వార్తలు

గెగారిన్ గగన విజయం

ఏప్రిల్ 12 వ తేదీన మానవుడు మొట్టమొదటగా వియన్మండలంలో ప్రవేశించి భూతలిచుట్టు ప్రదక్షిణించి క్షేమంగా అవనీతలి కవతరించాడు. ఈ ఘనవిజయం సాధించిన వ్యక్తి రష్యా దేశీయుడు మేజర్ యూరీ అలెక్సీవిచ్ గెగారిన్. ఇతడు ప్రయాణించిన అంతరిక్ష నౌక పేరు వోస్టాక్. గెగారిన్ 109 మొదలుకొని 187 మైళ్ల ఎత్తున భూమి చుట్టు ప్రదక్షిణం చేశాడు. ఈ ప్రదక్షిణానికి 80 నిమిషాల 6 సెకండ్ల కాలం పట్టింది.

గెగారిన్ వయస్సు 27 ఏళ్లు. వివాహితుడు. ఇద్దరు కుమార్తె లున్నారు. సాంకేతికంగా రష్యా పురోగమించిన దనడానికి ఇది ఒక ప్రబలమైన నిదర్శనమని భావిస్తున్నారు.

గఫర్‌ఖాన్ నిర్బంధం

సరిహద్దు గాంధీ, ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖానును నిర్బంధించవలసిందని ఆదేశించారని పాకిస్తాన్ ప్రభుత్వం ఏప్రిల్ 13 వ తేదీన అధికారరీత్యా ప్రకటించింది.

భారత సర్వోదయసభ

విజయవాడకు 60 మైళ్ల దూరంలో ఉన్న ఉంగుటూరులో ఏప్రిల్ 13 న సర్వోదయ సభ ప్రారంభ మయినది.

శ్రీ జయప్రకాశ్ నారాయణ్, దాదా దర్మాధికారి, సిద్ధరాజ్ దాదా ప్రభృతులు కొంతమంది నాయకులు ఈ సమావేశానికి విచ్చేశారు.

ఏప్రిల్ 13 న జరిగిన అఖిలభారత సర్వోదయ సంఘ సమావేశానికి ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి శ్రీ నవ కృష్ణ చౌదరి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

బెంగాల్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం

ఈశాన్య రైల్వేలోని సిలిగురి స్టేషనుకు సమీపంలో ఏప్రిల్ 19 వ తేదీ రాత్రి జరిగిన రైల్వే ప్రమాదంలో పదిమంది మరణించారు. 83 గ్గురు గాయపడినారు. వారిలో 28 మందికి తీవ్రంగా గాయాలు తగిలాయని రైల్వే ఉప మంత్రి శ్రీ ఎస్. వి. రామస్వామి రాజ్యసభలో వెల్లడించారు.

ఈ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 19 వ తేదీ రాత్రి సనోక్—గుల్మా స్టేషనుల మధ్య ప్రయాణం చేస్తూండగా ఈ ఘోర ప్రమాదం సంభవించింది. ఇంజను, ఏడు భోగీలు పట్టాలు తప్పి బోల్తాపడ్డాయి.

ప్రమాదం సంభవించిన స్థలానికి అధికారులు వచ్చి దర్యాప్తు కొనసాగిస్తున్నారనీ, పట్టాలు లాగివేయడంవల్ల ఈ ప్రమాదం సంభవించిందని తెలుస్తున్నదనీ, ప్రభుత్వం చట్టం ప్రకారం దర్యాప్తు కొనసాగించగలరనీ మంత్రి అన్నారు.

ప్రమాదం జరిగిన తరవాత గాయపడిన వారిని సిలిగురి ఆసుపత్రికి పంపించారు. రైల్వే సిబ్బందితో, డాక్టర్లతో, ఆఫీసర్లతో ఒక బండి హుటాహుటిగా అక్కడికి పంపించారు.

దక్షిణధ్రువాన్ని సందర్శించిన ప్రథమ భారతీయుడు

దక్షిణ ధ్రువాన్ని ప్రప్రథమముగా సందర్శించిన మొట్టమొదటి భారతీయుడు శ్రీ గిరిరాజ్ సింగ్ సిరోహి.

ఈయన లాస్ ఏంజిల్స్‌లోని కాలిఫోర్నియా విశ్వ విద్యాలయం పరిశోధక శాఖలో కృషి చేస్తున్నారు. శ్రీ సిరోహి గత సంవత్సరం నవంబరు 6 వ తేదీన అమెరికా పరిశోధన శాఖ సభ్యులతో కలిసి దక్షిణధ్రువం సందర్శించారు. ఘనీభవ శీతోష్ణస్థితికి 40 డిగ్రీలు తక్కువ గల ఆ ప్రాంతంలో ఆయన 65 రోజులు గడిపారు. అమెరికాకు వెళ్లతూ కొన్ని రోజుల క్రితం అంటే ఏప్రిల్ మూడవ వారంలో న్యూఢిల్లీ వచ్చారు. శ్రీ సిరోహి ఇంతకు పూర్వమే ఢిల్లీ విశ్వ విద్యాలయంలో పి. హెచ్‌డి. పట్టం సంపాదించారు.

దక్షిణాఫ్రికాపై ఆంక్షల ప్రయోగం

దక్షిణాఫ్రికా అనుసరిస్తున్న జాతి విద్వేష విధానాన్ని ఖండించి, అటువంటి చట్టాల అమలును నిరోధించవలసినదని సమితి ప్రత్యేక రాజకీయ సంఘం ఏప్రెల్ పదవ తేదీన తీర్మానించినది. తీర్మానం మొత్తంమీద 47—29 వోట్లతో నెగ్గింది. 21 దేశాలు ఎటూ వోటు చేయకుండా తటస్థంగా ఉండిపోయాయి.

Printed & Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor : S. Sambhu Prasad.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్	కాంట్రాక్టు
4 వ కవరు పేజి		రేట్లు	రేట్లు
2 రంగులు	...	రు. 125/-	రు. 100/-
ఒకేరంగు	...	రు. 100/-	రు. 90/-
2 లేక 3 కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	90/-	75/-
లోపలి పేజీలు	...		
పూర్తి పేజి	...	70/-	60/-
అర్ధ పేజి	...	35/-	30/-
పావు పేజి	...	20/-	15/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥ నకు వరుసగా 12 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

* కవులు, కళాకారులు, రచయితలు మొదలైన వారి ప్రకటనలు ఒక కాలం ఇంచికి తేపకు రు. 2/- చొప్పున ప్రకటించబడును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12-00
6 మాసముల చందా	...	రు. 6-00
విడి ప్రతి	...	రు. 1-00

మేనేజరు, భారతి,
మద్రాసు-1.